

చెన్నపట్టణము, నవంబరు ౧౯౨౮

సంపుటము ౫ విభవ సంవత్సరము కార్తికమాసము సంఖ్య ౧౧

సు ధా క రా!

వేమల సత్యనారాయణ శాస్త్రి (సాహితీసమితి)

ఓయి సుధాకరా! నిలువు మొక్క నిమేషము ; నీ మహోదయ
చ్ఛాయలు సోకి నాయెడద సాగరమట్టుల పొంగుచున్న; దే
వో యను భూతజీవితసుఖోర్ము లపూర్వవిముగ్ధనాట్యముల్
జేయుచు పాడుచున్నవి వినిర్మల మోహనరాగ గీతికల్.

నా కిపు డీప్రపంచ మొకనందనమట్టుల నీ యనంతలో
కైకపవిత్రకాంతి సుధలందున విచ్చిన మూగసోయగం
బై కనుపట్టె మానవుల యాశలతో విధికీ నిరంతరా
నీకము సాగు ఈకటికి నేల మనోజ్ఞత యింతనిల్చునే!

ఈయది మోగమో యెడద నేర్చెడు ఖేదమొ యతలంతలై
పోయెడు మోహమో తొలగిపోవని స్వప్నమొ చెప్పలేని దే
దో యనుభూతి దివ్యపవనోర్మిపరీమళ మట్లు ముగ్ధనిం
జేయుచునుండె నన్నిపుడు నీతెలికాంతుల కౌగిలింతలన్.

నీవొక యప్సరశ్ప్రణయినీ కబరీచ్యుత పారిజాత మా
లావిసరంబవో మరి; ఇలాతలమంట సుధాతుషారవ
ర్షావిమలావగుంఠనము జార్చుచు బోవు శరద్విభావరీ
దేవి లలాటికామణివొ, దీపికవో, సురలోకలక్ష్మికిన్.

అలసట జెందినావొ యుదయాస్తమయమ్ములె జీవనమ్ముగా
తిలచెడు మర్త్యపాళి కమృతప్రభలన్ వెదజల్లి; యింత సొం
పులొలుకు వెన్నెలం గనులు మ్రూయని పేదలకై కృపారసం
బొలసెడు నీసుధామురళి నూదుదువో భవనాలునోలగన్.

ఓయమృతాంశుమూర్తి, యెటకో పరువెత్తెదు వాయులీనమై
పోయెడు రాగరేఖవలె; మోయగరాని ప్రవాసదుఃఖమో,
తీయని ప్రేమవేదనయొ, తీరనికోరికయో, యెదో యెదం
గోయునొ యేమొ రాల్చెద వనూనహిమాశ్రుకణాల నావలెన్.

విరిసినపూలవెన్నెలల వెల్లువ చక్కదనాల హంసవై
యరిగెడు నిన్నుజూచు నిశలందున నాకగు బాష్పశాంతి నీ
వెరుగుదు; దుఃఖతాపముల క్రుంగు పాడుప్రపంచమం దెరుం
గరు కరుణైకముగ్ధుల యగాధహృదంతర బాష్పమాధురిన్.

చిరవిరహైకవాసనల జిమ్ముసుఖస్మృతులేవొ పై పయిం
బొరలుచు దుఃఖపుంగసటు వోవనియాశల మేలుకొల్ప సుం
దరతరచంద్రికా పులకితమ్మగు నింతటి కమ్మనైన రా
తిరి తెలవారిపోవక యిదేగతి నాకయి నిల్వరాదొకో!

ప్రేమపిపాసచే అమృతవీథుల జేరిన సుందరాంగనా
స్తోమ సితావగుంఠనలతల్ సుమి యా తెలిమబ్బుదొంతరల్;
నీమృదు శయ్యలై సుధలు నిండిననీస్మితరోచిరూర్మికా
కోమల ఫేనరాసులయి కూర్చెదు నాయెద కింత వేదనన్.

ఆమృదుచంద్రికా యవనికావృత నీలనభోనిశాంత శో
భామయసీమలం దమృతవాటుల స్వప్నపథాల ఒక్క యీ
యామినిమాత్రమే తిరుగులాడెద నే చిరుమబ్బువోలె నీ
తో మనసార; ఒక్కపరి తోడ్కొనిపోవగరాదటో సఖా!

నందిమల్లయ్య-ఘంటసింగయ్య

కేతుమల్ల అచ్యుతరావుగారు, యమ్. ఏ., యల్. టి.

(వెనుకటి సంచిక తరువాయి)

ఉదాహరణము: ౧—

ధర్మవ్యాధోపాఖ్యానము

శ్లో. తస్య కాలేన మహతా చారిత్రేణ చ ధీమతః;
బభూవ వార్జున కా నామ కన్యా చ వరవర్ణినీ.
తస్యా యౌవనకాలేతు చింతయామాస ధర్మవిత్;
కన్యేయం దీయతే కస్య కోవా యోగ్యశ్చవై
పుమాన్.

ఇతి చింతయత స్తస్య మతంగస్య సుతం ప్రతి;
ధర్మవ్యాధస్య సువ్యక్తం ప్రసన్నాక్ష్యం ప్రతిబ్రువన్.
(సంస్కృత వరాహపురాణము)

గీ. వ్యాధభర్తకు మతికొన్ని వర్షములకుఁ
బుట్టె నర్జున కీనామపుత్రి మెఱుఁగుఁ
డీఁగె క్రైవడి రతిరాజ తియ్యవింటి
చేఁగపోలిక వెన్నెలసోగపగిది.

క. ఈచందంబున జననం
బై చాంద్రమసకళభంగి నమదిన వృద్ధి
శ్రీనాతురి గల చెంచుల
రాచూలికి యౌవనంబు రాఁ గడఁగుటయున్.

సీ. నాభికావాలమండలమున మొలచిన
తాపింఛవల్లీ మతల్లి యనఁగఁ
దనుమనోభవపుష్ప ధనురంతరంబునఁ
గట్టిన బంగారు కట్టు లనఁగ
సౌందర్యకేళీ కాసారంబులోపల
మొనసిన నెత్తమ్మి మొగడ లనఁగ
విటుల స్తనంధయనీహారకరుని పైఁ
గవిసిన గాఢాంధకార మనఁగ

నాఁడు నాఁటికి నారు గానంగఁ బడియె
వళులు దోఁచెఁ గుచంబులు వచ్చెఁ గురులు
బ్రాలె నంతట నాభిల్ల నంశ వల్ల
భాత్మసంభవ సంపూర్ణ యౌవనమున.

గీ. హరిణ కరిహరిదమరంబు లక్షి కుంభ
మధ్యవాలాకృతులు దెచ్చి మనుపుకొఱకు
భిల్లపతియింట గిరువులు పెట్టె ననఁగ
దృక్కుచవలగ్న చికురచారిమల నొప్పు.

గీ. పట్టెఁ జేసి కుచంబులపై ధరించి
కందుకక్రీడ గావించు ఘర్మవారి
గరఁగి జిగజాఱ నవగైరికద్రవంబు
గిరులఁ బ్రవహించు ధాతునిర్ఝరము లనఁగ.

గీ. చన్నుగుబ్బలపోరాటఁ జక్కఁ బెట్టఁ
బోయి మధ్యస్థభావంబు పొంద లేని
కతన లజ్జించె ననఁగ మొగాలు నల్లఁ
బారు గురువింద పూసలపేరు దైచు.

క. క్రిక్కిఱిసినబింక పుఁజను
జక్కవకవ నెక్కు లనఁగ సకియలు దనకున్
మక్కువ నీ నొక్కొకమరి
పెక్కులు మెడఁ దాల్చు మించిపించెపుదండల్.

గీ. గ్రహణభయమున రవిసుధాకరులు హీను
లై చికురబంధరాహుగ్రహంబు కడను
శరణు వేడంగ వచ్చినచాడ్పు దోఁపఁ
బెట్టు సిందూరమునఁ జుక్కబొట్టు నొసల.

వ. ఇవ్విధంబున వారూఢయౌవనవిజృంభణమున దృక్కరంభంబైన నిజతనూజ నర్జునకిం జూచి దూరీకృత

విరోధుండు ధర్మవ్యాఘ్రుండు దీనికిం దగినవరుం డెవ్వండు గలుగునో యని చింతించుచు మతంగముని కుమారుండు ప్రసన్నుం డనువాఁడు సకలవిద్యాప్రసన్నుం డని విని వానికి వివాహంబు సేయుటకై నక్షీణపుణ్యలక్షణగేహ నవ్వరారోహఁ గొంచు దుష్కృతంబులకుం గొంచు చెంచులు వెంటరా నిరాయాసంబునం జని లవంగ నారంగ పూగ పున్నాగ వకుళ కురువక ప్రియాళు రసాల ప్రముఖ సాలవికాసమాన సూనవాసనావాసవాహ గంధపవమాన నిరస్త సమస్త పాంథశ్రమంబగు నాశ్రమంబు దలఁపి ముందట సరోవర తీరంబున బహుశిష్యగణంబులతోడ నాహ్నిక క్రియాకలాపంబులుదీర్చి వేదాంతశాస్త్రవ్యాఖ్యాన గోష్ఠి నున్న మతంగునిఁ గనుంగొని యిట్లనియె.

మ. అనఘస్వాంత మతంగసంయమివరే
  ణ్యా నాతనూజాత స
ద్గుణ కీ కన్యకఁ దెచ్చినాఁడ రమణీ
  చూడామణిన్ మీ ప్రస
న్ననకున్ జేయుఁడమా వివాహ మీఁక నెం
  దుం జూచినం గల్గ రా
యన దక్క న్మునిరాజనందనులు క
  న్యాదానయోగ్యుల్ సరుల్.

చ. అనవుడు నట్ల కాక తగు
  నాటవికాన్వయసార్వభౌమ నీ
తనయ మదీయ పుత్రునకు
  ధర్మకళత్రముగా నటంచు నా
తనిఁ దనపర్ణశాలకు
  మతంగమహామునిపుంగవుండు తో
డ్కొని చని చూపెఁ బెండ్లికొడు
  కున్ మితభావణా వంశభూషణున్.

(తెలుగు వరాహపురాణము, ద్వితీయాశ్వాసము)

ఉదాహరణము: ౨—

శ్లో. అస్త్యేకం భారతే వర్షే వనం దండక సంజ్ఞితమ్;
తత్ర తీవ్రం తపో ఘోరం గౌతమో నమవై ద్విజః.
చకార తస్య బ్రహ్మాతు పరితోషం గతః ప్రభుః;
ఉవాచ తం మునిం బ్రహ్మా వరం బ్రూహి తపోధన!
ఏవ ముక్తస్తు తా తేన బ్రహ్మణా లోకకర్తృణా;
ఉవాచ సస్యపంక్తిం మే ధాన్యానాం దేహిసంగతా.
ఏవ ముక్తో దదౌ తస్య తమేవార్థం పితామహః;
లబ్ధ్వాతు తం వరం విప్రః శతశృంగే మహాశ్రమః.
చకార త స్యోమపిద పాకాంతే శాలయో ద్విజైః;
లూయంతి తేన మునినా మధ్యాహ్నే పచ్యతే తథా.
సర్వాతిథ్య మసౌ విప్రః బ్రాహ్మణేభ్యో దదాత్యలమ్;
కస్యచి త్త్వథ కాలస్య మహతీ ద్వాదశాబ్దికా.
అనావృష్టి ర్ద్విజవర హ్యభవ ల్లోమహర్షిణీ;
తాం దృష్ట్వా మునయః సర్వే అనావృష్టిం వనేచరాః.
క్షుధయా పీడ్యమానాశ్చ ప్రయయు ర్గౌతమం తదా;
అథ తా నాగతాన్ దృష్ట్వా గౌతమః శిరసా నతః.
ఉవాచ స్థీయతాం మహ్యం గృహే మునివరాత్మజాః;
ఏవ ముక్తా స్తు తే తేన తస్థు ర్వివిధభోజనమ్
భుంజమానా అనావృష్టి ర్యావ త్సా నివృతా ఽభవత్;
నివృత్తాయాంచ తే తస్యా మనావృష్ట్యాంతు తే ద్విజాః;
తీర్థయాత్రానిమిత్తాంతు ప్రయాతు మనసో ఽభవన్.

(సంస్కృత వరాహపురాణము.)

సీ. మున్ను భారతవర్షమున దండకావన
  నాటి గౌతమఋషివర్యుఁ డబ్జ
సంభవుఁ గూర్చి నిష్ఠాపరత్వంబున
  బహుకాల ముగ్రతపంబు సలిపి
ప్రత్యక్షమైనతద్బ్రహ్మచే విత్తిన
  సస్యంబు లన్నియు జాములోన
పరిపాకమును బొందు వరముఁ గైకొని వచ్చి
  శతశృంగగిరిఁ బర్ణశాలఁ గట్టు
కొని సమర్పించుఁ గోటులకొలఁది మీఱి
వచ్చు నతిథుల కెల్ల నవ్వారి గాఁగ
వ్రదసాన్నంబు వరలబ్ధసస్యవృద్ధి
కలిమి నంతట నొకకొంతకాలమునకు.

క. రోషముతో నిజమహిమో
  న్మేషము చూపంగ దలచి మోసంబునకున్

బ్రాహ్మణులందు వచ్చిన
దోషంబునఁ జేసి కఱవు దోడనె రాఁ గన్. [మను

లయవిభాతి. విసరెఁ బెనుగాడుపులు మసలె జలదాగ
పసిమిచెడె సస్యములు కసవు దినలేమిం
బసరములు వట్టె నదు లిసుకలునఁ జిప్పలును
మిసమిస మనన్ విగతరసగరిమ నింకెన్
వసుమతి పడన్ దివిచె కుసుమఫలపత్రముల
పస దఱిగె భూరుహము లసు రుడిగెఁ బ్రాణి
ప్రసరములు నొండొకటి మెసఁగఁ దొడఁగెన్ గఱవు
గసిమసఁగె విశ్వమున పస లయవిభాతిన్.

సీ. మిగుల భీకరవృత్తి మిన్ను ముట్టినధూమ
కేతువె బిరుదు టెక్కెంబు గాఁగ
నోరంత ప్రొద్దును హోరని విసరుచుఁ
గెరలు కరువలి వకీలు గాఁగ
చెట్టుచేమలు గాఱుచిచ్చునఁ గమరిన
మన్ననిగిరులె హేమఁగులు గాఁగ
నిప్పులు గ్రక్కుచు నెప్పుడుఁ గాయు
నిబ్బరపు టెండలె ప్రతాపంబు గాఁగ
అనశనప్రాప్తి మృతమనుష్యప్రతాన
మాంసభక్షణదృప్తగోమాయుకాక
ఘూకబహుజంతువులు బంట్లగుంపు గాఁగ
రాజసంబున దుర్భిక్షరాజు మెఱసె.

క. భూకాంత నీరుపట్టుకఁ
గాక వదన మిలుకరింపఁ గాన్పించిన పం
డ్లో కాకన వెలిపుర్రెలు
లోకములోఁ గాచె నిల్లు లోఁబడె జనముల్.

ఉ. అప్పుడు దేవదారువిపి
నాంతరసీమ వసించుసంయముల్
విప్పగు భూమి వన్నము ఫ
లింపక చెట్టులు వెండిపోయె వా
తప్పినఁ బోవుఁ బ్రాణములు
తప్పదు రం డని మున్ను గౌతముం
జెప్పఁగ విన్నవా రగుటఁ
జేరిరి తచ్ఛతశృంగ శైలమున్.

క. ఈగతి వచ్చిన మునులకు
నాగౌతముఁ డెదురు నడచి సాష్టాంగముగాఁ
జాగిలి మ్రొక్కుచు నేఁడు గ
దా గణనకు నెక్కె మత్ప్రియాపం బనుచున్.

సీ. సంతసించుచు నిజాశ్రమమున విడియించు
కొని వారి కల్లన దినదినము న
హల్య ప్రాణేశుఁ డహల్య శాల్యన్నంబు
వలసిన వారికి వలసినంత
ఘృతసూపఫలదధిక్షీర యుక్తంబుగాఁ
దలఁచినప్పుడె పెట్టెఁ దారు నిత్య
మును భుజాభోజనంబులు చేసి చట్టుల
కరణి నందలు ముచ్చె మురియ బలిసి
నెమ్మది సుఖింప వెషలెఁ బండ్రెండువత్స
రములు కఱవునం దీఱె వర్షములు గురిసెఁ
జల్లఁబడె నేల సకలసస్యములఁ బండెఁ
బుడమి ధాన్యంబు పోఁకకుఁ బుట్టెఁ దమ్మ.

క. అప్పుడు తపసులు తమలో
'డెప్పరమా తీర నేమిటికి నిఁక నిచటన్
గుప్పలు వడి నిలువఁగ రం
డెప్పటి తావులకు పోద మిందఱ మనుచున్.

(తెలుగు వరాహపురాణము, దశమాశ్వాసము)

కవనశిల్పము, శైలి

కవిసార్వభౌముఁడగు శ్రీనాథుని తరువాతికవులను గుఱించి వెనుకటి రెండధ్యాయములలోను గొంత వ్రాయవలసివచ్చినది. దగ్గుబల్లి దుగ్గకవియు, పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవియు శ్రీనాథుని కతిసమీపకాలములో వెనుబడిని వచ్చినవారు. వారికి సన్నిహితసమకాలికులే యీ జంటకవులు. కావున వీరును శ్రీనాథుని తేజస్సారము గొంత గ్రహించియుందురని తలంచుట యసంభవము కాదు.

దుగ్గన కృతి నొందిన చెందలూరి గంగయామాత్యునికి వీరును దమ ప్రబోధచంద్రోదయమును గృతియిచ్చిరి. పినవీరభద్రుని కృతి స్వీకరించిన సాళువ నరసింగరాయల క్రిందనున్న దండనాథునకు వీరును తమ వరాహపురాణము

సంకలితము చేసిరి. కావున నీజంటకవులు దుగ్గనయును, పినవీరనయును అత్యంత సమీపస్థులుగ నుండి పరస్పరసన్నికర్ష సాహచర్యమున మెలఁగుచుండిరని యూహించుట యాథార్థ్యమునకుఁ జాలఁ జేరువయని చెప్పవచ్చును. కాఁబట్టి వీరికవిత పైనఁ జెప్పిన కవుల కవిత్వసంపత్తితో సరిచూచుట సారస్వత జిజ్ఞాసువుల కెంతయుఁ బ్రీతికరముగా నుండును.

వీరి కవితాశిల్పము శ్రీనాథాదులవలెనే కేవలము మాతృకానుసారి గాకుండ స్వకపోలకల్పనాభూయిష్ఠమై యొప్పుచున్నది. మూలమందలి కథారేఖాకృతిని దీసికొని దానిని మాంసమస్తిష్కపుష్టమగు సజీవస్వరూపముగ సృజింపఁగల నిసర్గశక్తి మహాకవులయందున్నట్లు వీరియందును గానంబడు. మూలగ్రంథమందలి విషయములను సంక్షేపించుటకంటె విస్తరించుటయే వీరి శిల్పమందలి ప్రధానాంశమని తోఁచుచున్నది. శ్రీనాథుఁడు మూలగ్రంథములను సర్వవిధములఁ బెంచుచు వ్రాసెను. కాని యాతని శబ్దభూయిష్ఠమగు శైలివలెనే వర్ణనావిస్తృతమగు శిల్పమును గ్రంథసంక్షేపమునకంటె గ్రంథవిపులీకరణమందే నిదర్శనముగా నున్నది.

ఈకవుల శైలి యట్లు గాక, గ్రంథపరిమాణము పెరుఁగుచున్నను, శైలియందుమాత్రము పదనియమము చాలవఱకుఁ బాటింపఁబడినది. భావములను గొలఁదిమాటలతో విస్పష్టము చేయుటయే కాని శబ్దాడంబరములగు నతిదీర్ఘ సమాసములతో ఘటించుట వీరిమార్గము కాదు. కథావిషయములను సందర్భానుసారముగఁ దమ రుచిరకల్పనలతోఁ బోషించి మెఱుఁగుపెట్టి వృద్ధిపఱచుటయే తఱచు గోచరించును. అట్లు పెంచుటలో వీరికి విసువు కానరాదు. వీరికల్పనలు, వర్ణనలు నైసర్గికములుగను, సర్వజనానుభవసిద్ధముగను, మనోహరముగను గాన్పించుచున్నవి. పినవీరనకల్పనలు స్వాభావికముగ నుండవనియు, పూర్వగ్రంథములనుండి సామాన్యముగ నెత్తి వ్రాయఁబడినవనియు నిదివఱలోఁ జెప్పితిని. వీరివి యట్టివి కావు. అనంతామాత్యునివలెనే వీరును నిసర్గప్రకృతిని దిలకించి స్వానుభవవిశేషములతో బ్రదర్శించిరి. జక్కనకవి వర్ణనలు నిర్జీవప్రతిమలవలె శృంగారభూషితములై విరాజిల్లుచున్నవి కాని వానియందు వీరు చేయఁగల చైతన్యారోపముగాని, ప్రకృతిసిద్ధభూషణములుగాని కానరావు. దుగ్గనకవి పరిమితశక్తి గలవాఁడై తనుమాత్రముగ రసపోషణ చేసినను, తాను జూపినశిల్పము నిర్దుష్టమై, నిర్వక్రమై, నిర్మలమై యున్నది. ఈకవుల ప్రతిభ దుగ్గనదానికంటె చాల హెచ్చు. కావున నించుమించు సమకాలికులగు కవులలో వీరనేకవిధముల మిన్నలని చెప్ప సాహసించుచున్నాను. వీరి భాషాంతరీకరణపద్ధతిని నిరూపించుటకుఁ గాను నేను జూపిన రెండు దృష్టాంతములలోను వీరి కవితాశిల్పసంబంధమైన పైయంశములను ధ్రువపఱచుటకు వలసిన నిదర్శనములు చాలఁ గలవు. కావున గ్రంథవిస్తరభీతిచే మఱికొన్ని భాగములను మూలమునుండి యుద్ధరించి యిటఁ బొందుపఱుప మానివాఁడను.

వీరిశైలి ధారాళమై, రసావహమై యున్నది. పినవీరనయందలి యుద్దండమగు నైసర్గికధారాపాతముగాని, యనంతామాత్యుని కించిత్కుంఠిత శబ్దానుసంధానముగాని వీరి కవనశైలియందుఁ గానఁబడదు. ధారాశుద్ధి సహజమై, సమగతి కలదియై విరాజిల్లుచున్నయది. వీరిశైలియు దుగ్గనకవిశైలివలెనే మృదులమై, సుకుమారమై, ప్రతిపద్యరసస్ఫూర్తిమై హృదయంగమముగా నుండును. జక్కనకవియందు ముఖ్యముగాఁ గవిసమయసిద్ధములగు భావములును, వర్ణనలును, శబ్దసమత్కృతులును సుప్రతిష్ఠలుగా నుండును. వీరియందట్లు గాక ప్రకృతిలోకైకములగు వర్ణనలును, భావములును, రసవికారములును కవియొక్క హృదయకుహరమునుండి నిర్వక్రగతిని వెలువడి, పాఠకహృదయములఁ బ్రవేశించి రసావేశము నుద్భవింపఁజేయును.

తమకవిత్వ శయ్యావిషయమున నీకవు లిట్లు వ్రాసికొనిరి: "పదరచనాచాతుర్యంబున నల్పాక్షరంబుల నధికార్థంబు గుదియించి పద్యపూరణంబులకు సాధికారణంబులైన సంస్కృతాంధ్రభాషలం గల జల్లులు విసర్జించి రసపోషణ ప్రధానశబ్దము లుపార్జించి" వీరు కవ్య

పద్యరచనాక్రమమునకుఁ గడంగిరి. వీరి గ్రంథములు పరిశీలింపఁగా నీరచనాపద్ధతులు యథావిధిగా వీరిచే నిర్వర్తింపఁబడిన వని మనకు విశదమగును.

ప్రాచీనకవిగ్రామణు లగు తిక్కన, సోమన, మంచన మున్నగువారివలెఁ జిన్న చిన్న పదములను, ముఖ్యముగా నాంధ్రపదములను, జేర్చి, సుస్వనము వీనులకు విందొనరించునట్లు మేళవించి, సరసకవితానిసర్గగానమాధుర్యమున డెందంబున నానందంబు నెలకొల్పుదురు. వారి భాషాప్రయోగమున జాతి వార్తానమస్కృతి తెలుచు గానవచ్చెడు. వీరి కవిత్వమందు భావనాసమృద్ధియు, భావనాప్రకాశమును, ప్రాచీనకవి ప్రయోగసంపత్తియు, నిండైన గౌరవమును సమర్పఁబడియున్నవి. ఏస్థలమందును వ్యర్థపదములు గానఁబడవు. నీరసభావములు చాల నరుదు. నాచనసోముఁడు, పోతన మొదలగు వారివలె వర్ణనములయందు దృశ్యములను దృగ్గోచరమగునట్లు వర్ణించెడు ప్రయత్నము చేయుదురు కాని యాప్రయత్నము సర్వత్ర సఫలము కాలేదు. చిత్రవర్ణనము కంటె భావస్ఫూర్తియే యెక్కువగ గోచరించుచుండును.

సీ. అర్చన దాన తపోమాదులు ఫలకంబు
        లింద్రియనిగ్రహం బినపచీల
యఖిలభూతదయాపరాయణత్వము లిపి
        కాఁడు వైరాగ్యంబు గాలిచీర
ధైర్యంబు శుద్ధసత్త్వగుణంబు ప్రోహులు
        మంచివారలతోడి మైత్రి పరకు
శీలంబు నడిపించువాలిమి పంచలిం
        పని మానసం బది బరువు గాఁగఁ
జేసిన మురారిచరణరాజీవభక్తి
గౌరవం బను పేరోడ గలిగనేని
ఘోరభవసాగరము దాఁటి చేరవచ్చు
మోక్ష మనుదీవి మానవాధ్యక్షతిలక.
                    (వరాహపురాణము, ఆశ్వాసము ౫)

వీరు రచించిన రెండుగ్రంథములలోను ప్రబోధచంద్రోదయమే యెక్కువ గణనీయ మైన దని నే నభిప్రాయపడుచున్నాను. దీని శయ్యాపాకరీతులు లేఁబ్రాయపు రచనను బోడసూపుచున్నవి. అయినను రసపుష్టిచే నిగనిగలాడు ద్రాక్షాఫలమంజరులవలె కోమలమై, మృదులమై, సర్వవిధముల మనోహరమై యున్నది. అందలిపద్యరచన యెంత రమణీయముగా నున్నదో గద్యరచనయు నంతసరళముగాను, మనోజ్ఞముగాను నున్నది. వీరిగద్యము పింగళి సూరనార్యుని గద్యమువలె దీర్ఘసంస్కృతసమాసములు లేక, చిన్నచిన్న శబ్దములతోఁ గూర్పఁబడి, యనుప్రాసమాత్రశబ్దాలంకారశోభితమై, ముత్యంపుసరులవలె విరాజిల్లుచున్నది. దిక్ప్రదర్శనముగా నొండు నిదర్శనము మాత్రము చూపెదను.

"అప్పుడు క్షపణకుఁడు భిక్షుకునిం గాపాలికుని వీక్షించి యాక్షణం బగణితమార్గంబున నెఱింగితి మన యిందఱము మహామోహుని పంపుఁబడి సత్యాత్మసంధి యగు సాత్త్విక శ్రద్ధం జెరపట్టుకొని పోవం జనుదెంచినారము. వచ్చి యిచ్చట నెచ్చరిక దప్పి విచ్చలవిడి నుండుట కాదు గావునఁ గార్యంబు విచారింపవలయు ననినఁ గాపాలికుండు దిగంబరా, యవ్వారాశిం బరామర్శింపుము. ... ... (ప్రబోధచం. ఆ. 3.)

ఈగద్యసారళ్యము వరాహపురాణమున నెక్కుడుగాఁ గాన్పింపదు. ప్రబోధచంద్రోదయము లేఁబ్రాయమున రచింపఁబడినదని కాఁబోలు, వరాహపురాణమున గద్యపద్యరచనాబంధము కొంత క్లిష్టతరమై సమాసబంధురమై సంఘటింపఁబడినది. మఱియు నీకావ్యమున శబ్దనమస్కృతులుమాత్రము గనుపఱచెడు పద్యవైచిత్ర్యములు కథాసరణియందే నిబద్ధములై, పఠనసారస్యమున కంతరాయము గలిగించుచున్నవి.* ఈవిషయమున మాత్ర మీకవివరులు తత్కాలసంప్రదాయముల నను

* రాజసభలయం దుండు పండితకవులు పరస్పరము కావ్యకృతుల నెట్లు పరిశీలించి మెఱుఁగు పెట్టుదురో యావిషయము నీకవులు తమ ప్రబోధచంద్రోదయమున నిట్లు తెలుపుకు చేసిరి:—

క. పారిపారి నొప్పు సలాకల, నోరసినకుందనపు బూడయును బోలె సభన్
పరసుల సంఘర్షణమున, వరకవికావ్యంబు మిగుల వన్నెకు నెక్కున్.

సరించి, పాండిత్యప్రకర్షము ద్యోతపరుప నుద్దేశించినట్లు గాన్పించుచున్నది. అట్లు కానియెడల రసజ్ఞులగు నీకవిశేఖరులు కథాసందర్భమున నేకాక్షరకందములు, ద్వ్యక్షరకందములు నున్నగునని వ్రాయవలసిన హేతువు కాన్పింపదు. మహీసురుఁడు వైష్ణవీమహాశక్తిని జూచి మోహించి విరహాతురుఁడై యావాలుఁగంటి కటాక్షవీక్షణము లపేక్షించి మాయాకోవిదుఁడగు విద్యుత్ప్రభుండను వానిని దౌత్యమునఁ బంప నాసందేశహరుఁ డామెసౌందర్యాతిశయంబుల వర్ణించుచు నిట్లు స్తుతించెను:

ద్వ్యక్షరకందము

క. కాకలికాకల కలకల
  కోకిల కుల లీల కలుల కులుకుల కలుకే
  కైకోకు కేలికోలఁకుల
  కోకాలీకేలి కులికి కొంకకు కలికీ.

(వరాహ. ఆ. ౧౧)

ఈశృంగారస్తవ మెంత రసోత్సేకముఁ బుట్టింపఁగలుగునో వేఱ చెప్పవలయునా? ఇట్టి రసవిచ్ఛేదసందర్భము లింకను గొన్నితావుల కేతకీకంటకములవలె రసామోదమునకు భంగకరములుగా నున్నవి.

ఈకవు లిద్దఱిలో నెవనికవిత్వ మెట్టిదో నిర్ణయించుట కాధారములు లేవు కాని వీరిలో రెండవవాఁడగు ఘంటసింగయ్య మలయమారుతకవి యను పౌరుషాభిధానము గలవాఁడై, కవితావిషయముల నెప్పుడు గౌరవమున కాస్పద మయ్యెనని యూహింపఁదగును. అట్లయిన నంది మల్లయ్య యను మొదటివాఁడు కవిత్వవిషయములోఁ గణనీయుఁడై యుండును. వెనుకఁ జినవీరన గుఱించి వ్రాయుటలో "కుకవి మల్లకమణ కులిశహస్త పల్లవుఁడ" నని యాకవి యహంకృతిని నాత్మస్తుతి చేసికొనె నని, యాతనిచే నోడిపుడు పొందిన మల్లన కుకవి యెవరై యుండురోయని నేను ప్రశ్నించితిని. ఆప్రశ్నమునకు సమాధాన మీనందిమల్లయ్య యగునేమోయని నాకు గొప్ప సందేహము కలుగుచున్నది. ఏలనఁగాఁ, చినవీరన సాళువ నరసింగరాయలయొద్ద నుండుటయు, నందిమల్లయ్య యతని దండనాయకుఁడైన తుళువ నరసరాయలయొద్ద నుండుటయుఁ జూడ, వీరికి రాఁచుగా సారస్వతసమరములు గలుగుచుండెడివేమో యని తోఁచెడిని. ఆసమరములలోఁ జినవీరన వజ్రపాణియై ఘంటసింగయ్యను దాఁకలేక, మెత్తనివానిని మొత్తుటయే మహాపౌరుషలక్షణమని తన శెట్టిదంపు దిట్టతనము నంతయు నీమల్లనమీఁదఁ బ్రయోగించియుండును!

శివవీరభద్రుఁ డెంత గర్వించినను నీ మహాకవు లిద్దఱు వాణీవిశారదులు, పదవాక్యప్రమాణజ్ఞులు, సరసకవితానిష్ణాతులు, నిర్దుష్ట ప్రవర్తనాదర్శప్రబోధకులు, గావున వీరి గ్రంథము లాంధ్రసోదరులు సాదరముగఁ బఠింప వేఁడుచున్నాను.

శ్రీ త్రిపురాన వేంకటసూర్యప్రసాదరావు దొరగారు

తరువోజ

ప్రేమైకపాత్రమౌ ప్రియురాలిఁ బాసి
పెంటిఁ బాసిన గువ్వపిట్ట చందమున
వేమాఱును ననంత విరహార్తి నొంటి
విలపించు విరహి పెన్విలపనంబులను
సామోదమధుర భావామృతాసార
మనుపదమ్ము వెలార్చునట్టి సత్కవుల
కోమలామలసూక్తి కుసుమమంజరుల
గుణవిశేషమ్మును గొనియాడఁ దరమె.

మంజరి

సరయూతరంగిణీ జలజషండముల
కమ్మఁ బుప్పొడి దుమారమ్ముఁ జిమ్ముచును
దరఁగయుయ్యెల లెక్క తగ నూఁగి యూఁగి
తెలిముత్తియపుఁ దుంపురులఁ దొప్పఁదోఁగి
యల్లనల్లనవీచు పిల్లగాలులకు
నుల్లమ్ము రంజిల్ల నొకనాఁడు వేడ్కఁ
దనప్రాణపదమైన తరుణితోఁ గూడి
నందనవని శచీనాథుండు వోలె
విరిదోఁటలోఁ బ్రీతి విహరించుచుండె
నిజరూప విజితకాయజుఁడైన యజుఁడు.

దక్షిణార్ణోరాశి తటమందు నలరు
గోకర్ణమున నున్న శ్రీకంఠుఁ గొలువ
నింగిరంగగు వీణెఁ గెంగేలఁ బూని
యవ్వేళ నాత్రోవ నరుగుచు నుండె
గానవిశారదుండైన నారదుఁడు.

వేలుపుజడదారి వీణియకొనను
వ్రేలువేలుపుమ్రాని విరిదండ నొడిసి
కరువలి వేగమై హరియించె నప్పు
డలరుఁ దావులకునై యాసించినట్లు.

మందారతరుపుష్పమాల వెన్కనెడు
తేంట్లతోఁ గూడు నాదేవర్షి వీణె
గనుపట్టె గాలి చేసిన తిరస్కృతికిఁ
గాటుక కన్నీరు గార్చుచున్నట్లు.

అట్లు గాలిం దూలి యవనిపైఁ బడెడు
నవ్వేల్పు విరిదండ యతిభూమి యైన
పరిమళమకరంద భరముచే నచటి
తరులతార్తవరమం బరిహసించుచును
దైవంబు గుఱి చూచి తగ వైచినట్లు
లాతోఁట విహరించు నజుపట్టమహిషి
యిందుమతీదేవి యిఱిగబ్బిగుబ్బ
పాలిండ్ల మొనలందుఁ బడియె నబ్రముగ.

పడినంత భయదసర్పముఁ బోలె దానిఁ
దిలకించి కరము విహ్వలయౌచు నామె
స్వర్భాను హృతచంద్ర చంద్రిక వోలె
నిలను రూపఱె కూలె నిఁక నేమి చెప్ప.

ఆకస్మికముగ నిట్లతివ దాఁ గూలి
తనపతిం గూడఁ దోడన కూలఁ జేసెఁ
దొఱఁగెడు తైలబిందువుతోడఁ గూడఁ
బుడమి దీపజ్వాల వడియెడుం గాదె.

అట పార్శ్వవర్తి జనార్తరావములఁ
గలగుండు వడి సరిగాఁ గుందునట్లు
కమలాకరమ్మునం గలవిహంగములు
గోలుగోలునను గగ్గోలుగా నఱచె.

ఉపచారములను జెల్వొందె నయ్యజుఁడు
పడఁతి లేవక మున్ను పడినట్ల యుండె
నాయువు మిగు లున్నయప్పుడే కాదె
ప్రాణికిని జికిత్స ఫల మీయఁజాలు.

విగతతంత్రీకమగు వీణియవోలెఁ
జైతన్యరహిత యగు నా తీవఁబోఁడి
నతివత్సలుండైన యజుఁడు దిగిచి
యిమ్ముగాఁ బరిచి తాంకమ్మునం జేర్చె.

కరణహీనిం జేసి కడు గాజువాఱి
యున్న యన్నాతి న ట్లొడిఁ జేర్చి యజుఁడు
సూపట్టె వఱువాత సోం పేది యున్న
మృగలేఖఁ దాల్చు రాత్రీశుండువోలె.

అపు డట సహజధైర్యముఁగూడ వీడి
బాష్పగద్గదముగాఁ బతి విలపించెఁ
గ్రాఁగిన నిను మైనఁ గడు మెత్తఁ బోలు
దేహధారులమాట దెలుపఁగా నేల.

మేఘమ్ములా లేవు మెఱుపులా లేవు
ఉల్లమ్ము నులికించు నుఱుములా లేవు
కడు బెట్టిదములైన గాడ్పులా లేవు
విమలప్రశాంతమగు వినువీథినుండి
సడియుఁ జప్పుడు లేక చల్లఁగా జాఱి
పడియె నీ కడిఁదిపూఁబిడు గి దెక్కడిదొ.

అకట పువ్వులును దేహము సోఁకినంత
నుసులులం బాపఁగా నోపునే నింకఁ
గడ తేర్చుపనికి సంకల్పించుకొన్న
దైవంబునకును సాధన మేది గాదు.

అదిగాక కాలుండు మృదులవస్తువును
మృదువస్తువునన మాయింపఁగాఁ గడఁగు
నెఱ మంచువాన రూపఱు తమ్మితీవ
మొదటి నిదర్శనం బిదియ రెండవది.

ఇప్పువ్వు నరి జీవ మెడలించునేని
నెడఁదఁ జేర్పఁగ నన్ను మడియింప దేల?
అపుర! యొక్కెడ విషం బమృతంబ యగును
అమృత మొక్కెడ విషం బగు నీశ్వరేచ్ఛ.

కాక నాదగు నభాగ్యతఁ జేసి నేఁడు
పిడుగుగాఁ జేసె నివ్విరిదండ నజుఁడు
చెట్టుఁ గూల్పక దానిఁ జుట్టుకొన్నట్టి
తీవియం బడఁ గూల్చె నీ వింత పిడుగు.

ఎందుండి యరుదెంచితే పూలసరమ
నా ప్రాణపదమును నాశమ్ము సేయ
దివ్యభావస్ఫూర్తిఁ దేజరిల్లుచును
గ్రూరరాక్షసవృత్తిఁ గొంటి వేమిటికి.

భువనమోహనమైన పొలుపమ్ము గలిగి
మకరందరస పరీమళ పరంపరల
హృదయ రంజన సేయు నిట్టి నీ వేడ
నతిఘోరమగు ప్రాణిహననం బిదేడ.

ననలకుం గడుఁ గూర్చు నా ప్రాణదయిత
యొలమిమై వాని నౌ దలఁ దాల్చుచుండు
నట్టి పూఁబోఁడిని గిట్టించినావు
రమణి నీ కే మపరాధంబు సేసె.

నీతావుల హసించు నిట్టూరుపులను
నీ తేనెతీపుల నిరసించు నుడుల
నీచాయఁ దెగడుచుండెడు లేనగవుల
నీకోమలత మీఱు నెమ్మేని తీరు

నారసి లోలోన నీరసం బూని
నాతిపైఁ బగఁ బూనినావు గాఁబోలు

నట్లు గాకున్నఁ దత్ప్రాణాలతోడ
నవి యన్నియు హరింతువా దాయవగుచు.

హా జీవితేశ్వరీ, హా ప్రాణపదమ,
యిదియేమి ననుఁబాసి యెం దేఁగినావు
నినువీడి నిముసమైనను మనఁజాల
నని యెఱింగియు నింత యదయ వైతేల?

చిరునవ్వు గెమ్మోవిచివురునం దొలఁక
సరస నాతోడ ముచ్చటలాడుచుండి
మఱి చూడఁ జూడంగ మాయమైపోతి
వైంద్రజాలికుఁ డయ్యె నవుర కాలుండు.

పలుమాఱు దేవి తప్పులఁ జేసియున్న
నన్ను నొండనఁబోక మన్నించినావు
నేరమేలేని యీ నీ ప్రియుతోడ
నిపుడు మాటాడ విదేటికో చెపుమ.

శఠుఁడ నేఁ గపటవత్సలుఁడనం చీవు
దలపోసినా వింత తథ్యంబు సూవె
కాకున్న నన్ను వీడ్కోక యిందుండి
తిరిగి రానను పూన్కి దివికి నేఁగుదువె.

తోడుతోఁ బ్రియురాలితోఁ గూడఁ జనియు
నానాటి విడిమల్లి తాను రానేల
తనతప్పువలని వేదన సైఁచుఁ గాక
యతి శోచ్యమైన నా హతజీవితమ్ము.

అతను కేళి జనించినట్టి క్రొంజెమట
బొట్టులుగ నీమొగంబున నివే కలవు
నదిరాత్రి క్షణములో మఱి నీవు లేవు
ప్రాణికోటుల యస్థిరతఁ గాల్ప నోక్కా.

ఎదనైన నప్రియం బేఁజేసి యెఱుఁగఁ
బడఁతి నన్నిట్లేల విడిచి పోయితివె

మహిభర్త ననుమాట మాత్రమే కాని
నిక్కవం బగు ప్రేమ నీయంద కలదు.

అళికాంతిఁ దఱిమి లే యలరులం దుఱిమి
నెఱి గల్గి వఱలు నీ నీలంపుఁ గురుల
గాలి గదల్చుచుఁ గరభోరు మరల
బ్రదుకు దీవని నాకు బ్రమ గొల్పుచుండె.

కాన నామదిలోనఁ గలవిషాదంబుఁ
బ్రతి బోధమున వేగఁ బాపవే దయిత
నిశి మంచుమలగవిఁ నెఱయు చీకటిని
స్వరుచిచేఁ బాపు నోషధివల్లివోలె.

చలితాలకములతోఁ బలుకొండులేని
యీ నీదు నెమ్మొగం బెద నిర్దహించు
రొదలేక లోని తుమ్మెద పిండునెదల
నిశివేళ ముకుళించు నెత్తమ్మివోలె.

రేచానమగుడఁ దారేతేనిఁ బొందు
మరల జక్కవపెంటి మగనిఁ దాఁ బొందు
నవి దాననే విరహావధినోర్చు
మఱి నీవు రావయో మఱుఁగదే మనసు.

నును లేఁ జిగుళ్లపాన్పునను జేర్చినను
కందు నీ సుకుమార సుందరాంగమ్ము
ఏటు లోర్చుఁ జెప్పుమా యిపుడు రంభోరు
యతి కర్కశచితా సమారోహణమ్ము.

అతిరహస్యమయాన పాయిని యనుఁగుఁ
జెలియ యీ రతనాల మొలనూలు నీకు
నడలేమి నిదియు నద్దఁగి నీతోడ
నార్తిమై మరణించి నట్లున్నదకట!

కోయిల లందును దీయఁ బల్కులను
రాయంచలందును రమణీయగతుల

హరిణులందును జంచలాలోకనముల
ననిలలోల లతావళిని విలాసముల
స్వర్లోకజిగమిషా సంసక్తవయ్యు
నాకునై యిటనిల్చినా వింత నిజము
నినుఁ బాసి విరహార్తి మునుఁగు నామెదకు
నివి మేలిడఁగఁ జాలునే యక్కటకట!

ఫలినిని సహకార ఫలశాఖనొకటఁ
గలపి రెంటిని జంటగాఁ జేసినావు
అవ్వాని పెండ్లి సేయకయు యిప్పగిదిఁ
బాసిపోవుట నీకుఁ బాడిగా దబల!

అతివ నీచేత దోహదమంది కలయఁ
బూచు నీ కంకేళి పూగోలల్ నీదు
కురులకుం దొడవుగాఁ గూర్పకే నెట్టు
లకటా, నివాపమాల్యముఁ జేయనేర్తు.

కనకనూపురము గల్లనఁగ నీ యిడిన
పరదుర్లభంబైన చరణ సత్క్రియను
దలఁచినట్టులు సుమాశ్రులు రాలనీయ
శోకమ్ము నీకునై శోకించుఁ గంటె.

నేఁ దోడుగా నీదు నిట్టార్పు నెనయు
పొగడపూవుల నూలు సగము గూర్చితివి
మిగులు సద్దానిఁ బూర్తిగఁ గూర్పకుండ
నిదురఁ జెందితి వయో యిది యేమి చెపుమ.

జలజాక్షి, సమదుఃఖ సౌఖ్య లీ చెలులు
విడియ క్రౌన్నెలవోలె వెలయు నీ కొడుకు
నీ పాదదాసుండ నేనిట్టు లయ్యు
నింతయుఁ విడిపోవు టెంత నిష్ఠురము.

ధృతి యస్తమయమందె రతి మాయమయ్యె
గేయమ్ము విరసమై హేయమై పోయె
సకలర్తువులు నిరుత్సవములై తోఁచె
భూషాప్రయోజనంబును గతంబయ్యె
నకట, పాన్పతిశూన్య మయ్యె నా కిపుడు.

గృహిణివై వహియింతు గృహభారమెల్లఁ
బ్రగడవై వచియింతు పరమహితమ్ము
నతిరహస్సఖివై హృదానంద మిడుదు
లలితకోమల సత్కలావిధులందుఁ
బ్రియశిష్యురాలవై ప్రియము గూరుతువు
కటకటా, యిట్టి నిన్ గనికరం బేది
హరియించి కొంపోయినట్టి యమ్మృత్యు
చెలియ, నా దేది మ్రుచ్చిలేదో చెపుమ.

మదిరాక్షి, యత్యంత మధురమైనట్టి
నాదు పుక్కిటిమధు వాదట నాని
దివి నెట్లవలఁ ద్రావెదవు నీవు బాష్ప
కలుషితంబైన నా తిల జలాంజలిని.

నెఱవైభవంబున్న నీలేమి సౌఖ్య
మింతతో సరి సుమీ యీ యజునకును
అన్యవిషయదూరుఁ డగు నాకు సర్వ
విషయముల్ నీతోడి వేకదా దయితే!

అని యిట్టు లతికరుణాలాపములను
గులకాంతకై కడుఁ విలపించు చేజుఁడు
పూఁదేనె కన్నీటి బొట్టు లుట్టించి
చెట్టులచేఁ గూడ బిట్టేడిపించె.

శశిరేఖ

ఎ. వి. రత్నముగారు

భారతిలో తరచు చక్కని ముచ్చటగు పద్యములు వ్రాయువారు, న్యాయవాదివృత్తియం దున్నవారు, నా కాత్మీయమిత్రులు, ఒక రోకనాడు ప్రాసంగికముగ వెంకటాచలముగారి కథామంజరి "కన్నీటికాలవ" అనుదానినిగూర్చి ప్రశంసించుచు నన్నుగూడ దాని నొకసారిచూడుమని చెప్పిరి. కాని, నేను లెక్కకు మిక్కిలిగా వెలువడుచున్నకథలు, కావ్యములు వంటిదే యిదియు నని లోదలంచి "కన్నీటికాల్వ" కై నే వెద్కుట ప్రయత్నము చేయలేదు. కాని తలవని తలంపుగ సుమా రొక సంవత్సరముక్రిందట, అది నాకళ్ల బడుట తటస్థించినది. అంత నామిత్రులు దీనింగూర్చి చేసిన ప్రశంస జ్ఞాపకమురా, కుతూహలాయత్త చిత్తుండనై ససంభ్రమముతో పుస్తకము తీసి చదువ మొదలిడితిని. ఒక గంటలో ముగింపగల్గుదు ననుకొంటిని; కాని అట్లయినది కాదు; అట్లా చదివి పారవేసేది అయిందికాదు. చాలసేపు పట్టినది; ఏకబిగిని కాకపోయినను, చదివిందే మరల చదువవలసివచ్చేది; కొన్నిపట్ల మధ్యమధ్య ఆగిపోయేది చదవడము; ఆలోచనలోపడేది మనస్సు. అంతట నామిత్రులుచేసిన ప్రశంస అర్హమయినదని యనిపించింది.

'కన్నీటికాలవ'లో 4 కథ లున్నట్లు జ్ఞాపకము. మొదటిది శశిరేఖ; చివరిది నాయుడుపిల్ల. ఆకథలన్నియు ప్రేమకథలే; అనగా ప్రేమతత్త్వమునుగురించి వినిపించే కథలు. మొదటివి మూడున్ను నవీనభావసంచలన వాతావరణమున తేలియాడునవి: చిరకాలమునుండి యవిచ్ఛిన్నముగ వచ్చుచున్న నీతి నియమములకు విరుద్ధమై, వ్యక్తిస్వాతంత్ర్యపరమైన స్వైరవిహారధీరలగు యువకులభావములచే, చేష్టలచే నడచునవి. వారిసంయోగములు, వియోగములు, జీవితచర్యలు హృదయమును స్పృశించునవి గాకున్నను చాలకుతూహలమును గలుగజేయునవి. అట్టి నూత్నభూములందు స్వేచ్ఛాజీవనమును, స్వేచ్ఛానురాగమును ననుభవించుటకై అతిసాహసముగ బయల్వెడలినది శశిరేఖ. ఆమె దొకవిలాసము; అదొక జీవితము; అదొక యాదర్శము. ఇతరుల కది నచ్చకపోవచ్చును; పోనిండు. కాని గ్రంథకర్తగారి కావ్యప్రతిభ యంతయు కన్నీటికాల్వయంతయు 'నాయుడుపిల్ల' యందు దసమానముగ ప్రభవించినది. కన్నీటికాల్వ 'నాయుడుపిల్ల'యందు సార్థకమగుచున్నది. అందుకు వీరిభావ, శైలి రెంటియు...నొనగూర్చుచున్నవి. శైలి ధారాళమై జీవకళలతో స్ఫురించుచు ప్రవహించుచుండును. భాష యన్ననో అచ్చమగు ఉచ్చమైన వాడుకభాష; హృదయమునుండి పుట్టుకొస్తుంది. నాయుడుపిల్ల చెపుతూ ఉంటే బ్రాహ్మణపిల్ల మాటలులాగే వుంటవి. చెపుతుంది, చెపుతుంది కన్నీరుకారేటట్టు; మహాచక్కగా చెపుతుంది నాయుడుపిల్ల.

ఆవిధముగ మనోహరముగ చిత్రింపబడిన 'నాయుడుపిల్ల' నామనంబునఁ దద్దయుఁ జిద్దకాలంబు నిలిచిపోయినది. తర్వాత చాలకాలమునకు ఆనామిత్రుని మరల నేను రైలులో కలిసికొనుట కలిగెను. 'కన్నీటికాలవ'నుగూర్చి చాల ప్రసంగించితిమి. ఎవరెట్లనుకొనేది చెప్పుకొన్నాము. వెంకటచలముగారి మిత్రులు కొందరు శశిరేఖమీద కనపర్చిన చప్పరింపులు పెదవికదల్పడాలు 'నాస్వామీ! శ్రీలవ్వట...' మొదలుగాగల మాటలు నేనక్కడ కన్నది విన్నది చెప్పితిని. మే మంత తేలికగా త్రోసివేయలేదు. 'నాయుడుపిల్ల'మీదమాత్రము మా యిద్దరిమనస్సులు పడ్డాయి ఒకేవిధముగ. అది గ్రంథకర్తగారికి లభించిన వాస్తవికమయిన ప్రత్యక్షానుభవమో, పరోక్షానుభవమో అయియుంటుంది. అందుచేతనే అట్లు వ్రాయగల్గిరి అని యనుకొంటిమి. 'కన్నీటికాలవ'మీద—ముఖ్యముగా నాయుడుపిల్లమీద—నొకవ్యాసము వ్రాయాలని కుతూహలముగా ఉండేది నాకు కొన్నాళ్లు; కాని యితరవ్యాసంగములమధ్య పడి మునిగియుండుటచే, నే నాతలంపే మఱచియుంటిని. ఆగస్టునెల భారతిలో శశి

రేఖమీద వ్యాసము వ్రాసేసరికి మళ్లీ ఆతలంపు పొడచూపి యినుమడించింది. ఇది ప్రస్తావన; శశిరేఖమీద గల్గు నభిప్రాయముల కుపకరించునని యిప్పట చేసితిని.

శశిరేఖనుగూర్చిన సర్వసామాన్యమయిన యభిప్రాయము, అది దుర్నీతిబోధకమని, నీతిబాహ్యమని అందుచే శశిరేఖ చాలామంది కసహ్యముగా నుంటుంది. అది యెట్లో ఆలక్ష్మీనరసింహారావు. (బి. యె., బి. యల్) గారిచే (ఆగస్టు) భారతిలో విమర్శింపబడినది. దానికి పీఠిక వ్రాసినవారు ఆగ్రంథము నీతిబాహ్యము కాదంటారు. విమర్శకులయితే అందు సాహిత్యమునకును, సంఘమునకును జెందిన సమస్యలు గట్టిగా ఆలోచించుట కున్నవి; కాని యిది యవినీతిబోధకముగ నున్నదని విమర్శించి, "యీగ్రంథము నీతిబాహ్య మవునోకాదో చదువరులే యూహించుకొందురుగాక" యని హెచ్చరించిరి. విమర్శకులు శ్రీ శాస్త్రిగారు—పీఠిక వ్రాసినవారు—ఇచ్చిన యభిప్రాయము లెంతేని విలువ గలవందురు గాని, అవి సమంజసములుగావని, ఒప్పుకోబడవని యంటారు. ఈకష్ట మెందుకు గల్గుచున్నదంటే, అసలుకథకంటే పీఠిక పాఠకుల మనస్సు నెక్కువగా కలవరపెట్టుచున్నది. పీఠికయందలి యంశములను చదువరులకు చక్కగ బోధపడునట్లు విపులముగా చరిత్రక్రమేణ నైతికసంస్థలను, వానిపరిణామావస్థలను శాస్త్రిగారు చర్చించినచో గ్రంథమునందలి నీతి మత్తనుగురించిగాని, శశిరేఖచరిత్రవిషయమైగాని కల్గే దురభిప్రాయములు పుట్టుట కవకాశ ముండేదికాదు. విమర్శకులకు శ్రమ తగ్గేది. అందలి యభిప్రాయములతో చదువరులేకీభవిస్తారా, శశిరేఖను హర్షిస్తారా అనేది వేరేసంగతి. అటుగాక నవీనభావములతో సంక్షుభితమగుచున్న అపారపారావారమైన సాంఘికనీతిని చిన్న పీఠికలో తరింపజూచిరి. బహుదుర్ఘటమైన కార్యమిది చదువరులు ఆధునిక సాంఘిక తత్త్వవేత్తల వ్రాతలతో చాలా పరిచయము కల్గియుంటే నేతప్ప తదితరులకు శాస్త్రిగారు ఢంకామీద దెబ్బకొట్టినట్లు వచించిన యభిప్రాయములు దురవగాహముగనుండి పైగ దుర్నీతిబోధకముగ గన్పట్టుటయందు వింతలేదు. అటుగాక ఆబాధంతా లేకుండా శశిరేఖపాత్రకు సంబంధించినంతవరకుగలనీతిని పీఠికలో చర్చించి వదిలేస్తే చాలా బాగుండేది.

నీతివిషయమై శాస్త్రిగారిదృష్టిపథము వేరు. అది ప్రాతవాసనలు లేని కేవలము క్రొత్తపుంత; ఉపప్లావికమయినది. నలుగురితో నారాయణా అనేది కాదు. ఇక మనవిమర్శకుల దృష్టి లోకములో పాతేది; 'గతానుగతికో లోక'మను నానోక్తి ననుసరించునది; బాధలేనిది;లాబద్ధమైనది. ధర్మశాస్త్రప్రకారము, సాంప్రదాయానుసరణి ననుసరించి పోతుంది. శాస్త్రిగారు వీటికన్నిటికి స్వస్తి చెప్పివేసినారు. శాస్త్రిగారిమతమునకు చెందినవారు ప్రస్తుత నైతికసంస్థలను మూలముకంట, పునాదులలోనుంచి పెకల్చివైచి, క్రొత్తపునాదులమీద చక్కనిసంస్థలను కట్టనెంచెడివారు. మనవిమర్శకులవంటివారు repairs చేయుచుంటారు; లోపములుంటే దిద్దుచుంటారు; వన్నెలు, చిన్నెలు, మెరుగులు పెట్టుచుంటారు ఇట్టిసంస్కారములవలన కార్యము కాదని భావిస్తారు శాస్త్రిగారి మతమువారు. వీరిమతము, వారిమతము బాగాపరిశీలిస్తే యిట్లుగా తోస్తుంది యీరెండుమతములకు గల మూలభేదము. అందుచే ఈ రెండుమతములవారికి సమరమేకాని సామరస్యము పొసగదు. మరి యింతకు ఎవరినిగురించి యీసమరము జరుగుచున్నదో వారు చాలకాలమునుండి తెంపులేని బంధములలో చిక్కువడియుండుటయే దీనికంతకు కారణము. వారికొంతుకలు నొక్కివేయబడియుండుటచే, మనగొంతుకలు లేచుచున్నవి. అటుగాక, "శారీరకమానసికవిషయములలో మీకుగలస్వేచ్ఛ, స్వాతంత్ర్యము, మాకేల నుండగూడదు. మేము మీసొమ్ములము గాము. మేమునూ మీవలె మనుష్యమాత్రులమే. మీతత్త్వములకు సరిపడునది మాతత్త్వములకు సరిపడుతుంది; వికటించదు. మీవంటిరోగములే మావును; అందుకు మీకొకవిధమయినచికిత్సాను, మా కింకొకటీనా?" అని లేచి గట్టిగ ప్రతిఘటించగల్గితే, యిట్టి మన విమర్శనములతో, నీతిబోధతో పనిలేకుండాపోతుంది. అప్పుడు మనము నియమించే నీతిధర్మాలు, చదివే ధర్మపన్నాలు తెలుస్తాయి. వారు యుద్ధరంగములోనికి దిగనంతసేపు మనకోటలలో మనము సురక్షితముగ నుండి

నీతులు చెపుతాము. అట్లాకాదు; స్త్రీలకుకూడ సర్వస్వాతంత్ర్యములు పురుషులకువలె కలగజేసేటట్లయితే, లోకానికి మనకు శుభము చేకూరదు; శాంతి యుండదు, అంటే అది కేవలము స్వార్థపరమును స్వార్థేతరమువని అనిపించుకుంటుంది. అందుచే ధర్మశాస్త్రములను, లాకోర్టులను అవతలపెట్టి హృదయమును విశాలముచేసికొని స్వార్థపరతను దిగనాడి పరికించితే ఇప్పుడు మనకు దుర్నీతిబోధకములుగను, నీతిబాహ్యములుగను కన్పట్టేవి అట్లా కన్పట్టవు. అప్పుడు వెంకటాచలంగారి 'శశిరేఖ', విమర్శకులు తలంచునట్లు నీతిబాహ్యముగ గన్పట్టదు.

దేశకాలపరిస్థితులనుబట్టి నీతులు మారుచుండునని శాస్త్రిగారంటే విమర్శకులు "అట్లనుకోవడం కేవలంపొరపాటు. ముఖ్యనీతులు ఎల్లప్పుడూ ఒక్కటే. బైబిలులో చెప్పిన 'పదియాజ్ఞల' కిప్పుడైనా చలనముంటుందా?" అని ప్రశ్నించారు. దేశకాలపరిస్థితులనుబట్టి యెన్నినైతిక సంస్థలు మారలేదు మారుటలేదు! వీరు చరిత్ర చదువుకోలేదేమో! పూర్వము బానిసవ్యాపారము నేడున్నదా? పూర్వము దొంగతనానికి శిక్ష, కాళ్లుచేతులు నరకడము. ఇప్పుడుందా? పూర్వము మనదేశములో స్వయంవరములుండేవి; స్వైరవిహారములుండేవి; తర్వాత సహగమనాలుండేవి. ఇప్పుడవి పత్రికలలో ఉంటున్నాయా? సంస్థలు మారుతూఉంటే, నీతులు మారవా యేమి? నీతిలేనిసంస్థ యేదైనా, యెన్నడైనా ఉంటుందా యేమిటి?

ఇంకా మరేమంటే వివాహసంస్థ ఒక్కొక్కజాతిలో ఒకొక్క విధముగా ఉంటోంది. అందుకు సంబంధించిన నీతులుకూడా వివిధములు. కొన్ని జాతులలో (నాగరికజాతులలోనే) క్రీస్తు పదియాజ్ఞలలో నొకటగు జారత్వము నేరముగాదు. కొన్ని దేశాలలో ఒక ఆడదానిని నలుగురు మగవాళ్లు సమిష్టిగ పంచుకొని కాపురము చేస్తారు. కొన్ని దేశాలలో ఆడవాళ్ళ నీతినియమాలేకాని మగవాళ్ల కేమి అధికారము లేదు. తురకలలో ఒక మగవాడు పదిమంది ఆడవాండ్రను పెండ్లిచేసికోవచ్చును. క్రైస్తవులలో మొదటిపెళ్లాము పోతేగాని రెండవదానిని కట్టుకోడానికి వీల్లేదు. మనలో మగవాళ్లకంతా ఉంది; ఆడదాని కేమిలేదు వివాహస్వాతంత్ర్యము. ఇట్లా నీతికి బహుదేశాలలో బహువిగ్రహాముపట్టియుంటే ముఖ్యనీతియంటే యేమిటో, ఇది నీతిబాహ్యమంటే యేమిటో అర్థముకాదు. బైబిలులోని 10 శాసనములకు చలనముంటుందా అంటే, చెప్పడములో చలనము లేదుగాని చేయడములో చాలావుంది. ఆనీతి ధర్మములే, లోకమునందంతట; కాని బహుదేశములందు బహువిధములుగ ఆచరణలో ఉంటున్నాయి, ఇట్లుంటుంటే, ముఖ్యనీతులంటే యేమిటో; వానికి చలనముంటుందా అంటే యేమిటో, మనవిమర్శకులకే అర్థమవాలిగాని, మరి యాలోచించువారి కవరికి అర్థము కావు. నీతిశాస్త్ర మపారమయినది. ఏది నీతో, ఏది మంచో, నిర్ణయించుట బహు దుర్ఘటము, బెర్ట్రాండు రసెల్ వంటి పేరెన్నికగాంచిన మహాతత్త్వవేత్తలు, పిడుక్కు బియ్యానికి ఒకేమంత్ర మన్నట్లు క్రీస్తుచెప్పిన బైబిలులోని 10 నీతిశాసనములను పరిహాసము చేస్తారు. మన విమర్శకులు లాయరుగారైయుండి నీతినిగురించి అంతతేలికగా సందర్భము విడిచిపెట్టి ప్రశ్నించడము చోద్యముగా నున్నది.

శ్రీశాస్త్రిగారు ప్రేమ చంచలము, శాశ్వతము కాదని చెప్పేది లోకానుభవముమీద చెప్పినది. వాస్తవికజీవితములోని నిజముసంగతి చెప్పినారు. ఆయన చెప్పినది సర్వజనసామాన్యమయినది; కావున నదియే సత్యసమ్మతము. విమర్శకు లందుపైన దాడివెడలిరి; కవులగీతములను వెంటబెట్టుకొని, కవుల ఆదర్శకభూములందుండి—అనగా స్వప్నభూములు—వాస్తవలోకమువైపు తిరిగిచూడకుండా వాదిస్తే విమర్శకులు గెలుస్తారు. వాస్తవమునకు వస్తే శాస్త్రిగారికే విజయము. ప్రేమ స్త్రీలదృక్కులవలెనే చంచలమయినది. కాబట్టి యేపెండ్లిముడి వేసినా, "లా"కు అప్పచెప్పడము తప్పినది కాదు ప్రేమకు. ప్రేమ శాశ్వతమయేటట్లయితే దాని జుట్టు 'లా'యొక్క చేతిలో పెట్టడ మెందుకు? బాగా ఆలోచించండి; లోకమువైపు తిరిగిచూడండి. మనలో మగవారు విద్యావంతులుకూడ పెళ్లాముపోయిన పెద్దదినము నాడే—యింకా ఆమెబూడిద చల్లారకముందే—పెళ్లిచేసుకొంటారే! మొదటిప్రేమ శాశ్వతమే అయ్యేట

ట్టయితే రెండవ దెబ్బకాలు పెట్టగలదు ఆస్థానములో? అది కాదు; ప్రేమ శాశ్వతము చేసుకోవాలంటే అది మన చేతిలోనిపని కాదు. కట్టి పడవేయుదుమంటే, అట్లా పడిఉండేది కాదు. ఆదర్శమునకును వాస్తవమునకును స్వర్గమర్త్యములకు గలభేదము గలదు. మన మమరులము కాము, కావున అమృతమువంటిదని దలచే, ఆదర్శప్రేమ మన కీమర్త్యలోకమున, కావ్యములందు దక్క, వాస్తవమునం దనుభవించుటకు లభ్యము కాదు. విమర్శకులు తలంచే శాశ్వతప్రేమ బందిఖానాలో చిలుకపెట్టలాగున దొరుకుతుంది. అదేప్రేమ, అంటే అనుకోనచ్చును; కవులుమాత్రము అట్లాతలంచరు దానిని.

ప్రేమ చంచలస్వరూపము గలది. మొదటుండే ప్రేమ కొన్నాళ్లకు తగ్గిపోతుంది. కలియకపూర్వము కనబఱచే ప్రేమ, కలిసిన తర్వాత ఉండదు. అందుచేతనే కాబోలు ప్రేమరసము చిలుకకావ్యాలు పెళ్లి చేసి ఊరుకుంటాయి. "తుమ్మెదలాగున పువ్వుపువ్వుమీద వ్రాలెడు ప్రేమ, ప్రేమేనా? అప్పుడు దీనికి 'ప్రేమ' అనేగొప్ప పేరు తగుతుందా?" అని విమర్శకులు కోప్పడతారు. అందుకు లోకవృత్తమును తెల్పుకథలేసాక్షి; మహాకవి కాళిదాసే సాక్షి; కాళిదాసుకథానాయకులది మీరు lust అంటారాఅనండి; ఏ పేరిడితేనేమి పెరుమాళ్ళకు? అసలు స్వరూపము ఒకటే. వీరు శశిరేఖది ప్రేమకాదు Fancy (=ఈడు) అంటారు; ఇంకాపోతే lust (=కామము) అంటారు. ఇంకాపోతే అది mere animal passion (=పశుధర్మము) అంటారు. ఏమిటో! కామశాస్త్రములో ఇవి అర్థములేనిపదాలు. ప్రేమకు ముందుగా దారిచూపేదే ఫ్యాన్సి; ఫ్యాన్సి లవ్వు అవుతుంది; love ఫ్యాన్సిగాను ఉంటుంది. అంకికూమూలము ప్రేమధర్మమే; లవులో లస్టుంది; లస్టులో లవ్వుంది. Love కు, lust కు సరిహద్దు ఎక్కడా గీచేది? Lust లోకంటె love నందే, వీరముళ్లానే animal passion ఎక్కువగా ఉంటుంది. Love దగ్గరగల కొన్ని దుర్గుణాలు lust కు లేవు; lust కు గల సుగుణాలు కొన్ని లవ్వుకు లేవు; love లో పశుధర్మము లేదంటే, పడుకోవడాలు ఎందుకు కల్గాలి? ఒక్క శశిరేఖయందే కాబోలు పశుధర్మముంటా? ఒక్కణ్నే కట్టుకొని చచ్చేవరకు పడి ఉండలేదనా? 'పశుధర్మము' ఎంత సుఖముగా తీరితే, అవగా సంతుష్టిపొందితే అంత దృఢముగ పాతుకుంటుంది లవ్వు. మనస్సులో అంతబాగా వికసిస్తుంది లవు అనే పువ్వు. అది లేనిచోట నీరసించి, వాడిపోతుంది. "పశుధర్మము" సంతుష్టిచేయడమంటే ప్రేమవృక్షమునకు దోహదము చేయడమన్నమాట. Law లోనలె love లో వేరువేరు సెక్షనులు లేవు. అంతా ఒకటేగ్రంథము. మనకామవికారాలు, మోహాలు, పశుధర్మాలు అన్నిటిని వివాహము కప్పిపుచ్చుచున్నదిగాన బయల్పడడం లేదు.

ప్రేమతత్త్వము బ్రహ్మాండమువలె పెద్దదయినది; ఆకాశమువలె విశాలమయినది; సాగరమువలె అగాధమయినది. దానితత్త్వము హరిహరబ్రహ్మాదులకైనా తెలియదంటే మన మేమిచెప్పగలాము. బ్రహ్మతత్త్వమయినా తెలుస్తుందిగాని, ప్రేమతత్త్వము తెలియదు దానిలోతంతా కనుక్కొన్న ఏమహాకవియు లేడు. దానితత్త్వము అనుభవమునకే తెలియదంటే తర్కిస్తే తెలుస్తుందా? ధర్మశాస్త్రిలు, లాకోడ్డులు, కేసులాలు తిరగేస్తే దొరుకుతుందా? మరి కవులేమిటి అట్లావర్ణిస్తారంటే, వాస్తవికములో నిది చూపిస్తే, అంతరసవంతముగా ఉండదని. దానికి నైతిక సాంఘిక ప్రతిబంధాలు చాలాఅడ్డుపడతవి. అందుచే రసము పోతుందని, ఎంతసేపు భావసముద్రమునసే తేలుచు, "ఆత్మను, ఆత్మను కలిపి కుట్టేదారము"ని, ఇట్లు ఆనందించడానికి ఏవో భావగీతాలు పాడుతూవుంటారు. అదిపట్టుకొని మనము వేళ్లాడుతూ ఉంటాము. ఆదారాన్ని పట్టుకొని మనము గాలిపటాలులాగున ఎగురుతూ ఉంటాము. అంతే కవులు వర్ణించేదానితత్త్వము, ఆదర్శము ఆదర్శమే. వారు పాడేవంతా అద్దములోని ఆటవంటిదే.

కాబట్టి శశిరేఖను లాదృష్టితోను, ధర్మశాస్త్రిల ప్రకారము, సాంఘికనీతి ననుసరించి చూస్తే, శశిరేఖ నీతిరేఖకు వక్రగతి పట్టినట్లు కన్పట్టకమానదు. అటుగాక మనజ్ఞానచక్షువునకు చిరకాలమునుండి పట్టినచత్వారమును పోగొట్టుకొని హృదయమును విశాలముచేసుకొని

చూచినట్లయితే మనశశిరేఖయు నొకచల్లని చంద్రకళ లాగే కనబడుతుంది. శశిరేఖది యొక వ్యక్తిస్వాతంత్ర్యమును, మనోధర్మమును నిర్భయముగ వ్యక్తపరచు ఆదర్శకజీవితమే. సాంఘికమర్యాదలకు కట్టుబడి ఆత్మవంచనమును, పరవంచనమును చేయుటకంటె, ఆత్మధర్మమును (Law of inner being) అనుసరించుట ధర్మయుక్తమైనది. కాదా; ఏమిసంభవించినను? నీతిదాయకమయినదికాదా? అట్లనుసరించుటవలన లోకహితమునకు గాని, పరార్థమునకుగాని హాని కలుగుతుందంటే, లోకముసహించి యూరకుంటుందా? ఏమి? గట్టిగా శాస్తి చేస్తుందప్పుడు. కాదు, అసహ్యముగా పరిణమిల్లుతుందంటే మనయొద్ద సహనగుణము లోపించిందన్నమాట.

"ప్రస్తుతపు వివాహములలో అనేక దురాచారాలున్నాయన్నమాట నిజము. అటువంటివి పోగొట్టుటకు ప్రయత్నించాలిగాని కేవలము వివాహము అనేసంస్థ ఉండుటకు వీలులేదంటే మాత్రము సంఘము ఒప్పుకోదు" అని విమర్శకు లంటారు. మునొక్కప్పుడు ఒప్పుకోని సంస్థలను నేడు సంఘ మొప్పుకోవడంలేదా? అలాగే దాని కాలము వచ్చినప్పుడు దానిని ఒప్పుకోవలసివస్తుంది. రష్యాలో నేడు రాలేదా? మనము అనాగరికులని అనుకొనేజాతులలో ఏయిబ్బంది లేకుండా సుఖముగా కాలక్షేపము చేయడము లేదా Legal marriage లేకుండాసంస్థలు సంస్థలులాగనే ఉండనిచ్చి దురాచారాలు పోగొట్టాలంటే మురికిగుంటలలో మందులు చల్లుటవంటిదే. అందుచేతనే సంఘసంస్కరణాభిలాషుల ప్రయత్నములు వ్యర్థమై దురాచారాలు మానానికి పోకుండావుంటున్నాయి. శస్త్రవైద్యమునకు కుదిరేరోగాలు మందులు చేస్తే కుదరవు. నాగరికులమనుకొనే మనయొక్క సాంఘికసంస్థలు, నైతికాదర్శములు స్వార్థమూలములును, కుమ్మక్క-దాంభికములును, పట్టి యాడంబరములునై నిర్వీర్యముగ నున్నవి గాని త్యాగయుతములుగను సత్యసంబద్ధములుగను నున్నవని నేటి నాగరికుల నైతికవ్యవహారములను బాగా లోతుగా పరీక్షించేవా రెవరు తలంపరు.

వెంకటచలముగారు మున్నెన్నడు నాంధ్రవాఙ్మయమునందు త్రొక్కని త్రోవలను నూత్నసమస్యలతో నిర్భయముగ చూపుచున్నారు. అజ్ఞానాంధకారముచే నావరింపబడి యున్న మన సాంఘిక నైతికవిషయముల మీదకు సెర్చిలైటును త్రిప్పినారు. వీరి 'కన్నీటికాలవ' లోని విషయముయొక్క విలువ రెంతేని అక్కడగలదు. అందు 'నాయుడుపిల్ల' ఒకటిచెప్పితే, తక్కినవి కన్నీటిని కాల్వగా చేయలేకున్నను, చదువుటకు మొదలిడితే కడముట్టేవరకు పుస్తకము విడువలేనంత కుతూహలముగను, అంతర్భావోద్రేకముగను నుండును; చివరకు మనయభిప్రాయ మెట్లున్నను, ఒక్కొకపట్టున చదివిందే మరల చదువాలని యనిపించుచుంది. 'నాయుడుపిల్లను' గురించి వేరే చెప్పేదేమున్నది? అది వెంకటచలముగారి పుష్పవనములోని Night Queen అన నొప్పును దాని సౌరభమే వేరు.

ఆధునికాంధ్రవాఙ్మయమును భాగ్యవంతముగ చేయు కొలదిపాటి గ్రంథములలో వెంకటచలముగారి "కన్నీటికాలవ" నిరతిశయముగ నున్నదని నిస్సంశయముగ చెప్పవచ్చును.

ఏది శాశ్వతము?

[ఒక ఆధునికతర కవిబాలుడు]

౧

భూమ్యాకాశముల పెండ్లిదినమా,
నీ విలాసము లెంతో ఆనందజనకములు.
చల్లని గాలులతో, వెచ్చని యెండలతో
అందరికీ హాయి కల్పించుచున్నావు.

కాని నీకు రానున్న అంతమును గానలేక
పోవుచుంటివి మూఢుము అదిగో ఆ
తూర్పు దిక్కున నీకు సహజవైరి యైన
రాత్రి ని న్నంతరించుటకు వచ్చుచున్నది
నీచావుకు దిక్కులు విలపిస్తూ వదలిన
కన్నీటిమంచుధారలవిగో ఆవరిస్తున్న వంతటను
ఆహా, సరిగదా నీ బ్రతుకు ఇంతటితో.

౨

చక్కని సంపెగ పువ్వా
నీ సొగసూ నీ సొంపూ నీ వాసనా
నీకూ మాకూ కూడా సంతోషకరములే
కాని సమీపిస్తున్ననీఅంతమును కానకున్నావు.

నీ మూడిక మెత్తందనమే నీ ముప్పుకు
కారణమని నీకు తెలియకున్నదా.
కొంచెము నీ శిరస్సు నిటు వంచిచూస్తే
నీ మొదలెట్లు పగుల నారంభించిందో
నీకే స్పష్టము కాగలదు గదా.

౩

వసంతమా నీవెంతో సుఖప్రదాతవని
చల్లదనమని చలిగాకుండా, వెచ్చదనమని వేడి
[గాకుండా
ఇండ్లలోనూ గాక తోటల్లోనూ గాక
ఇక్కడా అక్కడా ఉంచేటి కాలమని
నీవు పొంగిపోతూ నడుస్తున్నావు
పచ్చని చామంతులతోడా ఎర్రమామిళ్లతోడా
పూస్తున్న పనసలతో వికసిస్తున్న గులాబీలతో
ప్రపంచాన్ని స్వర్గసమంగా చేస్తున్నానని
అంత వడిగా పరుగెత్తు తున్నావు
కాని నీకూ తప్పింది కాదుకదా
ఈ నిర్దయ స్వరూపమైన అంతము.

౪

అయితే అన్నీ అట్లే పోతే నిలిచే దేది?
పోయేది వ్యక్తులు, మంచిగుణాలు నిలిచే ఉంటవి
దినమూ, సంపంగీ, వసంతమూ, పోవచ్చును
గాని తేజస్సుకూ, సువాసనకూ, శృంగారానికీ
చావంటూ ఎన్నడూ లేదు గదా
ప్రపంచ మంతా నశించి పోయినా
లోకకళ్యాణము సంపాదించే గుణాలకు
నాశము ఉండనేరదు గదా.

'దసరా' చిత్రములు





౨. దసరా పూజ



౩. యువకప్రాజ



౪. శమీపూజ

కవి కంఠాభరణము

కిళాంబి రాఘవాచార్యులుగారు

మహాకవి క్షేమేంద్రుఁడు కవికంఠాభరణ మను నలంకారగ్రంథమును రచించె నని యు, దానికి 'కవికర్ణిక' యను నామాంతరము గలదనియు 'ఔచిత్యవిచారచర్చ' యనువ్యాసమునఁ దెలిపియుంటిని. శిష్యుల కుపదేశ మొనర్చుకొఱకును, విద్వాంసులకు విశేషాంశముల బోధించుకొఱకును నీగ్రంథము ను రచించితి నని తెలుపుచుఁ, దన గ్రంథ మునుగూర్చి కవి యిట్లు వ్రాసియున్నాఁడు:

సువిభక్తిసమన్వితం బుధై
ర్గుణసంయుక్త మముక్తసౌష్ఠవైః;
రచితం పదకైః సువర్ణవ
త్కవి కంఠాభరణం విచార్యతామ్.

మనకుఁ జిరపరిచితము లగు కావ్యప్రకాశికా, ప్రతాపరుద్రీయా ద్యాలంకారిక గ్రంథములవలెఁ గాక, యీగ్రంథ మొకనూతనమార్గము ననుసరించుచున్నది. నాయకనాయికాల క్షణములు గాని, కావ్యనాటకాదిలక్షణములు గాని యిందుఁ దెలుపఁ బడ లేదు.

కవికంఠాభరణము కవిత్వప్రాప్తి, కవిశిక్షణము, కవిత్వచమత్కారములు, గుణదోషవిభాగము, పరిచయప్రాప్తి యను నయిదు ప్రకరణములఁ గలిగి యున్నది. అందుఁ బ్రథమప్రకరణమునఁ గవిత్వప్రాప్తికి దివ్యమానుష ప్రయత్నములు కారణము లని నిర్వచింపఁబడి నవి. సరస్వతీపూజనాదికములు దైవికములు; గురుశిష్యసంబంధము మానుషము. కవి యీ ప్రకరణమును ముగింపుచు సంగ్రహముగ నీ శ్లోకమును రచించియున్నాఁడు:

ఇతి తలితసుకృతానాం ప్రాక్తనానాం విపాకే
భవతి శుభమతీనాం మంత్రసిద్ధం కవిత్వమ్;
తదను పురుషయత్నై ర్ధీమతా మభ్యుదేతి
స్ఫురతి జడధియాం శ్రీశారదా సాధనేన.

ద్వితీయప్రకరణమునఁ గవులను ఛాయోపజీవి, పదకోపజీవి, పాదోపజీవి, సకలోపజీవి, భువనోపజీవి అని అయిదుజాతులుగ విభజించి, యనంతరము కవి యెట్టిశిక్షణము నందవల యునో తెలిపి యున్నాఁడు. (ప్రక. 2, శ్లో. 2-22). ఈ ప్రకరణమునందుఁ దెలుపఁబడిన నూఱు విషయములయందును శిక్షణము నంద నిచోఁ, గవి కానేరఁ డని క్షేమేంద్రుని యభిప్రాయము. అందువనే ప్రాచీనకవులయొక్క సర్వతోముఖవిజ్ఞానము వెల్లడి యగుచున్నది.

తృతీయప్రకరణమునఁ జమత్కారనిరూపణ మొనర్పఁబడినది. చమత్కారమునకుఁ గవి యీక్రిందిశ్లోకము నుదాహరించియున్నాఁడు:

రక్త స్త్వం నవపల్లవై రహమపి
శ్లాఘ్యైః ప్రియాయా గుణైః
త్వా మాయాంతి శిలీముఖాః స్మరధను
ర్ముక్తాః సఖే మా మపి;
కాంతాపాదతలాహతి స్తవ ముదే
తద్వ న్మమా ప్యావయోః

సర్వం తుల్య మశోక కేవల మహం
...సశోకః కృతః.

కాని యశోవర్మవిరచిత మగు నీశ్లోకము కాళిదాసవిరచిత మని పొరఁబాటునఁ దెలుపఁబడినది.

చమత్కారము పదివిధములు: (౧) అవిచార్యమాణరమణీయత, (౨) విచార్యమాణరమణీయత, (3) సమస్తసూక్తవ్యాపి, (౪) సూక్తైకదేశదృశ్యము, (౫) శబ్దగతము, (౬) అర్థగతము, (౭) శబ్దార్థగతము, (౮) అలంకారగతము, (౯) రసగతము, (౧౦) ప్రఖ్యాతవృత్తిగతము. ఈదశవిధచమత్కారములకు క్షేమేంద్రమహాకవి తాను రచించిన శశివంశపద్యకాదంబర్యాదిగ్రంథములనుండియే యుదాహరణముల నిచ్చియున్నాఁడు.

చతుర్థప్రకరణము గుణదోషవిభాగమని పేర్కొనఁబడియున్నది. కాని యీ ప్రకరణమునందు అప్రయుక్త, అపుష్టార్థ, నిరర్థకాది దోషప్రశంస గాని, శ్లేష ప్రసాద మాధుర్యాది గుణప్రశంస గాని కానరాదు. క్షేమేంద్రమతానుసారము కావ్యగుణములును, కావ్యదోషములును శబ్దార్థరసముల వైమల్యకాలుష్యములచేఁ గలుగుచున్నవి. కావ్యములు సగుణ, నిర్గుణ, సదోష, నిర్దోష, సగుణదోషంబులని అయిదువిధంబులు.

పంచమప్రకరణమునఁ గవికి తర్క వ్యాకరణ భరత చాణక్య వాత్స్యాయన భారత రామాయణ మోక్షోపాయాత్మజ్ఞాన ధాతువాద రత్నపరీక్షా వైద్యక జ్యౌతిష ధనుర్వేద గజతురగపురుషలక్షణ ద్యూతేంద్రజాలాదులయందుఁ బరిచయము తప్పక యుండవలయునని తెలుపఁబడినది. వివిధపరిచయముల కుదాహరణము లీయఁబడినవి.

ఈగ్రంథము నూతనమార్గము ననుసరించుచున్నదని యిదివఱలో తెలుపఁబడినది. కావ్యాలంకారలక్షణ నిర్వచనముకొఱకు వ్రాయఁబడి యుండలేదు. కవిత్వప్రాప్తి మొదలు శిక్షణాదికములు చర్చింపఁబడి యుండుటచే, కేవలము కవులకొఱకు రచింపఁబడినటులు దోఁచుచున్నది. కాని భాషాప్రపంచమున కుపయోగకరము లగువిషయము లిందుఁ జాలఁ గలవు.

౧. కవి తక్కిన యాలంకారికులవలెఁ గాక యుదాహరణములఁ జాలవఱకుఁ దన గ్రంథములనుండియే కైకొనియున్నాఁడు. క్షేమేంద్రుని గ్రంథములలో సంపూర్ణముగ మనకుఁ గొన్ని గ్రంథములు మాత్రమే లభించిన వని యిదివఱలోఁ దెలిపియుంటిని. ఔచిత్యవిచారచర్చాది గ్రంథములయం దుదాహరించిన శ్లోకములవలన మనకు లభించని గ్రంథముల ఇతివృత్తము స్పష్టపడఁ గలదని నానమ్మకము.

౨. ఔచిత్యవిచారచర్చయం దుదాహరించిన కవులను గాక యింక నీక్రిందఁ దెలుపఁబడిన కవులశ్లోకములను క్షేమేంద్రుఁ డీగ్రంథమున నుదాహరించి యున్నాఁడు: భట్టశ్రీశివస్వామి, భట్టవాచస్పతి, దామోదరగుప్తుఁ

డు, విద్యానందుఁడు, భట్టముక్తికలశుఁడు, ముక్తాకణుఁడు, చక్రపాలుఁడు, ఆర్యభట్టు, ఇంద్రభానుఁడు. వీరి కాలమును గూర్చియు, రచించిన గ్రంథములను గూర్చియు విమర్శన మొనర్పవలసి యున్నది.

౩. మఱియు ద్వితీయప్రకరణమున ఛాయోపజీవి మొదలగువారి కొసంగినయుదాహరణములవలన భట్టభల్లటుఁ డుత్పలరాజదేవునకును, ఆర్యభట్టు భట్టభాణునకునుఁ బూర్వులనియుఁ దోఁచుచున్నది. ఇది విమర్శనీయము.

౪. ముక్తాకణుఁడు, చక్రపాలుఁడు సోదరులని ద్వితీయప్రకరణమునఁ గననగును. ఇంద్రభానుని దని యుదాహరించిన 'స్నాతుం వాంఛసి కిం ముధైవ...' యను శ్లోకమును క్షేమేంద్రుఁడు సువృత్తతిలకమున రిస్సువిరచితమని యుదాహరించి యుండుటచే, రిస్సు వను కవికి ఇంద్రభానుఁ డనునామాంతరము గలదని తోఁచును.

౫. క్షేమేంద్రునకు భట్టోదయసింహుఁడు, రాజపుత్ర లక్ష్మణాదిత్యుఁ డను నిరువురు శిష్యులు గల రనియు, నందు భట్టోదయసింహుఁడు భక్తిభవ, లలితాభిధానము లనుకావ్యముల రచించె ననియుఁ బంచమప్రకరణము వలనఁ దెలియుచున్నది.

౬. ఈ గ్రంథమునందు భర్తృహరి వైరాగ్యశతకమున కాలమహిమాను వర్ణనమునఁ గానవచ్చు నీక్రిందిశ్లోకము చంద్రకుని దని యుదాహరింపఁబడినది:

యత్రానేకః క్వచిదపి గృహే
తత్ర తిష్ఠ త్యథైకో
యత్రా ప్యేక స్తదను బహవ
స్తత్ర నైకోఽపి చాంతే;
ఇత్థం నేయౌ రజనిదివసౌ
దోలయ న్ద్వావి వాక్షౌ
కాలః కాల్యాసహ బహుకలః
క్రీడతి ప్రాణిశారైః.

అందువలన భర్తృహరికిఁ జంద్రకుఁ డని యపరనామధేయము గలదా, లేక భర్తృహరిశతకత్రయము సంగ్రథితమై యుండునా యనుసంశయము కలుగుచున్నది. భర్తృహరిశతకమునఁ గానవచ్చు నొకశ్లోకమును జంద్రకుని దని కవి యుదాహరించినటు లౌచిత్యవిచారచర్చ యనువ్యాసమునఁ జూపియుంటిని.

౭. తాను రచించిన యాలంకారికగ్రంథముల మూఁటియందును దనగ్రంథములనుండి యనేకోదాహరణములఁ గైకొనుటవలనఁ గవికి స్వాభిమానము విశేషముగఁ గల దని యూహింప నగును.

౮. ఈ గ్రంథమును కాశ్మీరనృపతి యగు అనంతరాజుకాలమున రచించితి నని కవి యీ గ్రంథాంతశ్లోకమునఁ దెలిపియున్నాఁడు—

కాశ్మీరేషు పృథుప్రతాపసవితుః
కీర్త్యంశుతారాపతేః
ప్రాఘారాతివనానలస్య ధనద
స్యేంద్రస్య భూమండలే;
విశ్వాకారవతః పునః కలియుగే
విష్ణో రివోత్సాహినో
రాజ్యే శ్రీమదనంతరాజనృపతేః
కావ్యోదయోఽయం కృతః.

ఉదయభానుఁడు

కొంపెల్ల జనార్దనరావు గారు

సరసుల మానసాబ్జములు జల్లన, దిక్కులు తెప్ప లెత్తి యా
దరమున మ్రొక్క, 'విశ్వవిభు, తామసహారి, త్రిమూర్తిరూప' యం
చెఱఁగెడు భక్తసంఘముల కిమ్ము ఘటించుచు పద్మలోక సం
భరణచణాంశుఁడై యుదయభానుఁడు తోఁగుచుఁ దోఁచెఁ దూర్పునన్.

ప్రాఁతవిపంచి కూర్చికొని రాతిరి పాడు వియోగగీతికల్
సీతున పేరి రాలు హిమశీకరసంతతి జాలువాఱ, వే
దాతిశయార్థ మేమి కల దంచునొ యేఱుకొనంగ వచ్చె ని
ర్యాతతమఃప్రభాకరుఁ డహర్పతి పాటలకాంతి పర్వఁగన్.

నీడలు పోకలై నిగిడె; నిద్దుర నిద్దుర కేఁగె; బిట్టు కో
రాడెను తూర్పుటేన్గు లుదయాద్రిని జేగుఱుగుట్ట లెల్ల; మో
మోడెఁ దొగల్; పయోజముల కుబ్బులువాఱెను మోద మాత్మ స
మ్రా డభిదర్శనం బొదవ; మంతనమాడెను భూమి స్వామితోన్.

నిట్టూర్పు

మద్దిపట్ల వేంకటరమణయ్య గారు

ఎడము లేక తగులు నీ సుత్తిదెబ్బల
కెట్టు లోర్చి తనువు నెట్టువాఁడ?
మృదు సుమమ్మె కాని హృదయమ్ము పరమాత్మ
కాదు కమ్మటీని గట్టిదాయి—

కలరు కష్టసుఖా లోలిఁ గాంచుచుంట
బ్రదుకుఁ జదరంగమున బంట్లపగిది వారు;
దైవమా! యేమికర్మమో కేవలమ్ము
నల్లగడిసెకటును బోలినాఁడ నేను—

ఎంతకాల మిట్టు లెదురుగాలుల కోడ
నడిసముద్రమందు నడపుచుందు?
అకట! విసరదయ్యె ననుకూలముగ నొక్క
పిల్లగాలి యేని మెల్లగాను—

మొలకనగ వొప్ప కడకంటి తళుకుకొఱకుఁ
బెద్దయాసతోడను నేను వేచియుండఁ
జిమ్ముచున్నాఁడ వౌర! క్రోధమ్ముతోడఁ
గరముఁ గనకనలాడు నింగలము సీశ!

కఠినశిలలఁ జీల్చుకొనుచుఁ గాఱుటడవి
సన్నముగ బాఱుటయె, కాని యెన్నఁటికిని
లేదె మజ్జీవితాపగ కోదయాబ్ధి!
స్వేచ్ఛమై వెల్లడీని బ్రవహించు కలిమి?

అడుగకుండ నిచ్చి యడియాసలను గొల్పి
తిరుగ లాగికొంటి వెరవుపోల్క;
అది నేమికతన నరయవైతివి స్వామి!
నా యపాత్రతయును నీ యశక్తి?

కుచేల

సి. కామేశ్వరరావు గారు

(వెనుకటి సంచిక తరవాయి)

దృశ్యము ౨

[ప్రవేశము - నారదుఁడు]

నారదుఁడు

సకల లోకాధార సచ్చిదాకార
ప్రకటితాగమజాల పద్మావిలోల,
అగణిత గుణగ్రామ ఆత్మాభిరామ
నిగమశీర్షారామ నిత్యాప్త కామ.

చాల దినములకు మరల మర్త్యభువనమున శ్రీకాంతుని యపూర్వలీలాప్రదర్శనముఁ గాంచి ముగ్ధుండ నైతిని. ఆహా! దయామయుఁ డా శ్రీకృష్ణభగవానుని యుదారహృదయపరివర్తన మెవ్వఁడు గ్రహింపఁగలఁడు? నవ్వించునొక వేళ; తేలించు బాష్పస్రవంతిలో నింకొకవేళ. ఓ యదుకుల సార్వభౌమా, నీ యద్భుతమహిమ వాచామరగోచరము; నీ శైశవక్రీడారంగస్థలం బాగోకులము, నీ యమృతప్రణయరసాస్వాదనమున సాయుజ్యపదవి సాధించిన యా గోపకామినులు, నీ మధురవేణుగీతముల మైమఱచిన యానందవాహిని, యా యమునాతరంగిణి, భక్త్యావేశమున నీ హృదయప్రవేశముఁ గావించినలోకమాత యా రుక్మిణీదేవి ధన్యులని భావించితిని. సర్వసామాన్యుఁ డీ బ్రాహ్మణుఁ డింతమహిమాఢ్యుఁ డని నేఁ గలనైనఁ దలంపలేదు. ఎట్టిగుణాధిక్యమున నిన్నాతఁడు వశీభూతు నొనరించెనో పరీక్షించి చూచెదనుగాక! అదె, కుచేలుఁడు వచ్చుచున్నవాఁడు. ఇచ్చటనే పొంచియుండి యాతని వర్తనముఁ బరిశీలించెదను.

[నిష్క్రమించును]

[ప్రవేశము - కుచేలుఁడు]

కుచేలుఁడు

కృష్ణా, లోకనాయకా, నాహృదయతృష్ణ తీరినది. కన్నులార నిన్నుఁ జూచితిని. నాకింకేమికోరికలు గలవు? నిరంతరము నీ సాన్నిధ్యమే యభిలపింతును. భక్తచింతారత్నమా, మనోముగ్ధకరంబగు నీ మహోదార స్వర్గీయస్నేహభావమునకుఁ బ్రణామము!—వామా, నీకారణమున నే ధన్యుండ నైతిని; నీభక్తిమాన్యం బయ్యె; మనజీవనము సార్థకమయ్యె. (ముందుఁ జూచి) ఓహో! ఎట్టి బీభత్సదృశ్యము'—ఓ యబలా, నీ వెవరు? ఈ దుర్గతికిఁ గారణ మేమి?

[కుష్ఠరోగపీడితుఁడగు భర్తను గంపలో నిడి శిరమునఁ దాల్చి సుశీల ప్రవేశించును]

సుశీల

బ్రాహ్మణోత్తమా, ప్రణామము. ఈగంపలోఁ గల రోగార్తుఁడు నా మనోనాథుఁడు. మేము చాల పేదవారము. వాడవాడల బిచ్చమెత్తి పొట్ట పోసుకొనుచుందుము.

కుష్ఠరోగి

అబ్బా! అబ్బా! ఈబాధ భరించలేనురా దేవుఁడా! మృత్యువు నన్నేల కటాక్షింపదు!

పాతాళము నా కేల చోటొసంగదు! పూర్వ జన్మమునఁ జేసిన ఘోరపాపము! అనుభవింపక తీరునా? అబ్బా! అబ్బా! నా కేమిదారి? ప్రాణ మేల పోదు?

సుశీల

(గంప క్రిందఁ బెట్టి, పైటతో వ్రణములనుండి స్రవించురక్తము నొత్తుచు) కృష్ణా, విపద్బంధూ, పాపభంజనా, మమ్ముఁ గరుణింపుము! నాథా, పుణ్యాంగన యొకతె యన్నప్రదానముఁ గావించినది. పట్టెడన్నముఁ దిని యీ చెట్టుక్రింద విశ్రమింపుఁడు.

కుష్ఠరోగి

అబ్బబ్బా! నానిలువెల్ల విషజ్వాలలు ప్రసరించి పోవుచున్నవి. నా కిం కేమిదారి! హా! పరమేశ్వరా!—

కుచేలుఁడు

సాధ్వీశిరోమణీ, నీ యునికివలననే చరాచర ప్రపంచము నిలిచియున్నది. నీస్వామి భయంకరరోగప్రపీడితుఁడు. ఆతని సర్వాంగము వ్రణప్రపూర్ణము. ఈ శిథిలబీభత్సకళేబరమును బూాదండవోలె శిరమునఁ దాలిచి, వాడవాడల బిచ్చమెత్తి, దుర్భరజీవనయాత్ర నెఱపుచున్నావు. తల్లీ, నీవే పతివ్రతవు! నీ దుఃఖవిమోచనమున సర్వజగత్కల్యాణ మగును. (రత్నహారమును స్పృశించును.)

నారదుఁడు

(ఆవేగమునఁ బ్రవేశించి) ఓ బ్రాహ్మణోత్తమా, ఈవెఱ్ఱి నీ కెవరు గఱపిరి? శ్రీకృష్ణదేవుఁడు దయాతిరేకమున నీ కర్పించిన రత్నహారప్రభావమును మఱచితివా? జగజ్జనని రుక్మిణీదేవి యీ యలంకారమూల్యమును విశదీకరింపలేదా? త్రిభువనైశ్వర్యము, బ్రహ్మలోకము, దేవేంద్రపదవి, యమరత్వము, వేయేల, అనంతకోటిరయభీష్టము లీ రత్నహారమున నిమిడీయున్నవి. దేని వాంఛింతు వది నీహస్తగత మగును. అట్టి యమూల్య పదార్థతత్త్వమును విస్మరించి యిప్పు డే మొనరింప నూహించుచుంటివి?

కుచేలుఁడు

తపోధనా, నమస్కారము. ఏ మంటిరి? ఈ రత్నహారతత్త్వమును మఱచితి ననియా? త్రిభువనైశ్వర్యము, త్రిలోకాధిపత్యము, త్రికాలస్థాయిత్వము—భూతదయలేని హృదయమునకీ యొనలేని విభూతి యేల? ఈ రోగార్తుని యాతన నేఁ జూడఁ జాలను ఈ పతివ్రత దుఃఖము నే సహింపలేను. నన్ను నిరోధింపకుఁడు. (రత్నహారమును దీసి పట్టుకొని) ఓ, కృష్ణా, ప్రాణసఖా, ఈ శీర్ణగాత్రుఁడు వజ్రగాత్రుఁ డగునుగాక!

కుష్ఠరోగి

(ఆరోగ్యలాభము వడసి, కుచేలునిపాదములపైఁ బడి) మహాత్మా, మీ యవ్యాజకారుణ్యమున నేఁ బునర్జీవితుఁడ నైతిని. నా హృదయపూర్వకప్రణామము స్వీకరింపుఁడు.

సుశీల

ఓ పుణ్యపురుషా, నీ యాశీర్వాదమున నేను చిరసౌభాగ్యవతి నైతిని. నాకృతజ్ఞత నే నెట్లు

నివేదింపఁ గలను. నీయాలుబిడ్డ లపారశ్రీవిలసితు లగుదురుగాక!

[నిష్క్రమింతురు.]

నారదుఁడు

కుచేలా, ధన్యాత్ముఁడవు! శ్రీనివాసుని హృదయరాజ్యమున నీ వేటి కభిషిక్తుఁడ వైతివో గ్రహించితిని. మర్త్యలోకము నీవలనఁ బరమపూజ్యం బయ్యె. మహాత్మా, నీపాదధూళిఁ బ్రసాదింపుము. నాశిరమునఁ దాల్చి ధన్యాత్ముఁడ నయ్యెద.

కుచేలుఁడు

ఋషీశ్వరా, మీ రిట్లనఁ దగునా? ఈ యవాచ్యములు నే వినఁజాలను. ఈకార్యమున నాయాధిక్యమేమి కలదు? శ్రీకృష్ణుని కృపాతిరేకమున నీరోగార్తుఁ డారోగ్యలాభము వడసెను.

నారదుఁడు

కుచేలా, నీస్వార్థరాహిత్యము, నీపరోపకారపరాయణత, నీ శ్రీకృష్ణభక్తి, యాచంద్రతారార్కము మానవచరిత్రమున స్వర్ణాక్షరముల విరాజిల్లుఁగాక!

సౌరాష్ట్రి (మోహన) రాగము - ఆదితాళము

నందనందన గోపాల జయ నవనీతచోర గోపాల
కందర్పశతకోటిసుందర సుఖకరమందహాస శ్రీగోపాల
బృందావనగోబృందఘనానంద చంద్రానన శ్రీగోపాల
లీలామానుష బాలకవేష బలానుజవిగ్రహ గోపాల
మురళీధర మునిబృందవిచింతిత ముక్తజనాశ్రయ
[గోపాల.

[నిష్క్రమించును]

కుచేలుఁడు

చాల వేళ యైనది. వామాక్షి నాకై యెదురు చూచుచుండును. శీఘ్రగతిఁ బోయెదనుగాక.

[నిష్క్రమించును]

దృశ్యము 38

[సరోవరతీరము-కుండ చంకఁ బెట్టుకొని చింతాకులభావమున వామాక్షి ప్రవేశించును]

వామాక్షి

ఈ దగ్ధజీవనమున నిం కేమిప్రయోజన మున్నది? దారిద్ర్యదుఃఖము దుర్భరము. ఈ దుఃఖయోగమున నాస్వామిని దూరభూముల కంపితిని. నట్టింట కరుదెంచిన దీనురాలికిఁ బట్టెఁడన్నముఁ బెట్టలేనైతిని. కడుపుతీపి చంపుకొని బిడ్డలగోడు సహించితిని. నిర్లజ్జజీవనమునకు నోచుకొనిన నా కింకేమి సుఖ మున్నది? ఓ సరోవరలక్ష్మి, నీగర్భక్రోడమున నా కాశ్రయ మిమ్ము. (కుండ గట్టుపైఁ బెట్టి, సరోవరసోపానములు దిగుచు,) ఆహా! హృదయేశ్వరుని పాదపద్మములు కడసారి చూచుభాగ్యము లేకపోయె! ఓకృష్ణా, దీనురాలను! నాతప్పు సైరింపుము. మఱియొక జన్మమున నావిభుని పాదదాసి నై జన్మించెదను గాక! సురక్షితముగా నాతని నిల్లుఁ జేర్చుము తండ్రీ!— నాథా, నా యవివేకమును మన్నింపుఁడు. తల్లి లేనిబిడ్డల నాదరింపుఁడు! (సోపానములు డిగ్గి) ఆహా! చావ నెంచిన వానికి సముద్రము మోఁకాలు బంటి యని పెద్దలు వచింతురు. ఆ యార్యోక్తి నాయందు సార్థకం బయ్యె.

ఇంతదనుక ప్రళయపయోదమువలె సజలమైన పుష్కరిణి, శుష్కీభూత మయ్యె నెట్లు? ఇదియును నా యభాగ్యమే. నా మనోభీష్టమొక్కటియుఁ జేకూరదయ్యె; కడకు మరణింతమన్నను, నదియు ఘటింపదయ్యె. (చంద్రోదయమగుటఁ గాంచి) అయ్యో! ఆత్మహత్య కనుకూలముగా నంధకారము విరిసియుండెను. ఈ వెన్నెలవెల్లువలో మునిఁగి ధరణి శోభారాణివలెఁ బ్రసన్నతవహించినది. ఇది చంద్రాతపమా; లేక నా కర్మదశయా?

[కావడితో బాలకవేషధారి శ్రీకృష్ణుఁడు ప్రవేశించును]

కృష్ణుఁడు

ఈచిట్టచీఁకటిలో—ఒంటరిగా—చెఱువుగట్టుమీఁద—చాల బాగున్నది! నీ వెవరింటి కోడల వమ్మా!

వామాక్షి

(స్వ.) నాయదృష్ట మిట్లున్నది. ఈ బాలుని దృష్టిలోఁ బడితిని; నా యీసాహస మీతేఁడు జగద్విఖ్యాతము గావించును.

కృష్ణుఁడు

ఊరకుంటి వేల? బుగ్గమీఁద చేయి పెట్టుకొని మాటిమాటికి నీటివైపుఁ జూచుచుంటి వేటికి?

వామాక్షి

ఎట్టి యాశ్చర్య మిది?

కృష్ణుఁడు

ఏది ?

వామాక్షి

మఱేమియును లేదు, నాయనా; చిన్నవాఁడవు నీ కీగొడవ యేల?

కృష్ణుఁడు

చెప్పవమ్మా, నిన్నుఁ జూచిన మాయమ్మ జ్ఞాపకము వచ్చుచున్నది.

వామాక్షి

చావ నెంచినవానికి సముద్రము మోఁకాలు బంటి యని పెద్దలు పల్కుదురు. ఆమాటయే భావించుచుంటిని.

కృష్ణుఁడు

తల్లీ, ఇం దాశ్చర్య మే మున్నది? నిర్భాగ్యుల సంస్పర్శనమున మహాసముద్రములు కూడ నెండిపోవును.

వామాక్షి

(స్వ.) ఈబాలకుని విన్నాణము హృదయాహ్లాదకరముగా నున్నది. వీని యమృతస్వరము నాదుఃఖమును హరింపఁజేయుచున్నది. వీని మధుమయరూపముఁ జూచినకొలఁది నా నేత్రముల నమృతాంజనముఁ బెట్టినటు లున్నది. (ప్రకాశముగా) నాయనా! నీకోమలభుజమున నింతబరు వెట్లు మోయుచుంటివి?

కృష్ణుఁడు

అమ్మా, న న్నేమి చేయుమందువు? ఇదియే నాయుద్యోగము. బరువులు మోసి మోసి బ్రతుకుచున్నాను.

వామాక్షి

ఆమాట యెవరిది? ఏయూరి కరుగుచున్నావు?

కృష్ణుఁడు

ఈమూఁట యొక్క బ్రాహ్మణునిది అదిగో, చూపు మేరలో నున్న యీనగరమే నాగమ్యస్థానము.

వామాక్షి

ఆబ్రాహ్మణుని పే రేమి?

కృష్ణుఁడు

కుచేలుఁడు.—అమ్మా, ఆతని యి ల్లేవీథిలో నున్నదో నీ వెఱుంగుదువా?

వామాక్షి

ఏ మంటివి, ఏ మంటివి! నిన్నుఁ బంపిన వా రెవరు?

కృష్ణుఁడు

కుచేలుఁడు. ఏ మట్లు భయపడియెదవు? అమ్మా, నీ కాతఁడు దగ్గరచుట్టమా?

వామాక్షి

ఆమహాత్ముఁ డిందు వచ్చునా? ఇం కెంత దూరమున నున్నవాఁడు? ఆతని కెట్టియాప దయును గలుగలేదు కదా? ద్వారకనుండియే వచ్చుచుంటిరా? ఇం కెంత సేపటి కరుదెంచును? మార్గము నిష్కంటకమే కద? మృగ పన్నగబాధలు కలుగవు కదా? నాయనా, నవ్వుచుంటి వేమి? నాప్రాణేశ్వరుఁడు సురక్షితముగా నింతలో నిలు సేరునా?

కృష్ణుఁడు

ఇన్ని ప్రశ్నలకు నే నెట్లు సముత్తర మొసంగఁగలను? అబ్బా! కావడి యెంత బరువుగా నున్నది!

వామాక్షి

అయ్యో! పథశ్రమమున నీవు చాల వాడిపోయితివి. బాలకా, చెఱియొకమూఁట తల నిడుకొని త్రోవ నడచిపోదము.

కృష్ణుఁడు

ఊరిముందర పరుగులా? బరువులు మోసి మోసి నామూఁపు కాయలు కాసినది. రెండడుగు లెట్లో వేసెదను. ఇల్లు చేరుకొనఁగలము.

వామాక్షి

అట్లయిన నాయనా, నడువుము.

(స్వ.) ఆహా! శుష్కీభూతమైన పుష్కరిణి నిష్కళంక జలప్రపూర్ణమై నయనానందకరముగా నున్నది. ఎంతలో నెంతటిమార్పు! హా! కృష్ణా! నీలీలానాటకరహస్యము నెవ్వరు పోల్చుకొనఁగలరు! దయామయా! హతభాగ్యను, నే స్పర్శించినమాత్రమున జలాశయమున నీరంతయు నింకిపోయెను. నాకన్నీ రేల యింకిపోదు!

కృష్ణుఁడు

అమ్మా, నడువుమని చెప్పి నిలిచిపోయితి వేమి? ఇంటికి వచ్చుట కిష్టము లేదా? ఈ మాటలో లేనిపదార్థములు లేవు.

వామాక్షి

ఏ మంటివి? లేనిపదార్థము లెట్లుండును!

కృష్ణుఁడు

గ్రామ్యబాలుఁడను. మాటలపొందిక నాకుఁ

తెలియదు. ఈమూటలో బ్రహ్మాండ మంతయు నున్నది.

వామాక్షి

(స్వ.) బాలుఁడు వెఱ్ఱివాఁడా? లేక నాతో హాస్యమాడుచున్నవాఁడా?

(ప్రకాశముగా) నాయనా, పదపద.

(స్వ.) ఆమెను నట్టింట నొంటిగా విడిచి వచ్చితిని. నా యీ యలౌకికవ్యాపారమున కామె యెంతగా నొచ్చుకొనుచుండునో! (నీళ్లు ముంచుకొని)

(ప్రకాశముగా) బాలకా, నడువుము. ఆజొన్నచేలకావల త్రోవయున్నది. ఈ వెన్నెలవెలుఁగులో మనము అనాయాసముగా నిల్లు చేరుకొనఁగలము.

[నిష్క్రమింతురు.]

పంచమాంకము

దృశ్యము. ౧

కుచేలుని యావాసభూమి

[ప్రవేశము-కుచేలుఁడు]

కుచేలుఁడు

ఓహో! ఇదేటి వింత! నాపర్ణకుటీర మిందుఁ గానఁబడ దేమి? కడు ముద్దరాలు వామాక్షి యే మయ్యెను? ఈ సింహద్వార మెవ్వరిది? ఈప్రాంతమున మున్నెన్నఁడు నిట్టి యద్భుత నిర్మాణమును నేఁ జూచియుండలేదు. నే నిప్పుడు మాయాజాలమున బంధితుఁడనై యున్నవాఁడనా? నాచూపులో మార్పు కలిగెనా? నామస్తిష్కము చెదరిపోయెనా? నాకన్నులను నేను నమ్మఁజాలకున్నాను. అదిగో, నేను చేతులార పెంచిన మందారవల్లి! నా భక్త్యానందములతోఁ బెరిఁగిన మల్లియ లివిగో. నాశాంతినికేతనము, నాపర్ణాలయ మెందు లోపించె? కృష్ణా, నన్ను వంచించితివి. బాగు బాగు! నిన్నాశ్రయించి నేను నిరాశ్రయుఁడనైతిని! అదిగో, అవచ్చున దెవరు? సాలంకృతయై స్వర్గీయసౌందర్యప్రభవలెఁ గనులు మిఱుమిట్లు గొలుపుచు నిం దరుదెంచు నీమె యెవరు? అప్సరోభామినియా?

[వామాక్షి ప్రవేశించును]

కుచేలుఁడు

అబలా, నీ వెవరు?

వామాక్షి

మహారాణిని.

కుచేలుఁడు

ఇది యెవ్వరిసౌధము?

వామాక్షి

మహారాజుగారిది.

కుచేలుఁడు

ఆతఁ డెవఁడు?

(దాసి నీళ్లు తెచ్చును. వామాక్షి భర్తకాళ్లు కడిగి నీళ్లు తలపైఁ జల్లుకొనును, పైఁటచేఁ గాళ్లు తుడుచును.)

వామాక్షి

లోనికి రండు.

కుచేలుఁడు

ఎట్టివిపరీత మిది! అబలా, న న్నంటకుము. నే నొకదరిద్రబ్రాహ్మణుఁడను; నీ వన్ననో మహారాణివి.

వామాక్షి

మహాత్మా, మీపాదదాసి నగుటచేతనే నేను మహారాణి నైతిని. న న్నింకను బోల్చుకొనలేదా? అవును, ద్వారకానగరమున నెచ్చెలి కాని చూపులోఁ జూపు లీన మైపోయిన తరువాత న న్నానవాలు పట్టఁగలరా?

కుచేలుఁడు

(స్వ.) వామాక్షిస్వరమువలె నున్నది. (పరికించి చూచి) ఈ యలంకారముల మఱుఁగున నీనిసర్గలావణ్యము గోచరింపదయ్యె. వామా, ఈ మా ర్పెట్లు గలిగె నీకు?

వామాక్షి

ఈపరివర్తన కారణము మీచెలి కాని కనికరమే.

కుచేలుఁడు

అది యెట్లు?

వామాక్షి

నాథా, మీరు ద్వారకానగరమునుండి చాల దినములవఱకు రాకపోవుటచే నాహృదయము నిలుకడ లేని దయ్యె; నానాఁటికి దైన్యము హెచ్చె. నిన్న రాతిరి సన్యాసిని యొకతె మనకుటీరమున కరుదెంచి తల దాఁచుకొనఁ జోటడిగెను. పదపడి పిడికెఁటడుకులు గోరెను. ఇంటఁ బట్టెఁ డన్నము లేదు; పిడికెఁడు గింజలు లేవు. ఆమెను నిరాకరింపలేక, నీళ్లకుఁ బోవు నెపమునఁ జెఱువుగట్టుఁ జేరితిని. నీటిలోఁ బడి ప్రాణత్యాగము సేయ సంకల్పించితిని. అంతలోఁ జెఱు వెండిపోయెను. ఆ యద్భుతమును దిలకించుచు, నా కపాలమును నిందించుకొనుచు; నే నచ్చటనే నిలిచియుంటిని. వెన్నెల వెలుఁగు లోకమును ముంచివేసెను. అత్తఱి నొక బాలుఁడు, నీలనీరదగాత్రుఁడు, కావడి బుజమునఁ గీలించి నా యెట్టయెదుట సాక్షాత్కరించెను. మీపంపున వచ్చితిననియు, నింటికి దారి చూపుమనియు నన్నుఁ గోరెను. వానితోఁ గుటీరమార్గమున నడచితిని. వచ్చి చూచుసరికి కుటీరము లేదు. ఈ రాజసౌధము దృగ్గోచరమయ్యెను. నాథా, ఏమని చెప్పుదును! ఆ బాలుఁడే శ్రీకృష్ణుఁడు; ఆసన్యాసినియే రుక్మిణీదేవి!

కుచేలుఁడు

ఏ మనుచుంటివి, వామా? ఇది నిజమా, స్వప్నమా? వామా, నీవు సామాన్యురాలవు గావు. నీప్రజ్ఞ యసామాన్యము! నీభక్తివిశ్వాసములవలన నీ దీనకుటీరము ధన్యకైలాస మైనది! నిజముగా నీవంటిధన్యురాలు ముల్లోకముల వెదకినను గానరాదు. ఏ శ్రీకృష్ణుని దర్శనార్థము దుర్గమారణ్యపథములు, గడచి, పలుకష్టముల కోర్చి, ద్వారకానగరమున కరిగితినో, యా శ్రీకృష్ణుని నీవు నీప్రేమపాశమున, నీ భక్తిసూత్రమున బంధించి నీ సమక్షమునకు నాకర్షించితివి! నీజన్మము ధన్యంబయ్యె; నిన్నుఁ గన్న తల్లిదండ్రులు ధన్యులైరి; నీచేయి వట్టి నేఁగూడ ధన్యుండ నైతిని.

వామాక్షి

నాథా, లోనికి రండు. మీభక్తివలన నేను జరితార్థురాల నైతిని.

కుచేలుఁడు

వామా, ఈరాజభోగవిలాసము నీకొఱకు నిర్దేశింపఁబడినది. నే నాగర్భదరిద్రుఁడను. అక్షయభిక్షాపాత్రధారణమే నాజీవనసర్వస్వము. ఈ రాజసౌధప్రవేశమున నా కేమిప్రయోజన మున్నది. నీవు దేని కాసించితి వాయఖండశ్రీ వడసితివి. నీహృదయపూర్వకముగా ననుభవింపుము. నేను గహనభూముల కరిగి నాచింతామణిని స్మరించుకొనుచుఁ గాలయాపన మొనరించెదను.

వామాక్షి

నేను మీసహధర్మచారిణిని గానా ? మీరు లేకున్న నీరాజసౌధము నాకు గహనభూమి వలె స్ఫురింపదా ?

కుచేలుఁడు

కృష్ణా, ఆత్మీయసఖుఁడవని త్రికరణశుద్ధిగా నమ్మినందుకా నన్ను మోసగించితివి?

వామాక్షి

ఏ మాయెను ? నిందాతీతుఁడగు వానిని నిందింతు రేల ?

కుచేలుఁడు

వామా, నేను సిరిసంపదలతో జన్మింపలేదు. ఈ చంచలసంపదలో శాంతిసుఖము లేదు; దయాధర్మము లేదు. నాభిక్షాపాత్ర యక్షయసుఖప్రసాదిని; అనంతశాంతిసంపాదిని. ఈక్షణభంగురసంపద నే నెన్నఁడును శ్రీకృష్ణు నర్థింపలేదు.

వామాక్షి

నిజము, మీ రర్థింపలేదు; నేను మనసార నర్థించితిని. పిల్లలగోడు చూడలేక, మీ దైన్యవదనముఁ దిలకింపలేక, వికలమతి నై నేనే సంపద లర్థించితిని.

కుచేలుఁడు

వామా, ఆచతురుఁ డెం దున్నవాఁడు? ఆతని సమక్షమునకు దారి చూపుము.

వామాక్షి

ఆ యాదిదంపతులు శుద్ధాంతమున నున్నవారలు; రండు, లోనికిఁ బోవుదము.

[నిష్క్రమింతురు.]

దృశ్యము ౨

కుచేలుని సౌధశుద్ధాంతము

[ప్రవేశము - శ్రీకృష్ణుఁడు, రుక్మిణి, నారదుఁడు]

కృష్ణుఁడు

నారదా, చూచితివా! సంసారి యయ్యు నీ బ్రాహ్మణోత్తముఁడు భక్తిమార్గమున నన్నెట్లు వశీభూతు నొనరించెనో ?

నారదుఁడు

ప్రభూ, కన్నులారఁ జూచితిని; మనసార గ్రహించితిని. నా నేత్రములు, నాహృదయము పరమపవిత్రము లయ్యె.

కృష్ణుఁడు

నారదా, భక్తుఁడే నాదైవము. నా లీలానాటకమున నుపయుక్తపాత్రలు వామాక్షి కుచేలురు; వీ రిరువురే జగంబున నాదర్శభక్తులు!

[వామాక్షీ కుచేలురు ప్రవేశింతురు]

కుచేలుఁడు

కృష్ణా, దయామయా! ఈ నిష్ఠురభావము నీకుఁ దగునా? నిన్ను నమ్మినందుకా నన్ను వంచించితివి?

కృష్ణుఁడు

సఖా, ఏ మయ్యెను?

కుచేలుఁడు

నామనసులో మాట నీకుఁ దెలియదా? ఈ నాగపాశమున నన్నేల బంధించితివి? నే నన్నఁడును నర్థింపని యీవిభవము నా కేల ప్రసాదించితివి? నీ సాంగత్యమే నాస్వర్గీయ సంపద; నీస్మరణానందమే నాముక్తిమార్గము; నీ సాక్షాత్కారమే నా జన్మసాఫల్యము. తుచ్ఛభోగము లొసంగి నన్ననంతానంద పదవినుండి తొలఁగింప నెంచితివా?

కృష్ణుఁడు

నే నట్టి యాశయముతో నీ కీవిభవము లొసంగలేదు.

కుచేలుఁడు

నాజీవనమార్గమునఁ గంటక సదృశంబైన యీ సంపద నాకు బాధాజనకము. కృష్ణా, నిన్ను వేఁడుకొందును; నామార్గమును నిష్కంటక మొనరింపుము.

రుక్మిణి

బ్రాహ్మణోత్తమా, భక్తవరిష్ఠుండవై వైకుంఠమున కధికారి వైతివి. ఈ నిస్సారసంపదలు నిన్నేమి చేయఁ గలవు?—పతివ్రతాతిల కమా, అభిమానమున మఱల జలాశయమున మునుఁగ నెంచెదవా?

వామాక్షి

లోకమాతా, మునుఁగ వాంఛింతును; గాని జలాశయమునఁ గాదు, నీ ప్రేమసాగరమున.

కృష్ణుఁడు

కుచేలా, నీవు దుఃఖింపకుము. నీ దుఃఖవిమోచన మొనరింప నెంచి నీ కీయతుల సంపద లొసంగితిని. సంపద సత్పాత్రల వశంబున నున్నచో నశాంతి దాయకము గానేరదు. ఈ ధనయోగమున నీవు జగత్కల్యాణ సాధన మొనరింపఁగలవు.

కుచేలుఁడు

కృష్ణా, నీవు దరిద్రకుచేలుని సఖుడవు. వామా, నీవు చెప్పుము; ఈప్రభు వెవ్వని సఖుఁడు? పేదవాని నెచ్చెలికాఁడా? లేక ధనవంతుని సంగఁడీఁడా? పేదవాని మర్యాదకు మేర లేదు. పేదవార మగుటచేతనే కదా యీ జగత్పిత, యీ లోకమాత మనయింటి కరుదెంచిరి! దీనుల మగుటం జేసి కదా దీన బాంధవులు, రుక్మిణీ శ్రీకృష్ణులు, మన కన్నీరు దుడువ మనయింటికి వచ్చిరి! తెలిసినదా, వామా, మనసంపద యేదియో తెలిసినదా? ఈ తల్లి, యీ తండ్రి వీరే మన త్రిభువనాధిపత్యము! వీరికంటె మన కొండుధనము లేదు.

వామాక్షి

(రుక్మిణీ కృష్ణుని పాదములపైఁబడి) అజ్ఞానాంధ

కారమున నేను నిజానిజంబు లెఱుంగనైతిని. లోకపితా, లోకమాతా, నన్ను మన్నింపుఁడు.

రుక్మిణి

అమ్మా, నీవు దుఃఖింపకుము. (లేవ నెత్తి) ఈసంపదలు మిమ్ము వంచింపఁజాలవు. (సింహాసనమునఁ గూర్చుండఁబెట్టును.)

కృష్ణుఁడు

(కుచేలుని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి) కుచేలా, ఈధనమున నీవు పేదవారలకు సహాయ మొనరింపఁగలవు. శతశతదరిద్రకుటుంబములు నీయాశ్రయమున సుఖింపఁగలవు.

కుచేలుఁడు

సరిమె, ప్రభూ, నీవు ప్రసాదించిన యీ యక్షయసంపదలు నిరాశ్రయులకు, నిత్యదరిద్రులకు, వికలాంగులకుఁ బ్రదానముఁ గావించితిని. తొల్లిటివలె నేను నీనామామృతపానమున స్వస్థచిత్తుండ నయ్యెదను.

కృష్ణుఁడు

నీయౌదార్య మసామాన్యము! కుచేలా, త్రిభువనముల నీకు నీవేసాటి! నేఁటినుండి యీ యవంతీనగరము పుణ్యతీర్థ మగునుగాక!

నారదుఁడు

ధన్యుఁడవు, మాన్యుఁడవు. కుచేలా, ధన్యము నీ శ్రీకృష్ణభక్తి!

నందసునందాదినందితచరణారవింద మహోన్నత
గోపాల,
బాధితరిపుబృంద బోధగసానంద సాధితజగదండ
గోపాల,
గోపీమన్మథ గోపరిపాలక గోవర్ధనోద్ధర గోపాల,
రాసమండలనట దాసజనావన వాసవాదినుత గోపాల!

(తెరపడును)

సంపూర్ణము

సవరణ

కడచిన సంచికయందు ప్రకటించిన 'రామాయణము' అను వ్యాసమునకు మూలము ౧౯౩౩ సం. డిసెంబరున రచింపబడినది కాదు. ౧౯౦౩ సం. డిసెంబరులో రచింపబడినది.

—వె. గో.

ఆత్మార్పణము

తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు

భారతికిం గవిజనర - క్షారతికిం గేలుమోడ్చి కబ్బ మొకండేఁ
గూరుతు "నాత్మార్పణ" మన - సారమతిం దీని నరసి చదువుఁడు మిత్రుల్.

అక్కటికంబులేని కలుషాత్ముఁ డొకానొక బోయవాఁడు పెం
పెక్కిన కాననంబులకు నేగి ఖగంబుల కుచ్చులొడ్డి చేఁ
జిక్కినవానిఁ గొన్నిటి భుజించుచుఁ గొన్నిటి విక్రయించుచున్
బెక్కుదినంబు లిట్లు గడపెన్ దనజీవిత మొక్కపల్లియన్.

ఆతఁ డొకవేకువం గృ - ష్ణాతట కాంతారములకుఁ జనియెన్ మృగయా
కౌతూహల మలర ధను-శ్శాతాశుగ వాగురాది సాధనుఁ డగుచున్.

ఇట్లతండు వేటకుం జని యయ్యరణ్య మధ్యంబున.

బిగువు టుండెలగుండె లగలించి జిగిమించు కొక్కెర లొక్కొన్నింటి నుక్కడంచె
మొఱకుఁ గోలలు గాత్రముల నుచ్చి పోనేసి కొన్నిసాళ్వంబులఁ గూలఁద్రోసె
చెట్లఁబుట్టల రావి జిగురుగండెలఁ బన్ని కొన్ని గోర్వంకల మన్నిగొనియె
కడఁగి యందందు నూకలఁజల్లి వలలొడ్డి పావురాల్ గొన్నింటిఁ బట్టికొనియె
జంగుపిల్లులఁ గుందేళ్ల ముంగిసలఁ గు-ళింగములఁ బట్టిఁ గొన్నింటిఁ జెంగలించి
వేఱ వర్ణింపనేల యవ్వేళఁ బ్రళయ-కాల సంప్రాప్తియయ్యె నగ్గహనమునకు.

అయ్యవసరంబున.

ఈ పరమ కలుషహింసా-వ్యాపారం బంతకంత కగ్గలమగుచున్
గోపించె నన నహస్కరుఁ-డేపున నడిమింట మండుటెండలఁ గాసెన్.

అఖిల సర్వశరణ్య మా యయ్యరణ్య - మట్టుడికి నట్టులుడికెఁ జండాతపాగ్నిఁ
గడచె నొక రెండుగడియలకాల మిట్లు - పీచు పీచు మబ్బులు మింట లేచువఱకు.

తగవరి సిరికైవడి న - మ్మొగులు లొగిం బెరిగి గగనమున నెల్లెడలన్
నెగడుడుఁ జల్లనితెమ్మెర - నిగిడె నడఁగె నుమ్మదంబు నిముసములోనన్.

అంత సముద్రాంతమగుభంగిఁ గల్పాంతతీవ్ర వాయువనంగ దిక్కదంబ
మల్లాడ గిరులు కంపిల్లఁ బెల్లుగ రేఁగి పెనుగాలి సాగెఁ దద్భీకరార్భ
టికి నయ్యడవినున్న సకలమృగంబులు ఖగములునెంతయుం గలఁగి చెదరె
ఘళఘళధ్వనుల బ్రమ్మాఁకులుగూలె ఝొంపము ల్గొనబారె రోదసీకుహరమెల్ల
ధూళితోనిండె నిటుసముద్ధూతవివిధ- జంతుసంతానమును భయాశ్రయమునగుచుఁ
గొంతకాలంబు విసరివిశ్రాంతినొందెఁ- జండవాతంబు భూతముల్ సన్నుతింప.

గాలియడంగ మేఘము లఖండగతిం జెలరేఁగి గర్జితా
భీలములై తటిల్లత లభిన్నములై తులకింపఁ బిడ్గులుగ్
రాలుచునుండ దిగ్గజకరంబు లనందగు వారిధార లు
ద్వేలములై యెసంగ నటవిం గురిసెన్ జడివాన జోరునన్.

అదిపల్ల మిదిమిట్ట యను విభేదము లేక యడవివెల్లువనీట నడఁగిపోయె
తొలుతఁగూలినవృక్షములు నీడ్చికొనుచుఁ బర్వెత్తె వాఁగులు గట్లనొత్తికొనుచు
చటులధారాపాత సంపీడితాంగంబు లగుట గొన్నిపులుంగు లంతరించె
చిలువమన్నీలు కోమలపీడి గుమిగూడి వేడుకమై జలక్రీడ లాడె
కొండకోనలలోఁ దరుకోటరముల- నురునికుంజంబుల మృగంబు లొదిఁగియుండె
గడగడవడంకెఁ జలిగాలి కసరివిసరె- నబ్జబాంధవుఁ డింతలో నస్తమించె.

దుర్గమారణ్య, మదిగాక దుర్దినంబు- వెండియుం జడివాన, పైపె చ్చమాన
నల్లవో! యేమనందు నానాఁటి రేయి- కాటఁ గ్రమ్మిన చిమ్మచీఁకటులపేర్మి

అత్తఱి నక్కఅఱు లెఱుకు దోర వెఱపుఁ గొలుపునక్కానం గాంచి యుల్లంబు తల్ల
డిల్ల వదనంబు పల్లటిల్ల నెద్దియుందోఁపక రాపడి నిలుచుండి;


అక్కట యేమిసేయుదు? మహాగహానం బిది కాఱుఁ జీఁకటుల్
నెక్కొనె, శీతవాతములు నిండె, శరీరము గొంకుపోయె, నీ
దిక్కిదియం చెఱుంగఁ గలతెన్ను గనం బడదయ్యె, వర్షముల్
నిక్కుచునుండె, వెల్లువలు నెట్టుకొనెం దుది కెద్దిమూడునో.

నేఁడు పఱువాత నెవ్వని-పాదుమొగము నాదు కంటఁ బడెనో యిటు- ల
ల్లాడుగతి పట్టె నసువుల-తోడఁ నాపీడలెల్లఁ దొలఁగునె తలఁపన్?


తెలుగునాటి విపరీతపు వరదలు



౧. సామర్లకోటకు తూర్పు ఐదుమైళ్లదూరమున క్రింది మన్నంతయు పోయిన ఇనుపదారి



౨. సామర్లకోటకు తూర్పు మూడుమైళ్లదూరమున



౩. సామర్లకోటకు వచ్చుచున్న సామానుబండి పట్టాలనుండి తొలగగా
నీటిలో రెండుపెట్టెలు జోరగిలిపడినవి



౪. అనకాపల్లి చేరువను వరదలవలన కొట్టుకొనిపోయిన యిండ్లు

ఇదియ జగమందు నాకుం-దుదినిముసమ్మనుచు మదికిఁ దోఁచెడిఁ గాదే
నెదిరించునె యింతటియా-పదలు ననుం జుట్టుముట్టి బంధురభంగిన్ ?

ఇచ్చవచ్చినపుల్లు వ్రచ్చివెచ్చనిపచ్చి పాలసుమెక్కుడుగీఁత తొలఁగునొక్కొ-
జిడ్డుఁదేనెలనూరు జీడిమామిడిపప్పు నారగించు నదృష్ట మాఱునొక్కొ-
చవులూరఁ జేయు కల్సారాలఁ దెగఁద్రావి మత్తిల్లు భోగంబు మడఁగునొక్కొ-
నెక్కొన్నకూర్మి నానిసువ్వజ్జకుఁ జేరి ముద్దాడు భాగ్యంబు ముగియునొక్కొ-
బంగరుంబొమ్మఁ బోని నాసింగి బిగువుఁ-గౌఁగిటంజిక్కి సుగములకడలిఁదోఁగు
పండువెన్నెలరేలింక నుండవొక్కొ-నేటితో నాకు నూఱేండ్లు నిండునొక్కొ!

బోయం డార్తుఁడు రక్షణీయుఁడని సంపూర్ణానురాగంబుమై
నాయీయాపదఁ బాపు పుణ్యుఁ డెవఁ డున్నాఁ? డిప్పు డిచ్చోట నేఁ
జేయంగల్గిన కార్య మెయ్యది? యింకన్ జీవించు టేలాగు? నా
యాయుర్దాయము నాహరించుటకు నీవాసించితే దుర్విధీ!

నాకనుదోయిముందు మరణంబును గాంచిరి పెక్కు-రే ననం
ఖ్యాకవిహంగ రాజములఁ గాఱియ వెట్టితిఁ జేతులార నే
శోకము నప్డులే, దిపుడు చొప్పడు నాదగు చావటన్న ని
య్యాకులపాటదేటి; కదిరా బ్రదుకెంతయుఁ దియ్యమౌఁగదా.

పనికేగితినటకై వలయు నంజుళ్లు నింతకుమున్నపోలె మధ్యాహ్నమునక
తెచ్చెద నేనంచు వచ్చి నాదగురాక కెదురుసూచుచు నాకుటింటిముందు
నిలచి యెంతకు రామి నిస్పృహఁ జెంది నన్నే పాము కఱచెనో, యేమెకంబు
విఱిచెనో యంచు భావించి నేఁ డెన్నిభంగుల నేడ్చుచున్నదో కోమలాంగి
పేర్మినల్లారుముద్దుగాఁ బెంచుచున్న-పిల్ల లిపు డెంతగా దురపిల్లుచుంద్రొ?
ఎవరిగతి వారిదే యంటం చెఱుకగల్గు-పెద్దలాడెడిపల్కు నిబద్ధియయ్యె.

కట్టఁదయ నేది యీపాడుపొట్టకొఱకు-నింతవఱ కెన్నిపుల్గుల నేసిచంపి
జంట లెన్నింటి నేడ్పించి యుంటినొక్కొ-కట్టికుడువంగవల దె తత్కలుషఫలము!

అని పెక్కులగు తెఱంగుల-వనరుచుఁ దానుండఁ గొంతవడి కజ్జడి మె
ల్లనఁ దగ్గె జలదంబుల-పెనుపత్తె, గాఢాంధకారభీకర మడఁగెన్.

అంత నజ్జడిపోకకుం గిరాతుం డొకింత సంతసించియు వ్రేఁకనయగు నీఁదురుతాఁకునకు లొంగి యంగంబు లెల్ల వడంక నింక నేమిసేయుదునని పవవి నలుదెసలకుం జూడ్కు-లు నిగిడించి చేరువమిట్టనేల నింగిముట్టి దట్టంపుగుబురులం గ్రిక్కిఱిసి పక్కి మొత్తం బుల కెల్ల నిక్కువై యలరు నొక్క మఱ్ఱిమ్రాఁకుంగని దానిచాటునం గొఱరేయి గడప నెంచి తాఁబట్టిన పిట్టల నట్టాడువలం దులకించు గనయంబుం బిల్లగుబ్బలియన నుబ్బి యుబ్బరంబుఁగొల్పు దాపటి మ్రాఁపునం గీలించి మెల్లమెల్లన వెల్లువఁ గడవ నడచి యత్త రువుందరిసి తన్మూలంబునంగల కటికితా బండపైఁ దనమేనువైచి యేచిన భయంబున:

దిక్కుమాలినబోయ దీనతం బాపరే వనదేవతాచక్రవర్తులార,
నిండారుకూర్మి మన్నించి రక్షింపరే చటులకాంతార వృక్షంబులార,
పగవాఁడనని తలంపక కూర్మిఁ జూపరే సాధువిహంగరాజంబులార,
ఆపన్నుఁడను గాన లోపముల్ మఱవరే భల్లాదిమృగకదంబంబు లార
నీతు విదలించుచుండె హెచ్చెను బుభుక్ష-యసువులేనింట మ్రాఁడునాల్గరిగెఁ దొలఁగి
దుర్భరపుమృత్యు ముఖమున దూరియుంటి-నెట్లురక్షింతురో మీర లిపుడు నన్ను.

అని పులుంగుదిండి యెలుంగురాల్పడ వేఁడివేఁడి కన్నీరు మున్నీరుగాఁ గాఱ వగల సెగలం బొగులుచుఁ బరువపాషాణ పర్యంకంబున నొత్తగిల్లి యుండె నత్తఱిఁ దడవులం బట్టి యమ్మఱ్ఱితొఱ్ఱఁ గాలంబు పుచ్చుపావురంబొండు వఱువాత నెరకొఱ కరిగిన తనపరు వంపుటిల్లాలెంతకుం గూడు సేరమి నరసి వెఱతఱచునఁ బరిపరి విధంబులఁ బొరింబొరి దురపిల్లుచుఁ బల్లంబులకు డిగువెల్లువ నీటిజాళుల నుప్పతిల్లు "జలజల" మను చప్పళ్లతో మేళగించి ప్రోళులు చిగుర్ప దుర్భరవియోగగీతంబులం బాడుచు నిట్లు విలపించె.

వేకువ లేచి నా కెఱిఁగి వేడుకమై హృదయేశ, యిష్ట నా
యాఁకటి చిచ్చుచార్పుకొన నయ్యయి తావులకుం గమించి నీ
శ్రీకర పాదపంకరుహ సేవకు వత్తునటంచు నేఁగి నీ
వేకడ నుంటివో తరుణి, యింతకుఁ గన్పడవైతి వక్కటా!

అర్ధాంగి, నాహృదయం బెఱుంగఁ దలంచి సురిఁగి యుంటివె వనాంతరమునందు?
వనిత, నిన్నెడసి యుండిననిమేషంబు నా కొకయుగంబుగఁ దోఁచుచుండుఁ గాదె?
కలికి, నిన్నీరేయి గాటంపుటడవి నే పొదరింటఁ గలవంచు వెదక నేర్తు?
తరుణి, నాయీయవస్థ నొకింత గన్న నీహృదయంబు చిదురలై చెదరకున్నె?

గరిత, రాచిల్క – లేని పంజరముకరణి-నుండె మనగూడు నీవు లేకున్కి – నిపుడు
తెలివ, నీతోడులేని నాదేహయాత్ర-జగతి నొక్క-నిమేషంబు సాఁగఁగలదె?

కడ లేని నీతు వెంతయు-వడఁకింపఁ దొడంగె వేగ వచ్చి నను న్నీ
పొడవారు గఱులఁ గష్టము-పడఁతీ, నాచింత లెల్లఁబాయను దానన్.

కలదే ప్రాణము నీశరీరమున నోకాంతాలలామంబ, యే
వలలోనం బడి యుంటివో? కొదమసాళ్వం బెద్దుటం జిక్కితో?
చెలి, ఝంఝూహతికిన్ గఱుల్ విఱుగుటన్ జీవంబులం బాసితో?
ప్రళయోగ్రాభీలవిశాలమేఘ కరకాపాతంబులం గూలితో?

ఉవిదరో, నీవు జీవించి యుంటివేని-యేల రాకుండు వింటికి నింతదాఁక
లేవు గాఁబోలు జగతిలో నీవు బ్రతికి-రావు గాఁబోలు నిఁకఁ గోటరంపుదెసకు.

ఆలుమగలఁ జేర్చి యాడించి వెండియుఁ-జీలఁ దీయుచుండెఁ గాలపురుషుఁ
డబ్బ, వీనిడెంక మది యేగతి న్నిల్పెఁ-గనికరంబుపొంతఁ గఱకుఁదనము.

సకలదుఃఖరోగ సంపీడితున కింతి-యౌషధం బటన్న నబ్బురంబె?
ఉవిద, నిన్నుఁ గూడి యున్నంతవఱకు నే-యాపదల నెఱుంగఁ డయ్యె నితఁడు.

శబ్దార్థములభంగిఁ జంద్రికాచంద్రుల ట్లన్యోన్యమైత్రి నొప్పారుచున్న
మనకాఁపురంబుఁ గన్గొన మాలవిధి కెంత కన్ను గుట్టెనో జగత్కంటకునకు?
అడవిమేఁతల మేసి పడియనీళులఁ ద్రావి పరులసొమ్ముల కాసపడక యొగుల
కొకకీడుఁజేఁతయు నొనరింపక మెలంగు మనజీవితము దైవమున కదెంత
భార మయ్యెనో? పాపంబు పండె నిట్లు-విధివిధానంబు నెదిరించువిధము గలదె?
కటకటా, నేఁటి కెట్టిసంకటము వచ్చె-నెట్లు దీని భరింతు; దిక్కెవ్వ రబల?

అరలేని కూర్మిపేర్మిం-బొరపొచ్చెము లేనిడెందముం జూపి ననుం
గరము నలరించితిఁగదా-గరితా, ని న్నెట్లు మఱవఁ గలవాఁడ నిఁకన్.

నీమందస్మిత సుందరాస్యతలముల్ నీ నిగ్గులన్ జగ్గులన్
నీ మైమవ్వము నీకనుంగవపసన్ నీ నెన్నడల్ సొంపులన్

నీ మర్యాదల నీ మృదూక్తులను నీ నెయ్యంబు నీ తియ్యముల్
భామా, నే నెటు విస్మరింతుఁ జెపుమా ప్రాణంబుతో నుండఁగన్.

సకియా, మాపటివేళ ని న్గలసి కృష్ణావీచికాశీకర
ప్రకరప్లావిత నవ్యదివ్యసికతాభాగంబులం జేరి వా
తకుమారంబులు గంధబంధురము లాత్మప్రీతిఁ గావింప వే
డుకమై గొండిలి నల్పునే సయిచు టెట్లా? నీవియోగవ్యథన్.

క్రొవ్వినగండుఁదుమ్మెదలకూటువరాయిడి కోడి రాలు న
మ్మవ్వపు లేఁజిగుళ్లఁ గుసుమంబు లమర్చని సెజ్జ లై తమి
న్నివ్వటిలంగఁ జేయుతటి ని న్గవగూడి నికుంజసీమలన్
జవ్వని, కాలముం గడపు సౌఖ్యము నా కిఁక దుర్లభం బొకో!

అతివ, నీ విచ్చుమేఁతల నారగించి-నీమృదులపాణిపల్లవానీతపూత
సలిలముం గ్రోలి సంతోషజలధిఁ దేలు-భాగ్య మున్నదె యీమందభాగ్యున కిఁక?

కలిమిలేములలోన భాగంబుఁ గొనుచు-మంచిచెడ్డలలోనఁ బా ల్పంచుకొనుచు
మెలఁగునర్ధాంగి దూరమై తొలఁగెనేని-మగని కాధార మెవ్వరో మగువ, చెపుమ.

ఓవనిత, సకలసౌఖ్య-శ్రీవిరహిత మైనతుచ్ఛజీవిత మిఁక నే
లా? వెల్లువలోఁ బడి నా-జీవంబుల విడుతు నెల్లచింతలఁ గడతున్.

ఇట్లు బిట్టు వగచు మగపావురంబు విలాపంబు లబ్బోయవలం జిక్కి కుములు చున్న క
పోతి విని:

ధన్య నైతిని జగన్మాన్య నైతిని మహాపుణ్య నైతిని సతీగణ్య నైతి
నాథుఁ డస్మద్వర్తనంబు నెంతయు మెచ్చి ప్రకటించె నిర్మలప్రణయరసము
నాయీమెడాటంబునకుఁ బొరింబొరిఁ గుంది జోరున వేఁడికన్నీరు రాల్చె
మగనినెమ్మదికి నిమ్మాడ్కి నెక్కుటయ కా కులకాంత సతతంబుఁ గోరుచుండు
నింక వలసిన దేమి? నా కీభవంబు-సార్థకతఁ జెందె దుర్గతి ప్రాప్తిదప్పె
బాపము లడంగె నోములపంట పండె-ననుచు మదిఁ బొంగి మగని కిట్లనఁ దొడంగె.

ఏల దురంతచింత నిటు లేఁచెద వో హృదయేశ? నేఁడు దు
ష్కాలము దాపరింపఁ దొలికర్మము నన్నొకబోయవాగురన్
గూలఁ బడంగ నేయ నిటఁ గుందుచు నుంటి భవత్పదాబ్జముల్
వాలినభక్తిఁ గొల్చు విభవం బఖిలంబును గోలుపోయితిన్.

ఒచ్చెంబు నెఱుంగక మన-మివ్వో దంపతుల మై సుఖించితి మిన్నా
ళ్లిచ్చెరు వగునంస్మృతిఁ గన-విచ్చుచు నున్నార మిప్డు విధియోగమునన్.

ఆగుండెదానఁ గానన్-వాఁగురలోఁ జిక్కి గాలివాన కలసి నీ
యోగంబు నెడసియు నసు-త్యాగం బొనరింపనైతి ననురాగనిధీ!
ఉసురులు దొలంగ సిద్ధ మై యున్న వేళఁ-దలవనితలంపుగా భవద్దర్శనంబు
నాకుఁ గల్గించినట్టి ప్రేమైకమూర్తి-కార్తజనబాంధవునకు జోహా రొనర్తు.

ఎడతెగక మనదాంపత్య మింతవఱకు-నెన్ని పుట్టువులం దరియించెనో కా-
జీవితేశ్వర, యిది యవిచ్ఛిన్నమగుచు-నెల్లకాలంబు నిట్ల భాసిల్లుఁ గాత.

నీకొఱకు నిరీక్షించుచు-నాకమునం దేను నిరశనవ్యాపృతి నె
ట్లో కాలము గడపెద నిట-నాకొఱకో నాథ, మనమునం గుందకుమా.

నీకనులుగార్చు వెచ్చని నీటిధార-కాల్చుచున్నది నామనఃకందరంబు
నేమి నేయుదు శోకంబు నెడసి మధుర-వాగమృతవృష్టి ననుఁ దన్పవా మనోజ్ఞ!

ఆడుంబులుఁగి ట్లనునెడఁ-గూడు న్విడనాడి వెఱఁగుఁ గొందలము నెదన్
జో డై కలంపఁ దలియుం-బోఁడికడకుఁ బోతుపిట్ట బుజ్జన వచ్చెన్.

అరుదెంచి యుసులందవిలియున్న యన్నువంజూచి.

హా రమణీ, పారావత-హారమణీ, నన్ను విడచి యమరీప్రియమం
దారోద్యానవనీ సం-చారంబును గోరి వెడలఁ జనునే నీకున్?

కటకటా! నేఁటికెట్టి దుర్ఘటనవొడమె-వనిత, యీకాలపాశంబువలన నిపుడు
నిన్ను విడపించు వెరవుగన్పింపదయ్యె-నేటితోఁదీఱునె ఋణంబు నీకు నాకు?

పీసంబును లాఁతులయెడ-దోసంబుఁ దలంపనట్టితొయ్యలి వకటా!
నీసాధుచరిత కిదిఫల-మా? సుదతీ, దైవ మెంతకైనం దగదే?

ఒకపరి నిన్నునర్థి మృగయుం డొడ్డినవాగురలోనం గూలం ద్రో
యక నిను నొంటిగా వలకు నప్పనసేసి దయావిహీనతన్
బకపకనవ్వుచున్ మనవిపత్తులం గాంచుచు గేలిసేయు న
ట్టికలుషదైవ మెంత వికటీకృత దశ మహో! తలంపంగన్.

వలలన్న జిగురులన్నన్, దెలివిమెయిం దిరుగుచుండు తెలివా, యిపుడెం
దుల కేగె నీవివేకము, కలయ న్నీకనులమబ్బు క్రమ్మెనె చెపుమా?

గాటపుంగానం బయనించు బాటసారి-యాతపార్తిందరుచ్ఛాయ, నాశ్రయించె
వానసాగుడు నొకలోయలోనదూరెం-దుదకు నిర్ఘాతమ యడంచె బ్రదుకుటెట్లు?

ఈమహాజలరాశిలో మునింగినవేళం దెప్పవై హర్షాబ్ధిం దేల్చితిగద,
ఈగాఢతిమిరంబు మూంగిముట్టినవేళ దీపంబవై తెన్ను సూపితిగద,
ఈదారికర్దమం బెనసియుండినవేళ కోలవై నడిపింపం జాలితిగద,
ఈమహోన్నతశైల మెదురువచ్చినవేళ గగనయానంబవై కాచితిగద,
నీసహాయంబులేక నాచేసినట్టి-గట్టికర్జం బొకండేనిం గానంబడునె?
అఖిలమునకు నాధారంబవైతివీవు-వెలందీ, నిన్బాసియెట్లు జీవింపనేర్తు.

అని చింతించు మగనింగని కపోతి వెండియు నిట్లనియె.

హృదయేశ, నిఖిలార్థవిదులువాం దగుమీఱ లీరీతి వగంగొన్న నేమిఫలము?
దైవనియోగంబుం దలంగ బ్రహ్మేంద్రాదులగు వేల్పుగమికైన నయితియగునె
కరకరి దైవంబు తెఱచినదుఃఖంపు వాంకిలి ధైర్యకవాటమునన
మూయవలయుంగదా! బుధులుశోకహతంబు లోకంబటంచుం బల్కుదురు వినవె?
ఇలమెలంగుశరీరధారులకునెల్ల-జననమరణంబులెన్నైనసర్గికముల
కసిమసంగిన మిత్తి గండె సంగ నడంచి-యెల్లకాలంబు నొకమేన నెవ్వరుంద్రు?

జీవులను సృష్టిగావించు శిల్పియెవండొ-ప్రాణులను గూర్మిం గాపాడుభర్త యెవండొ,
వాడ వెండియుం గూల్చు విశ్వంబునెల్ల-నతని కిది నిత్యలీలావిహారసరణి.

ఈలతయు నీకుజంబును-మేలుగం గొన్నాళ్లు కలసి మెలసి మరలం బె
న్గాలికి విడివడుచుండుంగ-దా! లోకంబెల్ల నిర్విధంబ తలంపన్.

ఆపదలుగల్గువేళఁ గట్టా! యటంద్రు-సుఖము లొనగూడువేళ మెచ్చుకొనుచుంద్రు
కాని, యెవరేనిఁ గష్టసుఖములపట్లఁ-గడఁగి స్వాతంత్ర్యముంజూపఁ గలరె చెపుమ?

కావునసీవు నాకొఱకిఁక న్విలపించుట నిష్ఫలంబ నా
జీవములం దపేక్ష విడి చిత్తమునం దగుశాంతిఁబూని నీ
జీవితశేషమున్ విబుధశేఖరు లెంతయు మెచ్చ ధర్మసం
సేవనబుద్ధిమైఁ గడపఁ జేయుము కోయుము మోహబంధమున్.

ఆసనడంపు మోర్మిఁగొను మార్యపథంబును ద్రొక్కు నిక్కపుం
బాసలువల్కు శాత్రవులపై నయినం బెరిమంబ నిల్పు నం
త్రాసముగొన్న దీనుల సదా కరుణింపు మనంబుఁ బెంపు మే
దోసము నాచరింపక బుధుల్ (?) నుతిగాంచుము జీవితేశ్వరా!

శరణమంటన్నవాఁడు నిజశాత్రవుఁడైనను వాని నెంతయుం
గరుణ దలిర్పఁ బ్రోచుటయు కర్జము నుత్తమధర్మమంచు స
త్పురుషులు పల్కుచుందు రిది బుద్ధిఁదలంచియు నిక్కరాతు నా
దరమునఁ జూడవయ్య, చలితాంకున కెంతయుఁ దల్లడిల్లెడిన్.

మనయందుఁ జేరిన విపన్నునకుం దోడ్పడెడినోము నోఁచనికతనన్
దన కీట్టులయ్యె సీవైన నీతనికి సాయపడు మ నాథుం డనుటన్.

మగఁడు నేఁడురాక మసలె నదేమొకో-దైవమా, యటంచుఁ దల్లడిల్లి
యెలుకునింటియింట నెల్లెడ్చుచున్నదో జాలిఁగొల్పు పీనిచరిత మకట!

వినుమిల్లుద్రొక్కుకొని వచ్చినయతిథికి శక్తికొలఁదిఁ జేయందగుమే
లనఘా, నిరాశతోడం-జనుటొప్పదతండు ధర్మసారం బిదిగా.

అతిథుల నభ్యాగతులన్-గుతుకంబునఁ బూజసేయు గుణమీ కర్మ
క్షితిఁ బుట్టినట్టివారికి-మతినూహింప గనవీనమా హృదయేశా!

ఆపత్సాగరవీచికాహతులచే నల్లాడి యల్లాడి ప్రా
ణాపాయంబునకున్ దలంకి శరణంబం చేడ్చెడిన్ పీఁడ దయో
లోపంబుల్ గణియింప కీతనిఁ గృపాలోకంబులం జూచి నీ
వాపద్బాంధవుఁడన్న కీర్తిఁ గొనవయ్యా, ఖేచరగ్రామణీ!

భేదబుద్ధివిడచి విశ్వమీశ్వరకళా-దర్పణం బఁటంచుఁ దలచి భగవ
దర్పణంబుగాఁగ నఖిలధర్మంబుల-నలుపకున్న ముక్తి కలదె చెపుమ?

దీనుల మొరలాలింపని వానిబలంబును ధనంబు వంశంబును వి
జ్ఞానంబు జీవితంబు ద-యానిధి! వ్యర్థంబులగుఁగదా పరికింపన్.

తనమానముఁ దనప్రాణముఁ-దనవిత్తముఁ దనబలంబుఁ దనసర్వస్వం
బును విశ్వశ్రేయస-మున కప్పన సేయువాఁడ ముక్తుఁడు సుమతీ!

లోకంబ నేను నేనే-లోకంబ నఁటంచు నాత్మలో నెంచిన సు
శ్లోకునకు నిందు సందర్శ-జేకూరు నఖండ హర్ష చిరసౌఖ్యంబుల్.

సమదృష్టిలేమి సంకుచి-తములగు భావంబులకు నిదానంబుగదా?
సుమహితచరిత్ర, వినుసం-ఘమునకధఃపతనసిద్ధి కల్గును దానన్.

పరమేశ్వరగురుతేజః-పరిపూరితమై వెలుంగు ప్రకృతిని వికృతిం
బొరయనిచిత్తంబుననీ-శ్వరతుల్యమఁటంచుఁ గొల్వవలయు మహాత్మా!

ఇట్లిల్లాలు ధర్మోపన్యాసంబు నొసంగిన;

వినిమగపుల్గు విశుకవివేకముఁగాంచి కపోతి మెచ్చి నె
మ్మనమున ధర్మతత్త్వసువిమర్శనముం బొనరించి కాని నీ
జనధనపుత్ర బంధుభటసౌఖ్యము లెంతయుఁ జంచలంబు లం
చు నెఱింగి సంస్కృతిం దెగడి శోక భయంబులఁ బాసి వెండియున్.

జీవుఁ డొడలింపొలంగెడి-చో వెంటం దోడువచ్చు చుట్టంబు మదిన్
భావింప ధర్మమ కదా?-నీవాఁడ నఁటం చెవండు నెయ్యము సూపున్.

అని విచారించి సంచలించు సంగంబులం గుందు కిరాతుదెసఁ బ్రసాదభాసురంబగున
పాంగావలోకనంబుం బఱపి మృదుమధుర కంఠస్వరంబున మానుషభాషణంబు
లొలయ వాని కిట్లనియె.

(సశేషము)

నిరుటి దీపావళి*

ముడుంబ నరసింహాచార్యులుగారు

౧

ఆనాడు నరక చతుర్దశి. సెలవుదినము. కులాసాగా మాట్లాడుకొందామని అలవాటుచొప్పున రామారావు వెంకటశాస్త్రి యింటికి మధ్యాహ్నము రెండుగంటలకే బయలుదేరి వెళ్లినాడు.

రామారావు ఏలాపురి ఉన్నతపాఠశాలలో స్కూలుఫైనలు పూర్తి చేసినాడు. వెంకటశాస్త్రి ఆయూరి జాతీయమహావిద్యాలయములో ఉన్నతతరగతియందు విద్య నేర్చుచున్నాడు. ఒక్కబడి కాకపోయినను సమవయస్కులగు ఆయుభయులకు చాల స్నేహము. ఇరువురు పరిహాసభాషణప్రియులే. ఇద్దఱును ఖద్దరు వస్త్రధారులే. దేశాభిమానములోను ఒకరికొకరు తీసిపోరు.


తన చదువులగదిలో రాట్నముదగ్గఱ కూర్చుండి నూలు వడకుచున్న వెంకటశాస్త్రికి రామారావును చూడగానే ప్రాణములు లేచివచ్చినవి. మొగము వికసించినది. నూలు వడకుచున్న వాడు అది మాని చటుక్కున లేచి, "రామారావ్! రా! రా! నీకోసమే చూస్తున్నాను. కూర్చో" అని చెప్పుచు, వీధి బల్లపైనున్న రెండు తలగడాలు అందుకొని ఎదురుగా గోడ ప్రక్కను పఱచియున్న తివాచీమీదను వాటముగా విసరివైచినాడు.

"రెం డెందుకు తలగడాలు? రాట్నం పని మాని నీవుకూడా తివాచీమీద చేరుతావా?— నిర్జీవమైన రాట్నానికి విశ్రాంతి అవసరము లేకపోయినా, నీవంటి జీవుడికి కొంత విశ్రాంతి యుండవల్సిందే—సరే. నీ వీపాటికి లేచిరా, నేను రాట్నం పని పట్టి స్తా—కదు రాడుచుంటే నేకాని కాటకం పోదన్నారు పెద్దలు" అన్నాడు రామారావు.

"కదు రొక్కటే కాదు—కదురూ కవ్వముకూడ—ఆడితేగాని కాటకం పోదు." అని నవ్వుకొనుచు లేచివచ్చి వెంకటశాస్త్రి తివాచీమీద కూర్చున్నాడు.

"అయితే నీవు రాట్నాని కెదురుగుండా ఒక రాట పాతి చల్లకుండ పెట్టి కవ్వము త్రిప్పడముకూడా ప్రారంభించు. ఇద్దరం పోటీలమీద కదురు, కవ్వము ఆడించి కాటకాన్ని పారతోలుచున్నామంటే పల్లెల్న వాళ్లంతా పకాల్న నవ్వుతారు" అని చప్పట్లు చరచి బొళ్ళునవ్వి నవ్వుచు రామారావు రాట్నమువద్ద చేరి నూలువడుకుట ప్రారంభించినాడు.

వెంకటశాస్త్రి ఒక తలగడ వీపువెనుక, ఒకటి మోచేతిక్రింద పెట్టుకొని, మోకాళ్లు ముందుకు ఎత్తియుంచి, ఒయ్యారముగా గోడను ఆనుకొని, తివాచీమీద బాలసంక్రాంతాకృతిగా పండుకొనియున్నాడు.



* ఈ కథకు చిత్రములు కథకుని రెండవకుమారుడును, ఏలూరునందలి శ్రీ గాంధి జాతీయమహావిద్యాలయమున ౧౦ వ తరగతిలో చదువుచు కవిత్వమును, చిత్రలేఖనమును అభిమానవిద్యలుగ నభ్యసించుచున్న విద్యార్థియు నగు "ము. నరసింహాచార్య" యను విద్యార్థి పెన్సిలుతో చిత్రించినవి. —భారతి.

రామా: నీ వాలాగు దర్జాగా పకి యుండడానికి కాదు_నిన్ను కాళీగా యుంచింది_

వెంక: ఏమి చేయమన్నావు_నన్ను?

రామా: కథో, కారుణ్యమో_ ఒకటి_ప్రారంభించు, మఱి_

వెంక: (నవ్వుచు) చీమతలకాయ కథ చెప్పనా?

రామా: నిన్న మీవిద్యాలయంలో మీటింగైందటే! విశేషా లేమీ లేవూ?

వెంక: మీటిం గేమిటి? ఊరికే విద్యార్థులందరినీ సమావేశపర్చి దీపావళికథ చెప్పినారు_అంతే.

రామా: ఆకథాసారాంశం టూకీగా నాలుగువాక్యాలలో చెప్పగల విప్పుడు?

వెంక: కావలెనంటే ఒక్క వాక్యంలోనే తేల్చేస్తా.

రామా: ఏదీ_మఱికానీ. నీశక్తి చూద్దాము.

వెంక: నీవుమాత్రం శ్రద్ధగా వినవలె_టపా_కాయలు_కాల్చ_కూడదు.

రామా_కథేదీ?

వెంక: కథెందుకు? కథాసారాంశమేగా. నీ వడిగింది?

"సారాంశ మంటే కథాసంగ్రహమని నాఉద్దేశ్యము" అని రామారావు ప్రసన్నముఖుడై రాట్నపుపనిని తదేకదృష్టితో సాగించుచుండెను.

౨

వెంకటశాస్త్రి కథ ప్రారంభించినాడు. "నీవు విన్న కథేనోయ్_ద్వాపరయుగాన, నరకమహారాజు పరిపాలనలో అధికార నిరంకుశ మెక్కువై పోయింది. శ్రీకృష్ణమూర్తి ప్రబోధముచేత ప్రజలు నరకమహారాజుతో సహాయనిరాకరణ మవలంబించినారు. రాజు వారిని నానాబాధలు పెట్టించినాడు. జైళ్లలో ఉంచినాడు. తిండికి, బట్టకు, దీపానికికూడ కఱవు వచ్చేలాగు చేసినాడు. ఏమి చేసినను ప్రజలు వాళ్ల ధర్మదీక్ష విడువలేదు. చివరకు శ్రీకృష్ణుని దయచేత నరకపాలన మంతరించినది. మఱునాడు నరకుని కొడుకు భగదత్తుడు రాచబొక్కసములో నున్న ధనరత్నరాసు లన్నియు తెప్పించి ప్రజలకు బంచిపెట్టించినాడు. ప్రజలు తమ తమ సొమ్ములు లెక్కపెట్టుకొని సంతోషించినారు. ఆసంగతి జ్ఞాపకముంచుకొనుటకే కొన్ని ప్రాంతాలవారీపండుగకు ధనలక్ష్మీపూజ చేయుచున్నారు. ఆనాడు ప్రజ లానందమున దీపారాధనలు చేసికొన్నారు. ఆదీపారాధనలకు ప్రతిగానే మనవారీపండుగకు దీపావళులతో గృహాలను అలంకరించుచున్నారు. ఆరోజున విజయసూచకముగా ఫిరంగులు ప్రేయించినారు. ఆ జ్ఞాపకార్థము ఇప్పుడు బాణసంచులు కాల్చుచున్నారు."

రామా: (నవ్వుచు) సరే. బాగుంది కాని_నేనింకోకథ చెప్తాను. నీకు కోపము రాదుకదా?

వెంక: మధ్య_నా కెందుకు_కోపము?

రామా: నీకు కొంచెము వ్యతిరేకముగా మాట్లాడవలసి వస్తూంది_అందుకు చెప్తున్నాను.

వెంక: నీవు నాకు వ్యతిరేకంగా మాట్లాడని దెప్పుడు? కానియ్యి_ఎంతవిమర్శనకైనా నేను తయారుగానే యున్నాను.

రామా: అసలు పూర్వము నరకాసురు డనే ఒకరాజున్నా డన్నమాట సర్వాబద్ధం.

వెంక: (ముక్కుమీద వ్రేలు పెట్టుకొని) ఎంతమాట మఱి నరకచతుర్దశి ఎందుకు పుట్టిం దంటావు?

రామా: ఈ విషయాన్నిగురించి వేదాన్ని తలతన్నేటంత ప్రామాణ్యమైన దొక కథను ఈ మధ్య నా కొకానొకరు చెప్పినారు. ప్రత్యక్షప్రమాణంగా కనబడే ఆకథాంశాలను నాస్తికుడైనా కాదనలేడు.

వెంక: నాస్తికులకథ చెప్పకుము_ప్రాయశ్చిత్తం చేసికోవలసి వస్తుంది.

రామా: (నవ్వుచు) అదే_ప్రత్యక్షంగా జరుగుచున్న సంగతేనోయ్, నే జెప్పేది_సత్యభామాసమేతుడైన శ్రీకృష్ణుడు నరకరాజును చంపినట్లుగదా

భాగవతములో వ్రాసినారు! ఆకథలోనివా రందరు వట్టి కల్పిత వ్యక్తులే.

వెంక: (చెవులు మూసికొని) "పెళ్ళి కొచ్చిన వాళ్ళంతా నాపెళ్ళాలే" అన్నట్టుంది నీమాట—చాలు చాలు. ఊరుకో.

రామా: చెవులు మూసికొంటా వెందుకు? "విన దగు నెవ్వరు చెప్పిన" అనేపద్యము అర్థముతో వల్లించి కూడ—నీ వింత పామరత్వంలో పడిపోతావని నే నెప్పుడూ అనుకోలేదు.

"సరి. కానియ్యి—ఈవేళ, నీకూ నాకూ కూడా ప్రాయశ్చిత్తం, ఏలాగూ తప్పదు" అని తల పంకించుచు బాసినపట్టు వేసికొని కూర్చుండి వెంకటశాస్త్రి చిరు నవ్వుతో కథాశ్రవణమునకు సంసిద్ధు డైనాడు.

3

పరిహాసభాషణ ప్రియుడు డగు రామారావు వడి వడిగా రాట్నము త్రిప్పి నూలు వడుకుచునే తనవింతకథ మొదలుపెట్టినాడు:

"భాగవతకారుడు నరకాసురవధ శ్లేషార్థంగా చెప్పినాడు. ఏలాగంటే, ప్రజాకంటకు డైన నరకుడే దేశారిష్టదాయకము లైన దోమలపురుగులు—పరమాత్మ స్వరూపు డైన శ్రీకృష్ణుడే వెలుగుచున్న దీపపువత్తి—రణ ప్రోత్సాహకారిణియైన సత్యభామే దీపమును ప్రజ్వరిల్ల చేసే చమురు— రణక్షేత్రమే ప్రమిద—ఫలిత మేమనగా; దీపపువెలుగుచే దోమలపురుగు లాకర్షింపబడి, నూనెలో పడుటచేత ఎగురజాలనివై దీపపువేడిమికి మాడి, దోమ లాడగా ప్రమిదయందు పడి చనిపోవుటకే నరకాసుర వధయని అర్థము—కాదు, కాదు—ఇది దండాన్వయం: మఱి తాత్పర్య మేమిటంటే—పూర్వ మొకప్పుడు దోమ లపురుగులు చెలరేగి నిరవకాశంగా ప్రపంచమంతయు ఆక్రమించి మనుష్యులు నిల్వడానికి ఆధారము లేకుండా చేయగా, నూనెదీపములచే వాటిని సంహరించడమనే సులభోపాయమును ప్రజలు కనిపెట్టి, ఆవేడుకను ప్రతి సంవత్సరము ఆచరించుచున్నా రనేదే—ఆయన చెప్పిన ఈసమాచారమంతా తమాషాగానూ, నమ్మదగిందిగానూ కనబడుచున్నది—ఏమంటావు?"

వెంక: పుణ్యకథలందు నమ్మకము లేని పాషండుల మాటలు తమాషాగానే ఉంటవి. బహు నమ్మకముగా కూడా కనబడుతవి. అందుచేతనే అటువంటివాళ్ళతో మాట్లాడినవాళ్ళకు కలిగేపాపము అనేకజన్మా లెత్తినా పోదన్నారు—పెద్దలు. తంటి కొట్టితే మూతిపళ్ళు రాలిన వన్నట్లు అమావాస్యనాడు దీపాలు పెట్టితే చతుర్దశినాడే పురుగు లెట్లు నశించుతవి?

రామా: ఒక్కరో కెక్కువ తక్కువ కేమిలే—అస లు చతుర్దశినాడే దీపాలు పెట్టి పురుగులను చంపవలసినది. అమావాస్యనాడేమో—బాణసంచులు కాల్చి గాలిని శుభ్ర పర్చవలసినది.

వెంక: (ఎగతాళిగా)అయితే చతుర్దశినాడే దీపా వళి అనక, అమావాస్యనా డన్నా రెందుకోయ్?

రామా: (పరధ్యానముగా) ఏమో! ప్రజలనోళ్ళ లో పడి బహుశా చతుర్దశి అమావాస్యలు తలక్రిందులై పోయి యుంటవి.


వెంక: బలే—బాగుంది, నీమాట. ఇంత సృష్టి చేసిన భగవంతునికి దోమల పురుగులను చంపడమును, గాలిని శుభ్రము చేయడమును చేతకాక, మన భారతదేశము లోని పారతంత్ర్యపు ప్రజలను శరణు చొచ్చినాడు కాబోలు, తనకు సహాయము చేయుడని. జీవహింస చే యుట, ధనము దుర్వ్యయము చేయుట అనునవి వేడు కలుగా మనపూర్వు లెప్పుడును ఉద్దేశించలేదు. ప్రజ లలో భక్తిజ్ఞానము లభివృద్ధిపఱచి, దేశమునకు అభ్యుదయ ము కలిగించుటకోసమే, మనపెద్దలు ఈపండుగలన్నియు ఏర్పాటుచేసినారు. నేటికాలానికి నీవంటివాళ్లు బయలు దేరి పాషండవాదాలు చేసి పండుగలకు వెడఅర్థాలు తీస్తున్నారు.

"నీ స్వంత ఉపన్యాసం ప్రారంభించినా వేమి కర్మమోయ్—మీ ఉపాధ్యాయులు చెప్పిన క్రొత్తసంగతు లేమైనా మొదలుపెట్టమంటేను—"అని చెప్పుచు రామారావు నూలుతో నిండిన కదురు తీసివైచి

ప్రక్కనున్న ఉత్తరకదు రొకటి అందిపుచ్చుకొని రాట్న మునకు పెట్టి వేగముగా నూలువడుకు పనిని సాగించు చుండెను.

౪

"అయితే మా ఉపాధ్యాయులు చెప్పిన ఒక విచిత్రకథ ఇక్కడ చెబుతాను—కాచుకో" అని వెంకటశాస్త్రి హుషారుగా శ్రోత్రకథ ప్రారంభించినాడు—"పూర్వ మొక గ్రామములో సంపన్నగృహస్థుడగు ఒక బ్రాహ్మణుని యింట్లో పాడిపంటలు సమృద్ధిగా ఉండేవి. అందుచేత వారియింట్లో ఏడు గండు పిల్లులు సింహాలులాగు తిరుగుచు అన్ని పదార్థాలలోను మూతులు పెట్టి తిన్నంత తినేవి. అవి తినగా మిగిలినవే ఇంటివారికి ప్రాప్త మౌచుండేవి—అయితే వాళ్ల యింట్లో తద్దినం వచ్చిన ప్పుడుమాత్రం—తప్పకుండా ఈయేడు పిల్లులను తీసికొనిపోయి దొడ్లో ఉన్న పెద్ద చింతచెట్టుకు కట్టివేసేవారు. ఆబ్రాహ్మణుని యింట్లో ఉన్న పిన్న పెద్దలను పిల్లవాండ్రంతా దొడ్లో కట్టివేసిన పిల్లులను చూడగానే "ఈవేళ మాయింట్లో తద్దినమోయ్—అప్పచ్చులు—చేస్తారు" అని ముసిముసి నవ్వులు నవ్వుకొనుచు—చేతులు ఊపుకొని కేకార్లు చేయుచు—ఎగిరి గెంతులు వేయుచు—సంతోషముగా ఉండేవారు.



మాస్తున్నావా వాళ్ల కులాసా. ఈలాగు కొంత కాలము వెళ్లిపోయింది. తర్వాత ఆకుటుంబములో పాడిపంటలు తగ్గిపోయి, మార్జాలాలసంఖ్యకూడా క్షీణించి నాలుగు కాడికి వచ్చింది. మనపెద్దలు తద్దినానికి ఏడుపిల్లులను తప్పకుండా, దొడ్లో చింతచెట్టుకు కట్టేవారు—మనయింట్లో నాలుగుపిల్లులే ఉన్నవి. కనుక మిగిలిన మూడింటిని ఎక్కడో సంపాదించి దొడ్లో కట్టకపోతే, తద్దినము పడిపోతుందనియెంచి, రెండుమూడు రోజులు నానాతంటాలు పడి, ప్రయత్నించి, యేలాగో ఏడవసంఖ్యగల పిల్లులను పూర్తిచేసి, దొడ్లో చింతచెట్టుకుకట్టి అప్పటివారు కృతార్థులగుచువచ్చేవారు.

ఆలాగు ఉండగా తరాలు వెళ్లిపోయినవి. పాశ్చాత్యనాగరికత బాగా దేశములో అలుముకొన్నది. వాళ్ల యింట్లో పాడిపంటలు పూర్తిగా నింపుకొన్నవి—ఒక్క పిల్లియైనా వాళ్లింటికి రావడములేదు. పిల్లులు లేకపోతే తద్దినము పడిపోతుంది—ఏలాగురా—అని ఆలోచించి, చివర కావాటి బుద్ధిమంతులు 7 మట్టిపిల్లులను చేసి, చింతచెట్టుకు కట్టివేయడము మొదలుపెట్టినారు. పితృదేవతలు—పిండము—మంత్రాలు — భోక్తలు— మొదలైన వన్నీ, వాళ్లు పూర్తిగా మరిచిపోయినారు. ఇంత రాగిడిమట్టి తెప్పించిఏడుమాయపిల్లుల్ని చేయడం. వాటిని దొడ్లోచింతచెట్టుచుట్టూ కట్టడం—ఇంట్లో పిండివంటలు చేసికొని మింగడం — క్రింద, దిగించి—తద్దినం.

రామా: (నవ్వుచు) అయితే తరాలు గడచిపోయినా ఆచింతచెట్టు ఆలాగే ఉంది టోయ్—పడిపోకుండా—?

వెంక: అబ్బో! చింతచెట్టుని పోనివ్వడమే? అదిపోతే కొంప మునిగిపోదూ? పాతతులసిమొక్కలు పోగా క్రొత్తతులసిమొక్కలును, పెద్ద మారేడు వృక్షము పోగా చిన్నమారేడుచెట్టును హరిహరుల దేవాలయాలలో ఎంతశ్రద్ధగానాటుతారో అంతకన్న డెబ్బైరెట్లు ఎక్కువశ్రద్ధాభక్తులతో వాళ్లు చింతమొక్కలు జాగ్రత్తచేసి నాటుచుండేవారు.

రామా: (చిరునవ్వుతో) సరే—లే—అయినా మట్టిపిల్లల్ని కట్టడానికి బలమైన చింతచెట్టెందుకు? లేత మొక్కైనా చాలు—లేకుంటే మట్టితో చేసిన మాయ చింతమొక్కైనా చాలు.

వెంక: పైకథవిను మరి. వీరింటికి ఒకనాడు వైదికజ్ఞానసంపన్నుడైన ఒక బ్రాహ్మణుడు వచ్చినాడు. ఆరోజునే వీరింట్లో తద్దినం కూడా—వచ్చింది. ఆయన వాళ్ల తెలివితక్కువ చేష్టలన్నీ చూచి తెల్లబోయి ఇంటియజమానికి తద్దినమంటే యేమిటో బోధించినాడు. మరేన్నీ—మంత్రాలు చదివి, పితృదేవతల నాహ్వానించి భోక్తలద్వారా వాళ్ల ఆకలిదప్పులు అణచడానికి మారుగా—దిక్కుమాలిన పిల్లలు—చింతమొక్క—నీవు—తయారయినావుటయ్యా! అని మొగము వాచేలాగు అతనిని నానాచీవాట్లుపెట్టి ఆపామరుని యింట్లో దిగినందుకు పశ్చాత్తాపపడి, ప్రాయశ్చిత్తంచేసికొని చక్కాపోయినాడు.

కథాశ్రవణానంతరము రామారావు కొంచెమాలోచించి "ఈ ఏడుపిల్లలు—పితృశ్రాద్ధముకథ ఆర్యకథానిధి 8 వ భాగములో—వెనుక మన వెంకమారు చదివినాము. నీకు జ్ఞాపకములేదూ?" అని అడిగెను.

వెంక: లేకేమి! అకథనే ఇంకా విపరంగాను వినోదంగాను ఉండేలాగు మామాష్టరుగారు చెప్పినారు. నేన దిప్పుడు టూకీగా తేల్చివైచినాను.

"పాడిపంటలుండి ఇంట్లో పిల్లలున్న పూర్వీకుడొకడు కర్మం జాలక వాటినింట్లో కట్టివేసినాడంటే అదే తద్దినానికి ముఖ్యమనుకొని పిల్లలులేనిదే పిచ్చిచేష్టలు చేసిన బీదబ్రాహ్మణు డెంత బుద్ధిమంతుడో, రాజ్యంపోయి, వృత్తులునశించి, భోగభాగ్యాలుపోయి దేశము దరిద్రావస్థలో నుండగా అప్పోసప్పోచేసి నాలుగురూపాయలు సంపాదించి, బాణాసంచాకొని తగులబెట్టి, దీపావళి వెళ్లించినామని సంతోషించేవాళ్లూ అంత బుద్ధిమంతులే" అని మామాష్టరుగారు చెప్పినారు.

రామా: ఒక్క దీపావళి అన్నమాటేమిటి? అన్ని పండుగలు—అలాగే అయినవి—ప్రజాభిప్రాయం ఈ లాగు మారిపోయినప్పుడు నీవూ నేనూ తంటాలు పడి ఏటికి ఎదురీత లీదితే ఏమిప్రయోజనము?

వెంక: నీవు. నేను ఉపన్యాసాలిచ్చి లోకాన్ని బాగుపర్చ నక్కరలేదు. ప్రజలు, కనుక ధర్మదీక్షలో ఉండి కష్టసహిష్ణుతకు తయారైతే ఎట్టి నిరంకుశప్రభువులైనా లొంగిపోక తప్పదనే వాస్తవమును ప్రజలకు జ్ఞాపకము చేయుటకేర్పడిన ఈపండుగనుగురించి సరిగా అవగాహనచేసికొన్న మనబోటివాళ్లయినా బాణసంచుల వెల్లిలో పడడం మానవలె. దేశసౌభాగ్యాన్ని వృద్ధిచేసి ప్రజలయందు ధర్మదీక్షవృద్ధిచేసే నిర్మాణకార్యక్రమానికి పూనవలె. అదే మనధర్మం. అంతవరకే మనకు హక్కున్నది. నాలుగురోజులనుండి మాజాతీయ విద్యాలయానికి మేము దీపావళి భిక్ష వసూలుచేస్తున్నాము. దీపావళి ప్రభావమును సూచించే కరపత్రాలు పంచిపెట్టి జనులకు కర్తవ్యమును నచ్చచెప్పుచున్నాము. నూలువడికే ఉత్సాహముగలవారికి రాట్నాలు, కదుళ్లు, ఏకులు మొదలైనవి ఖరీదు పుచ్చుకొని సప్లయిచేస్తున్నాము. కొంతమందిమి ఖద్దరుప్రచారముకూడా చేస్తున్నాము.

రామా: ఈ పండుగరోజులలో ఈ పనులన్నింటికీ నేనుకూడా నాశక్తికొలది సహాయము చేయడానికి ఏమీ అభ్యంతరం లేదు. కాని నాకొక చిన్నసందేహమున్నది. అడుగమన్నావా?

వెంక: (నవ్వుచు) ఒకటికాదు—పది సందేహాలుండినా ఇప్పుడే తీర్చుకో—శంకానివృత్తిచేసికోకపోతే చాలా చిక్కులున్నవి.

రామా: లోకమంతా టపాకాయలు—సీమటపాసులు—జింకాలు—తారాజువ్వలు—మతాబులు—తాప్, కూప్, తస్, తుస్, జఁయ్, జాఁయ్—అని ఊరికే జాజ్వల్యమానంగా వెలిగించివేసి ఆనంద మనుభవించుచుంటే, తసుసుమమ్మా అని చందాలూ, భిక్షలూ వసూలుచేయుచూ—ఖద్దరుమూటలు బుజానవేసికొని

తిరుగవలెనంటే ఈ కలికాలంలో ఎవరు మనమాటలు వింటారు చెప్పుమా.

వెంక: బుగ్గల్ని తమలపాకుల కిళ్లీలూ, నోట్లో సిగరెట్లూ పెట్టుకొని వంకపాపిళ్లు దిద్దుకుంటూ, రోజు రోజూ సినీమాలకూ, నాటకాలకూ బయలుదేరే, షోకేళీపురుషులతోపాటు నీవూ, నేనూ, ఆనంద మనుభ విస్తున్నామా? పోనీ కోడిపందేలలోను, జూదాలకొంప లలోను, వేశ్యాగృహాలలోను—లక్షలకు లక్షలు పందేలు పెట్టి, గెల్చుచూ, ఓడుచూ, ఒకనిమిషానికి లక్షాధి కారులు—మఱొక నిమిషానికి భిక్షాధములు—అగుచు ఆనందసముద్రములో ఓలలాడే వారిని మనము అనుకరిం చడం లేదేమి? ఆపనులు చేస్తేనే కాని మనకు సంతో షంరాదా? నిజంగా—నీవుచెప్పు! ఒకమతాబా కాల్చ డం, ఎక్కువ ఆనందమా; ఒక ఏకునసికి దారం తీయడం ఎక్కువానందమా?

౬

వెంకటశాస్త్రి ప్రశ్నకు రామారావు వెంటనే జవాబు చెప్పలేదు. ఏదో ఆలోచించుకొనుచు, కొం చెము పరధ్యానముగా నుండుటచే గాబోలు అతనిచేతి లోని దారము తెగిపోయినది. కొసలు నలిపి దారము అతికించుకొని మరల రామారావు సంభాషణ మారం భించినాడు.

రామ: నామట్టుకు నాకు నీమాటనిజమే సరదా—కాని అందరికి అలాగుంటుందా? ముఖ్యముగా— చిన్నపిల్లలమాట ఆలోచించు!

వెంక: తప్పని చెప్పిన తర్వాత చిన్నపిల్లలకు మాత్రం దానిలో ఆనంద మెందుకుంటుంది? జూద మాడడం—తప్పనికదా నీవు ఆడకుండా ఊరుకొ న్నావు. దాని ఆనందం ఒక్కసారి చవిచూస్తే—మళ్లీ నీవదిమానగలవు?

రామా: టపాకాయలకూ జూదానికీ సాపత్య మే మిటోయ్? పోనీ—నాదగ్గర ఒకరూపాయ ఉన్నద నుకో—అందులో అర్ధరూపాయ ఏదీపావళి భిక్షకో ఖర్చుపెట్టి, మిగిలిన అర్ధరూపాయతో నేను ఎందుకు బాణసంచా కొనుక్కొని కాల్చకూడదు?

వెంక: బాణసంచా కాల్చడంవల్ల దీపావళి సార్థక మౌతుందని నీకేమైనా నమ్మకముందా? పూర్వులు తమ కుసత్పరిపాలన లభించినప్పుడు విజయసూచకంగా ఫిరం గులు పేల్చుకొన్నారని, ఎన్నాళ్లకూ—పారతంత్ర్యము లోంచి బయట పడలేక—అసహాయులమై పడియున్న మనమిప్పుడు తగుదునమ్మాయని టపాసులు కాల్చి వెఱ్ఱి సంతోషం వెల్లడించవలెనంటావా?—తద్దినానికి, భోక్తలకు మంత్రయుక్తంగా భోజనమూ పెట్టుతాను— దొడ్లో పిల్లులనూ కట్టించుతానంటే విన్నవాళ్లు అపహాస్యం గా నవ్వరూ?

రామా: ఎందుకు నవ్వుతారులే—ఇప్పుడుకూడా ఒకళ్లింట్లో పదిపన్నెండు పిల్లులుంటవనుకో, వాళ్ల దొడ్లో ఏదో చెట్టుంటుందనుకో—తద్దినమంతా శాస్త్ర యుక్తంగా మంత్రాలతో జరుగనిచ్చి ఆపిల్లులను దొడ్లో చెట్టుకు కట్టివేస్తే తప్పేముంది?

వెంక: తప్పా మరీతప్పా? ఆపిల్లులన్నిటినీ కట్టకూ డదు. అందులో ఏడుపిల్లులను మాత్రమే కట్టవలె. దొడ్లో ఏదో చెట్టుకుకట్టితే ఏలాగు? చింతచెట్టుకే కట్టవలె.

రామా: దానికేమిగాని—విదేశపుబాణ సంచులు మాని స్వదేశంవి కావలసినన్ని కొనుక్కొని కాల్చుకో మన్నారొక గొప్పజాతీయవాది—ఈ విషయమై నీ ఉద్దేశ్య మేమిటి?

వెంక: నిజమైన పిల్లులకోసం, ఇల్లిల్లూ తిరిగి ఒళ్లం తా బరుకులమయం చేసికోకుండా, మట్టిపిల్లులను నీచిత్తం వచ్చినన్ని చేసి, చెట్టుకుకట్టి, తద్దినంపూర్తిచేసికొమ్మన్న హితోక్తితో దాన్ని పోల్చవచ్చును.

రామా: (తలఊపుచు) అయితే—మొట్టుకి— స్వదేశపు బాణసంచావల్ల ఏమీనష్టములేదని నిన్ను ఒప్పించినావన్నమాటే—

వెంక: ఆలాగైతే తద్దినానికి దొడ్లో మట్టిపిల్లుల్ని కట్టితే పిచ్చితనమనుకొంటారని నీకుభయం లేదన్నమాటే!

రామా: అవునుగాని—ఊళ్లో అందరు మతాబులు, తారాజువ్వలు వగైరా అన్నీ పంచుకొని ఉబలాట పడుతూఉంటే—నువిక్కడకూర్చుండి ఏకులూ, కదుళ్లూపంచుకొని, యిద్దరము చెరియొక రాట్నము ఎదురెదురుగా వేసికొని త్రిప్పుచు దారాన్ని సృష్టిచేసి అపర బ్రహ్మానంద మనుభవించుచు దామంటావా?

వెంక: వాళ్లు అరవీసెడు మతాబాలూ కాల్చివేస్తే, చివరకు బూడిదయైనా మిగులకుండా అన్నీ అయిపోతవి—మనము అరవీసెడు ఏకులు వడికి దారము తీసినామంటే ఆనూలు చూచుకొన్నప్పుడెల్లా మనకు ఒళ్లు పరవశమయ్యేటంత ఆనందం కలుగుతూఉంటుంది.

అని వెంకటశాస్త్రి ముందునకువంగి తానింతకు ముందునవడికిన దారము చుట్టబడియున్న పంటికఱ్ఱను కుడిచేతితో అందుకొని మెల్లగా బొంగరమువలె త్రిప్పుచు తననూలు నాణెమును చూచుకొనుచుండెను.



౨

వెంకటశాస్త్రి పలికినమాటలు వినగానే రామారావునకు పట్టరాని సంతోషముకలిగినది. ఇకతన వితండవాదమునకు స్వస్తిచెప్పి హృదయమిచ్చి మాట్లాడనారంభించినాడు.

రామా: నిజమేసుమా—నాకు ఈసంగతి నీకన్న ముందే తెలుసును. నీతో తమాషాకు ఈవాగ్వాదమంతా చేసినానుగాని నిన్ననే, నేను పవ్వాసేరుఏకులు కొని తెచ్చినాను. ఇప్పుడు చెప్పడ మెందుకు? రేపు రాత్రి మాయింటివద్ద ఎంతతమాషా చేస్తామో ఒకసారి అటువైపువచ్చి చూచితే నీకే తెలుస్తుంది—అవునుకాని ఈవృథాకాలహరణ మెందుకు; దీపావళి చందాలకు బయలుదేరక?

వెంక: వేళైంది. నీవు నూలువడుకుతున్నావు గదా ఆటంక మెందుకని ఊరుకొన్నాను. ఇంకెన్ని ఉన్నవి ఏకులు—?

రామా: ఇంకేమిఉన్నవి? దీనితో అన్నీ అయిపోయినవి (అని చేతులు దులుపుకొని లేచుచున్నాడు.)

వెంక: ఏమిటే! 20 ఏకులకూ నేను నాలుగు మాత్రమే వడికినాను. మిగిలిన 16 ను నీవు అప్పుడేవడికివైచినావా? ఆహా! మనమింతసేపూ కులాసాగా మాటలూ ఆడుకొన్నాము—బోలెడు దారము తయారుచేసాము.

రామా: అందుకే రాట్నాన్ని సుదర్శనచక్ర మన్నారు. మన దౌర్భాగ్యానికి హేతువైన సోమరితనపుపిశాచము ఈరాట్నచక్రము తిరిగే యింటిఛాయలకైనా రాలేదు

వెంక—నేనువృథాగా కూర్చున్నానుకాని, ఇంకోరాట్నముండి వడికితే, వట్లో ఇంత దారము తయారైపోయి యుండును—సరే; మనము ప్రచారానికి బయలుదేరుదామా మరి—

ఇట్లు మాట్లాడుచు ముందు వెంకటశాస్త్రియు, వెనుక రామారావును గదివెలుపలికి వచ్చినారు. వెంకటశాస్త్రి గదితలుపు గొళ్లెము పెట్టి తాళము నొక్కివేసినాడు. ఇరువురు కలిసి జాతీయమహావిద్యాలయమున కేగినారు. అచ్చట తమ నిర్ణయకార్యము లొనర్ప సంసిద్ధులైయున్న మిత్రబృందముతో కలిసికొని వారందరు ప్రచారము చేయబూనినారు.

బాణసంచులు కొనుక్కొనుటకు తమ తండ్రులవెంటబోవుచు కొందరు బాలురు వారికి మార్గములో కనబడినారు. ఆపిల్లలు చేయబోవుపనికిని తానుచేయదల

దలచిన పనికిని గలుగుఫలితముల తారతమ్యముల గురించియు, ఆనందముల భేదాలను గురించియు వితర్కించుకొనుచు, సహజముగ తనకు దేశసేవాసక్తిని గల్గించినందుకు, భగవంతునకు లోలోన ధన్యవాదము లర్పించుచు రామారావు ప్రఫుల్లహృదయముతో వారివెంటబోయి ప్రచార మొనర్చి, సఫలీకృతమనోరథుడై, రాత్రికి స్వగృహము చేరుకొన్నాడు.

౨

రామారావుతండ్రి లక్ష్మణరావుగారు జమీందారీయిలాకాను నెలకు 80 రూపాయలు జీతముగల ఉద్యోగములో నున్నారు. ఆయన భార్య సీతామహాలక్ష్మమ్మ సదాచార సంపన్నురాలు, దేశాభిమానవతియునై సాధ్వీమణియని పేరుగాంచినది. ఆమెకు మగపిల్లలు అయిదుగురు, ఆడుపిల్లలు ముగ్గురు, మొత్తము ఎనమండుగురు సంతానము కలిగి అందరు బాగున్నారు. పెద్దకుమారుని పేరే రామారావు. అతని వయస్సిప్పుడు రమారమి ఇరువది సంవత్సరములు. ఆడుపిల్లలలో కడసారపు బాలికయు సీతామహాలక్ష్మమ్మగారి యూరవ సంతానమును నగు రాజ్యం చాలా తెలివిగలది; చురుకైనది. ఆమెకు కడచిన దసరాకు ఎనిమిదేళ్లు దాటి తొమ్మిదవయేడు వచ్చినది. ఆమెవెనుక గల్గిన మగబిడ్డలిద్దరు చాల చిన్న పిల్లలు.

ఆయింట్లో లక్ష్మణరావుగారును, చిన్నమగ శిశువు లిద్దఱును తప్ప మిగిలినవారందరు రాట్నముమీద బహు సున్నితముగను, త్వరితముగను నూలు తీయగలిగినవారే. వారందరును నప్పుడప్పుడు పందెములు వైచికొని నూలు తీయుచుండుట కలదు. అది వారికొక వినోదప్రాయముగా నుండునేకాని పనిగా కాన్పింపదు. ఆపందెములందు నాణెమైన నూలుతీసినవారిలో రాజ్యమే తరుచు ప్రథమస్థాన మాక్రమించుచుండును. ఆముద్దుబాలికను చూచి మెచ్చుకొని వారొక్కరును లేరు.

లక్ష్మణరావుగారింట్లో దీపావళికి ప్రత్యేకము బాణసంచులకొరకు 8 రూపాయలు వ్యయపఱుపబడుట వాడుక. ఈసంవత్సరము దీపావళిపండుగ వారమురోజు లున్నదనగానే పండుగుల ప్రయోజనముగూర్చియు, దీపావళిని సార్థక మొనర్చవలసిన పద్ధతినిగూర్చియు రామారావు తన తల్లికిని సోదరీసోదరులకును బాగుగ నచ్చునట్లుగ బోధించియుండెను. అందుచే సీతామహాలక్ష్మమ్మ తనభర్తగారితో చాలసేపు వాదప్రతివాదములు చేసి ఏలాగైననేమి మొత్తముమీద ఆసంవత్సరము దీపావళికి ఎనిమిది రూపాయలును రామారావు ఇష్టప్రకారము ఖర్చుపెట్టనిచ్చుటకు అనుమతి పొందెను. అయినను బొత్తిగా టపాసులు కొననియెడల తనభర్తగారికి కోపమువచ్చునేమో అని, సగము దేశోపకారకృత్యములకును సగము బాణసంచులకును ఖర్చుపెట్టిన బాగుండునేమో అని సీతామహాలక్ష్మమ్మ రామారావునకు హితము కరపెను.

పండుగ మూడురోజులున్నదనగానే రామారావు దీపావళీ కార్యక్రమమును తనహృదయఫలకముపై ఇట్లు లిఖించుకొనియున్నాడు.

	రు.	అ.	పై.
స్థానిక జాతీయవిద్యాలయమునకు దీపావళిభిక్ష	1	0	0
సోదరీసోదరుల నూలు పోటీ పరీక్షకు ఏకులు సవాసేరు	0	8	0
కృతార్థులకు ప్రథమబహుమతి	1	4	0
,, 2 వ బహుమతి	0	12	0
,, 3 వ బహుమతి	0	8	0
స్వదేశపు బాణసంచులు	4	0	0

వెంకటశాస్త్రితో సంభాషణము చేసి వచ్చిన వెనుక రామారావునకు పూర్తిగ హృదయపరివర్తనము కలిగినది. నాటిరాత్రి పండుకొన్నప్పుడు అతడు తన కార్యక్రమ పట్టికయందుగల చివరవిషయమును మార్చక తప్పదను నిశ్చయమునకు వచ్చెను.

తెల్లవారినది; దీపావళిపండుగ వచ్చినది. ఆనాడుదయమున వెంకటశాస్త్రియును, రామారావును నిర్ణయస్థలములలో జాతీయమహావిద్యాలయమునకు దీపావళిభిక్ష వసూలుచేయుచు ఖద్దరుప్రచారము చేసినారు. మధ్యాహ్నము 12 గంటలకు తిరిగి వచ్చునప్పుడు రామారావు 5½ గజముల ఖద్దరు పరికిణీగుడ్డ కొని తెచ్చినాడు.

మధ్యాహ్నము భోజనములు చేసిన పిమ్మట రామారావు మెల్లగా తల్లిని పిల్చి "అమ్మా, నీవు నామీద కోపపడకు. 4 రూపాయలు అనవసరముగా బాణసంచులుకొని కాల్చి పారవేయుటవలన ఏమియులాభము లేదుకదా! పైగా దీపావళి యేర్పాటుచేసిన మన పెద్దల యుద్దేశ్యమును వృధాచేసి వారిపట్ల ద్రోహముచేసినట్లగును. ఆవిషయమై నాకు పూర్ణమైన నమ్మకమున్నది. అందుచేత ఆనాల్గురూపాయలలోను రు 3-7-0 పెట్టి ముద్దులుమూట గట్టుచున్న ఒకపువ్వుల ఖద్దరు పరికిణీగుడ్డకొని తెచ్చినాను. తక్కిన తొమ్మిది అణాలు పెట్టి అది ఒక పటకాపరికిణీయు, జాకెట్టును కుట్టించి, నాకైమైన నూలుతీసిన ఆకుపిల్లకు అది ప్రత్యేకపుబహుమతిగ నీయవలెనని నాయుద్దేశ్యము. టపాకాయలు కొననందుకు నాన్నగారు కోపపడకుండ చేయుమని నిన్ను బ్రతిమాలుచున్నాను. తమ్ములను, చెల్లెళ్లను ఒప్పించడము బాధ్యత నాది" అని చెప్పెను. తనముద్దు చెల్లెలగు రాజ్యానికి దుస్తులను దీపావళి కానుకగా నీయనెంచిన రామారావు పవిత్రహృదయమును తల్లి చాలమెచ్చుకొనెను. "బాణసంచులు లేకుండుటచే మీలో నెవ్వరికిని సంతోషభంగము కాకపోయేటట్లయితే మధ్యమీ నాన్నగా రెందుకు కలుగజేసికొందురులే! నీవు చేసిన పని బాగానే ఉన్నది." అని ఆమె అతనికి అభయహస్తమిచ్చినది. నాటిమధ్యాహ్నము 4 గంటలకే క్రొత్త దుస్తులు తయారై వచ్చినవి.

౬

సీతామహాలక్ష్మమ్మ, ఎత్తయి విశాలమైయున్న తమ గచ్చు అరుగులు కడిగి శుభ్రపరిపించెను. రాట్నములకు పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టి అలంకారము చేయించెను. అరుగు ఒక్కొంటికి మూడేసి రాట్నముల చొప్పున వేయించి ప్రతిరాట్నమువద్దను తగిన యెత్తుపీటలు పెట్టించెను. ఆయరుగులపై నడుమగా నొక్కొక్క విద్యుద్దీపము వ్రేలాడగట్టించెను. ఆప్రదేశమంతయు నత్యంత కాంతిమంతమై పట్టపగటిని మరపించుచుండెను. ఇంతకుముందే వారివీథిఅరుగులకు ఎదురుగా కఱ్ఱలతో మెట్లవలె కట్టించి, సీతామహాలక్ష్మమ్మ నాలుగేసి వరుసలను ప్రమిదెదీపములు పెట్టించెను. విద్యుద్దీపద్యుతుల ముందు కొంచెము వెలవెల బోవుచున్నట్లగపడుచున్నను ఆదీపావళి తత్ప్రదేశమున కొకవింత యందమును గల్పించుచునే యుండెను.

ఆరోజున ఆరుగంటలకే బాలికాబాలకులందరును భోజనములు ముగించిరి. పిండివంట లారగించుట, తాంబూలములు వేసికొనుట, ప్రమిదదీపములు సర్దుట మొదలగు పనులక్రింద రమారమి ఒక అరగంటయయ్యెను. రామారావు కోరిక ననుసరించి సీతామహాలక్ష్మమ్మ రాట్నపు పరీక్షాధికారిణిగ నుండ నంగీకరించెను. సవానేరు(=ఏబులము) ఏకులను ఆమె ఆరు సమానములగు కట్టలుగ కట్టించెను. రమారమి నలుబదియైదేసి ఏకులుగల యాకట్ట యొక్కొక్కటియు, నాలుగేసి కదుళ్లను, ఆమె ప్రతి రాట్నమువద్దను పెట్టించి యుంచెను.

సరిగా 6½ గంటలకు సీతామహాలక్ష్మమ్మ తన చేతిలోని స్ప్రింగుగంట నొక్కెను. గంట మ్రోగుచుండగానే వస్త్రధారులై కలకలలాడు మోములతో ముగ్గురు బాలికలును, ఒక అరుగుమీదకును, ముగ్గురు బాలురును మఱియొక అరుగుమీదకును చేరి వరుసగా తమతమ రాట్నములవద్ద ఎత్తుపీటలపై కూర్చుండిరి. అప్పుడే మఱల రెండవగంట మ్రోగినది. ప్రతియొక్కరును చేతితో నొక్కొక్క ఏకుతీసికొని కదురునమున్న దారపు కొనలతో తమ ఏకు చివరలను అతికించిరి. సీతామహాలక్ష్మమ్మ మూడవసారి గంట మ్రోయించెను. వారారుగురు నొక్కసారిగా రాట్నములు త్రిప్పుట ప్రారంభించిరి. ఆదృశ్యము చూచుటకు కన్నుల పండువుగ నుండెను.

ఊరిలో అందరును బాణసంచులుకొని ఉత్సాహముతో కాల్చుకొనుచుండగా తమబాలికాబాలకులు ధనహీనులవలె గృహమున కూర్చుండిపోయుండి, బయటకు వచ్చుటకే సిగ్గుపడుచు దీనులవలెగాన్పింతురేమో అని లక్ష్మణరావుగారు మొదట అనుకొనిరి. కాని ఊరిలో నందరికంటెను నత్యధికోత్సాహవంతులై తేజస్సంపన్న

ములను హేమములతో పచ్చనిరాట్నముల యెదుట దేవతలవలె కూర్చుండి పంతములమీద నూలువడుకుచున్న యాసుకుమార మూర్తులను చూడగానే ఆయనకు సంతోషముచే ఒడలు పరవశమయ్యెను. లక్ష్మణరావుగారు వీథివాకిట్లో నిలువబడి అదృశ్యమును తదేకదృష్టితో చూడసాగిరి.



సీతామహాలక్ష్మమ్మ చంటిపిల్ల వానిని చంకనెత్తుకొని రాజ్యము రాట్నమువద్ద నిలువబడి "నీవు ఎక్కువ దారము తీయుటకు ప్రయత్నింపకు. నాణెమైన దారము తీసినందుకు ప్రత్యేక బహుమతిగలదు. నీదారమే చాలసన్న నాణెముగ ఉన్నది. ఆబహుమతి తప్పక నీకేవచ్చును. అలాగే తీయుము. తొందరపడి లావుతీయవద్దు" అని ప్రోత్సాహవాక్యములు పలుకుచుండెను. వారి చిన్నపిల్లవాడు మూడేండ్లప్రాయముగల ఆనందరావు లాగుయు, చొక్కాయును తొడిగికొని, తలపై తెల్లని ఖద్దరుటోపీతో రాజ్యము రాట్నము దగ్గర మకిముచ్చి కొని కూర్చుండియుండి "రాజ్జెమక్క—భాగా నూలు తీస్తే— నేనే బనుమానం, ఇత్తాను—అమ్మా— నువ్వియ్యొద్దు. ఏమే! బుల్లెక్కా! నేనే ఇత్తానుకాదూ" అని తల్లితోను, అక్కతోను పుంఖానుపుంఖముగవచ్చియు రాని ముద్దుమాటలు నుప్పించుచుండెను.

లక్ష్మణరావుగారు సీతామహాలక్ష్మమ్మను సంబోధించుచు "నీ ఏర్పాటు చాల సంతోషదాయకముగానే యున్నదిసుమా! ఈదీపావళి ఖర్చు నిజముగా సద్వినియోగమైనది" అనెను. ఇంతలో అచ్చటకు వెంకటశాస్త్రి వచ్చి అదృశ్యమును, లక్ష్మణరావుగారి ప్రశంసావాక్యములను, గమనించి రామారావు విచిత్రపు ఏర్పాటునకు మిక్కిలి ఆశ్చర్యపడి యూతని నెంతయు మెచ్చుకొనెను.

అప్పుడు లక్ష్మణరావుగారును, వెంకటశాస్త్రియు దేశపరిస్థితులను గూర్చియు, శ్రీ గాంధిమహాత్ముని దయచేత ముఖ్యముగా యువకులయందు గల్గుచున్న హృదయపరివర్తనము గూర్చియు చాలసేపు మాట్లాడుకొనిరి. అప్పటికి గం. 10–20 నిమిషములయ్యెను. "ఇక 10 నిమిషములు మాత్రమే వ్యవధియున్నది. తరువాత నెవ్వరును రాట్నమును తాకుటకు వీలులేదు జాగ్రత్త" అని సీతామహాలక్ష్మమ్మ బాలికా బాలకులను హెచ్చరించెను. మగపిల్లలలో రామారావును, ఆడుపిల్లలలో రెండవదియగు రత్నావతియు తమ పాలియేకులన్నియు పూర్తిగ వడికివై చిరిపని ఒక్కసారిగా లేచిరి.

సీతామహాలక్ష్మమ్మ సరిగా గం. 10–30 ని॥ లకు తనపిల్గింపుగంటను నొక్కి మ్రోయించెను. పెద్దకుమార్తెయగు రంగనాయకమ్మ "నానూలు కూడ పూర్తియైనదమ్మా—" అని చేతులు నులుపుకొనుచు లేచెను. మిగిలినవారికి రెండేసియో, మూడేసియో మాత్రము ఏకులు మిగిలెను. ఒక పావుగంటలోనే బహుమతుల నిర్ణయమొనర్చి సీతామహాలక్ష్మమ్మగారు ఈ క్రింది ఫలితములు చదివెను.

అందరిలో మిక్కిలి నాణెమైన నూలువడికి నందుకు రాజ్యమునకు ప్రత్యేకబహుమతి	4 రు. వెలగల పరికిణీయు జాకెట్టును.		
రత్నావతికి ప్రథమ బహుమానము	రు 1	4	0
రామారావునకు ద్వితీయబహుమానము	0	12	0
రంగనాయకమ్మకు తృతీయబహుమానము	0	8	0

"తక్కిన మగపిల్ల లిద్దఱు తీసిన నూలుకూడ చాల బాగుగానే యున్నది. వాండ్రకుకూడ బహుమతి కర్హులే కాని 4 బహుమతులే యేర్పాటు చేయబడుటచే వాండ్రకు ప్రస్తుతము బహుమతులొసగ జాలనైతి"నని సీతామహాలక్ష్మమ్మగారు చెప్పిరి. రామారావు రెండవ బహుమతిని తాను తీసికొనక తనతమ్ము లిద్దరికిని చెరి యొక పావలాయును బల్లి తమ్ముడగు ఆనందరావునకు మిగిలిన పావలాయును నిప్పించెను. మొత్తముమీద వారందరును పరమానందభరితులై దీపావళిని సార్థక పఱిచిరి.

వెంకటశాస్త్రి స్వగృహమున కేగి తనమిత్రుడు రామరావు జరిపిన దీపావళిపండుగను గూర్చి తన తలిదండ్రుల తోను, తమ్ములతోను వినోదకథవలె పన్నెలు, చిన్నెలు చేసి చెప్పి వారిని సంతోషసాగరమున నోలలాడించెను.

ఉ మా ర మ ణా!

క్రొత్తపల్లి సూర్యారావు గారు

వినుమస్పృశ్యము నంటు, దర్భఁ గొని పేర్మి న్నీవుఁ బునం దాల్తు, వ
గ్నిని గట్టెప్పను మాటు, దానవుని న్నిశ్వాసమాత్రంబుగాఁ
గొను, దుర్విస్మృదుపీఠముం బలెనె కైకోఁ జాలు, దే మంచు నీ
క్కొనుబింతుర్ ఘను నోయుమారమణ, వాఙ్నిర్మాణవైచిత్రితోఁ.

గాలికి రూప మిచ్చెదవు కన్నులకుం గనరావు; డెందమం
దోలిన చూడఁగాఁ బడుదు వో ప్రభు, చూచెడి దెద్ది యందుఁ బ్రా
జ్ఞాలికి; నీదుచిత్రమును జ్ఞానులునుర్ లిఖియింపలేరు నే
నా లఘుబుద్ధి నెంతుఁ దగుదంచు నుమారమణా, భవద్గతిన్.

గగనము కొను, మేఘములు కైశ్యము, పృథ్వి నితంబ, మగ్ని ఫా
లగతిలకంబు, సూర్యుఁడు గళాపతి కన్నులు, శేషుఁ డారు, వా
యుగతి వచో విలాసము, పయోధులు సాగరనంబు, దిక్కులే
జిగిగల పుట్టముల్ ప్రకృతిశీల, కుమారమణా, త్వదార్యకున్.

నీయం దుద్భవ మయ్యె భూతములు లేనే లేవు నీకంటె ము
న్నాదైయెదు న్నినుఁ బట్టి యున్న కతనన్ వ్యామోహాతం జెట్టొ వి
త్తో యే దా మొదలం చెఱుంగక భవద్రూపంబుగా నెంచుఁ బై
పై యాకారముచే నుమారమణ, విద్వద్బృంద మట్లేకదా!

వేలూరి శివరామశాస్త్రిగారు

౧

రామనాథబాబు హావేలీ జమీందారు. అతనికి ప్రాయము దాఁటినపిమ్మట వెంకయ్యమ్మారావు అను కూఁతురు. రామనాథబాబునకు వ్యపదేశవద్భావముచే కూఁతురైనను కొడుకైనను వెంకయ్యమ్మారావుగారే.

ఆమె చిన్నారిపొన్నారి చిఱుతవయసున ముద్దులకూచి; అందచందాల యౌవనమున గయ్యాళిగంప; ఆమె పవలంతయు లాగులలోను, రాత్రులంతయు లంగాలలోను. జమీందారీ వ్యవహారపు అడుసున నడుమనడుమ ఆమె చేతిగీఁతలుకూడ అంటుచుండెను.

వయసు ముదిరినను కూఁతుపెండ్లిని రామనాథబాబు లోఁగడ తలపెట్టలేదు కాని, ఇపుడు తనశరీరమున నంజు అంటుతోఁక్కఁగా ఆప్రయత్నముమీఁదనే ఉండెను. ముందు స్వయంవరగృహమొకటి కట్టించెను. దాన బస చేసిన వరుఁడు మూఁడవ అంతస్థులో నున్న రాజపుత్త్రికి స్పష్టముగా కనఁబడును.

ఈ స్వయంవర మంటపమునకు రాజకుమారులందఱు ఒక్కసారిగా రారు. ఒకరితరువాత నింకొకరు. సరస్వతి చేటియయి వచ్చి, ఇఁతడు చోళాధీశుఁడు; ఇతఁడు నేపాళాధీశుఁడు; ఇతఁడు నీయెదకు కస్తూరి తెచ్చునటిగాని, ఇతఁడు నీమొగమునకు వేసలీను పూయునని గాని వర్ణింపదు. మరి నవుకరులు వచ్చి కంచెఁడుకూడు తిను ననియు, కాళ్లు తానే కడుకుకొనుననియు, వెలకిలఁ బరుండుననియు వర్ణింతురు. రాజకుమారి గంభీరముగా చూచి ఊరకుండదు. వీఁడు వృషభము, వీఁడుభషకము, వీఁడు మహిషము అని వెంటనే పేరులు పెట్టి వెడల నడిపించును. ఇటులు జంతువుల నామములు, జడముల నామములు ఇంచుమించుగా వ్యయమాయెను.

రామనాథబా బెంతతొందరపడుచుండెనో అంత యాలస్య మగుచుండెను. తుదకు ఆర్కాటినుండి జనార్దనరావుగారు స్వయంవర మంటపము ప్రవేశించిరి. లోఁగడ వచ్చినవారిలో చాలమందితో వచ్చిన కూలినవుకరులవలె ఆయనతో ఒకఁడును రాలేదు; కాని బి. యే. డిగ్రీమాత్రము వచ్చెను.

ఈమాట వినిన వెంటనే రాజకుమారి మేడపైనుండి చూచెను. చూచునది చూచుచునే నిలువఁబడిపోయెను. 'ఒలెస్కాపు తెచ్చియీయునా?' అని దాసి యనెను.

వెంకయ్యమ్మారావుగారు దానిమ్మపండ్లు, సపోటాలు, నారింజలు, బత్తాయిలు, చక్రకేళీలు, ద్రాక్షలు తీసికొనిపోయి యిచ్చి రమ్మని ధీరముగా పలికెను.

రామనాథబాబు అనుజ్ఞచే మంత్రి స్వయముగా జనార్దనరావుగారికి స్వాగతమిచ్చెను. ఒకటి రెండు సారులు రాజకుమారి మేడక్రింద నుండి ఏదోమిష పెట్టి జనార్దన రావుగారిని అటూ ఇటూ నడిపించెను. స్వయంవర మంటపమున కుర్చీలో ఒకానొక అంగభంగిగా కూర్చుండబెట్టెను; నిలువబెట్టెను; పండఁబెట్టెను. ఏమి చేసినను నాణెము ఇంచుకయు ఓటిది కాదు.

రాజకుమారి అంతయు జూచెను; నవు కర్లచే అంతయు వినెను. తుదకు అతనికి 'పెంపుడుచిలుక' యని పేరుపెట్టెను.

ఆపేరుపెట్టుట కొక సంబంధ మున్నది. తనగది ముంజూరునందు వ్రేలాడ-దీసిన బంగారుపంజరమున రెండు చిలుకలు ఉన్నవి.

తుదకు వ్యవహార మిటులు ఫైసలాయెను; ప్రథమపురుష సంతానము జమీాది; రాజకుమారి పుట్టినింటనే యుండును; ఇష్టము కలుగువో అత్తిల్లు మెట్టును; పురుష సంతానము కలుగువఱకు అల్లుఁడుమాత్రము అత్తింటనే యుండి తీఱవలయును. జమీాకి అతఁడు నిత్యమును అతిథియు, అక్రీతదాసుఁడును.

కాకితములు పుట్టి రిజిస్టరు అగుటతో పాటు అతివైభవముగా వివాహము జరిగెను.

పెంపుడుచిలుకను ఒక బంగారు పంజరమున బంధించిరి. అవసరములయందు పండ్లు పెట్టిరి. 'రామన్నా, తోఁటకూర' అని నేర్పఁగా ఆచిలుక మరల 'రామన్నా, తోఁటకూర' అని అనుట అతికష్టముగా నేర్చుకొనుచుండెను.

పెండ్లివైభవము చేతులార చేసికొని, కనులార చూచుకొని, రామనాథబాబు రంగస్థలమునుండి నిష్క్రమించెను. ఆపాత్రయొక్క అభినయ మంతయు ఇపుడు వెంకయ్యమ్మారావుగారే చేయ దొరఁకొనెను.

౨

పండ్లు దొరకని చిలుకకు పండ్లు దొరకువో పంజరబంధముకూడ కొన్నాళ్లు పండువే. పండ్లు నోరార దొరకినను నిత్యము పంజరబంధమగుచో, ఆ పంజరమును— సువర్ణమయమే యగుఁగాక—గర్భనరకము. ఆచిలుక చూపెపుడును అనంత-ఆకాశముమీాఁదనే. పక్షియయినను దానికి పక్షములు లేవు. అది చేతనియయినను జడము. దానితో కొంతసేపు కొందఱు క్రీడింతురు గాని ఆలావణ్యము సహజసిద్ధమగుటయే స్వయంకృతాపరాధము. కాకిని పంజరమున ఎవఁడు ఇడుకొనును?

వెంకయ్యమ్మారావుగారికి కుమారుఁడు కలిగెను. జమీా యంతటను నిత్యకల్యాణము పచ్చతోరణము. మహేంద్రవైభవముతో బారసాల. శిశువుపేరు రామనాథబాబు. పెంపుడు చిలుకకు పంజరకవాటము కొంచెము సడలెను. ఒకరెక్క స్వాధీనమాయెను.

జనార్దనరావుగారికి అనుకొనినపుడల్లా కుమారుని చూచుకొనుటకు వీలు లేదు. భార్య

మాట వేఱుగా, చెప్పనక్కఱలేదు. తన పుత్త్రుని నోరార పిలుచుకొన వీలు లేదు. రామనాథబాబుగ్గారూ అని అన్నియక్షరములను పట్టి పట్టి అనవలయును. ఏల? ఆయనయే జమీందారు; ఆయన వెంకయ్యమ్మారావు గారి కుమారుఁడు.



జనార్దనరావునకు భార్యాపుత్త్రులబదులు దాపున పుస్తకము. అతనికి మనస్తత్త్వశాస్త్రమునందు (Psychology) అభిరుచి. అతఁడు ఆపరిజ్ఞానముచేతనే ఇన్నాళ్లు పంజరమునఁ గడఁపఁగలిగితి ననుకొనెను. విచారించుచో తనకేను తెలియకుండ అనురాగబంధముచేతనే పంజరబంధము సైరించెనేమో!

అతఁ డిపుడు స్త్రీపురుషులకు సంబంధించిన మనస్తత్త్వమును రచించుచుండెను. అనుభూతమైన ప్రతివిషయమును ఉదాహరణముగాఁ గొనుచుండెను. తనకడకు వచ్చిన సేవకుని, వాఁడు తెచ్చిన ఆహారమునుగూడ తెలియని ఏకాగ్రతతో దానిని వ్రాయుచుండెను. ఒకానొకపుడు ఎవరుపిలిచినను అతఁడు చెవిటి.

వెంకయ్యమ్మారావు గారికి ఈవైనము తెలిసెను. ఒకనాఁడు ఆమె చక్కఁగా అలంకరించుకొని భర్త అంతఃపురములోనికి ఎవరికిని తెలియకుండ వెళ్లెను. అటులు వెళ్లుట కదే మొదలు.

అతఁడు వ్రాఁతలో మునిఁగి తేలుచుండెను. భార్యను చూచినంతనే కాకితము లావల ద్రోసి, చూచినవాఁడు చూచినటులే యుండెను. అనుకొనని గౌరవము!

ఉభయతటములు నిండిన ప్రవాహము వలె, పూలతో పండ్లతో నిండిన తీవవలె, మనుష్యదేవతవలె ఆమె నిలువఁబడెను. అతఁడు భార్యకేసి రెండుచేతులూ చాఁపెను.

వెంకయ్యమ్మారావు ఒకనవ్వు నవ్వెను. తృణీకృతబ్రహ్మపురందర మా నవ్వు; మర్మావిధ మా నవ్వు; హృదయభేది ఆనవ్వు.

ఏదీ చూతము, పాఠకుఁడా, నీవు నవ్వుమా నవ్వు! పోనీ, అర్థము చేసికొన్నఁ జాలును! కావలసిన దంతయే.

ఇటులు నవ్వి వెంకయ్యమ్మారావు— 'నన్ను పెంపుడులేడి యనుకొంటివా, చేతులతో దువ్వుటకు, ముద్దిడుటకు' అనెను. జనార్దనరావున కిట్టి ప్రసంగములు క్రొత్తలు కావు.

ఆమె సి. ఐ. డి. ఇన్‌స్పెక్టరువలె ఆగది లోని పుస్తకములన్నియు చూచెను. వ్రాయుచున్న కాకితములు విప్పి నడుమనడుమ పరిశీలించుచుండెను.

దాసి యొకతె వడిగా వచ్చి, 'చిన్నమ్మారావుగారికొఱకు వరుఁడిపుడే స్వయంవర మంటపమున విడిసెనని చెప్పెను. మరొకదాసి వచ్చి, 'వ్యవహార పర్యాలోచనమునకు దివాను బహద్దరు తెరచాటున కాచికొని యుండె' నని మనవిచేసెను. విని వెంకయ్యమ్మారావుగారు 'సరి' యని పిమ్మట "ఓసీ, నీ వీ కాకితములకట్టనాగదిలోపెట్టు"మనెను. దాసి తీసికొనివెళ్లెను.

వెంకయ్యమ్మారావు భర్తను చూచి- "తాము నేఁటిరాత్రి ఏడుగంటలకు నాగదిలోనికి దయచేసి నన్ననుగ్రహింపవలెను" అనెను. జనార్దనరావుగారికి ఇది యొక క్రొత్తగౌరవము.

"మాటాడ రేమి?"

"దాసిని బంపుచో వత్తును."


జనార్దనరావిటు లనుటకు ఇదియే మొదలు. వెంకయ్యమ్మారావు పనులమీఁద వెళ్లిపోయెను.

ఏడుగంట లాయెను; దాసి రాలేదు. ఎనిమిది యాయెను; రాలేదు. తొమ్మిది; పది; పదొకొండు; పంద్రెండు. దాసి రాదు.

జనార్దనరావు దాదికిఁ బదిరూకలిచ్చి కుమారుని తొట్టికడ కేఁగెను. రెప్పవాల్పక చూచెను.

"కోయిల తనగ్రుడ్డును తాను పొదిగికొనలేదు. నాయనా, పెద్దవాఁడవైన పిదప మీయమ్మవలె నన్ను మఱవకు."

అతఁడు బాలు నొకసారి ముద్దుగొనెను.



నేను నీవాఁడ నన్నటులు బాలుఁ డూరకుండఁగా, తండ్రి ముద్దుగొని మరల తొట్టియ నుంచెను.

"నీవు నీతల్లిపోలిక; తల్లిచాల మంచిది. వెళ్లునపుడు నిన్నువలె నీతల్లినిగూడ చూడఁదలఁచుగాని అందులకు నాకు భాగ్యము లేదు. బాలుఁడా, నన్ను మఱవకు. దాదీ, నాపలుకును పెద్ద అయినపిదప ఇతనికి చెప్పెదువా?" అని దానికి మరికొన్ని రూకలిచ్చి తొట్టెచూ

చుచు కనుల నీరు గ్రమ్మఁగా వెనుదిరిగి పోయెను.

జనార్దనరావుగారు వెళ్లిపోయిరని ప్రొద్దుననే సేవకుఁడు వెంకయ్యమ్మారావుగారికి విన్నవించెను. "ఓసీ, నల్లమందు వేళకు ఉడుత తానే వచ్చును" అనెను వెంకయ్యమ్మారావుగారు.

3

చిన్నమ్మారావు తనకు మేనత్తకూఁతురు. ఆమె పోషణమంతయు తనమీఁదనే యుండెను. చిన్నమ్మారావుకూడ తన అదుపు ఆజ్ఞలలో ఉండెను. ఆమె కిపుడు పెండ్లి; ఇల్లటమునకు వరుఁడు వచ్చెను. నియమము లన్నిటికి అతఁడు తల నూఁపెను.

వెంకయ్యమ్మారావు చిన్నమ్మారావును దాపునకు బిలిచి, 'ఈ గంగిరెద్దు నీకు బాగుండెనా?' అని అడిగెను.

దాసీలు కొందఱు ఈ నామకరణమునకు సంతసించిరి. కొంద ఱింకను రాణి మోమును జూచుచుండిరి. ఇంకను మంచిపేరు కావలయుఁగాఁబోలు! కొందఱు పకపక నవ్విరి.

చిన్నమ్మారావు చీరముడుతలు సవరించుకొనుచు మోము వంచి తన నెవరో వెనుక పిలిచినటులు లోనికి వెళ్లిపోయెను.

వెంకయ్యమ్మారావు వరుఁడు వెంకటరాయణిం గారికి పదివేలరూపాయలు, వెండి బిందెలు, బంగారు హారములు, వజ్రము మలఁచిన ఉంగరము, రాతికట్టడపు అంటుజోడు, గుర్రమును కట్నమిచ్చెను. ముప్పదివేలు రాఁబడిగల గ్రామము కొని చిన్నమ్మారావునకు ఫెళ్లుమని పెండ్లి చేసెను. తా నొక్కతయే పెండ్లికూఁతును ధారపోసెను.

గ్రామపాలనమును గుఱించిన వ్యవహారమంతయు భర్తతో సంబంధము లేకుండ నిర్వర్తించుకొను ప్రక్రియను వెంకయ్యమ్మారావు చిన్నమ్మారావునకు నేర్పెను. ప్రథమసంవత్సరము చిన్నమ్మారావు తనవ్యవహారమంతయు తానే చేసికొనెను. రెండవసంవత్సరమునుండియు కొంతకొంత తగ్గించుకొని క్రమక్రమముగా అంతయు భర్తపరము చేసెను.


చిన్నమ్మారావుకు చిన్నతనమునుండియు ముందటేఁటివఱకు వెంకయ్యమ్మారావుగారికడనే కాలక్షేపము. వెంకయ్యమ్మారావుగారును అన్నము తినునపుడు, నీరు త్రావునపుడు, షికారు వెళ్లునపుడు, నిద్రించునపుడు, ఆటలాడుకొనునపుడు, పాటలు పాడుకొనునపుడు, కూర్చుండునపుడు, వ్యవహరించునపుడు చిన్నమ్మారావును ఉచ్ఛ్వాసనిశ్వాసములవలె ఎడఁబాయకుండెడిది. అట్టి చిన్నమ్మారావు ఇపుడిపుడు తాను పిలిచినను కొన్నివేళల దర్శనమునకు రాఁదొడఁగుట లేదు. కారణమడుగుచో ఎపుడు ప్రత్యుత్తరించినను తన భర్తకు సంబంధించిన విషయమే చెప్పుచుండెడిది. వెంకయ్యమ్మారావుగారు—'గంగిరెద్దు ఆయన కాదు; నీవు' అనుచుండెడిది.



కీ. శే. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు

౧౯౨౫-వ సం. సెప్టెంబరుమాసమున చూచి వ్రాసిన రూపచిత్రము.

చిత్రకారుడు: శ్రీ కాశా రామమోహనశాస్త్రిగారు.



పటేలుగారి కుటుంబము

ఐదుగురు అన్నదమ్ములు; తల్లి.

ఎడమకడను శ్రీ విఠలభాయి పటేలుగారు. కుడికడను శ్రీ వల్లభభాయి పటేలుగారు.



కీర్తిశేషులు యస్. ఆర్. దాసుగారు

ఒకనాఁటి రేయి ఆమె చిన్నమ్మారావును పిలిచికొని రమ్మని దాసిమీఁద దాసిని బంపెను. దాసీ లందఱు తిరిగివచ్చి—'తలుపు వేసికొని పలుకనైన పలుకలేదు' అని మనవిచేసిరి.

ఆమె దాసీల నందఱ నక్కడనే ఉండ నియమించి తాను వెళ్లెను. గవాక్షమునుండి



తొంగిచూచెను. ఒడలు జల్లుమనెను. 'నా కీ యదృష్టమేదీ?' అనుకొనెను. తిరిగివచ్చి ఆలోచించుచు కూరుచుండెను.

దాసీ లందఱు ముక్కుమీఁద వేళ్లువేసికొని నిలువఁబడియుండిరి. సమయము కనిపట్టి ఒకదాసి 'అమ్మా, ఆమెకు మగఁడు మందు పెట్టెను' అనెను. మరొకతెఁ 'ఏమందోపెట్టనిచో సతనిత్యము మగనిముం దెటులుండును?' అనెను. 'అదేమో కాని ఏ మున్నదమ్మా అప్పనము మగనికడఁ బడియుండుటకు?' అని యింకొకతె యనెను.

వెంకయ్యమ్మారావు దాసికలఁజూచి 'అటువంటి మందు ఉండునా?' అని యడిగెను. 'ఉన్నవి ఉన్న'వని ప్రతివైపునుండియు ఉదాహరణపూర్వకముగా సమాధానములు తామరతంపరగా బయలుదేరెను. వెంకయ్యమ్మారావు ఆశ్చర్యముతో వినుచుండెను.

కొంతవడి ఎవరును మాటలాడక తాము చెప్పిన అపూర్వవిషయముయొక్క సత్యము గ్రహింప రాణి కవకాశమిచ్చిరి. ఆమె ఒక తూరి ప్రబలముగా నిట్టూర్చెను.

కీరవాణి యను దాసి—అమ్మా, మందులకేమిగాని, ఆమెకు మగడే మందు' అనెను. ఇంకొకతె 'సీకో' అనెను. దానినిగూర్చి మరియొకతె 'సీకో' అనెను. ఇటులు 'సీకో'లు వేనవేలు.

వృద్ధదాసి—'ఎందుల కీవాదము? మగఁడే మందుకాని ఆఁడుది కలదా?' అనెను. ఒకరి మొగము లొకరు చూచుకొనిరి. అందఱు తలాయొక పనిమీఁద వెళ్లిపోయిరి.

వెంకయ్యమ్మారావు గారు ఆకాశము చూచుచు పండుకొనిరి. ఏమియు తోఁచక ఒకొక్క నక్షత్రమునే లెక్కపెట్టుచుండఁగా ప్రభాతమాయెను.

౪

ఇపుడు వెంకయ్యమ్మారావు పను లన్నియు దివానుపరము చేసెను. చేయి కడుగుకొని కూర్చుండెను. ఇపుడు తనకు పనిలేమియు లేవుకాని మనస్సులో ఒకపని ఉండెను. అది వేయిపనులపెట్టు.

ఆమె ఒకనాఁడు మొంజారున వేలాడు పంజరమున మగచిలుకను స్వయముగా తీసి మరియొక పంజరమునఁ బెట్టి దూరముగా కట్టెను. రణగుణధ్వని: పండ్లు తినవు; నీరు త్రావవు. ఎగిరి బయటికి రాఁజూచును; ముక్కుతో కడ్డీలను పొడుచును; రివ్వున నెగిరికూలును.

వెంకయ్యమ్మా రావుగా రెంతో సేపు వాని వియోగమును సహింపలేక పోయెను. మరల రెంటిని ఏకపంజరమం దుంచెను. మరల మామూలు.

కొంత సేపటికి కీరవాణిని రావించెను. దానికి మంచిచీరయు, రైకయు ఇచ్చెను. కీరవాణి వానినితాల్చి అన్వర్థనామము కలదయి రాణికి నమస్కరించి సెలవు తీసికొనెను.

ప్రొద్దుపోయిన పిదప చిన్నమ్మారావు పడకటింటి ప్రక్కగా స్నానగృహమున కేఁగుచు వెంకయ్యమ్మారావు దంపతుల సరసాలాపముల వినెను. పులకలచే ఆమెకు స్నానమక్కఱ లేకపోయెను. ఆమె తనకు మరి రెండు చెవులు లేనందులకు కినిసెను. ఇఁక స్నానము లేదు; భోజనములేదు. శయన గృహమునకు వెనుదిరిగి పోయెను. పోయెనన్న మాటయే కాని నిదిరింపలేదు.

ఇంటిలో జనార్దన రావుగారి పటము లేదు; ఆయనవస్త్ర మేనియు లేదు.

ఆమె ఆలోచించి ఆలోచించి కొంతవడికి కొడుకు మంచముకడకు వెళ్లెను. అతనిని ఆచియాచి చూచెను. చూచిచూచి "నీవు నా చాఱ; నీవుకూడ నావలె కాఁగలవు; కాఁగలవేమిటి? ఐతివి. లేనిచో 'మా తండ్రి యేఁడి? అని అడుగవా?' అనెను.

చూడఁగాచూడఁగా వానిలో కొంత భర్త కవళిక కానవచ్చెను. నోరార ముద్దిడెను;



ముద్దిడి ముద్దిడి సిగ్గిలెను.

తెలవాఱకముందే జమానులను బిలిపించి జనార్దన రావుగారివిషయము కనుఁగొని రమ్మని పంపెను. వారు ఆర్కాటికి వెళ్లిరి.

వెనుక వెంకయ్యమ్మారావుగారు భర్త రచించుచున్న గ్రంథమును అతనిని బిలిచి అతని యెట్టెదుటనే తగులఁబెట్టఁ దలఁచెను. కాని అపు డతఁడు దాసిని బంపుమనఁగా అభిమానించి పెట్టెలోఁ బాఱవైచెను. దానిని నేఁడు పైకి దీసెను; చదివెను. తనపతి యిపుడు గోచరించెను. దానికి తా నొక పీఠిక వ్రాసెను.

భర్తయొక్క ఆంతరస్వరూపదర్శనమాత్రము తనకు తృప్తిజనకము కాకుండు టటుండ స్వస్వరూపదర్శనమునకు ఆమెను తొందర పెట్టెను. ఆమె ఆతొందరచే ఉడ్డుగుడిచినటులుండెను.

ఆర్కోటినుండి జమానులు వచ్చి దేవరవారు వారికుటీరమున సుఖముగా నున్నారని మనవి చేసిరి.

"మరల పెండ్లాడియా?"

"అమ్మా, అదేమి? ప్రయత్నము చేసినను ఆయనకు మరి పెండ్లియగునా?"

"ఏమీ కాదేమి? మీకు తెలిసెఁ గాఁబోలు, చేదుమాట లొకప్పుడు తియ్యమాటలు, తియ్యమాట లొకప్పుడు చేదుమాటలు."

జమానులు వెళ్లిపోయిరి. వరాండాలో కుమారుఁడు దాదిపై కినియు మాటలు కొన్ని స్పష్టముగను, కొన్ని అస్పష్టముగను వినవచ్చుచుండెను. దాది బతిమాలుకొనుచుండెను. బాలుఁడు దాదిని లాఁగికొనివచ్చుచు "ఆఁగు! మాయమ్మతో చెప్పి నీపెండ్లి చేయించెదను" అనఁగా "బాబుగారు, బాబుగారు! చెప్పకుఁడు, చెప్పకుఁడు! రేపంతయు మిమ్ము బుజముల మీఁద మోసి తిప్పెదను" అని దాది బతిమాలెను. బాలుఁడు "అమ్మా" యని కేక పెట్టెను. దాది వెలవెలపోవుచుండెను. తల్లి కుమారు నెదురుకొని "ఏమి నాయనా!" అని అడిగెను.

"చూడు, ఇది—నీకు నాయన ఏఁడీ?



అనుచున్నది. మానాయన ఏఁడీ? చూపు! ఆపైని దీనిపెండ్లి!"

"నాయనా! నీకును దానికిని చూపుదును; నేనును చూతును. లెండు; పోదము" అని అపుడే పయనించెను. బాలుని ఆనందమునకు మేర

లేదు. దాది సంతోషమును లోలోపల అణఁచుకొనెను. బాలుఁడు—"చూడు నీ పెండ్లి! మానాన్నవద్ద!" అని దాదిని బెదరించుచుండెను.

ఆమఱునాఁడే వా రాశీర్వడు చేరిరి. గ్రంథపర్యాలోచనము చేయుచున్న జనార్దనరావు రాణివాసము విడిచి నడిచి వచ్చుచున్న



తనభార్యను, దాది చేతులనుండి కిందికి దుముకుచున్న కుమారుని జూచి తనకనులను తానే నమ్మఁజాలకపోయెను.

వెంకయ్యమ్మారావు సాష్టాంగపడి పుస్తకహస్తుఁడైన కుమారుని భర్త కందించెను.

అతఁడు కుమారుని మూర్కొని పుస్తకమెత్తి పీఠికనుజూచి పరవశుఁడాయెను.

రామనాథబాబు లోలోపల 'నే నిదివఱకు మానాయనను చూడలేదే' అనుకొని దాదికడకు వచ్చి తండ్రిని జూపి చఱచెను. దాదికి ఆచఱపే సమ్మోద మాయెను.

"తుదకు పెంపుడు చిలుకకడకే వచ్చితివా?"

"క్షమింపుఁడు, క్షమింపుఁడు! నేనే యిపుడు పెంపుడుచిలుకనై వచ్చితిని."

చిన్ననాఁటి చేష్టలు

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

(వెనుకటి సంచిక తరవాయి)

ఊళ్లనుండి వచ్చి యుండిన బందుగుల్
వారివారి యూళ్ల దారిఁ బట్టి
రందు దూరదేశమందుండి వచ్చిన
బంధు వొకఁడు నాఁడు పయనమయ్యె.

పిండి జల్లెడ తాఁచిప్ప పేఁడబొమ్మ
కొండచీపురు ఖర్జూరపండు లక్క-
చేట గలమూట ముసలమ్మ చేతఁ గొనియె
నెక్కి యుండిరి వారు రెండెడ్ల బండి.

నన్ను నాలుగైదు నాళ్లనుండియు
ప్రేముడించు చున్న పెద్ద యతఁడు
దాపురించి చేత రూపాయి నిడి ముడ్చి
పోయి వత్తు ననియె ముద్దు గొనియె.

తెలివ నాచేయి రూపాయఁ దెల్లవాఱె
తేటదనమున నామోము తెల్లవాఱె
నెల్లరాత్రియు నంతలోఁ దెల్లవాఱెఁ
దెల్లవాఱె నా కోర్కులు క్రేళ్లువాఱె.

నాకంటెఁ గొంటె యొక్కఁడు
చేకుఱెఁ జెలికాఁడు మాఱిచితి మారూప్యం
ఏకీభవించి మే మట
[illegible]

లాటరీ వేసి డబ్బెంతో లాగి యవల
వలయువస్తువుల్ కొనుకొనఁ దలఁచు కొంటి
మెనిమి దెనిమిది కానుల నిర్వ్యరమును
బూని లాటరీచోటికిఁ బోయినాము.

తిండి లేదు తిప్పలు లేదు త్రిప్పి త్రిప్పి
వేయుచుంటిమి ; మావలె వేయుచుండు
వారిఁ జూచుచు నుంటిమి ; వ్యర్థ మయ్యె-
నాకుఁ బదునాలుకానులు నష్ట మయ్యె.

బిక్క మొగముతో నిలుదారి త్రొక్కినాఁడ ;
అమ్మ నాయన నిన్నటి యుమ్మలికమె
అనుకొనిరి బుజ్జగించిరి యంతో యంతో
తింటివో లేదో మఱి బజార్వెంటఁ బడితి.

కొంత కేవేవో వెదకుచు నుంటి నేను
దంటచెలికాఁడు నంతతో వెంటఁ బడియె
ముందుగ మిఠాయి సరకును గొంద మనియెఁ
దింద మామీఁద నివి చూచుకొంద మనియె.

చెప్ప సిగ్గు గదురు నిప్పుడు మెత్తఁబ
కోడులుం జిలేబి జీడిపప్పు
పాఁగు బూంది లడ్డు నూఁగుండలును గొను
కొంటి మంతఁ బంచుకొంటి మంత.

పీలుచాలు వేళపాళ దలంపని
తిరుగులాట, పాడుతిండి, యదియు
కాస్తకూస్త కాదు, కడుపున కిందునో,
[illegible]

తీయవస్తువులను దినఁదిన దాహంబు
తీవ్రమయ్యె నెండఁ దిరుగుటయ్యె
చెఱువులోని కలఁకముఱికినీ రొన్నార
నాఁగకుండ మేము త్రాగినాము.

మిగిలె నొక్కయణా మాత్రమే మితాయి
వెక్కసంబుగాఁ దింటిమి మెక్కవమ్యొ
దాన నావంతులోఁ గొంత దాఁచినాను
చిన్నపొట్టము చొక్కాయి జేబులోను.

ఇంక మిగిలినయాయణా మెంతొ చింత
కొల్పుచుండెను చెలికాఁడు తెల్పె నిట్లు:—
రార పోదము అంకులరాటమునకు
నిద్దఱకుఁ జెల్లిపోవు రెండద్దణాలు.

పరుగువాఱి మే మచ్చోటి కరిగినాము
ఒక్కణా నిచ్చినా మందు నెక్కినాము
తీవ్రవేగమై రాటంబు తిరుగఁ జొచ్చె
జలదరించెను నా మేను చలి జనించె.

గిరు గిరు గిరుమని రాటము
తిరిగె నొకటొ రెండొ సార్లు తెలియదు దీనిఁ
దిరిగెఁ దల దిరిగెఁ గన్నులు
తిరిగె నొడలు నేల మీఁద దిమ్మని పడితిఁ.

*   *   *   *

చెవులఁ అంకులరాటపు
రివురివ్వులు మ్రోఁగుచుండె రి మ్మడఁగెను నే
నవనిఁ బడియుంటి నను స్మృతి
దవిలె నెఱింగితిని జీవితమ్మున నునికిఁ.

కన్నుల నీరు నించుచు వి
కారముఖంబున నమ్మనాయనల్
నన్నును గాంచుచుండిరి క
నం గలనైతిని వారి నేను నే
మన్న, యెటున్న దంచు నను
నడ్గిరి వా ర్నను నిల్లు సేర్చఁ డీ
చెన్నఁటి చెట్టచెద్దమును
జేసితి నంచును వేఁడి యేడ్చితిఁ.

జ్వరపు వేఁడిమి నొడలెల్ల మఱుఁగుచుండె
నుల్లిపాయపకోడీల క్రుళ్లుకంపు
సోఁకుచుం గడ్పు చుమ్మలుచుట్టుచుండె
నోఁకరలు రెండుమ్రేళ్ల చీకాకు లుండె.

ఇటునటుం జూతుఁ గద యది యింటివట్టు
మాదియే, నేను మంచము మీఁద నుంటి,
ఎపుడు తెచ్చితి రింటికి? నెవరు సెప్పి
రెంత సే పయ్యె? నని యెంతొ వింతపడితి!

కన్నుల నీరు నించుకొనెఁ
గౌఁగిటఁ జేర్చుకొనెఁ వచించె మా
నాన్న! యెఱింగితే యొడలు
నాయన! నిల్చితె మాదుప్రాణముల్
నిన్నటిసంజఁ గూలితివి
నేఁ డిదె ప్రొద్దుట జ్ఞప్తి గల్గె; మ
మ్మెన్ని యవస్థలం బఱచి
తే మన నేర్తుము నిన్నుఁ బ్రతకా!

అయిన దయినది నీయొడల్ నయమయినను
నందఱము నింక జాగ్రత్త నుంద మనుచు
వాంతుల విరేచనమ్ముల నంత నున్న
నన్ను నోదార్చి తేర్చె మానాన్న యపుడు.

చెంత వసించుచుం గథలు
సెప్పుచు బాధ నెఱుఁగనీక ధ
న్వంతరిఁ బోలునట్టి ఘన
వైద్యుఁడు మజ్జనకుండు వేఁకియుఁ
వాంతు లవెల్ల మాన్పె నను
పానములం దియమందు లిచ్చి యం
తంతకుఁ దేరుకొంటి హిత
మయ్యెఁ గ్రమంబుగఁ బథ్య పానముల్.

చిలుకకుఁ జెప్పుచొప్పునను
జెప్పితిఁ జెప్పితి నెంత సెప్పినన్
గలుగక పోయె లాభ మది
కంబగు కష్టముఁ దెచ్చుకొంటి ; నీ
యలఁతను మాకుఁ బ్రాణములు
నట్టిటు లైనవి; యిట్టి దుష్ట చ
ర్యల నిఁక నైన వీడి తన
యా వినయాఢ్యుఁడ వై మెలంగుమా.

ఎక్కడుండి వచ్చెఁ జొక్కాయిలోన ని
తాయి నీకు? నుల్లిపాయకంపు
ప్రబలమయ్యె; అంకురాటంబుపయి నెక్క
నెట్లు సాహసించి? తేది డబ్బు?

ఎచట సొమ్ము గొంటి? నేమేమి గొంటి? వే
మేమి తింటి? వింక నేమియేమి
కొంటెపనులు చేసి తంటాలు తెచ్చితి?
వెవరు తోడు నీకు? నెఱుఁగఁ జెపుమ.

అలవు లేనికూర్మి దొలకాడుమానాన్న
హృదయ మపుడు నాకు నెఱుకపడియె
చెప్పికొంటి నాఁటి చెడుచేష్ట లెల్లను
దప్పిదము లటంచు నొప్పికొంటి.

ఎవరే నెయ్యదియేని యిచ్చినను మా
యిష్టంబు లేకుండ నీ
వవునంచుం గ్రహియించఁగాఁ దగదు మా
కష్టానిఁ దెల్పన్ వలెన్
దవునంచున్ వచియింతుమేని పిదపన్
దానిన్ గ్రహింపన్ వలెన్
నవుఁబా ల్గాఁగద యిట్లె నీవడత యు
న్నన్ మీఁదటన్ బాలకా!


వారు వీరు మంచి వస్తువు లెవియేని
చెంత నుంచుకొన్నఁ జేరఁ బోయి
చూచుచుంట మొగము వాచినవానిలీ
లొసఁగినను గ్రహించు టసదుసుమ్ము.

కొంటివి రూప్యముం జెఱుచు
కొంటివి దేహము దాని నాఁడు నీ
వంటకయున్న నెంత మరి
యూడగ నుండెడి దాతఁ దప్ప డీ
కుంటయు లేక మాయెఱుక
కొప్పఁగఁ జెప్పియెఱుంగుటోయుగున్
రెంటనుగూడఁ గీ డపన
రిల్లెడిదేకద నీకు బాలకా!

చెడ్డచెల్మి, ధనము చే నుంచుకొను, టిచ్చ
వచ్చినట్లు దాని వెచ్చపెట్టు,
టింతనర్థమో గ్రహించితె మేలును
గీడు నెఱుఁగనట్టి యీడునందు.

* * * *

నాఁటిచెట్టచేష్ట నాపడ్డపాటును
నాన్న యెఱుకపఱిచినట్టిహితము
నాఁడె కాదు నాకు నేఁడును నేనాఁడు
నెమ్మనమ్మునందు నిల్చి యుండు.





దీపావళి

Lakshmi Art, Bombay, 8.

లింగం వీరభద్రయ్య, బా. దర్శి

గారి

గృహలక్ష్మి

ప్రాణ మలసట జెందినది. ఉదయమున నేగి సాయంతనమున కింటికి జేరుకొనినాడు. ఎడతెగని పని, సేవకుల యడ్డంకులు, ప్రాంథేయుల ప్రార్థనలు, సహోద్యోగుల ప్రశ్నలు, ప్రాణము విసిగించివేసినవి. పైగా, పైయధికారుల తర్జన భర్జనలు. ఈజీవిత మెంత దుర్భరము!—ఎండలు సాగినవి. దిక్కుమాలిన యాఫీసులో, ఎలెక్ట్రిక్ ఫ్యాన్సు లేవు సరేగదా ఉన్నపంకాయైన సగము చిరిగిపోయినది. పంకాలాగువా డెంత సోమరిపోతు! ఈరోజులలో సేవకులకు భార్య మున్న భయభక్తులు లేనేలేవు. సమయము చిక్కినప్పు డెల్ల బలి తెగగొట్టినట్లె నని చూచుచుందురు. వాండ్రకింకను దమపనిని దాము నిర్వర్తించవలె నను జ్ఞానము కలుగలేదు. జీతము ఇచ్చిన గడియారము చేతుల వలె పంకావాని రెండుచేతు లెడతెగ కప్పుడు పనిచేయుచున్నను గాలి యీపాడుమూల నున్న కుర్చీ టేబుల్ లకు చేరదు. చేరినకొంచెము, శరీరమును చల్ల జేయుటకు మారుగా పొగ లెగయ జేయుచున్నది. అబ్బా! ఏమి నిస్సారము! దహించుకొనిపోవుచున్న ఆకలిమంటను మాన్పుట కింత మజ్జిగనీరైన లేకపోయినదిగదా! ఇక, కలవపుదీరు ఫలహారము, కంచుచెంబుతో దెచ్చిన ఇగమువంటి మంచినీళ్ళసంగతి చెప్పవలయునా? ఆఫీసు చాపలోని నీళ్లంత శుభ్రముగా లేవు. వాట్లు మంచి నీళ్ళుమంచి, పైగా నీహారుగాలి, దుమ్ము అన్నియు నల్లకలే. నౌకరిచేత దెప్పించుకొనిన సోడానీళ్ళమాత్రమే గతి. పాడుముండాకొడుకులు, శుచీగా, శుభ్రమా— అసలు సోడాయే బాగుగ నుండలేదు. అప్పటికప్పుడు మరలోనుంచి ఫోర్సుగా బట్టించిన కొంత బాగుగనుండు నేమో!—ఎట్లో కాలము గడిచినది. సాయంత్రము కావచ్చినది. బ్రతుకుజీవుడా పని పూర్తియైపోయినది. ఒక్క పెద్దనిట్టూర్పు విడిచినాడు. ఇక నింటి కేగవచ్చును. బలమువచ్చినది; హృదయ మాహ్లాదపూరితమైనది; ముఖము వికసించినది. సౌందర్యరాశి, దరహాసవదన, తన యర్థాంగి; కలకలలాడు బిడ్డలు. గృహ మెంత యానందదాయకము! తత్క్షణమే యింటికి బైలుదేరినాడు. త్వరితముగా నడచి యింటికి జేరుకొనినాడు. చిరునగవుతో దనభార్య యెదురువచ్చినది. 'నాన్నా, నాన్నా' యని కేరింతలు గొట్టుచు పిల్లలు వచ్చి కాళ్ల కడ్డము పడినారు. దేహము పులకాంకిత మైనది; జీవితము ధన్యమైనది.

ఆమె యుదయమున చీక టుండగనే లేచినది. వందిమాగధులు గాని, నిద్ర పట్టక జాగరణము చేయు ముసలివాండ్రు గాని, "కోమ టెంకమ పేడ కొచ్చెను.. మేలుకో" అని మేలుగొత్తి పాడు కొంటెపడుచువాండ్ర పాటలు కాని యామెకు సాయము జేయలేదు. పక్షుల కిలాకిలారావములు మేల్కొలిపిన వని చెప్పిన నిజముండదు. ప్రభాతమందమారుతములు మెల్లగా, చల్లగా, హాయిగా వీచి ఆమెను నెమ్మదిగా లేపిన వని కవిత్వించలేను. నిజమున కామె పక్షులకు ముందుగనే లేచి యుం

డినది. వీచుచుండినది మందమలయానిలము గాక చల్లపెట్టి శరీరమును కట్టెచేయు కటికశీతవాయువులు. అర నిముషముక్రిందవరకు కౌగిలించుకొనియున్న ప్రియుని శరీరము వేడిమి, హృదయమున నిశ్చలముగ వెలుంగుచున్న ప్రేమజ్యోతి వేడిమి ఆమెచలిబాధ నుపశమనములు. స్వాభావికముగ జన్మించు 'ఊహాపోహాలు' పెదవులు దాటి పైటికి రాకముందే మనమున నావరించియున్న సంతోషానందముల మిశ్రమమున జిరునగవులై మొగమునంతటిని గప్పివేసినవి. స్నానము జేసినది; తల ముడుచుకొనినది; శుభ్రవస్త్రము ధరించినది. సంతోషము, తృప్తి ప్రేమ యామెముఖమున తాండవించుచున్నవి. ఇంటి పనుల జక్కపెట్టుట కారంభించినది. బిడ్డలు లేచినారు. వాండ్రు సరిగా నున్నప్పుడు ముద్దులుగాని లేనప్పుడు మొద్దులు. పిల్లలపోరు తల్లికే రొటుక. ఎంత మంచి బిడ్డలైనను లేచుటతోడనే వ్యథ కలుగజేయకమానదు. ఉషఃకాలము శిశువులకు, చంద్రునకు రాహుకాల మెట్టిదో, యట్టిదేమో యనుకొందును. పిల్లల కట్లున్నను, తల్లుల కది నిజముగ గ్రహణకాలమే. గల్లున గగ్గోలు పెట్టుదురు. గగ్గోలు పెట్టునపె దాటినను, ఏడ్పు మొగములతో వచ్చి కాళ్ల కడ్డముపడుదురు. చిరునగవుతో సౌజన్యముగ కావలసిన దడిగి తల్లిచేత చెప్పించుకొనుట గాని, చేయించుకొనుట గాని చేయుపిల్ల లరుదు. పాప మామెకు నిజముగా చిరాకే కలిగింతురు. ఆమె పనుల కడ్డమువత్తురు. కాని గట్టిగా కసరుకొనదు. "ఎక్కడిపిల్లలురా, మీకడుపు కాల" యని ప్రాతఃకాలప్రదీవెన లీయదు. ఎప్పుడును పిల్లలు పిల్లలే. ముండ్లున్నగులాబిపువ్వులు. కష్టసుఖముల కావడికుండలు. వాండ్రను లాలించినది. ముఖమార్జనము మొదలైనవి చేయించినది. వాయనతోపాటు మొగము కడుగుకొనిన మతేంతసంతోషము. ఒకరిద్దఱకు జల్దియన్నము దినుటభ్యాసమున్నది. వారికద్దాని పెట్టినది. బట్టలు విడిపించి, తలలు దువ్వి, బొట్టు పెట్టి ముస్తాబు చేసి వాండ్రను బడికి బంపించినది. భర్తకు గాఫీ తీసికొని టఫ్యాసము. అతనికి గాఫీ యుపమాల జేసి యిచ్చినది. భర్తకు గాఫీ యిచ్చుటామెకు సంతోషము. పూర్వాచారపరురాలైన పూర్వసువాసిని దేవునకు నైవేద్యము పెట్టునట్లామె భర్తయం దుపమా పెట్టినది. గంగాభవానీ సమారాలు కొబ్బరికాయ గొట్టి లోటలోటమని నీరు వంచునట్లు అతనికప్పులో గాఫీ పోసినది. భగవంతునే మానసికముగ భర్తను జేసికొనియున్న విధవ భక్తికిని, భర్తను దేవునిగా జూచుకొనుచున్న మన పుణ్యస్త్రీ భక్తికిని భేదము రవంతైన లేదు. భక్తి ప్రధానము కాబట్టి, ఆచరణయందు భేద మున్నను, మోక్షమున కిరువురు సమముగనే పోవుదురు.

ఇక వంట జేయుట కారంభించినది. ఏమిసంసారము! ఏదో సంసారపక్షము; ఒక టుండిన నొక టుండదు; దానికి దీనికి జతపర్చవలెను, ముడివేయవలెను. ఒకొక్కప్పుడు గరికతో బచ్చడి చేసి 'రాజును' మెప్పించవలెను; పాకముల నున్నది గాని పదార్థముల కేమి? పప్పులు, ఊరగాయ లిచ్చిన నెంత తృప్తిగానైన భోజనము చేయించవచ్చును. పప్పుపులుసు స్వర్గము జూపించును. అందులో నిమ్మకాయ పిండిన నెంతరుచి? ఇక ములక్కాయసంగతి చెప్పనేయక్కరలేదు. వీనికన్నిటి కేమిగాని నాలుగు పెద్దయుల్లిపాయలు పడినవా రంభతో నృత్యము జేసినట్లే యుండును. భర్తకు గాకరకాయల యంటుపులుసు మిక్కిలి యిష్టము. వానియం పదిగ వారము రోజులనుండి ప్రయత్నించుచున్నను ఎక్కడను దొరకుటలేదు. నిన్న సాయంత్రము వెంకటసామి 'రామయ్యగారి దొడ్డిలో నున్నవి. నాలుగు పిందెలడిగి తెచ్చిపెట్టెద' ననినాడు. ఇంకను రాలేదు. ప్రొద్దెక్కుచున్నది. వారికి ఆఫీసువేళ కావచ్చుచున్నది. రెండవ అబ్బాయికి కందిపచ్చడనిన నిష్టము. దానిని త్వరగా జేయవలెను. బుజ్జది రాత్రి సరిగా నన్నము తినలేదు. కొంచెము జ్వరము తగిలినట్లున్నది. సాతె నరసింహామును బిలిపించెద నన్న నా కేమి వద్దులే మందని బడిలోనికి బోయినది. పొట్లకాయ జ్వరమునకు మంచిది. కొంచెము పెసరబద్దలు జేసి తినగబోత వేసిన

బాగుగ నుండును. చిన్నపిందె ఒకటి దొడ్డిలో నుండవలెను. పిల్లలు బడినుండివచ్చువేళ యైనది. వచ్చినప్పటినుండి 'అన్నమన్న'మని మీద బడుదురు. ఆయనగారేమో వ్రాసికొనుచున్న ట్లున్నది. పాపము కాస్తంతసేపు పోయినని కాలుమీద కాలువేసికొని యింటి యొద్ద కూర్చుండుటకు వీలుండదు. ప్రొద్దస్తమాన మొకటేపని వారట్లు కష్టపడి సంపాదించకపోయిన మాపని యేమి కావలెను?—వంట పూర్తియైనది. స్నానము సిద్ధపరచినది. అంగవస్త్రము, తుండుగుడ్డ, కట్టుపంచె తెచ్చి స్నానమునకు లెండని చెప్పినది. భర్తస్నానము చేసినాడు. ఇంతలో బిల్లలు వచ్చినారు. కేదురు, కాచురు. వారికి, భర్తకు భోజనము పెట్టినది. చేతిమీద వేయించుకొనుట పెద్దబ్బాయికి గిట్టదు; చేతిగిన్నె ముందర పెట్టవలెను. అట్లు పెట్టిన నితరపిల్ల లూరుకొనరు. వాడు లాగి, వీడులాగి వాడెక్కువ వేసికొనినాడని, వీడెక్కువ వేసికొనినా డని. పాపము కమలముమాత్రమే పోరు లేక తనకు పెట్టిన దేదియో తినును. పెనిమిటికి ములక్కాయ ముక్కలనిన నిష్టము. పప్పుపులుసులో నుండి దేవి నాలుగు ముక్కలు వడ్డించినది. 'నాన్నకువేసినావు. నాకేవి' యని పిల్ల లెగబడినారు. 'లెక్కకు రెండు కాయలే దొరికినవిరా, మీ నాన్న కవియన్న నిష్ట' మని యెంత చెప్పినను పిల్ల లూరకొన లేదు. తలకొకముక్క పెట్టినది. రెండవవా డెప్పుడు గడుసే. 'నాకు లేకుండ నన్నియు, నీవే తినుచున్నావే' యని నాన్నను గద్దించినాడు. 'నీ ముఖం; గల్లంతు చేయకుండా నీకు పెట్టిన దేదో తిను' అని తండ్రి సమాధానమిచ్చినాడు. ఈరోజున మజ్జి గెందుచేతనో మిక్కిలి పల్చగనున్నది. ఫస్టు క్లాసు బఱ్ఱెయుండి, దివ్యమైన గడ్డవంటి పెరుగు వేసికొనిన స్వర్గమునకు బెత్తెడేడముగ నుండును. గాని పాడుముండలు, ఈగొల్ల వాండ్రు దెచ్చి యమ్మే కటిక నీళ్లు రుచియా, పచియా? నిమ్మకాయచెక్క వేయించుకొని రసముపిండుకొని యింతయుప్పు కలిపినాడు. ఎట్లయిన నిమ్మకాయకు సరిపోయినవస్తు వేదియు లేదు. మామిడియూరగాయ, నిమ్మకాయపచ్చడి, దబ్బకాయపచ్చడి యుండును గాని మజ్జిగ పల్చనై నప్పుడు వానిపస యేమియు బనికి రాదు. అప్పుడు నిమ్మకాయరసము ఉప్పే కావలసి యుండును. కలిగినదానిని తృప్తిగ భోజనము చేసినాడు. తా నెంత యదృష్టవంతుడు! అందచందములకు దోడు తనభార్య మంచివంటకత్తె. ఆమెపాకము లెంతరుచిగానుండును! సగమన్నము కాకరగాయ అంటుపులుసుతోనే తినివేసినాడు. వేళ కావచ్చినది. బట్టలు త్వరగావేసికొని యాఫీసునకు బైలుదేరినాడు. పెందలకడనే రండని యథాప్రకారము భార్య యనినది. సరేయని చిరునగవుతో దల యెగరవేసినాడు.

తనభోజనము మొదలుపెట్టినది మజ్జిగే పల్చనైనది గాని భర్త తృప్తిగానే భోజనము చేసినాడు. పిల్లలకును గాకరకాయకూర యిష్టమే. ఏమియు మిగిలినట్లు లేదు. అబ్బా, ఏమీదుండగీడుపిల్లలమ్మా! ఎగబడి మఱి ములగముక్కలు, ఉల్లి పాయలు పూర్తిచేసినాడు. కందిపచ్చడి రుచిగానే యున్నది. కృష్ణుడు మఱికాస్త పెట్టవే అమ్మాయని పెట్టించుకొని తిన్నాడు. కమలం తిండి రాత్రికంటె మెఱుగే. ఆసవ్యాసికి జ్వరము లోపల నింక నున్న ట్లున్నది. నాముదస్సులో నట్లుండును గాని, పిల్ల లైనతర్వాత జ్వరములు రాక యుండునా? అదే పోవును. భోజనము పూర్తిచేసినది. చావడిలోను, వీథియరుగులమీదను పిల్ల లేదో ఆడుకొనుచున్నారు.

చీకటినుండియు నొకటే పని. కొంచెమాయాసముగ నున్నది. పదినిమిషములు విశ్రమించెద ననుకొన్నది. చావడిలో జిరుచాప వేసికొని అట్టె తలవాల్చినది. ఎన్నియో నిమిషములు కాలేదు. గంపెడంతపని యుండగా సోమరిపోతువలె నిద్రించుటేమి! చప్పున లేచినది. కందిపప్పు పూర్తిగావచ్చినది. క్రిందటి యాదివారమొక యిరసకందులు బజారునుండి పట్టించుకొని వచ్చినారు. ప్రక్కయింటి సుబ్బమ్మ కాస్తంతసేపు వచ్చి ఆలాగే వేయించిపెడతాలే యని చెప్పినది. ఆమెకిప్పుడు తీరికగానే యుండవచ్చును. ప్రొద్దు తిరుగక పూర్వమే ఆపని చూడనిచో మరల నిబ్బందిపడవలసివచ్చును. మినపప్పు కొంచె మున్నట్లున్నది. వెంకమ్మతీసికొని వెళ్లిన బదులిచ్చిన నిప్పటిలో నంతయు

బ్బంది యుండదు. అనుటయే కాని యీ లేమిడిసంసారములో దినిన్ని గారెలను వోచుకొనినామా! ఎప్పుడైన ఫలహారము చేయవలెనన్న శెనగపిండియో ఇంటిలోనుండకపోదు. ప్రక్కయింటి సుబ్బమ్మను పిలిచినది. అపూర్వసువాసిని రెండుమూడు పిల్పులైనతర్వాత పలికి, 'ఏమిటొయ్యండలమ్మ, దీనిదుంపదెగ ఒక బేదాహము. ఇప్పుడే రవంత సేపు నోరగిలినాను. నీకేకలు విని యులికిపడి లేచి వచ్చుచున్నా'నసుచు లోపలికి వచ్చినది. కంది పప్పు చేయ టారంభించినారు. పిల్లలు బడికి వెళ్లువేళ యయినది. వాండ్రను పిలిచి తలాకాస్త అన్నము పెట్టినది. బట్టలను సర్ది మొగములు తుడిచి బడికిపంపినది. సుబ్బమ్మ చలవనలన పప్పు విసరు టారంభించినది. అప్పుడే మూడుగంటలు కావచ్చినది. వారెప్పుడూ ప్రొద్దున పది గంటలకు భోజనము చేసి వెళ్లినారు. పాప మాకలి వేయుచుండ వచ్చును. పనిలో పని చేరడంత సెనగపిండి కలిపి నాలుగు మెత్తనిపకోడీలు చేసిన, వారు వచ్చుటతోడనే ఫలహారము చేయుదురు. చేతినిండ డబ్బుండి, నౌక రుండిన నెంత బాగుగ నుండును! మధ్యాహ్నము రవంత చిరుతిండి చేసి ఆఫీసునకు పంపిన బాగుగ నుండును గదా— కందిపప్పిట్లో తయారైనది. ఇక వెళ్లెద నమ్మా యని దోసెడుపప్పు చీరచెరగున గట్టుకొని సుబ్బమ్మ తనయింటికి వెళ్లి పోయినది. బడి విడిచిపెట్టు వేళ యైనది. ఒక యరగంటలో పిల్ల లింటికి కెగబడుదురు. త్వరగా పకోడీలు చేయవలెను. వాండ్రు వచ్చిన పని సాగనీయరు. తొందరగా పిండి కలిపి నేతిలో నొక సవాసేరునకు సుమారు పకోడీలు చేసినది. ఇదిగో పిల్లలు వచ్చుచున్నారు. "ఏమిటే అమ్మా! ఏదో కమ్మనివాసన వచ్చుచున్నది. ఏమివండినా వేమిటి? గారెలా, పకోడీలా, నేతిలో వేయించిన మసాలా సెనగపప్పా? ఏదో మాకుపెట్టకుండా దాచుకొన్నావు? మాకుకూడ పెట్టవే. నాన్న యొక్కడే తినవలెనా?" అని పిల్లలు గల్లంతుచేసినారు. "మీకుపెట్టకుండా నాన్న కెట్లా పెడతానురా? లెక్కకు నాలుగు మెత్తని పకోడీలు చేసినాను. మీ నాన్న కవి యన్న నిష్టము ఇదిగో" అని చెరి కొంచెము చేత పెట్టినది. 'నాన్న కిష్టము గాని దేమిటి! పకోడీలు ఇష్టమే, గారెలు ఇష్టమే, చక్కిడాలు ఇష్టమే, నేతిలో వేయించిన కారపుసెనగపప్పు ఇష్టమే. మాకుమాత్రము మని యిష్టము గావా' యని యుండగీడు కృష్ణుడు తర్కించినాడు. 'నాన్న సంపాదించుకొని రాకపోతే నీవట్లా తింటా వేమిటి పకోడీ' లని పెద్దబ్బాయి రాముడు తమ్మునకు సమాధానము చెప్పినాడు. తనకు పెట్టిన పకోడీలు కొంచెము కొంచెము కొరికి తినుచు కమలము తృప్తిజెందినది. సరే యిక లెండి నాన్న వచ్చువేళ యైన దని వాండ్రకు తలలు దువ్వి స్నానము చేయించినది. శుభ్రమైన బట్టలు తొడిగి చాదుబొట్టు పెట్టినది. తానుగూడ తల దువ్వుకొని తిలకము దిద్దుకొనినది. అబ్బా ఏమికంపరమమ్మా చాకలి అంజిగాడు ఇస్త్రీబట్టలు తీసికొని రానేలేదు. ఇదిగో నదిగో నని రెండువారములనుండి గడుపుచున్నాడు. ఆయనగారి కీ నిమ్మపండుచాయ చీర యన్న మిక్కిలి యిష్టము. ఆచీర గట్టుకొన్నది. ఈసంవత్సర మెందుకోగాని మల్లెయంటు సరిగా పూయలేదు. పందిరి పొత్తిగా పడిపోయినది. దానిని కొంచెము బాగుచేయింపుడని యెంత చెప్పినను భర్త చెవి కెక్కలేదు. ఏవియో మూడునాలుగు మొగ్గలున్నట్లున్నవి. వానిని కోసి కమలము జడలో నిన్ని పెట్టి, తానిన్ని తన జారుముడిలో సవరించుకొన్నది. ఐదుగంట లైనట్లున్నది. భర్త యాఫీసునుండి బైలుదేరి వచ్చుచుండును. పాపమెంత యలసియుండినారో! పైగన ఆఫీసు దాదా పర మైలు నడువవలెను. ఇదిగో వచ్చుచున్నట్లున్నారు. కాదు, ఎవరో దారిని బోవువారు. ఆ కాలిచప్పుడు వినవచ్చుచున్నది. చప్పున గుమ్మము దగ్గరకు వచ్చినది. అబ్బే ఆయనగారు కాదు. కుమ్మరి నాగన్న 'అయ్యగారితో కొంచెము పని యున్నదండీ, ఇంకను రాలేదా' అని యడిగినాడు. వచ్చుచుండవచ్చును, కొంచెముసే పాగుమన్నది. 'లేదండీ వెళ్లవలెను, తొందరపనియున్నది. రేపుదయము వచ్చి దర్శనము చేసికొందు' నని చెప్పి వెళ్లిపోయినాడు. అట్లే గుమ్మముదగ్గిర నిలబడి యెదురు చూచుచుండినది. పదిబారల దూరములో మలుపు తిరిగి ఆయనగారు కన్పడినారు. హృదయమూ

హ్లాదమయమైనది. ముఖము వికసించినది. చిరునగవు పెదవులపై తాండవింప మొదలు పెట్టినది. చప్పున లోనికేగి మంచువాద్దగ్గర సిద్ధముగా నుంచియుండిన జలపాత్రను తెచ్చి యెదురుగా వచ్చినది. చేతిగొడు గందుకొని, చెంబు చేతి కందించినది. ఇంతలో నాన్న వచ్చినాడని పిల్లలు కేరింతలు గొట్టినారు. కమలము అంగవస్త్రము తెచ్చి తుడుచుకొనుట కిచ్చినది. లోపలినుండి యొక పింగాణిపళ్లెములో మెత్తని పకోడీలు, కాశిచెంబులో చల్లనిమంచినీళ్లు తీసికొనివచ్చి, చావడిలోని బెంచీబల్లపై జదికిలబడి, ఉస్సురుస్సురనుచు గాళ్లుచేతులు తుడుచుకొనుచున్న భర్తముందర బెట్టినది. వహ్వా, ఏమి సౌఖ్యం యీవేళ! మెత్తనిపకోడీలు!— మొత్తమువిూద ఊరకుండడు. సంతోషపూర్వకమైన నవ్వు నవ్వినాడు. 'ఏమిరా కృష్ణా, నీవంతైనదా' అనినాడు. 'అయినది గాని నాన్నో...మరి...' అని కృష్ణుడు నెమరువేసినాడు. 'ఏమిటక్కరిదిరా యని నవ్వి, ఇదిగో యీ రెండు తీసికో' అని పిల్చినారు. కృష్ణుడు చెట్టు చేసినాడు. 'వా డిదివరకే తినినాడు. ఇక వాడిని మారాము పెట్టకండి' అని చేరువ నున్న కుర్చీపీటమీద గూర్చుండి యున్న భార్య యాతురతతో ననినది. రాముడు నాన్న యంతు నాన్నకే యనుస్వభావము గలవాడు! కమల యొట్టను ఆడపిల్ల. 'నాన్న ప్రొద్దున మొదలుకొని సాయంత్రము వరకు పని చేసినారు. ఎంతో ఆకలి వేసి యుండును' అని జాలితో గూడిన ప్రేమతో ననుకొనినది. ఎంతతృప్తితో భర్త ఫలహారము చేయుచున్నాడు! ఇంక నాలుగు చేయనైతి ననుకొన్నది. 'సుమ్మరినాగన్న వచ్చి వెళ్లినాడు, మరల రేపుదయము వచ్చెద నన్నాడు. మీతో నేదో పని యున్నదట' అని చెప్పినది. 'వాడి మొఖం భడాయికోరు వెధవ. ఏదో పని యున్నట్లు ఆర్భాటాలు చేస్తాడు. చివర కేమియు నుండ' దని కోపగించుకొనినారు. పొరుగింటిసుబ్బమ్మ వచ్చి కందులు పప్పు చేయుటలో దనకు దోడ్పడిన దనియు, ఎందుప నేలనో గాని, మాపులకు బాగుగ నున్నను, పప్పు అటి రాలేదనియు జెప్పినది. మొత్తముమీద సుబ్బమ్మ మంచిమనిషి. ఒకవిధముగా విధవలు సంఘమునకు లాభమే.

కాని వారికి కోర్కెలు, ఆశలు, తృష్ణలు ఎందులకుండవలెను? భగవంతుడు పరిపూర్ణు డందురు గాని, ఈవిషయములో దిలివితక్కువపనియే చేసినాడు... కాని, తానే ఆడుజన్మమెత్తి పదునాలుగువత్సరములు దాటకమునుపే విధవరాలైన నెట్లు భరించెడువాడో?—ఏదో, ఎవరికర్మము వారిది. ఈపల్లని సాయంతన మప్పు డీపాడు తలంపు లెందులకు? భార్యవంక నిండుదృష్టితో జూచినాడు. ఎంత కలకల లాడుచున్నది. ఎంతశృంగారముగా, కన్నులపండువుగా నున్నది! ఆనిమ్మపండు ఛాయచీర యామె సువర్ణ దేహమున కొంతయింపు నిచ్చుచున్నది. ఆమె కది, దానికామె అతికినట్లు సరిపోయినారు. సుబ్బమ్మ జ్ఞాపకము వచ్చినది. గుండె గుభేలు మన్నది. ఈశృంగారవతి, యీపూచిన తంగేడుచెట్టు కర్మము చాలక విధవ యైన నెంతఘోరము! తా నప్పు డామెను జూచి సహింపగలడా? కన్నుల పండువ జేయుచున్న ఈపుణ్యస్త్రీని ఈ అర్ధాంగిని, ఈగృహలక్ష్మిని ప్రచండ ఝంఝామారుత క్రూరహస్తముల బూవుల, నాకుల, లేగొమ్మల గోలుపోయి మొండి యయి మొరటుగ నున్న తంగేడుచెట్టువలె నుండు విధవనుగా జూచుటకు మన సెట్లొప్పును?—సటుక్కున జ్ఞాపకము వచ్చినది. తనలో దాను నవ్వుకొనినాడు. తాను నిండు జీవముతో మిటకరించి చూచుచుండగా తనభార్య విధవ యెట్లగును! భర్తముఖమువంక తదేకధ్యానమున జూచుచున్న భార్య ఏమిటా రహస్య మని సగ ముత్సాహముతోను, సగముచింతతోను అడిగినది. 'ఏమిలేదు. నీ వెంతయు...నీకాచీర ఎంత అందముగా నున్న'దని చిరునగవుతో ననెను. విషయముల నర్థముజేసికొనుట కారంభించిన కమలము కొంచెము సిగ్గుపడినది. తల్లి ముఖమున నన్నియు గులాబిమొగ్గలే. తాను ప్రేమించు భర్త మెప్పెంత సంతోషకరమైనది.

ఫలహారము పూర్తియైనది. 'ఇక బైలు దేరుదమా? ప్రొద్దు గ్రుంకవచ్చుచున్నది. జయలక్ష్మి పెందలకడనే రండి, ఒకఘడియసేపు కూర్చుండి వెళ్లవచ్చు నన్నది.' అని యామె యనినది. 'ఇదిగో నేను సిద్ధముగనే

యున్నాను. నా నేలంఅంచు కండువా తెచ్చిపెట్టు' అని అనినాడు. భార్యాభర్తలు, పిల్లలు బైలుదేరినారు. వెంకటకృష్ణయ్యగారియిల్లు అదృష్టవశమున నూరికి బైటగా నటుప్రక్కన నున్నది. జనమధ్యమునుండి పోవనక్కరలేదు. ఆమలుపు దిరిగి నాలుగుబారలు పోయిన పంటకాలువ కన్పడును. దాని ననుసరించి రెండుఫర్లాంగులు నడచిన వారున్నవీథిని చేరుకొందుము. ఆవీథిలో కుడిప్రక్క పదియిండ్ల తర్వాత నున్న డాబాయే వెంకటకృష్ణయ్య జయలక్ష్మిగార్ల గృహము. ఎంత చల్లనిహాయిగొలుపు గాలి వీచుచున్నది! ఈసాయంతన సమయ మెంతరమణీయము! అదిగో, సూర్యుడు మొగ మెంత ఎఱ్ఱజేసికొనినాడో చూడుడు. కటా, కాలమాహాత్మ్యము! ఈ యుదయముననే యతడు లేత గులాబిరంగుల నీనువదనముతో, ప్రకాశవంతములైన చిరునగవులు నగుచు, స్నేహయుతముగ దన లేకేతుల జాచి, యందరి నాలింగనము జేసికొనినాడు. ఈమధ్యాహ్నమున నతడెంత దుర్నిరీక్ష్యుడు! వయోగర్వము. మిత్రు లనక, బంధువు లనక, ఆశ్రితులనక, సహవాసు లనక, యందరి నెట్లు నిరాకరించినాడో! తనరూక్షేక్షణముల నిప్పులు గుఱియుచు నందఱి నొకమూల నొదిగి యుండునట్లు చేసినాడు—అకాలము చెల్లినది. సాయంత్రమైనది, ఇప్పుడో, ముదుసలియై, ఎఱ్ఱగ బండి, ఇప్పటి తన యసహాయత్వమును, కొలదిగంటల క్రిందటనే తాను చూపించిన యౌద్ధత్యమును, తలచుకొని సిగ్గుచే మొగ మెఱ్ఱబారినవాడై, ఎట్లు ప్రక్కప్రక్కకు నొదుగుచున్నాడో, దూర దూరముగ బోవుచున్నాడో! చూడుడు. ఈయుదయమున జూపిన మైత్రి, మధ్యాహ్నగర్వమున మాడియుండనియెడల తనయవసానకాలమున నెందఱు తనను గౌరవించెడివారో! తనయెడల నభిమానము చూపెడివారో!! దానికి మారుగ ప్రజాకంటకుడైన నిరంకుశప్రభువుపాలన మంతమొందినప్పుడు జను లెట్లు సంతోషింతురో యట్లె యిప్పు డతనియవసానకాలమున లోకము చల్లబడి సంతోషించుచున్నది. ఈయవమానమును తా నింక భరింపలేడు. సమీపమున నున్న పశ్చిమసముద్రమున ప్రాణముల బాపుకొనుట యుత్తమము. అదిగో ఎట్లు సాహసించి చటుక్కున దుమికినాడో!— కటకటా ఎట్టివారికి మృత్యువు తప్పదుగదా—సూర్యభగవానుని చైదములు మనకు క్రొత్తలుకావు. అతనిది దినదిన మరణము, దినదిన జననము. నిత్యము చచ్చి, పుట్టుచుండు వారి విషయమున విచార మెందులకు? ఇంతహృదయాహ్లాదకరముగ మలయమారుతము వీచుచు, ఇంత ప్రశాంతముగ భూమ్యాకాశము లుండి, ఇంత కన్నుల పండువుగ వరిచేలు పండి, ఇంతరామణీయకముగ నిరుప్రక్కల చెట్లులుండిన ఒక్కసూర్యునేకాదు లక్షసూర్యులనైనను నిత్యము జంపుటకు వెఱచవలసిన పని లేదు. నాన్నతో ముందు నడచుచుండిన కృష్ణును కబుర్లు కొట్టిపోయుచున్నాడు. వాని స్నేహితుడు సత్యమునకు చిన్నసైకి లున్నది. నాన్న తన కొకటి కొనిపెట్టడా!—వాండ్రు తెలుగుపంతులు రామమూర్తిశాస్త్రిలుగారు బడిలోనికి రాగానే 'నాన్నో, ఏమి జరిగిం దనుకున్నావు, యివ్వాళ? చలమయ్యగారి రామారావున్నాడే వాడు గాంధిమహాత్మునకు జై ఖద్దరుబట్టలకు జై యని కేకలు వేశాడు. క్లాసంతయు గొల్లున గగ్గోలు పెట్టింది. శాస్త్రుల్లుగారికి గాంధిమహాత్ముడంటే యెంతో భక్తి. ఖద్దరు బట్టలన్నా మిక్కిలి యిష్టమే. కాని క్లాసంతా కేరింతలు గొట్టి గల్లంతు చేయటంతోనే శివమెత్తి 'ఫుండాకోర్ గల్లంతు చేస్తావా' అని రామారావుమీదికి దుమికాడు. రామారావు యీబల్లపైనుండి ఆబల్లపైకి, ఆబల్లపైనుండి యీబల్లపైకి, కోతిగంతులు వేశాడు. దానితో పిల్లలు మఱింత రెచ్చిపోయారు. శాస్త్రుల్లుగారు కోపాన్ని పట్టలేక చిందులు త్రొక్కుతూ, కొండకేకలు వేస్తూ, హెడ్‌మాస్టరును దీసుకొనివచ్చి విరాదుంప దెంపుతాను చూడండని ఒక్కలగువున మా పెద్దపంతులుగారిగది కేగాడు' అని చెప్పసాగినాడు. నాన్నకు తన బాల్యానుభవములు జ్ఞప్తికి వచ్చినవి. నవ్వుకొనినాడు. పిల్లలెప్పుడును గొంటెవాండ్రే తనబాల్యమున నున్న పిల్లలకును, ఇప్పటిపిల్లలకును ఈవిషయమున భేదమిసుమంతయు లేదు. ఈరోజున చలమయ్యగారి రామారావు గల్లంతుచేయుటలో నాశ్చర్య మేమున్నది? తాను కూడ నట్లు చేసినవాడే. నిజమున కింతికంటె ఘోరములే

చేసియుండినాడు. తనమోకాళ్ల దండెములు, గోడకు ర్చీలు, కోదండములు జ్ఞాపకము వచ్చినవి. అబ్బా, వేనినైన ధరించవచ్చును గాని, గోడకుర్చీలు ధరించుట కష్టము. రాక్షసులపద్ధతులు గాని యార్యులపద్ధతులుగావు. ఈ రోజులలోనటువంటి మోటుదండనలు తగ్గిపోవుచున్నవి. తగ్గిపోయినవనియే చెప్పవచ్చును. ఎట్లయినను కొన్నివిషయములలో గడచినదినములకంటె ప్రస్తుతమే యుత్తమముగ గనుపట్టుచున్నది. తల్లి కృష్ణుని మందలించినది. 'గురువుగారి నట్లు సేవ చేయవచ్చునటర; భక్తి లేనిది చదువెట్లు వచ్చును? పాపము శాస్త్రులుగార్లు ఈకాలపుపంతుళ్లలో మిక్కిలి మెత్తనివారు. నిజమున కనాయకులు. అట్టివారిని గల్లంతుచేయుట మిక్కిలిచెడ్డపని. నీవుమాత్రము అల్లరిపిల్లలతో జేరవద్దని యామె బోధించినది. రామమూర్తి శాస్త్రులుగారి అమ్మాయి సీత తనసహాధ్యాయిని యనియు, మిక్కిలి నెమ్మదిదైన పిల్లయనియు, వారియింటికి తా నప్పుడప్పుడు వెళ్లుచుండుననియు, శాస్త్రులుగారు మిక్కిలి మంచివారనియు, తన నెప్పుడాదరముతో బలుకరించుచుందు రనియు, కమలము చెప్పినది. అందరికంటె వెనుక నడచుచున్నరాముడు 'శాస్త్రులుగారు మంచివారే కాని, మా హెడ్‌మాస్టరుగారు మాత్రం తలతిక్క మనిషి' అనినాడు—ఆ, ఇంటిని సమీపించినారు. డాబాయరుగులమీద నింటిపిల్లలాడుకొనుచున్నారు. వెంకటకృష్ణయ్యగారు డాబాలో నేదియో చూచుకొనుచున్నట్లున్నది. వీరు సమీపించుటతోడనే పిల్లలు, తల్లికి జెప్పుటకు చప్పున నింటిలోనికి బరుగెత్తినారు. ఇంటి యజమానుడు మనవారు వచ్చినారని భార్యను కేక వేసినాడు. జయలక్ష్మి లోపలినుండి వచ్చినది. 'ఏట్లా, ఐతే వచ్చారమ్మా, లోపలికిరం'డని తల్లిని బిడ్డలను లోనికి దీసికొనిపోయినది. తండ్రి వెంకటకృష్ణయ్యగారి యాహ్వానమున డాబాలోనికుర్చీమీద కూర్చుండినాడు. తనచేత నున్న కాగితము లటు వైచి యింటియజమానుడు తన స్నేహితుని కుశల మడిగినాడు. 'ఏమిటో చూచుకొనుచున్నా'రని స్నేహితుడనినాడు. 'ఏమున్నదండీ, ఎప్పుడూ ఉన్న రాద్ధాంతమే గదా; ఈమధ్యజరిగిన దెబ్బలాటలకోసని యజమానుడు జవాబిచ్చినాడు. ఔను నిజమే, మొన్న నేగదా ఆయూరువాండ్రుకొట్టుకొనినది? ఇరువదియవ శతాబ్దములో మన మందఱము నాగరికులమైతి మని సంతోషించుచుండగ, కాట్లకుక్కలవలె నీపోట్లాటలేల? కడుపునకుదిన్నట్లా, కటికెకట్టుకొన్నట్లా? తెలివితక్కువ ప్రసంగములు, మూర్ఖప్రసక్తులు, వ్యర్థవివాదములు, దురహంకారపునడవడులు, పశుకృత్యములు. వీడు బజారువెంట వెళ్లుచుండగ వాడు లేవలేదు. వాడు చెప్పినమాట వీడు వినలేదు. వీడు తనకోటును వానితరపు మనుష్యున కీయలేదు. ఇవి తగాదాకారణములు. మనలో క్షాత్రము లేదందు రేమి? మనపూర్వులు దండయాత్రలు చేయలేదా, దిగంతములు జయించలేదా? ఆక్షాత్ర మెట్లు చచ్చును? మన కోడిపందెములు, మన పొటేళ్లపోరాటములు దానిని నిల్పియే యున్నవి. అట్టిచో చచ్చు దద్దమ్మలవలె యూరక యుండెదమా? బుద్ధి లెగరవలెను గాని తప్పో, యొప్పో, నాలుగుదెబ్బలు కొట్టి, నాలుగుదెబ్బలు పడినదే పౌరుషము. వెంకటకృష్ణయ్య స్నేహితుడు ఆకబుర్లు, ఈకబుర్లు చెప్పుకొనివారు—మధ్యాహ్నములో చిరుచాపమీద కూర్చున్న యాడంగు లూరక యుండిరా? 'మీరాకమల మెంత నెమ్మదిదైన పిల్లమ్మా; ఎంత వయస్సు? పెండ్లి యీడు వచ్చిందికాదా? ఈగాజులెక్కడ చేయించారు? బాగానే ఉన్నవి కాని మావారు మొన్న మా పెదతల్లి కూతురుబిడ్డ పెండ్లికి బెజవాడలో, శ్రీలక్ష్మీజ్యూయలరీ కంపెనీవారివద్ద తెచ్చినగాజు లంత సొగసుగా లేవనుకొంటాను. మీరు కట్టుకొన్నచీర మిక్కిలి బాగావున్నది. ఎక్కడ కొన్నారు? మొన్నీమధ్య చెన్నపట్టణము మాబావకొడుకు వెళ్లుచుంటే, రెండుచీరలు తెమ్మని డబ్బిచ్చాను. అత డింకా వచ్చినట్టు లేదు.' జయలక్ష్మిమాటలు సాగిపోవుచుండెను. కాని కృష్ణు డూరకుండెనా? యేదియైన గిల్లి కజ్జము దెచ్చిపెట్టక మానడు. వారిరంగడు, కృష్ణు డెందులకో కీచులాడుకొనినారు; రంగ డేడ్వ మొదలుపెట్టినాడు. తల్లి కృష్ణుని చీవాట్లు పెట్టి, రంగని బుజ్జగించ మొదలుపెట్టినది. జయలక్ష్మి సరసురాలు. రంగనిదే తప్పై యుండునని సమాధానపరచ జూచినది. రాముడు కృష్ణునితో

నము కైట పెట్టినాడు. సరే, ఇక వెళ్లుటకు వేళయైనది. ఈపిల్ల లోకపోట కొంచెముసేపు నెమ్మదిగ కూర్చుండ నిచ్చెదరా? వారును సిద్ధమై యిక గైలుదేరుదమా యని నారు. సెలవుతీసికొని బయలుదేరినారు వెళ్లి నమార్గము ననే తిరిగి యింటికి జేరుకొనినారు.

వెంకి పాచి సరిగ నూడ్చి, వంటసామానులు శుభ్రముగా తోమినదో లేదో? చీకటి పడవచ్చుచున్నది. బుడ్లలోను, లాంతరులలోను చమురు పోయుమని చెప్పుటకు మఱచిపోయినాను. ఆ సుద్దు కామాత్రము జ్ఞాన ముండిన నింక గావలసిన దేమి? వంట యారంభించినది. కమలము తల్లికి తోడుపడినది. ఆకలి వేస్తున్న దే అమ్మా' యని కృష్ణుడు కేకలు మొదలుపెట్టినాడు. ఇదిగో పూర్తికావచ్చుచున్న దని తల్లి సమాధానము చెప్పినది. ఈపూట యెట్లును ఆలస్యమైనది. స్నేహితు లున్నప్పుడు రాకుండను, పోకుండనా? జయలక్ష్మి మంచియిల్లాలు. వారి సంసారము మాసంసారము కంటె చాల మెరుగు. ఆయమ్మ యదృష్టము భర్త బాగుగా సంపాదించుచున్నప్పుడు, డాబాలు రాకయుందునా, వంటకత్తెలు లెక్కువ యౌదురా!– ఏమో ఎవరి యదృష్టము వారిది. వంట పూర్తియైనది. భోజనములైనవి. పిల్లలు కొంచెముసేపు చదివి పరుండినారు. స్నానముజేసి తాను కూడ భుజించినది. భర్త యేదో పడకగదిలో జదువుకొనుచున్నట్లున్నాడు. ఇన్ని యాకులు వక్కలు చేత దీసికొని కంచుచెంబుతో నీరు పట్టుకొని గదిలోని కేగినది. ప్రక్కకుర్చీపై నాసీనయైనది. భర్త యామె రాక గ్రహించి యామెవంకకు దిరిగి చిరునవ్వు నవ్వినాడు. తాను నిజముగా నదృష్టవంతురాలు ఏమో! లక్షాధికారులు కాకపోయినను తాను తనభర్త సుఖముగ గాలక్షేపము జేయుచున్నారు. తనవివాహమై ఎన్నిసంవత్సరము లైనది? అప్పుడే పెద్దబిడ్డ కమలమునకు పండ్రెండు వత్సరములు దాటినవి. ప్రస్తుత లోకాచారముప్రకారము బిడ్డకు పెండ్లియీడు వచ్చినది. కాని ఆయనగారు పసిపిల్లలకు పెండ్లిం డ్లేమిటి? దేశములో నున్న బాలవిధవలు చాల కాయని కసరుకొందురు. ఏమో ఆయనగారి యిష్టము. 'కమలం, పాగింది చూశారా?' అన్నది. అప్పుడే తాను చదువుచున్న దస్త్రలలికి బారవేసి భార్యవంక ప్రసన్న వదనముతో జూచుచున్న భర్త 'కమలం' దృఢమైన పిల్ల. ఏపుగా పెరుగగలదు. పెండ్లి, కార్య మని రభసలు పెట్టకపోయిన, చక్కగా పెరిగి యారోగ్యవతి యగు' నసెను. జయలక్ష్మిగారి యింటియొద్ద కృష్ణుడు చేసిన చిలిపితనము చెప్పినది. 'వాడు శ్రుతిమించి పోవుచున్నాడు. జాగ్రత్తపడకపోయిన చేయి మించిపోవచ్చును. చదువులో, సన్యాసి, కరుకే. గుబులు కుదిరి చదివిన వృద్ధిలోనికి రావచ్చును. వానిని బి. ఏ. వరకు చదివించిన బాగుగ నుండును. కాని డబ్బెక్కడనుండి వచ్చును? మీ జీత మెప్పుడు పెరుగు' నని భర్తను ప్రశ్నించినది. 'భగవంతుని కెఱుక. నే నెట్లు చెప్పగలను? నా పైయుద్యోగి నాయందు ప్రసన్నుడుగనే యున్నాడు. మాడిపార్టుమెంటులో నున్న దావే యిది, మావంటి చిన్నయుద్యోగుల లావాదేవులు, మాపైయధికారుల ఆగ్రహానుగ్రహములపై నాధారపడి యుండును!' అని నాడు. భార్య నిట్టూర్పు విడిచినది. ప్రపంచము మిక్కిలి యన్యాయమైనది. పాపము, రాత్రింబవళ్లు వారు కష్టించినను, తుదకు బిడ్డలకు సరిగా జదువుజెప్పించు యోగ్యత యైన నుండదు కాబోలును! 'రాముని స్కూల్ ఫైనల్ తో మాన్పించవలసియుండును. ట్రైనింగునకు పంపించి టీచరును జేయుటయా లేక యేతాలూకాకచ్చేరిలోనో చేర్పించుటయా? ఒకవేళ ప్లీడరుగుమాస్తా బాగుగ నుండునేమో– వానియదృష్టము బాగుగ నున్న ఎంతయైన సంపాదించుకొనవచ్చును. వెంకటకృష్ణయ్యగారి గుమాస్తాను చూడుడు. ఆయనగా రేమి చదువుకొనినారు? ఏఫస్టుఫారమో చదివినా డందురు. మనిషి చూడబోయిన మఱింత తెలివిగలవాడుగా గన్పించడు. మాటలలో గాని, చేతలలో గాని సున్నితము లేదు. నిజమున కొక్కరకము మనిషి. అట్టివాడుగూడ సలక్షణముగ సంపాదించుకొనుట లేదా? ఈమధ్యనే దివ్యమైన డాబా కట్టినాడు. వెంకటకృష్ణయ్యగారి డాబా కేమాత్రము తీసిపోదు. ఈయనగారుమాత్రమే యను కొందమన్న, ఆఫీసులోని

రాముసుబ్బయ్యగారి గుమాస్తా పనికూడ నాడుజోరుగా నున్నదట. అతడు మూడవక్లాసువరకైనను జదువుకొన లేదట. మొద్దా, దున్నపోతా, ఎందులోనైన పడి చావ రాదటరా' యని తండ్రి మొదలైనవారు శాపవార్థములు పెట్టుచుండెడివారట. వారిపోరు పడలేక యింటిలోనుండి పారిపోయి, అక్కడక్కడ గొన్నివాళ్లు తిరిగి చివరకు రామసుబ్బయ్యగారియొద్ద ప్రవేశించినాడట. ఇప్పుడతడొక పెద్దవ్యవహర్త. ప్లీడరుగారికి మూడయిన తనకు వరహాక్లయంటులను పిశాచమువలె పీడించుకొని తినునని చెప్పుకొందురు. ఎట్లేడ్చిన నేమి? అప్పుడే యిరువదియెకరముల బంగారమువంటి మాగాణి సంపాదించినాడు. భర్త యుద్దేశ్యము టీచరును జేయవలెనని కాబోలు 'ఇప్పుడేమితొందర వచ్చినది? ఇంకను గొన్నివత్సరములు గడువవలయునుగదా. అప్పటిసంగతి యప్పుడు చూచుకొనవచ్చు' ననినాడు. చటుక్కున మంచమునుండి దిగి భార్యను సమీపించి, 'కొంచెము మంచినీళ్లీయు'మని యడిగినాడు; మంచినీరు త్రాగి రెండవకుర్చీని లాగి దగ్గరగా వేసికొని తానుకూడ తాంబూలచర్వణ మారంభించినాడు. కిటికీ పూర్తిగ దెఱచి యున్నది. ఎంతహాయిగా మలయమారుతము వీచుచున్నది. పూర్ణిమ యెన్నిరోజులలోనో లేదు. బైట పిండియారబోసినట్లు వెన్నెల కాయుచున్నది. ప్రియురాలి యాలింగనమున కెంత యింపైన రాత్రి! మీద చేయి వేసి దగ్గరకు దీసికొనినాడు. దేహ ముప్పొంగ నిండుగ గౌగిలించుకొని, హృదయమున నత్తుకొనినాడు. ప్రేయసి అర్ధనిమీలితలోచన యైనది. ఆమె మృణాళబాహువు లతనికంఠమును బెనవైచినవి.— హృదయములం గలిపిన దంపతుల ప్రేమ యెంత గాఢమైనది! ఎంతనిర్మలమైనది! ఎంతనిశ్చలమైనది! దాంపత్య సౌఖ్యము మానవజీవితమును ధన్యము చేయును.

స్త్రీ గృహలక్ష్మి. ఆమె లేనయిల్లు పాడుపడిన దేవాలయము పుష్పించిన మల్లెపందిరివలె, పొన్నచెట్టువలె, నామె గృహమును శోభాయమానము జేయును. ఆమెయునికివలన గృహము కలకలలాడుచు, నిరంతరము నవ్వుచుండును. ఆమె భర్తకు జేయూత! అతని కామముల దీర్చునప్సరస; అతని సంసారసాగరమును దరింప జేయునావ; అతనిజన్మకు సార్థకము; అతనికి ముక్తి నిచ్చుపరదేవత. ఆమె లేనియెడల నతనిజీవిత మంతయు నంధకారమయము; వ్యర్థము.

శకుంతల

పెనుమర్తి వెంకటరత్నము గారు

౧

తాను మహామునీంద్రుఁడు గదా! సుఖదుఃఖము లాఁగి నిశ్చల
ధ్యానసమాధిలో యుగశతంబులు దివ్యతపస్సుఁ జేసి తా
త్రానధిగమ్య పూర్వవిదితం బగు బ్రహ్మశరీర మందె! నా
నా నిఖిలాండభాండములయందు వెలింగెను సప్తసప్తి యై.

అట్టి మహానుభావుఁ డగునా! మరి యన్యసమాధిభీరు వై
కట్టిడి చేఁతలందు నెఱకాఁ డగు నింద్రుని యప్సరోంగనన్
బట్టి రమించి పాశవిక పాశములం బడెఁ గాని లోనఁ జా
పట్టెడు తేజ మబ్బువడి భావివిధానమునే నెఱుంగఁడే!

సద్యోగర్భజ మైన యానిసుఁగు విశ్వద్వార దుఃఖాగ్రభా
వద్యోతం బగు నేడ్పును న్విని శిలావల్లకీతాత్మంపు వై
శద్యం బై కనుపట్టు స్వీయపలితజ్ఞానంబుచే దైవమో
పీద్యోగంబున నుండి ముక్తుఁ డయి వచ్చెన్ స్వీయవస్త్యోర్వీకిన్.

౨

క్షాత్రమున నుండి బ్రహ్మవర్చస్సు గొనిన - యాకఠోరతపస్వి, దయావిహీనుఁ
డట్లు తను వీడి పోయెడు నట్టివేళ - సిసువుఁ జూచి మేనక కంటినీరు విడిచె.

పొరలి పొంగెడు వాత్సల్యభరముచేత - విడిచిపెట్టదు! కన్నీరు విడుచుఁ గాని
సృష్టిదేహళి కపుడె విచ్చేసియున్న - ఆచిఱుతపాప వెన్నెలల్ పూచి నవ్వ!

మానవజీవితమ్ము రసమాధురి కర్థ మెఱుంగరాని లో
కాన జనించి యాదివిజకాంత, యెదో వచియింపలేని జ
న్మానుగ సౌహృదమ్మువలనన్ విడిపోవను లేద! యచ్చటే
తానును నాఁగిపోవద! సుధాంధసులన్ విడియుండ లేదునన్.

3

మానవుఁడె యయ్యు పాషాణుఁడైన గాధి - సూతి, బంధమ్ము లట్లు త్రెంచుకొని
మానవీభిన్నమైన యామేనక - కీక-భూతలస్నేహసార మేరీతి నుండు? [పోమె!

శ్రావణాకాశ నీలాంబుదావతార - మోహినీమణి, చంచలామూర్తివోలె
భూపథ మతిక్రమించి, తారాపథంపు-టెల్లలం దాఁటి యెచటికో యెగిరిపోమె!

అటు విడిపోవుచున్న తనయంబ కనుంగొని వెక్కివెక్కి యే
డ్చుట యొకటే యెఱుంగు! చిఱుపోనల నశ్రుకణంబు లొక్కటొ
క్కటిగ స్రవించి యాతలిరుకందు, దివంబున వంకఁ జూచు త
త్తటగత నీలమేఘ సముదాయములో తనతల్లి కోసమై.

మేనక ఆతిగుండెలనమే తన కూఁతగ దివ్యవీథిపై
పైన నతిక్రమించు చనపాగత మైన హృదంతసౌహృద
జ్ఞానముచే నధఃస్థితవిశాల జగత్తును జూచిచూచి యే
దో నిశితంపుటార్తిఁ గనుదోయిఁ దొరంగు కదుష్ణబాష్పముల్.

౪

'దివిజకాంత నిర్ఘృణ యయి తిగిచిపోయె-మనుజుఁ డట్టుల తనదు సమాధి కేఁగ
సృష్టి కాధిపత్యంబు వాంఛింపఁబోవు-నీమహాత్ముల కుండదో యేమొ కరుణ?'

'ప్రేమమయ మైన జీవనగ్రామమందు-హింస వెట్టుకిరాతకుం డీనరుండు! [ణాళి.'
జడిమఁ బూని యింద్రియసుఖశయ్యలందుఁ-దదితర మెఱుంగఁబోవ రైంద్రప్ర

'ఓశకుంతములార, మీ రూరకొనక-స్నేహరస మెండిపోయిన జీవకోటి
దప్పికలు తీర ప్రేమదుగ్ధములు పోసి-రండు! రక్షించి పొండు దుర్గతులనుండి!'

అనుచు విహంగరాజులు విహాయన కేళి చరింపఁబోయి యుం
డినపులుఁగుం గుటుంబములనెల్లను గూడుక సప్తపర్ణవే
దిని కెవుకెవ్వుమంచు నలుదిక్కుల కేడ్చెడు పూపపాప క
ల్లన నిజపక్షచామరములన్ దగ వీచుచుఁ జేరియుండిరన్.

మానవకృతఘ్నతాఫల మైన చిన్ని-పాపఁగని పుల్గుతేల్గు సంతాపపడుచు
ఎఱకలం గప్పి భానూష్మ చొరనియట్లు-కంటి కొకతప్పవలె తమకమునఁ బెంచు!

౫

కలికికోయిల జోలపాటలను బాడు-వనమయూరి నృత్యప్రౌఢిమను వచించు
పూలతోఁటల వాహ్యాళిఁ బూవుఁదేనె-మొగ్గలం దెచ్చి భ్రమరిక లుగ్గుపోయు!

అలనసమీరచాలనగతాగతశీతలితోర్మిడోలిలో
మలయదరీకుమార పవమానుఁడు తానములాడి యాశకుం
తలయలకల్ కదల్చి, నలఁతన్ బడ సీక శరన్నిశాకరుం
డలమును గంధముల్ కపుర మద్దినతావి జవాదిచిక్కనన్.

మాశకుంతల పెద్ద దై మనసు తెలిసి-అత్తవారింటి కేఁగెడునట్టివేళ
గర్భమంధర యగు లేడిఁగని, విషాద-బాష్పముల జార్చి సంతాపపడెను సృష్టి!
సృష్టిలోఁ గల చేతనాచేతనముల-వలపు గొనియున్న మాశకుంతలను జూచి
ఏరసాలాగ్రమున దాఁగనేమొ కాని-కాళిదాస పికమ్ము రాగములు మునరె!

గురుశిష్యసంవాదము

కూచి నరసింహము గారు

దసరాపండుగలకు సెలవు లిచ్చినారు కొంత విశ్రాంతి కలిగినది. శిరోభ్రమణ రోగికిఁ జిత్తవిశ్రాంతి సుఖము "కొంత" గాక పూర్తిగా నెట్లు లభింపఁగలదు?

నవమినాఁడు నావంటి రుగ్ణున కుదాత్తమనియే చెప్పఁదగిన భోజనము చేసి, పుస్తకాలబల్లప్రక్కనున్న పడుకకురిచీపైఁ గాళ్లు చాఁచుకొని పరుండియుండఁగా నాకుఁ గునికిపాట్లు వచ్చినవి. కన్నులు మూఁతపడినందున జాగ్రదవస్థ యనలేను; చుట్టుపట్లనుండి వచ్చు చప్పుడు ఛాయగా వినఁబడుచున్నందున స్వప్నావస్థ యనలేను; అదొక చిత్రమైన చిత్తస్థితి! మఱపులో మెలఁకువ, మెలఁకువలో మఱపు! మనసు ద్రొక్కిన పఱగడలుమాత్రము మహాశ్చర్యకరములు. పాఠశాలలో మరల పాఠములు చెప్పితిని. పదముల కర్థనిర్ణయము చేయుటలో నిఘంటుకార్యాలయమనఁ బడుచు పండితులతో సకర్మకాకర్మకాది విషయములఁ గూర్చి వివాదములు పెట్టుకొంటిని. లోడితెఁడు తలలోని కవియన్నియు నెట్లువచ్చినవో, అంత స్వల్పకాలములో నన్నిపను లెట్లు చేసితినో, తెలియఁజాలను. మనఃపిశాచ మంత పర్యటనము చేసి మరల స్వస్థానమున నెట్లు ప్రవేశింపఁ గలిగినదో, యంతకంటెఁ దెలియదు. అనుభవైకవేద్యమైన యట్టి యనిర్వచనీయస్థితిలో నుండఁగా, "అయ్యా! నమస్కారము" అను మాటలు వచ్చి చెవిని బడినవి. ఉలికిపడి లేచి చూచితిని. చిత్తకల్పితచిత్రపీకతాసౌధ మంతయు నిట్టెకూలి మాయమైనది. కళవళముతోఁ గనులు విప్పి యర్థవ్యక్తము లైన మాటలతో "అయ్యా! దయచేయుఁడు" అని కుర్చీనుండి కొంచెము లేచి, యెదుటనున్న మఱియొక కుర్చీవైపునకు చేయిచాఁపి చూపితిని. "తమ గట్లు మన్నించి దయచేయుమనుట ధర్మము గాదు; నేను మీపూర్వశిష్యులలో నొకఁడను." అని గదిలోనికి వచ్చిన పాతిక ముప్పదియేండ్ల పడుచువాఁడు పలికినాఁడు. మనసు కుదురుపఱచుకొని లేచిచూచి "నీవయ్యా, రా, కూరుచుండుము" అని యంటిని. మా యిరువుర కంతట నీక్రింది సంభాషణము జరిగినది.

అతఁడు—నేఁడు సుదినము, ఇన్నాళ్లకు నాకు మీ దర్శనలాభము కలిగినది.

నేను—నాయనా! ప్రాఁత శిష్యులతోఁ బ్రసంగించుట నాకును బరమ సంతోషకరము, నాకు మీరు పోషణశ్రమ మిసుమంతయేనియు నీయకుండఁ బూర్ణప్రేమచూపు ముద్దుబిడ్డలు.

అ—స్వపోషణసామర్థ్యము మాకు మీవలననే కాదా కలిగినది. ఆభారము మాత్రము మేము మీకిచ్చుటమానలేదు. మిక్కిలి చిక్కినట్లున్నారు.

నే—ఔను నాయనా! ఆరోగ్యము సరిగాలేదు.

అ—అదిగో బల్లమీఁద ఆశ్వయుజమాస భారతీ పత్రికయున్నదే అది చక్కని సచిత్రమాసపత్రిక సుమండీ! వివిధవిషయములఁ గూర్చి విఖ్యాతపురుషులు పద్యగద్యాత్మకములగు వ్యాసములు వ్రాసి యందుఁ బ్రకటించుచున్నారు. మీరేమియు వ్రాయుటలే దెందుచేత?

నే—ఓపిక లేదు, తీఱిక లేదు, వ్యాధిగ్రస్తుఁడనైయున్నాను. ఏదైన వ్రాసి పంపుమని మూఁడు నెలల నుండి పత్రికాధిపతు లుచితముగా వారియమూల్యమైన భారతి నాకంపుచున్నారు. సేవపరిగ్రహవ్రతముఁ బూనినవాఁడనుగాను గాని, యూరక పుచ్చుకొని చదువుచు నించుకైనను భారతీసేవ చేయఁజాలమి కెంతయుఁ జింతిల్లుచున్నాను.

అ:—వయోధికు లగు డెబ్బదియేండ్ల వృద్ధాది సుబ్బారాయకవీంద్రులే యింకను భారతి కేదో వ్రాసి పంపుచున్నారఁట కాదా?

శి:—ఔను, వారు నాకుగురుతుల్యులు, వయోవృద్ధులేకాక జ్ఞానవృద్ధులు. ఆంధ్రలోకమునకెల్ల వందనీయులు. ఈ భారతి సంచికలో "విమానము"నుగూర్చి వారు వ్రాసిన సరసపద్యములు చదివి యానందించినాను. వయసుచే వారి కవితాపటిమ సడలినట్లు నాకగపడలేదు. వారిస్థితి వేఱు; అఱువది రెండేండ్లవాఁడనైనను నాస్థితి వేఱు.

అ:— తలచుగాఁ గాకపోయినను, అప్పుడప్పుడైన నేదోయొక గద్యమో పద్యమో వ్రాసి మీరును పంపుచుండరాదా? భారతీపత్రికలలో నావంటి మీ శిష్యులనేకులున్నారు. మీ వ్రాఁతలు వారు చదివిచూచి మిమ్ముఁ జూచినట్లే సంతోషించుచుందురు.

శి:—బాబూ! నాకును అట్టి సంకల్పముగలదు, కాని సంకల్పసిద్ధికిఁ జాలిన సామర్థ్యముమాత్రము అగపడుటలేదు.

అ:— ముందు మాట చూచుకొందముగాని, యిప్పుడు నే నేఁడు ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరము లిచ్చి, ప్రస్తుతమవి ప్రకటనార్థము భారతీపత్రికకంపి మీ చింత కొంత వాపుకొనుఁడు. ఎంతప్రాఁతదైనను, ఇనుపతునుకతోఁ గొట్టినప్పుడు చెకుముకిరాతినుండి స్ఫులింగములు రాకమానవు.

శి:—చెకుముకి రాయియో! చివుకురాటాకు పాయయో! సాదృశ్యసమంజసత్వమున కేమిగాని, నీవడుగఁదలఁచుకొన్న ప్రశ్నలడుగుము. శక్యమైన, జవాబు లిచ్చెదను.

అ:—ప్రస్తుత విద్యాపద్ధతి బాగుగా నున్నదా? సంస్కారణము నపేక్షించుచున్నదా?

శి:—నే నధ్యాపకవృత్తి విడిచిపెట్టి అప్పుడే రమారమి పది సంవత్సరములైనది. ఇప్పటి విద్యావిధాన మెట్లున్నదో నేనెఱుఁగను.

అ:—కాల మహాప్రవాహములోఁ బదియేండ్లనఁగా నెంత? భేదమున్నను అది యంత గణనీయముగాదు. అప్పటిస్థితిగతులను బట్టియే మీ యభిప్రాయ మీయ వచ్చును.

శి:—అట్లైన, నాకుఁదోఁచిన మాటలు చెప్పుచున్నాను విను. అవి యందఱకును నచ్చునో నచ్చవో మాత్రము నేఁ జెప్పఁజాలను. విద్యావిధానము కేవల విదేశీయముగానున్నది. అది మన దేశాభ్యుదయమునకనుకూలమేకాక, యనర్థోత్పాదకము, అతివ్యయాత్మకము, అనర్థకరము. చదువుకై సర్వస్వమును గోల్పోయి చితికిలఁబడిన సంసారము లనేకము లిప్పుడగపడుచున్నవి.

అ:— అయ్యయో! అట్లనుచున్నారేమి? ఆంగ్ల విద్యార్థు లెంతమంది యెన్ని యున్నతోద్యోగములలోఁ బ్రవేశించినారు! వందలకొలఁది జీతములు పుచ్చుకొనుచున్నవారు వేలకొలఁదిగా నున్నారే! గోఁచిపాఁతరాయలు కుబేరులైనారే! లక్షాధికారులైన లాయర్లతోను, ఎంజినీయర్లతోను, డాక్టర్లతోను, ఇంక ననేకేతరపరిపాలనాశాఖలలోఁ బనిచేసి యుత్తరవయస్సు హాయిగాఁ గడపుకొనువారితోను, దేశము కలకలలాడుచుండఁగా, నిట్టి విపరీతనైరాశ్యపు దీనాలాపములు మీ నోటినుండి వచ్చుట యత్యాశ్చర్యకరముగానున్నది! అందఱ మాట యేల? మీ సుఖజీవన హేతు వాంగ్లవిద్యయా, అన్యమేమైననున్నదా?

శి:—నిజమే, ఆంగ్లవిద్యయే నా మనుగడ సుఖముగా సాగించినది! కాని ప్రజాసమష్టిదృష్టివలనఁగాని, యేకైకనిదర్శనములతోఁ జూచు వ్యష్టిదృష్టివలన, దేశము యొక్క వాస్తవికస్థితి గోచరింపఁజాలదు. నీవు బి. యల్ చదివి చరితార్థుఁడవైతివి గదా! నా బిరుదముకంటె నీ బిరుదములో రెండక్షరము లెక్కువగా నున్నవి గదా! ఎంత డబ్బు వ్యయముచేసి యీ బిరుదము సంపాదించినావు? దానికి బ్రతిఫలముగ న్యాయవాదవృత్తివలన నీవు డెంత గడించుచున్నావు. నిజము దాఁపక చెప్పుము.

అ:—చిక్కు ప్రశ్నయే వేసినారు. మా వృత్తిలో సత్యగోపన మంతదోషముగాదు కాని, గురువుగారియెదుట నబద్ధమాడ బుద్ధిపుట్టుటలేదు. నా చదువుకై చేసిన ఋణములో సగమైనను ఇంకను నా రాబడివలన నేఁ దీర్చుకొనలేకున్నాను. అది నా లోపముగాదు. వీకఫలాపేక్షు

లైన నావంటి చతురక్షరబిరుదాంచితు లనేకులున్నారు. సర కెక్కువగానున్న వెల తక్కువ యగునుగాదా!

నే:—కావుననే, నీవంటివారును, నీకంటెను దరిద్రతరదశలో నున్నవారును, దేశములో నెందరున్నారో యితఃపూర్వము నీవు పేర్కొనిన వారివంటి విత్తాధికు లెందరుండి రున్నారో, కొంచెము నిదానించి చూచుకొందము. మనము చూచుకొన నక్కఱయే లేదు. ప్రభుత్వమువారును, ప్రజానాయకులును ప్రకటించుచుండు లెక్కలే సత్యమును జాటుచున్నవి. హైందవుని సగటాదాయమును ఆంగ్ల దేశస్థుని సగటాదాయమును త్రా వేలు వేసి చూచుకొనుము. కట్టబట్టలేక, తినఁ దిండిలేక మలమల మాడుచున్న క్షామరోగపీడిత జీవచ్ఛవములను జూడుము. బిచ్చకాండ్ర యమితసంఖ్య చూడుము. దేశదుర్దారిద్ర్యమున కింతకంటెఁ బ్రత్యక్షప్రమాణ మేమి కావలయును?

అ—సరియేకాని, దేశదరిద్రతకును, విద్యావిధానమునకును ఏమి సంబంధమున్నది?

నే—ఉన్నసంబంధము నీకుమాత్రము తెలియదా? అది నాచేఁ జెప్పించి పత్రికకంపఁజూచుచున్నావు. అట్లే కానిమ్ము—

చదువునుబట్టి సంపాదనశక్తి యుండును; సంపాదనసామర్థ్యమునుబట్టి దేశభాగ్యముండును. కనుక దేశదారిద్ర్యమునకును దేశవిద్యాపద్ధతులకును సంబంధ మున్నదని చెప్పక తప్పదు. ఏమనెదవు?

అ—వ్యాస మతి దీర్ఘము కాఁగూడదు. మీ ధోరణికి నేనడ్డురాను; ముందఱికి సాగిపొండు.

నే—బ్రహ్మాండమంత భారతభూమిని పాశ్చాత్యులగు నాంగ్లేయులు జయించి దానికిఁ బ్రభువులైనారు. పరిపాలనకృత్యములందు, వారిభాషావ్యవహార సంప్రదాయము తెలిసిన హైందవులు వారికి సహాయముగావలసి వచ్చినారు. కనుక మెకాలేదొరగారు తమవిద్యావిధానమును మనదేశములో నెలకొల్పి కృతకృత్యులైనారు. గొప్ప యుద్యోగములు దొరకుచున్నవని చంకలు గొట్టుకొనుచు మనవారు స్వధర్మ స్వవృత్తులను మానుకొని ఆంగ్ల పాఠశాలలోఁ బ్రవేశింప మొదలుపెట్టినారు. క్రమక్రమముగా బడి జీతములు పెరిగినవి. విద్యార్థివన నిర్మాణాదులకై వేలును, లక్షలును దేశధనమునుండి వెచ్చింపఁబడినవి. ఇసుక్ల తెరలవలె, ఏఁటేఁటను బి. ఏ. లును, బి. యలు లును, యమ్. ఏ. లును బయలుదేఱుచుండిరి. ఉద్యోగస్థానములు తక్కువవైనవి; ఉద్యోగార్థు లెక్కువయైనారు. పూర్వవృత్తులు పాలిసిపోయినవి. పదార్థనిర్మాతలు తగ్గినారు. పండినపంట నమలివేయు నోళ్లు బహుసంఖ్యాకములయినవి. విదేశీయభోగపదార్థములు తరంగములవలె వచ్చి దేశముపైఁబడి దేశధన మన్యదేశములకుఁ గొట్టివేయుచున్నవి. అగ్గిపెట్టెలు, గుండుసూదులు, సాళీలు, గాజుసరకులు గడియారములు—ఇట్టు లెన్నియో యన్నోదకములవలె మన కత్యావశ్యకములైనవి. నిత్యోపయుక్తములగుచున్న యట్టివస్తువులు చేసికొనుట యెట్లో దేశీయులకుఁ దెలియదు. అవి మానుకొని వారు తమ పూర్వపుఁ గష్టజీవనము చేయఁజాలరు. వేలకొలఁది యంత్రములు వాడుకలోనికి వచ్చినవి. అవి లేకుండనుండలేము; వానినిచ్చటఁ జేసికొనలేము. అన్నియుఁ బరదేశములనుండి రావలెను. వర్షవర్షమునకుఁ బరాపేక్ష ప్రబలి స్వతంత్రతను జంపివేయుచున్నది. వివిధయంత్రనిర్మాణవిషయకములైన శాస్త్రీయాంశములఁగూర్చి చక్కని విపుల వ్యాసము లాంగ్ల విద్యాపారంగతులైన మనవారు వ్రాసి ప్రకటింపఁగలరు; ప్రయోగభాగముమాత్రము పరమరహస్యమైన మంత్రమువలె నింకను బరదేశీయులలోనే యున్నది. డబ్బులేదు; యంత్రనిర్మాణనైపుణి లేదు; బ్రహ్మరాక్షసులవలె నిరువదినాలుగుగంటలును పనిచేయుచుండు యంత్రములతోఁ గక్షగట్టి యుత్తచేతులు తమ పంతమెట్లు నెగ్గించుకొనఁగలవు? నాయనా, మన దేశస్థితియు క్షయరోగి దేహస్థితియు నొక్కతీరుగా నున్నవి.

అ—నివారణసాధనము తెలియఁగింపని రోగనిదానము నిష్ప్రయోజనము.

నే— మునిసిపాలిటీలును, లోకలుబోర్డులును భారము వహించి పిల్లలకు, ఆచండాలము ఉచితముగా

నిర్బంధముగా ప్రాథమికపాఠశాలలలో విద్య నేర్పింపవలెను. చేతిపనులు మున్నగు వృత్తివిద్యలు మామూలు చదువుతోపాటు కలుపవలెను. ప్రైమరీవిద్యతోఁ జదువు చాలించుకొను బాలుఁడు పైతము జీవికకనువైన చిన్న వృత్తివిద్య యేదో యొకటి నేర్చియుండవలెను.

మాధ్యమిక పాఠశాలలు స్థాపించి కొలఁది జీతములు పనూలుచేసి స్కూలు ఫైనలువఱకు పిల్లలకుఁ బై చదువు చెప్పింపవలెను. బసులు పెట్టుట ఆరోగ్యభంగకరములు గాకున్నఁ జాలును. పిల్లలకును ధనవాదులకును అతివ్యయము చేయనక్కఱలేదు. విద్యాశాఖాధికారులు ప్రస్తుత నియమ కాఠిన్యమును తగ్గించి యట్టిబసులు పెట్టుట కనుజ్ఞ యీయవలెను. ప్రాథమిక పాఠశాలలో కంటె నింకెక్కువగా వృత్తివిద్యలు నేర్పు ఏర్పాటులు గావింపవలెను. మాధ్యమిక పాఠశాలతోఁ జదువు ముగించుకొను బాలుఁడు సుఖజీవనము చేయుటకుఁ జాలిన యొకటి రెండు వృత్తివిద్యలు నేర్చుకొని యుండవలెను. ప్రస్తుతదేశస్థితిలో విత్తకరిగానివిద్య నిష్ప్రయోజనమైన విద్య. తర్క-వ్యాకరణాది విద్యలు నేర్చుకొనియున్న సంస్కృతపండితుల కావిద్యలెట్లుపకరించుచున్నవో, కేవలాంగ్ల భాషావేత్తలకు వారి విద్యలును నట్లే యుపకరించును.

ఉన్నత విద్యాబోధకములగు కళాశాలలకు ధనవత్కుటుంబముల బాలురే పోవలెను. సామాన్యసంసార స్థితిలోనున్న వారు తమ తాహతునకు మించిన పరుగు లెత్తి పడిపోఁగూడదు. అసాధారణమేధాసంపన్నులగు పేదపిల్లలు, దేశాభిమానులగు వదాన్యుల తోడ్పాటు పడయఁగలిగినచోఁ బై చదువు చదువవచ్చును.

అ:—ఇది చేయవలెను, ఇది చేయఁగూడదు. అని యేమేమో విధినిషేధవాక్యములు పలవిచ్చుచున్నారుగాని సాధ్యాసాధ్యత లాలోచించి చెప్పుచున్నట్లగపడదు. వృత్తివిద్యలు, వృత్తివిద్యలు అందురుగదా; ఆ విద్యలేవి? వర్ణధర్మములు పాటింపరా? బోధ్యవిషయము లేవో, పఠనీయగ్రంథము లేవో, విద్యాపరిసమాప్తికిఁ బట్టు కాలమెంతో, సవిస్తరముగాఁ జెప్పిన బాగుగానుండును.

నే:—నాయభిప్రాయము లిట స్థూలముగామాత్రమే యీయఁగలను. దప్పిర్లలోనికి దిగిన యెడలఁ బెద్ద గ్రంథమగును

తాటాకులు, వెదురుబద్దలు, పేము — మున్నగు వానితోఁజేయు అల్లికపనులు, నారతోను, పేఁచుతోను నులక, పురిత్రాళ్లు మొదలగునవి పేనుట, వ్యవసాయము, వడ్రంగిపని, కమ్మరపని, చెంబులచేఁత, పోఁత, నూలు వడకుట, బట్టలనేఁత, రంగులపని, దర్జీపని, అచ్చుకూర్పు పుస్తకములు కుట్టి యట్టలు కట్టుట — ఇట్టి వెన్నియో యున్నవి. స్థలమునుబట్టి, ద్రవ్యబలమునుబట్టి, యితర పరిస్థితులఁబట్టి, యట్టివెన్నుకొని నేర్పవలెను. చేసినసరకుల వలన వచ్చుసొమ్ములోఁ గొంతభాగము అవిచేసిన పిల్లలకు బహుమతిగా నిచ్చుచుండు నెడల, నది మఱియుఁ బ్రోత్సాహకముగా నుండును.

నాయనా, వర్ణధర్మములు పాటించుకాలము పోయినది. ఏ యెండ కాగొడుగు పట్టవలెను. ఇప్పుడు వర్ణములఁబట్టి వృత్తులు లేవు. ఇప్పుడన నేల? చిరకాలము నుండి లేవు! వీరివృత్తులు వారును, వారి వృత్తులు వీరును జేయుచున్నారు. వ్యాపారములలో న్యూనాధిక భేదములు పాటింపఁగూడదు. పనిగా న్యాయ్యముగాఁ జేయు నెడలఁ బ్రతివృత్తియును ప్రశస్తమైనదే; తెలివి తేటలును, యోగ్యతయు నే గౌరవార్హములైన ప్రధాన లక్షణములు.

అ:—మీయాశయమునుబట్టి మాధ్యమిక విద్యయగుటకు నెన్నియేండ్లుపట్టును?

నే:—ప్రాథమికవిద్యకు మూఁడేండ్లును, మాధ్యమికవిద్య కాఱేండ్లును—వెరసి తొమ్మిదేండ్లుచాలునని తోఁచుచున్నది.

అ:—వృత్తివిద్యలు నేర్చియును మీరు 11 సంవత్సరముల చదువును తొమ్మిదేండ్లకు దిగలాగినారే!

నే:—ఔను, అనావశ్యకములైన పేడబములు విసర్జించిన యెడల, నించుమించుగాఁ దొమ్మిదేండ్లు చాలుననుకొనియెదను.

నేనుద్యోగము చాలించుకొనిన పిదప, రోజున కొక యరగంటసేపైనఁ, దత్పూర్వ మింగ్లీషేమియు నెఱుఁగని వ్యక్తియొకఁడు నొకబాలున కింగ్లీషుచెప్పి, రెండేండ్లలో నతఁ డాంగ్లభాషయందు వాగ్వ్యవహారమున కర్హుఁడగుట కనుఁగొనినాను.

ప్రైమరీ తరగతులలో స్వభాష వ్రాయుట, చదువుట, సామాన్యపు లెక్కలుచేయుట—యివి నేర్పినఁ జాలును. ఇంగ్లీషు అక్కఱలేదు. ఉపవాచకపుస్తకములంతకంటె నక్కఱలేదు. నీతి, ఆరోగ్యము, సత్పురుషుల చారిత్రములు, నిత్యానుభూతములగు వ్యవహారవిషయములు, సంగ్రహములగు ప్రకృతిశాస్త్ర విషయములు—వీనిఁగూర్చి చక్కఁగా వ్రాసిన పుస్తకము సంవత్సరమున కొక్కటి చాలును.

ఆంగ్లభాష మాధ్యమిక పాఠశాలలలోఁ బ్రారంభింపవచ్చును. వ్యవహారమునకుఁ గావలయు నాంగ్లభాషాజ్ఞానము సంపాదించుకొనుటకా రేండ్లు చాలును. మాధ్యమిక విద్యఁగఱపుబడులందు స్వభాష, రాజభాష, స్వదేశచరిత్ర, భూగోళశాస్త్రము, ప్రధాన ప్రకృతిశాస్త్రములందలి మూలవిషయములు, గణితశాస్త్రము—ఇవి నేర్పవచ్చును. లెక్కలలో క్షేత్రబీజగణితము లంతర్భూతములై యుండవచ్చును.

అవశ్యపఠనీయములు, ఐచ్ఛికములు—అను విభాగము వృత్తివిద్యలలోఁ దక్క ఇతరత్రయుండఁగూడదు. సవిమర్శపఠనీయ భాషాగ్రంథములు, సామాన్యపఠనీయ భాషాగ్రంథములు—అను ప్రస్తుత విభాగ మనావశ్యకము. మంచి గద్యగ్రంథ మొకటియుఁ జక్కని పద్యగ్రంథ మొకటియు—సంవత్సరమునకు భాషలో రెండు సవిమర్శపాఠ్యగ్రంథములున్నఁజాలును.

వృత్తివిద్యలందును భాషాదీతరవిషయములందును మూఁడేసి తరగతుల కొక ముఖ్యపరీక్షచేసి, యందు విజయమొందినబాలురకు అర్హతాపత్రము లీయవచ్చును.

అ:—పై కళాశాలలఁగూర్చి మీ రేమైనఁ జెప్పెదరా?

నే:—వాని యనుభవము నా కంతగా లేదు. క్రిందిమెట్లకనుగుణముగాఁ బై మెట్లు విశ్వవిద్యాలయాధికారులు ఆలోచించి యేర్పాటుచేయవలెను.

అ—తప్సీళ్లలో కొన్ని తంటాలు రాకమానవు, వానికేమిపోనిండు; మీరుచెప్పినట్లుచేసిన, దేశారిష్టములన్నియుఁబోవునా?

నే—కొన్నిపోవునని యేనా నమ్మిక. తల తిరుగుచున్నది. సంభాషణమిఁకఁ బెరుఁగనీయకుము. ఉపసంహారవాక్యములు కొన్ని చెప్పి నాయుపన్యాసము కట్టిపెట్టెదను.

పరిపాలకులకు నిజదేశాభిమానముకంటెఁ బ్రజానురాగ ప్రజాశ్రేయోభిలాష లెక్కువగా నుండవలెను. వారు తమవారికిఁ గల యంత్రనిర్మాణపాటవమును, శిల్పనైపుణ్యమును పాలితప్రజావర్గమునకు నిష్కపటముగాఁ గఱపవలెను. దేశమునుండివచ్చు ఆదాయము దేశాభివృద్ధికే వినియోగపఱుపవలెనుగాని దానిని దేశము దాఁటి వృథాగాఁ బైకిఁ బోనీయఁగూడదు. పరిపాలనాతంత్రములో జ్ఞానవంతులగు ప్రజల నంతకంతకెక్కువగాఁ బాల్గొనఁజేయవలెను. యుక్తవయస్సు వచ్చిన బిడ్డను వీక్షించి, యధికారలుబ్ధుఁడై వృద్ధపిత, గృహభారమంతయుఁ దనమీఁదనే యుంచుకొనునట్లు వ్యవహరింపఁజనదు.

"నాదేశీయులు చేయఁగల పదార్థములు దక్కఁ దక్కిన భోగపదార్థములు సాధ్యమైనంతవఱకుఁ ద్యజించెదను". అని ప్రజలు కట్టి ప్రతిజ్ఞపట్టి యట్లు జరపుకొనవలెను. "పైతృకమగు ఆస్తి కేదో కొంత యదనముగాఁ జేర్చిపోవనివాఁ డప్రయోజకుఁ"డని ప్రతివాఁడును అనుకొని సముచితమైన మితవ్యయముతో నట్లు తా జీవయాత్ర చేసికొనవలెను. సత్వవేషధారియై మనల నిపుడు మోసపుచ్చుచున్న తమోగుణమును దఱిమివేసి రజోగుణద్వారమున యథార్థమైన సత్వగుణమును సమార్జించుకొనవలెను. పుట్టుకకంటె బుద్ధియు, సౌశీల్యమును పూజ్యతరములని యెంచుకొనవలెను. అనేక కారణములచేనంతరించిపోయిన ప్రాచీన దయాధర్మసత్యశౌచశౌర్యములు మరల సంపా

దించుకొనవలెను. అన్యోన్యవ్యక్తులహము లణచుకొని పరస్పరమైత్రిపరోపకారచింత లలవడఁజేసికొనవలెను. ఉచితవృత్తులగపఱిచి వృద్ధగాత్రులగు పేదలకు జీవికాసాహాయ్యము చేయుటనిజమైన లోకోపకారకృత్యముగాని, యపాత్రదానములుచేసి సోమరితన మభివృద్ధిచేయుట కేవల దేశాపకారము అని వివేచించి తెలిసికొనవలెను. స్వహితపరాఙ్ముఖత్వ పరహితపరాయణత్వములు సర్వమత సమ్మతములయిన యుత్తమ ధర్మములని గౌరవించుకొనవలెను.

ఇట్లు మనము నడచుకొనినచో, పోయినకీర్తిసంపదలు మన దేశమునకు మరల వచ్చునని నేనాశాపూర్ణుఁడనై యున్నాను.

అ—చాలశ్రమ యిచ్చితిని. క్షమింపవలెను. నమస్కారము. (అని లేచెను.)

గు—(అర్ధానుస్వారమువలెఁ గురిచిలోనుండిమందలికి సగమువంగి) శుభమస్తు! శ్రీరామచంద్రప్రసాదసిద్ధిరస్తు! లోకాస్సమస్తా స్సుఖినోభవంతు! (అని యాశీర్వదించి మరల వెనుక కొఱగితిని.)



కామమ్మ, యం. ఏ., యం. యల్.   సుబ్బయ్య, బి. ఏ., బి. యల్.

నా నెల్లూరుమండలయాత్ర

మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు

౨

కందుకూరు చాలాపురాతన గ్రామం. ప్రాచీన పల్లవరాజుల శాసనాలలో కూడా ఈవూరి పేరు వస్తుంది. ఆంధ్రవంశము వారైన సాతవాహనుల తరువాత ఈప్రాంతమును పరిపాలించిన వారు పల్లవరాజులే. ఈ పల్లవరాజుల మొదటిశాసనాలు ప్రాకృతభాషలో ఉన్నవనీ, తరువాతి శాసనాలు సంస్కృతభాషలో ఉన్నవనీ చరిత్రపాఠకులకు తెలిసిన విషయమే. ప్రాకృతము వదలి సంస్కృతభాషతో శాసనాలు వ్రాయించుట ఆరంభించిన మొదటి పల్లవరాజుల శాసనములు అన్నీ నెల్లూరి కుత్తరంగా ఉన్న యీప్రాంతాల దొరికినవే. వీరి శాసనాలలో కందుకూరి పేరు కనబడుతూ ఉండడంవల్ల ఇది చాలాపురాతనస్థలం అని చెప్పడానికి సందేహం లేదు.

పల్లవరాజుల రాజ్యం పోయిన తరువాత ఈ దేశం చాళుక్యవంశపు రాజులకు స్వాధీనం అయినది. ఇక్కడ చాళుక్యులనాటి తెలుగులిపిలోని శిలాశాసనం ఒకటి ఉన్నది. అదులో 'గొణకేనల్లాత'ని పేరూ, 'పాండరంగ'ని పేరూకూడా వస్తుంది. ఈ'గొణకేనల్లాతు'డు వేంగీచాళుక్యులలోని 'గుణక్కనల్లాటు'డే. ఇతనికి (మూడవ) విజయాదిత్యుడని మరొక పేరు ఉన్నది. ఇతను కలి విష్ణువర్ధనుని కొడుకు; వేంగీదేశములో క్రీ. శ. ౬౨౪ వ మొదలు ౬౯౨ వరకు రాజ్యంచేశాడు. పాండరంగడు ఇతనిమంత్రే. ప్రతిబింబముతో సహా ఈశాసనాన్ని బట్టరువర్తు, వేణుగోపాలశెట్టిగార్లు తమ నెల్లూరుమండల శాసనసంపుటాలలో ప్రకటించారు. దీనిలో సీసపద్యం ఉన్నదని కనిపెట్టి కీ. శే. కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావుగారు ఆంధ్రపరిశోధక మహామండలి పంచమ వార్షికోత్సవ అధ్యక్షోపన్యాసంలో ఈశాసనపాఠాన్ని మళ్లీ యిచ్చారు. కందుకూరులో ఈశాసనశిల యిప్పుడు కనబడడం లేదు. కాలం గడచినకొద్దీ వాటిని జాగ్రత పరిస్తేనే తప్ప విడిగా పడిఉన్న శాసనశిలలుకూడా ప్రయాణాలు చేస్తూఉంటవి; అంతర్ధానమూ అవుతూ ఉంటవి.

బట్టరువర్తు వేణుగోపాలశెట్టిగార్ల నాటికి కందుకూరు 'పీర్ల భావి' మెట్లలో అడగి మడగి ఉన్న ప్రతాపరుద్రశాసనశిల దొర్లి దొర్లి యిప్పటికి కందుకూరుతాలూకా ఆఫీసు ఆవరణలోకి వచ్చిఉన్నది. దొర్లి వచ్చేటప్పటికి ఆ శిల ముక్కలై రెండుచెక్కలుగా పడిఉన్నది.

'గొణకే నల్లాత'ని శాసనశిల కనబడుతుందేమో అని ఆవూళ్లో దానికోసం చాలా వెదకినాను. కనబడలేదు. దాన్ని ఎవరు పుణ్యంకట్టుకొన్నారో ఏం తెలుసు? ఈ శాసన ప్రతిబింబమును బట్టి చూస్తే దానిలోని అక్షరాలు చాలా చెడిపోయినవని చెప్పవలెను. అయినా ఆప్రతిబింబమునుబట్టి ఆశాసనపాఠం నేనిట్లా చదివినాను.

చాళుక్యశాసనం: మొదటిపక్క

౧. శ్రీవిక్రమస్య్యణ్డు
౨. సిత్త...సముణ్డు శివ
౩. పదవర . సేవితుణ్డ
౪. ఖిలుణ్డ నతరిపుబ
౫. లుణ్డాహవ రాధరణ్డ
౬. యోగ్యవిషసముణ్డ
౭. గణితద (? దా)నా(?)సవణ్డు గ [? జ]
౮. ....

రెండవపక్క

౯. . లయుణ్డు...హాసణ్డ (?)
౧౦. నపణ్డరంగువ్వి .. జయు గాన్ని

౧౧. కొలదిలేని కో[ట్ల]ంబు ల్యాది (?డి)[చి]

౧౨. గొణకనలాత పక్షపాతి

౧౩. పలలిత... [?ద]. గ౯

౧౪. ....

మూడవపక్క

౧౫. శాకోణ దివ(?డ)వ గొరిప్ల త్ర (?)

ఇదివరకున్న పాఠాలకంటె పైని చేసిచ్చిన ఈ పాఠం ఎక్కువప్రయోజనకారి అనికాని,చాలాబాగున్నదనికాని నేననను. అయినా శాసనం కందుకూరిది గనుకనూ, నేనక్కడికి వెళ్లడం సంభవించినది గనుకనూ, ఆవూళ్లో ఉన్న శాసనాలను గురించి కొంత ప్రసక్తి వచ్చినది గనుకనూ ఆశాసన పాఠం ఇస్తే ఇందులోకూడా పడి ఉంటుందనిమాత్రమే ఇచ్చాను. ఈ పై పాఠాన్ని బట్టి చూస్తే శాసనంలో తప్పులు ఉన్నవేమో అనిపిస్తున్నది. కాని అక్షరాలు చాలాచెడిపోయి సరియైన పాఠానికి అర్థమూ అన్వయమూ కలవడం లేదు గనుక ఈశాసన విషయం ఇంతటితో కట్టిపెట్టుతాను.

చాళుక్యులకాలంలో ఈవూరు మంచిదశ అనుభవించిందనడానికి పాండురంగని అద్దంకి శాసనమే తార్కాణము. చోళరాజులవల్ల ఏ వుపద్రవమూ కలుగకుండా చాళుక్యరాజ్యమును, దక్షిణదిశను కాపాడడానికి ఇది ఆనాడు ప్రధానస్థలంగా ఉండేదని ఆ శాసనమునుబట్టి ఊహింపవచ్చును.

పల్లవ చాళుక్యరాజుల ఏలుబడి అయినమీదట కందుకూరి దశకూడా కొంతకాలంవరకు తగ్గిపోయినట్టు తోస్తుంది. రెడ్లఏలుబడిలో ఊరికి మళ్లీ వైభవంపట్టింది. చాళుక్యశాసనాల తరువాత ఇక్కడ కనబడేవి రెడ్ల శాసనాలే.'

పూర్వం ఇక్కడ రెడ్లు కోట కట్టించి అందుండి ఈప్రాంతదేశమును ఏలుతుండేవారని ప్రతీతి. ఇప్పటికీ కోటసంబంధమైనవనిచెప్పి ఈవూరికి ఉత్తరాన్ని కోట గోడలు, దర్వాజా మొదలైన శిథిలావశేషాలు కొన్ని చూపిస్తూ ఉంటారు. కందుకూరికి అవతిమార్గంలోనే ఉన్నచుండిలోకూడా రెడ్డిరాజులకోట ఉండేదట. పాతచుండివద్ద ఈకోటకు సంబంధించిన శిథిలావశేషాలు ఇప్పటికీ కొన్ని చూడవచ్చునంటారు అక్కడివారు. చుండిలోకూడా రెడ్లశాసనాలు ఉన్నవి.

కందుకూరు, చుండినగరాలు రాజధానులుగా చేసుకొని పరిపాలించిన రెడ్డిరాజులు కొండవీటి రెడ్లకు బంధువులే. శ్రీశైలంలో పాతాళగంగకు సోపానాలు నిర్మించి కొండవీటి రెడ్డిరాజ్యం స్థాపించిన వేమాయరెడ్డిం గారి సోదరుడు మల్లాయరెడ్డింగారే ఈ కోవవారికి మూలపురుషుడు. ఈయన వేమాయరెడ్డింగారి సేనాధిపతులలో ఒకడు; చాలా పరాక్రమవంతుడు; తురకలను జయించి వారు తీసుకొన్న బ్రాహ్మణాగ్రహారాలు తిరిగి బ్రాహ్మణుల కిప్పించినవాడు. కందుకూరు చుండి ప్రాంతాల గనబడే శాసనాలను బట్టి ఈకోవ వారి వంశావతారక్రమం ఇది.


వీరిలో చాలామంది గుళ్లూ గోపురాలూ కట్టించి ప్రజోపయోగం నిమిత్తం అనేక తటాకాలు నిర్మించారు. శాసనాలలో ఈరెడ్డిరాజులు కవీంద్రప్రకరసుర తరువులనిన్నీ, సంగీత సాహిత్య గుణజ్ఞులనిన్నీ, అనేక దేవాలయ తటాకప్రతిష్ఠాతలనిన్నీ ప్రశస్తులు పొందినారు. కందుకూరిలో వేమారెడ్డిగారి సైన్యాధిపతి అయిన మల్లారెడ్డింగారి శాసనమున్నూ, ఆయనమనుమడు రాచవేమారెడ్డింగారి శాసనమున్నూ ఉన్నవి. ఈశాసనాలు కోటలోని మసీదుస్తంభాలమీద ఉన్నవి. స్కన్దపురి జనార్దనస్వామివారికి చేసిన దానధర్మాల శాసనాలక్కడ ఉండడంవల్ల ఈమసీదు పూర్వం జనార్దనస్వామి ఆలయంగా ఉండేదనిన్నీ, ఈ స్తంభాలు ఆగుడి మండపస్తంభాలనిన్నీ ఊహించవచ్చును. తురకల 'తళ్లి'లో ఈ ఆలయాని కీగతి ప్రాప్తించి ఉండవచ్చును. ఆలయానికి సంబంధించిన శిల్పపురాళ్లు ఈవూళ్లో బావులవద్దను ఇతరచోట్లను ఇప్పటికీ కనబడుతవి.

రెడ్డిరాజుల ప్రభుత్వంతో ఈవూరిదశ మళ్లీ మళ్లి పోయింది. వారి తరువాత ఈప్రాంతమును ఏలినవారి

శాసనాలేవీ ఇక్కడ కనబడకపోవడాన్నిబట్టి రెడ్డి రాజుల రాజరికం పోయినతరువాత ఈవూరి ప్రాముఖ్యం కొంత తగ్గివుంటుందని తోస్తుంది.

కందుకూరునుంచి పెట్లూరికి రైలుదేరినాను. నాతో మన్మిత్రులు అనంత లక్ష్మీనరసింహముగారు* వస్తానన్నారు.

కందుకూరి రెడ్డిరాజుల వంశవృక్షము



* వీరు అనంత సత్యనారాయణగారి సోదరులు. బి. యే. పరీక్షప్యాసయి వైద్యపరీక్ష యమ్. బి. కి చదువుతూ సహాయనిరాకరణోద్యమంరాగానే దేశాభిమానపూరితులై సత్యనారాయణగారు చదువుమానివేసి ఉద్యమంలో ప్రవేశించి కొంతకాలం ప్రచారంచేసి రాజకీయగ్రంథాలూ, స్వరాజ్యగీతాలూ మొదలైనవి ప్రకటించి, చివరకు ఖద్దరులో దిగినారు. కనిగిరి, కందుకూరుతాలూకా గ్రామాలలో గాంధిమహాత్ముని ఖద్దరుఉద్యమం రాకపూర్వమునుంచీ కూడా రాట్నములు తిరుగుతూ ఉండడంచేతనూ, 'నూలనూలు' వాడుకలో ఉండడంచేతనూ, ఆప్రాంతాలు పత్తి పండేస్థలాలు గనుక ముడిపత్తి విశేషంగా దొరకడానికి అవకాశం ఉండడంచేతనూ సత్యనారాయణగారు కుటుంబసహితంగా కందుకూరులోనే స్థిరపడి ఈపరిశ్రమ ప్రారంభించి వ్యాపారంసాగించి తమ సర్వస్వాన్నే కాకుండా నిరాడంబరమైన ఆదేశసేవలో చివరకు తమ ప్రాణాన్నికూడా ఆహుతియిచ్చారు. ఆయనసోదరులైన ఈ నరసింహముగారు ఇప్పటికీ ఎన్నెన్ని విఘాతాలు వస్తున్నా అన్నగారు చూపినమార్గాన్నే పోతూ శక్తికితగినట్లు ఆ పరిశ్రమ సాగిస్తున్నారు.

1 Kr 43. N. 1. vol II, 568.
2. Kr 35. N. 1. vol II, 549.
3. Kr I8. N. 1. vol II, 503.
„ Kr 19. N. 1. vol II, 505.
„ Kr 21, N. 1. vol II, 515.
4. N. 1. Cd vol. I, 5.
5. Kr 16. N. 1. P 195.
6. అనుబంధము చూడుడు.

వారూ నేనూ ఉదయాన్నే సైకిలుదేరి పొన్నలూరి మీదుగా వెళ్లినాము. పొన్నలూరు చెరువు చాలా పెద్దది. దీనికింద వరిపంట విస్తారము. పొన్నలూరి మీదుగా పచ్చవ చేరుకొనేటప్పటికి మధ్యాహ్నం పదకొండో, పదకొండున్నరో అయింది. ఆవూళ్లో వడివీథిలో శాసన శిల ఉన్నదికాని తీరా పోయి చూచేసరికి అది శిథిలయంత్రమైనది. పచ్చవ పాలేటిఒడ్డున ఉన్నది. ఇక్కడ రమారమి మూడువందలవరకు ఉంటవన్నారు రాట్టాలు. మేము వెళ్లినది పత్తిపట్టేరోజులవడంచేత పత్తిరాట్టముల చప్పుడు కిఱ్ఱా కఱ్ఱా మంటూ వినబడుతూ ఉండేది.

పచ్చవలో భోజనంచేసి మధ్యాహ్నం రెండున్నర గంటలకు మళ్లీ ప్రయాణం సాగించాము. అక్కడక్కడ పత్తిచేలూ, పత్తివడిచేవాళ్లూ తక్క మాకింక ఏమీ కనబడలేదు. పేరాపురం, జాళ్లపాలెముల మీదుగా సాయంత్రానికి పెట్లూరు చేరుకొన్నాము.

ఇదంతా రేగుకంపరాజ్యం. మోకాలియెత్తున పెరిగే రేగుడొంకలుతప్ప చెట్లూ చేమలూ ఏమీ కనబడవిచ్చట. అంతా రాతిభూమి. మంచిఎండలో వెడితే తలదాచుకోడానికి దారిలో ఎక్కడా నీడ దొరకదు. చెట్టన్నది ఉంటేగా. చెట్లు కనబడుతున్నవంటే అక్కడ గ్రామం ఉన్నదన్నమాటే. ప్రతీగ్రామానికీ ఈప్రాంతాల చుట్టూ చింతతోపులో మామిడితోపులో ఉంటవి. గ్రామందాటితే మళ్లీగ్రామానికి వెళ్లేవరకూ దారిలో చెట్లే కానుకదా తుదకు పురుగుకూడా కనబడదు. అంతా ఎడారిలాగుంటుంది. కాకి సంచారం కూడా చూడం. సరిఅయిన బాటలే లేవు. బండి తోవలున్నది ఏకొద్ది ఊళ్లకోమాత్రమే. ఊరికీ ఊరికీ మధ్య చీలితోవలు హెచ్చు. ఏతోవనుపోతే ఎక్కడికి పోతుందో—వాగుకే పోతుందో వంకకే పోతుందో, కొండకే పోతుందో, ఊరికే పోతుందో—దారిలో చెప్పేవా రెవ్వరూ కనబడరు. వర్షాకాలం పైరూపంటారోజులు. కనబడితే అంగణ్ణోకరు ఆమణ్ణోకరు అప్పుడే కనిపించాలి; అంతే. ఏవూళ్లోనూ బ్రాంచిపోస్టాఫీసుకూడా లేదు. కందుకూరితాలూకా పెట్లూరికి అక్కడికి ఎనిమిదో పదో మైళ్ల దూరంలో ఉన్న మద్దులూరినుంచి వస్తాడట ఉత్తరాలు తెచ్చే అతను. (ఆమద్దులూరు గ్రామం గుంటూరుజిల్లా ఒంగోలుతాలూకాలోది). ఇతని 'బీటు'లో రమారమి ఇరవై రెండు గ్రామాలదాకా ఉన్నవన్నారు నిజమో అబద్ధమో! ఈప్రాంతాల కొన్నికొన్ని ఊళ్లలో బ్రాహ్మణులే లేరు. ఆవున్న బ్రాహ్మణులకుకూడా వరి అన్నం కరవే. శ్రీనాథుడు పల్నాటిని గురించి వ్రాసినట్లు ఇక్కడ

చిన్నచిన్న రాళ్లు - చిల్లరదేవళ్లు
సజ్జజొన్నకూళ్లు-సర్పంబులును దేళ్లు

విశేషం.

జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తప్పన్
సన్నన్నము సున్నసుమీ

అన్నట్లు రాగిసంకటి, కొఱ్ఱసంకటి, సజ్జసంకటి, ఆరికెలు, వరిగెలు తప్ప ఇంకేమీ లేదు. ఉద్యోగస్థులకోసం కొందఱు కొందఱు కొంచెంగా బియ్యం నిలవచేసుకొని ఉంచుకొంటారు. కావాలెనంటే ఊళ్లో మళిగ(కోమటి దుకాణం)లో మాత్రం ఏయెఱ్ఱబియ్యమో దొరకుతవి.

దేశంచాలా దరిద్రదేశం. అంతావర్షాధారం. వర్షములు కురిస్తే పంటా, కురవకపోతే మంటాను. ఇటువంటిస్థితిలో ఈవూళ్లు ఇట్లావున్నవంటే ఆశ్చర్యం ఏమిటి! ఈదేశస్వభావాన్నీ, స్థితినీబట్టి అక్కడివాళ్లు 'ఇదంతా రావణాసురుడు చుప్పనాతికి అరణమిచ్చిన రాజ్యం' అంటారు నవ్వుతూను.

ఆరాత్రీ ఆమరునాడు ఉదయమూ అక్కడ ఉండి అక్కడిశాసనాలకు ప్రతిబింబాలు తీసుకొని తరువాత పన్నమూరికి సైకిలుదేరినాము. పన్నమూరికి పొదిలె కొండలు దగ్గరగా కనబడుతూ ఉంటవి. సాయంత్రం ఆవూళ్లోశాసనం ఒకటి ఉండగా దానికి ప్రతిబింబం తీసుకొన్నాం.

తీసిచూస్తే అది పదవశతాబ్దికి పూర్వపుదిగా కనబడలేదు. దానిలో ఉన్నసంవత్సరం తొమ్మిది వందల వలస్థ పైచిల్లర. చిట్టచివర అంక తిన్నగా కనబడడంలేదు. ఆసంవత్సరం శకవర్షమో యేమో తెలియదు. వ్రాతలిపినిబట్టిచూస్తే అది శకవర్షమే అవుతుందనితోచింది. ఇట్లా అయితే ఈశాసనం నన్నయభట్టారకునికి సమకాలంనాటిది అవుతుంది. ఇది బాణరాజుల శాసనం. ఇందులోని సంవత్సరం నెల్లూరు మండలశాసన సంపుటాలలో రాలేదం అని యివ్వడంమూలాన్ని దానికోసం అక్కడికి వెళ్లినాను. కాని ఆశాభంగం కలిగింది ఆ సంవత్సరం చూడగానే. బట్టరువర్తు వేణుగోపాలశెట్టిగార్ల నాటికం టె రాయి చాలా పాడయినది. అందులో దిగువ కొంతమేర ఇటీవల పేడులేచిపోయింది. నెల్లూరు శాసనసంపుటాలలో ఇచ్చిన పాఠంకంటె మంచిపాఠం ఇవ్వలేకపోయినా వెళ్లి ఆశాసనప్రతిబింబం తీసుకువచ్చాను గనుక దానినిబట్టి నేను చదివిన పాఠం ఈక్రింద ఇస్తున్నాను. ఇందులో కొన్ని అక్షరాలు నాకింకా సందేహంగానే ఉన్నవి. ఇదే సునిశ్చితమైనపాఠం అని ఖండితంగా చెప్పలేను కాని చాలావరకు దానిని జాగ్రతగా చదివినానని మాత్రం చెప్పగలను.

బాణ శాసనం: మూలము

వృషభము లింగము మూలము

౧. స్వస్తి సకలజగత్రయా
౨. భివర్ధితానేక సురాసురాధీశ ప
౩. రమేశ్వర ప్రతిహారీకృత మ
౪. హాబలికులోద్భవ కృష్ణధ్వజ
౫. విరాజితపైశాచికపటహ[ఘో?]
౬. [ష*]గ వృషభలాంఛన నన్ద
౭. గిరినాథ పతీగిపురపరమే
౮. [శ్వ]ర బాణవోల్లగ్ణ బలికు
౯. లాజ్ఞానగటు(ఘ్న)సణ్ణియఙునన
౧౦. . దిన. చి(?) శ్రీమత్(?)
౧౧. అగ్గపరాజు సంవ్వర ౯౪[౫?]
౧౨. యగు నేణ్టి వైశాఖపుణ్ణమకు
౧౩. క్రవారంబునాణ్డు ప్రన్నగూరి అగ
౧౪. స్తీశ్వరభటారనికి పెద్దరాజ్య
౧౫. నయు(?) కొణ్డు(?)క రాజ్యనచేతం గొని ఇ
౧౬. చ్చినభూమి ఇరువోదినాలుగు మ
౧౭. [ఱు]తుర్ల నేల పెద్దరాజ్యనయు కొ(?) ణ్డు(?)
౧౮. [క] రాజ్య...నతిభోగము (?) వ .
౧౯. పవ....[పా*]క్షీ దేసరట్టకి
౨౦ ....రిమాధ..
౨౧. ....నయుచి..
౨౨. ....సన్మంధంబు
౨౩. ....మయ్య [స్వ*]దత్తం
౨౪. వాపరదత్తం[వా యో*] హరేతు వసుం
౨౫. ధరాం షష్టిం వర్ష సహస్రాణి వి
౨౬. ష్టాయాం జాయతే కృమి

ఈబాణరాజు పేరు అగ్గపరాజని ఉన్నది. ఇంకా ఈదేశాన్ని క్రీస్తుశకం పదివందల ప్రాంతమున కొందరు బాణరాజులు పాలిస్తూ వున్నట్లు ఈశాసనంవల్ల స్పష్టమవుతున్నది. శాసనంలో ప్రన్నగూరి పేరు వచ్చినది. ప్రన్నగూరే ఇటీవల పన్నమూరు అయినదనుకొని ఈవిషయమై ఆవూరికరణంగారిని కూడా అడిగినాను. వందసంవత్సరములకు పూర్వంవరకూ 'గ్రామలెఖ్ఖ'లలో ఈవూరిని ప్రన్నగూరనే వాడేవారని చెప్పినారు.

ఆమరునాడు ఉదయం సంగమేశ్వరానికి పైలు దేరినాము. మేము జువ్విగుంట, అయ్యవారిపాలెం, శోభనంవారి పాలెములు గడచి జగ్గరాజుపాలెం వచ్చేటప్పటికి దాదాపు తొమ్మిదిగంటలవుతుంది. పక్కవూళ్లలో ఎక్కడో కలరా ఉన్నదట. మేము ఆవూళ్ల నుంచి వచ్చినామనుకొని జగ్గరాజుపాలెం సంసారులు మేము అవూళ్లోకి వెళ్లగానే మాదగ్గరకు గుంపులుగా వచ్చి 'అయ్యా! బిడ్డా పాపా ఉన్నవాళ్లం. వూళ్లోకి రాకండి; పూరవతలనుంచి తోవవుంది. అతోవమీదుగా పొండి' అని వేడుకోవడం మొదలుపెట్టినారు మమ్మల్ని. మాకు మొదట కొంతవరకిది అర్థంకాలేదు. ఈప్రాం

తాల ఏవూళ్లోనైనా కలరా వస్తే రెండోవూరివాళ్లు ఆవూరివాళ్లను తమగ్రామంగుండా పోనివ్వరు. అట్లాపోనిస్తే కలరాతగిలిన గ్రామాలనుంచి వచ్చేవాళ్లు కలరా దేవతను వెంటతీసుకొనివచ్చి తమ గ్రామంలో దిగబెట్టి వెళ్లిపోతారని భయమట. ఎవరో ఒకరు వెనక కొంతకాలంక్రిందట కలరాతగిలినవూరినుంచి వస్తూ దానిని వాళ్ల వూళ్లో దిగబెట్టిపోయినారట. అప్పుడు వూరంతా చేటలతో చెరిగిందట అమ్మవారు. అందువల్ల వారికంతభయం. మేము కలరా ఊళ్లలోనుంచి రావడంలేదని వారికి నమ్మకం పుట్టించేటప్పటికి మాకు తలప్రాణం తోకకు వచ్చింది.

జగ్గరాజుపాలెం కొంచెం గడచి ముందుకు వెళ్లేటప్పటికి సంగమేశ్వరం దేవాలయాలు కనబడుతూ ఉంటవి. మేము దేవాలయాల దగ్గరకు వెళ్లేటప్పటికి పదిన్నరో, పదకొండో అవుతుంది. సంగమేశ్వరాలు నెల్లూరులోనూ దత్తమండలాలలోనూ కూడా చాలా ఉన్నవి. ఎక్కడ రెండేరులు కలిస్తే అక్కడల్లా సంగమేశ్వరుడు వెలుస్తాడు; ఆస్థలం గొప్ప పుణ్యతీర్థమవుతుంది. ఈసంగమేశ్వరం మానేరు పాలేరుల సంగమస్థలంలో ఉన్నది. ఇక్కడ ఊరేమీ లేదు. శివరాత్రికి ఇక్కడ గొప్ప తిరునాళ్లు సాగుతుందట. యాత్రికుల సౌకర్యార్థం సత్రం ఉన్నది. ఈసంగమేశ్వరునికి అర్చనాదికములు చేసేఅర్చకులు అక్కడికి సమీపంలోనే ఉన్న చెన్నుపాటినుంచి వస్తారట. చెన్నుపాటినుంచి యేళ్లగుండా రావాలి వారు. వర్షాకాలాన యేళ్లు పొంగినప్పుడు సంగమేశ్వరానికి రావడం కష్టం. అందువల్ల చెన్నుపాటిలో కూడా సంగమేశ్వరస్వామి ఉన్నాడట. ఆరోజులలో అక్కడనే నైవేద్యాదికములు జరుపుతూ ఉంటారట. మేమక్కడ శాసనాలకోసం వెదకినాము. గుడిఆవరణలో రెండుశాసనశిలలు పాతి ఉన్నవి. అవి నెల్లూరుమండల శాసనసంపుటాలలోనికి ఎక్కలేదు. అందువల్ల అవి పదవశతాబ్దికి పూర్వపు శాసనాలు కాకపోయినా వాటికికూడా ప్రతిబింబాలు తీసుకొన్నాం. వాటిపాఠము ఇక్కడ ఇస్తున్నాము. అందులో ఒకటి పల్లవరాజశాసనం, దీనిని ఒకప్రక్క కిందినుంచి పైకి వ్రాశారు. అందువల్ల శాసనప్రారంభం కింద ఉన్నది.

పల్లవశాసనం: మొదటిపక్క

౧. స్వస్తి అనేకమహీమం[డ]
౨. లగాజధిరాజరజప
౩. రమేశ్వర పరమవంశోద్భ
౪. వపల్లవ కులతిల [క]
౫. భారద్వాజగోత్ర లలితార్ధ్ణవ
౬. ంద్రవర ఖట్వాంగధ్వజకడు
౭. వాయుపఙ్క్షణోమణ స్వమథ
౮. లాంఛ్ఛన వెంగళవాధకాంచీ
౯. పురవరధీశ్వర కామకోట్యం
౧౦. వికలబ్ధ వరప్రసాద నోడువ
౧౧. డిసహోపాజార్జన నిజసేవకాభర
౧౨. ణా బంధుజనాశ్రయ ప్రసన్నప్ర
౧౩. చంద్రజలదంక్కా శైరవ భు
౧౪. [వన *]నారాయణ కుమారకందప్పా స్వ
౧౫. ......సురముఖు(కు)టఘటితచర ణా
౧౬. [రవింద *][భూ]లోక చతుర్వర్ణ న్నాత్ర
౧౭. [మధమర్జరక్షణ *] దిగ్విజయూర్జితగం
౧౮. ......[శ్రీపర్వతపూర్వదిగ్భాగస్య *] [ప్ర]స
త్రగహార [ప్ర]
౧౯. [తిష్ఠిత శ్రీమన్మ *] [క్క]ంటికడువె[ట్టి*]
౨౦. [వంశావతారులైన శ్రీమను*]మహోనం
౨౧. [డలేశ్వర..............*]

రెండవపక్క

౨౨. ......కూడలిసంగ[మేశ్వా *]
౨౩. [శ్రీ] మహాదేవని [అమృ]
౨౪. తపడ్భకన్న అంగరంగ[వై]
౨౫. భవభోగరాగషాడనో(శో)ప
౨౬. చారాలకన్న..ంగ...
౨౭. చన్నినిపాడుగ్రామద్వయ[ం]
౨౮. ఆచంద్రాక్కాస్థాయిగాను శ్రీ.
౨౯. [ర*]నదిమాకేటికూడలి

౩౦. పుణ్యసంగ్గమంలోను
౩౧. దారాద త్తంనేళి షనుపీా
౩౨. ం స్తిమి అష్టలోకధర్మా
౩౩. పాలకులుసాక్షిగాను ఇ స్తి
౩౪. మియాధర్మమును ఎరింగి
౩౫. న్నితిరస్కరించక పాలిం
౩౬. చ్చినపుణ్యుల పాదపద్మ
౩౭. ములు తమశిరసున నం
౩౮. తును॥స్వదత్తా ద్విగుణ
౩౯. ం పుణ్యం।పరదత్తాను
౪౦. పాలనం।పరదత్తాపహారే
౪౧. ణ! స్వద త్తం నిష్ఫలం భ
౪౨. వేత్॥ మంగళమహా
౪౩. శ్రీ శ్రీంజేయును॥

శాసనంలో రాజు బిరుదులూ, దానంచేసిన గ్రామమూ మొదలైనవి వర్ణితమైన భాగం బాగానే వుండికాని అసలురాజు పేరుగలభాగంమాత్రం పోయింది. అందువల్ల శాసనం ఉండీలేనట్టే. ప్రయోజన విరహితం.

నెల్లూరుమండలంలో పరిపాలన సాగించిన పల్లవ రాజులు కొందరు కనబడుతున్నారు. వీరి శాసనాలు దర్శి (౪౩, ౬౯ నెంబర్లుగల శాసనాలు), కందుకూరు (౬౧, ౬౨, ౬౩ నెంబర్లుగల శాసనాలు), కనిగిరి(౨౪ వ నెంబరు శాసనం), ఉదయగిరి (౬ వ నెంబరుశాసనం) తాలూకా గ్రామాలలో ఉన్నవి. ఈశాసనాలఁవ్రాయించిన పల్లవరాజు లందరూ ముక్కంటికాడువెట్టివంశావతారులమని చెప్పుకొన్నవారే. వీరందరు ఒకరిద్దరు తక్క క్రీస్తుశకం పదునూడవ శతాబ్దిలోవారే. కనిగిరి, ఉదయగిరి శాసనాలలోని పల్లవరాజ బిరుదులే దీనిలో కూడా ఉండడంచేత సంగమేశ్వరంలో శాసనం వేయించిన పల్లవరాజుకూడా కనిగిరి, ఉదయగిరి పల్లవరాజ వంశములలోనివాడై ఉండవచ్చును.

ఇక సంగమేశ్వరంలోని రెండవశాసనం చాలా ఇటీవలిదని తోచింది. అయినా దాని పాఠంకూడా ఇక్కడ ఇస్తున్నాను. శిలపడివున్న శివాలయమును ఉద్ధారం చేసినప్పుడు వేసిన శాసన మిది. దీనిలో రాజు పేరులేదు. శాసనంకూడా అసంపూర్తే. శకవర్ష సంఖ్య ౧౩౦౭ అని ఒకవిధంగా చెప్పవచ్చును కాని దానిని మాటలతో తెలిపేవిధంకూడా మరచిపోయిన ఇటీవలి కాలంలోనే ఈశాసనమును వ్రాశారేమోఅని నాతలంపు.

శాసనపాఠము

నంది చంద్రుడు సూర్యుడు


౧. శ్రీ శకవర్షా శశిరామాగగనషి॰
౨. సంఖ్య ప్రభవాద్య (బ్ద) ఆశ్వయుజ శు
౩. క్ల పక్షనవమి (ప్రథమ?) తిథి శివాలయం
౪. పర్యాత్ శ్రీశైలశిఖర ఆ[గ్నే]
౫. యభాగే పంచాధశయో
౬. జనవిస్తార ఆయామధూ
౭. తు సమూర్ణ క్షీరవాహినీ
౮. మూంకేటిసంగమపుణ్యతీ[ర్థ]
౯. సంగమేశ్వర దేవశిలమంధిరం
౧౦. శిఖరపర్యంత కుర్యాత్ దేవేం
౧౧. ద్రుండ మొదలైన దిక్పతు
౧౨. లున్ను ఆదిత్యాధి నవగ్ర
౧౩. హాలున్ను పృథివ్యప్పతే
౧౪. జోవాయురాకాశములు
౧౫. న్ను అహోరాత్రములున్ను
౧౬. సంవత్సరమాసరుతు
౧౭. వులున్ను దశదిక్కులు
౧౮. [న్ను] ... .

రెండవపక్క


౧౯. అష్టదిగ్గజాలు [ను*]
౨౦. కృతదుష్కృతింబులుం [న్ను*]
౨౧. స్థావరజంగమంబులున్ను
౨౨. యధిం ... ...

ఆకస్మిక ఛాయాచిత్రములు


(Snap Shots)



౭. కష్టజీవులు




౮. పెన్నయందు ఈదులాట



3. భాగస్వాములు



౪. గమనసదనము



౫. పినాకినిమీఁది ఆనకట్ట-రైలు వంతెన

ఛాయాచిత్రకారుడు: శ్రీ డాక్టరు కె. యస్. ప్రసాదరావుగారు, పొదలకూరు, నెల్లూరుజిల్లా.

శాసన ప్రతిబింబాలు తీసుకొని వేసవి ఎండ చాలా తీక్ష్ణంగా ఉంటే అక్కడి దేవాలయమంటపంలో కొంతసేపు విశ్రమించాము. అక్కడికి కొందరు గొల్లలువస్తే వాళ్లతో కాటమరాజుకథనుగురించి ప్రసంగిస్తూ కూర్చున్నాము.

ఈప్రాంతమంతా కాటమరాజు ఏలినదే. పెద్దిరాజుకున్నూ, కాటంరాజుకున్నూ యుద్ధంజరిగినది ఈసమీపాన్నే. కందుకూరినుంచి కనిగిరివెళ్లేతోవలోనే అలవలపాడూ పంచలింగాలకొండా ఉన్నవి. కాటమరాజు తండ్రి పెద్దిరాజు అలవలపాటి కధిపతి. పంచలింగాల కొండ పరిసరప్రాంతము ఖడ్గతిక్కన సమరక్రీడసలిపిన మహాక్షేత్రము.

అలవలపాటి సమీపాన్ని వేరేళ్ల వాగు ఒడ్డున ఉన్న పంచలింగాలకొండదగ్గర ప్రతీయేటా వైశాఖ పౌర్ణమికి గంగతిరునాళ్లు సాగుతుండట. ఆరోజున కందుకూరు, కనిగిరిసీమలనుంచి 'ఎక్కడెక్కడివాళ్లూ' రెండెడ్ల బళ్లుకట్టుకొని, రంగురంగుల చీరలూ మొదలైనవి గూళ్లుగాకప్పి, ఎడ్లకు వింతవింత అలంకారాలు చేసి ముస్తాబై వస్తారట. కోటప్పకొండ (గుంటూరు), జగ్గన్నతోట (తూర్పుగోదావరి)లలో ప్రభలతీర్థంసాగినట్లు ఇక్కడ బండితీర్థం సాగుతుండట. వచ్చినయాత్రికులంతా ఆవాగుఒడ్డున గంగమ్మకూ కాటమరాజువారికీ పశుక్షేమంకోరి పొంగళ్లు పొంగిస్తారట. వేరేళ్ల వాగు దగ్గర కొండమీద పంచలింగాలున్న ఆలయం ఉన్నది. కొండకింద సమీపాన్ని రావిచెట్టున్నస్థలం దగ్గర యాదవ వీరులు యుద్ధానంతరం వీట్లోకదిగిన కత్తులు పాతినారని చెప్పుతారు. వాగుకవతలి ఒడ్డున సమీపాన్నే గంగ దేవళం ఉన్నది.

పశువులనిమిత్తమై వచ్చిన యుద్ధంలో యాదవులైన కాటమరాజువారే గెలిచారుకనుక ఇప్పటికీ ఆప్రాంతపు పశుపాలకులకు వారిమీద ఉండేభక్తి అట్టిది. ఇప్పటికీ ఆ ప్రాంతాలవారికీ కీర్తి మాసిపోలేదు. మన్యాలకూ, కొండలకూ మేతకోసం పశువులను తోలుకుపోయేటప్పుడల్లా పశుధనంకలవారందరూ అవి తిరిగి సురక్షితంగా ఇల్లు చేరుకొన్నట్లయితే పొంగళ్లు పొంగిస్తామని కాటమరాజువారికి మ్రొక్కుకొంటారట. ఎప్పటి యుద్ధం! ఎప్పటి కాటమరాజు! ఇప్పటికీ పోలేదు విజయుడైన ఆరాజు పలుకుబడి! ఆప్రాంతాల కాటమరాజువారికి గుళ్లుకూడా లేచినవి! మాచెర్ల సీమలో ఇప్పటికీ కాటమరాజు శిలావిగ్రహాలను చూడవచ్చును. మాచెర్ల గ్రామం కనిగిరి తాలూకాలోనిది. ఈమాచెర్ల ప్రాంతమే మాచెర్ల సీమ

గంగగుడి ఉన్నచోట్ల సాధారణంగా కాటమరాజువిగ్రహం కనబడుతూనే ఉంటుంది. గంగ కాటమరాజువారికి కులదేవతట. పశువులకు సంబంధించిన వివాదంలో విజయముపొంది ఆప్రాంతాలపశుధనంకలవారి పాలిటి పరమదైవమైనాడు కాటమరాజు.

కాటంరాజు కథకు ప్రచారం విశేషం అక్కడ. అలవలపాటి గంగతిరునాళ్లలో రాత్రులకు రాత్రులు భట్టురాయబారము, యఱ్ఱగడిపాటి పోట్లాట, కాటంరాజుకథ- ఈమొదలైన పాటలలోనే గడచిపోతవట.

కాటంరాజువారు అసలు తమకథ ప్రచారంచేయడానికి అధికారంఇచ్చినది కొమ్మువాళ్లకట. వీళ్లది మాదిగలలో ఒకకులం. కాటంరాజువారి కథలు మాసిపోకుండా కాపాడినది వీరేనట. ఇందుమూలాన్ని యాదవులైనగొల్లలు వాళ్లను ఎక్కువగా గౌరవిస్తారట. ఎప్పుడైనా కొమ్మువాడు యాదవుల(గొల్లల) ఇంటికి వస్తే వానికి ముందు భోజనంపెట్టకుండా గొల్లలు భోజనం చేయరాదట. ఇప్పటికీ ఈఆచారం సాగుతున్నదట. తమ పూర్వచరిత్రను కాపాడిన ఆజాతికి గొల్లలు ఇంతవరకు చూపించిన, ఇప్పటికీ చూపిస్తున్న అఖండగౌరవం ఇది.

ఈకథలు పాడేవాళ్లు గొల్లలలో కూడా ఉన్నారట. వారికి పికిలివాళ్లని పేరు. వీరు ముఖ్యంగా కందుకూరుతాలూకా ముప్పాళ్లలో ఉన్నారు. వారికి వంశపరంపరగా వస్తూఉన్నవృత్తే ఇది. కందుకూరు తాలూకాగ్రామాలలో ఎక్కడెక్కడ అమ్మవారి జాతరలైనా ఈపాటలు పాడేనిమిత్తం వీళ్లు వస్తుంటారట. ఇందుకు

వీళ్లకు (వృత్తిమావూళ్లు)నివర్తనలు ఉన్నవట. పంచలింగాలకొండగంగతిరువాళ్లలో కొమ్మువాళ్లే కాక పికిలివాళ్లు కూడా ఈపదాలు పాడుతారట. కాని అక్కడ ఆచారం ఏమిటంటే ప్రాచీనసంప్రదాయ గౌరవాన్నిబట్టి కొమ్మువాళ్లు ముందుగా సుడా కర్తి తేనే కాని పికిలివాళ్లెత్తకూడదనట. ఇవి కాటమరాజు కథకుసంబంధించిన ప్రాచీన సంప్రదాయాలు ఆప్రాంతాల వాడుకలో ఉన్నవి.

కొంచెం ఎండచల్లబడినపిదప పాలేరుదాటి మంగినపాటిమీదుగా కందుకూరు కనిగిరిరోడ్డుమీద ఉన్న వెంకుపాలెం చేరుకొన్నాం సాయంత్రానికి. అక్కడికి రాగానే మాకు మళ్లీ స్వదేశంలోనికి వచ్చినట్లయింది. అక్కడినుంచి 'బస్సు' మీదుగా కందుకూరు వెళ్ళినాము.

అంతవరకు నాతోపాటు కష్టాలకోర్చుకొని నాకు సహాయభూతులైన లక్ష్మీనరసింహంగారిని అక్కడ దిగబెట్టి వారికి వందనాలు సమర్పించి సెలవుపుచ్చుకొని ఆమరునాటి ఉదయం 'బస్సు' మీద కనిగిరికి వెళ్ళినాను.

కనిగిరిలో రెండురోజులాగి అక్కడినుంచి పామూరుమీదుగా వలజవంపాడు వెళ్లినాను. పామూరులో గొప్ప చెరువున్నది. పాతకోట ఒకటున్నది. అదిగొప్ప వర్తకస్థలము. వలజవంపాడు వెలిగొండల కీవలితట్టు ఉన్నది. అవతలిపక్క మూడుపరుగుల దూరంలో భైరవునికోన మొదలైనవి ఉన్నవి. ఈగ్రామం ప్రస్తుతం వెంకటగిరిరాజావారి జమీలోనిది. ఇక్కడ ఉన్నవారంతా వెలమలు. బ్రాహ్మణులెవ్వరూ లేరు. అక్కడ ఎలిమెంటరీబోర్డుస్కూలు అయ్యవారొక్కరే బ్రాహ్మణులు. అయ్యవారింట్లో ఆమధ్యాహ్నం భోజనంచేసి శాసనంకోసం బైలుదేరినాను. "ఈశాసనం ఏంచేస్తారు? మీరు జమీందారుగారి తరఫున వచ్చారా? గౌవర్నమెంటుతరఫున వచ్చారా? ఒక్కశాసనంకోసం చెన్నపట్టణం నుంచి రావలసిన అవసరమేమున్నది? ఈశాసనశిల క్రింద లంకెబిందె లున్నవి. వాటిని తీసుకు పోవడానికి కాదా మీరు వచ్చింది? ఎక్కడెక్కడ లంకెబిందె లున్నవో అన్నైనంకూడా ఆశిలమీద వ్రాసి ఉన్నదటకాదా! ఈ వైనం మాకు కొంతకాలంక్రిందట ఇక్కడికి వచ్చిన యోగిగారొకరు చెప్పినారు. ఇటువంటి సందర్భాలలో మిమ్మల్ని ఆశాసనం తీసుకోనిస్తామా?" ఇట్లా ఆవూరివారు ఒక్కపెట్టున ప్రశ్నలవర్షం కురిపించారు. చిట్టచివరకు వారి ప్రశ్నల కనుగుణ్యంగా జవాబిచ్చి నా సదుద్దేశమును గురించి వారికి నమ్మకం కలుగజేసేటప్పటికి కృత్యాద్యవస్థ అయింది. పిదప వారుకూడా నాపనికి తోడ్పడి నాకు చాలాసాయం చేశారు. అయ్యవారి సాయంవల్లా వారి సాయంవల్లా త్వరితంగానే నాపని ముగించుకొన్నాను. అక్కడ ఉన్నదల్లా ఒక్కశాసనమే. అది పదివందలకు పూర్వపుది. పాతతెలుగుశాసనం. బట్టురువర్తు వేణుగోపాలశెట్టిగార్ల నాటి కంటె చాలాచెడిపోయినది. అది జైనశాసనం. శాసనారంభంలో జినదేవసంకీర్తనము కలదు. ఇక విశేషమేమిటంటే శాసనం జైనశాసనమయినప్పటికీ శాసనం తలభాగాన్ని నందీలింగమూ మొదలైనవి చెక్కి ఉన్నవి. అది జైనశాసనశిల అవడమూ వాటిమీద నందీ మొదలైనవి కనబడడమూ వింత. ఇది ఆలోచింపదగిన విషయమనుకొన్నాను ఇది ఎట్లా సంభవించినదా అని. వలజేనంపాడు గ్రామనామాన్ని బట్టి అది ఒకప్పుడు జైనుల నివాసస్థలముగా ఉండవలెననుకొన్నాను. అందువల్లనే దానికి జైనులపాడని పేరుకలిగి ఉంటుంది! కాకతి ప్రతాపరుద్రుని కొలువులో వచ్చిన బ్రాహ్మణ జైన మతవివాదంలో విప్రవినోదుల సహాయం మూలంగా బ్రాహ్మణులే గెలిచారట. ఓడిపోయిన జైనులను హతంచేశాడట రాజు. హతశేషులు పారిపోగా వారిని ఊరి (పాడు) పాళ్లలో నివసింపవలసినదే కాని ఊళ్లలో నివసింపరాదని బ్రాహ్మణులు శపించారట. ఇట్లా ఒకకథ చెప్పుతారు. కథ ఇట్టిది ఒకటుండడమూ, ఇక్కడ జైనశాసనం ఒకటి కనబడడమూ చూస్తే ఇది పూర్వం జైనుల నివాసస్థలమనీ, అందువల్లనే దీనికి జైనులపాడనే పేరు కలిగి ఉంటుందనీ, ఆ జైనులపాడే కాలక్రమాన్ని మనుష్యులనోళ్లలోబడి జేనంపాడుగా

మారి ఉంటుందనీ ఆలోచనకలిగింది. కడపమండలంలో పూర్వం చాలా జైనబస్తీలు ఉండేవని కొన్నికొన్ని ఆధారాలవల్ల తెలుస్తున్నది. నెల్లూరుమండలానికి ఈప్రాంతాన్ని కడపజిల్లాయే సరిహద్దు. ఇదిన్నీ కాకుండా నెల్లూరులోకూడా పెద్ద జైన విగ్రహాలు ఉన్నవి. ఇవన్నీ ఒకప్పుడు జైనులు ఈప్రాంతాల ఉండేవారని విశ్వసించ డానికి గట్టి ఆధారాలుగా కనబడుతున్నవి. వల జైనుల పాడులోని వల అనునది విశేషణ పదమవుతుందేమో అనుకొన్నాను. మంచి అనో యేమో దాని అర్థం. ఇంకా విచారించాలి.

ఈప్రయాణంలోనే చుండి, మాలెకొండ మొద లైనవి చూచాము. మోపూరు ప్రాజెక్టు చెరువు కూడా చూడడం తటస్థించినది. ఈచెరువువల్ల వేలకొలది ఎకరాలు వరిపంట పండుతున్నది. ఆప్రాంతమంతా పంటకాలువలతోను పిల్లకాలువలతోను, డెల్టాభూమి వలె ఉన్నది. ఇవేకాకుండా నెల్లూరుజిల్లాలోని పెదారికట్ల, చినారికట్ల, పొదిలి, కురిచేడు, కలుజువ్వలపాడు, గొట్లకట్టు, బుడమకాయలపాడు, దర్శి ఈ మొదలైన ఊళ్లుకూడా చూడడం కలిగింది.

బుడమకాయలపాటిలోను కలుజువ్వలపాటిలోను పాతతెలుగు శాసనాలు ఉన్నవి. బుడమకాయలపాడు ఇప్పు డించుమించుగా చేచిరాకు గ్రామమనే చెప్పవచ్చు. ఇది ఒంగోలు కంభంరోడ్డుమీద ఉన్న గొట్లకట్టుకు శివారుగ్రామం. ఈ రెండుగ్రామాలూకూడా వెలిగొండచాలుకి అయిదారుమైళ్ల దూరంలో ఉన్నవి. ఈ ప్రాంతమున కనుమలు దాటితే వెలిగొండలలోని కర్నూలు జిల్లాలోనికి పోతాము. నెల్లూరుజిల్లా పడమటి సరిహద్దుగా ఉన్న వెలిగొండల వంటుకొని అవతల కడప, కర్నూలు, గుంటూరుజిల్లాలున్నవి. బుడమకాయలపాటిలో ఊరికి మైలు మైలున్నర దూరాన్ని ఒకవేపచెట్టుకింద గంగమ్మదేవళం ఉంది. అక్కడ పాతతెలుగు శాసనాలు రెండు మూడున్నవి. అందులో రెండుమాత్రం నెల్లూరు మండల శాసనసంపుటాలలోనికి వచ్చినవి. ఒకటి రాలేదు. అక్కడ శిలాస్తంభం ఒకటున్నది. దానికి నాలు గువైపులా శాసనం ఉన్నది. అది ఆరేడుమూళ్ల పొడవుంటుంది. అది అంతా పూర్తిగా ఇసుకలో పూడిపోయింది. ఇది అంతా తువ్వనేల అవడం మూలాన్ని గాలి దుమారాలు లేచినప్పుడల్లా ఇసుకపొరలు మబ్బుతెరల లాగు లేస్తుంటవి. ఇట్లా లేచిన ఈయిసుకపొరలవల్ల ఆ స్తంభం పూర్తిగా కప్పడిపోయింది. ఎగువ తలభాగం మాత్రం కొంచెం కనిపిస్తున్నది. ఈశిలాస్తంభంమీది శాసనం నెల్లూరుమండలశాసన సంపుటాలలో వచ్చినప్పటికీ వాటిలో ఇచ్చిన పాఠంలో కొన్ని పొరపాటు లున్నవని తోచడంచేత ఎట్లయినా దానికి ప్రతిబింబాలు ఎత్తవలెనని బుద్ధిపుట్టింది. మరొకశాసనశిల నేలమీదపడిఉండడంచేత సులభంగా దానికి ప్రతిబింబం తీశాను. ఈరెండూ కాక మూడవ శాసనశిల మరొకటున్నది. దానిని గంగమ్మ కోవానికి ప్రాకారపు రాయిగా పాతివారు. దేవళమంటే పెద్దదేవళంకాదు. పెద్దతులసికోటంత ఎత్తు ఉంటుంది. చుట్టూ రాళ్లు పాతిఉంటవి ప్రాకారానికివలె. ఈప్రాకారపునిలువురాళ్లకుపైన కప్పుమాదిరి ఏర్పడేటట్టు వాటిమీద బల్లపరుపుగా రాళ్లు పరిచి ఉంటవి. లోపల గంగవిగ్రహం ఉంటుంది. దీనినే గంగదేవళం అంటారు; కాని అలవలపాటెదగ్గరి గంగదేవళం మాత్రం అమ్మవారి గుడివలెనే ఉంది. ఈప్రాకారపు రాయిగా ఏర్పడిఉన్నదానిమీదనే శాసనంఉంది. సగంభాగం శాసనం భూమిలోనికి పూడిపోయిఉంది. అంతేకాకుండా ఆరాతిని ఎడాపెడా అక్కడి వేపచెట్టువేరు పాము వలె మెలికలుతిర్చి చుట్టివేసుకొన్నది. ఆవేరును తెగనరికించి ఆరాతిని పైకి తీయింతామన్నా అది వట్టివేపచెట్టుకాదు; అమ్మవారి వేపచెట్టు. అటువంటి వేపచెట్లంటే ప్రజల కెట్టి నమ్మకాలుంటవో అందరికీ తెలిసినవిషయమే. అక్కడ ఈరాయిఒకటీ, ఆ స్తంభమొకటీ— ఈరెండూ రెండు వ్యాసఘట్టాలలాగు ఏర్పడ్డవి.

నేను గొట్లకట్టులో వేమూరి సీతారామయ్యగారి యింట్లో బసచేశాను. సీతారామయ్యగారు చాలా మంచివారు. ఆవూళ్లో ఉన్న బోర్డుస్కూలుకు హెడ్డుమాస్టరు. వారికాప్రాంతాల మంచి పలుకుబడిఉన్నది. ఆయన

ఆవూళ్లో అయ్యవారే కాకుండా వైద్యులు కూడాను, పంచాంగంచూచి నక్షత్ర తిథివారాలూ, వర్జ్యాలూ పరిశీలించి ఊళ్లోవాళ్లకు మంచిచెడ్డలు చెప్పగలవారు. ఆలోచనకు, పాలోచనకు ఎన్నికైనచెయ్యి. ఈకారణాలవల్ల ఆవూళ్లో ఆయనఅంటే అందరికీ విశేషగౌరవం. ఆయన నాకు చేసిన ఉపకారం చెప్పవలెనంటే ఆయనే గనుక నాకుతోడ్పడి ఉండకపోయినట్టయితే నేనాశాసనాలకు ప్రతిబింబాలు ఎత్తగలిగిఉండేవాణ్ణి కానని చెప్పితే చాలు. ఆయన నాకంతటి మహోపకారి అయినాడు. మొత్తంమీద ఆశాసనాలకు ప్రతిబింబాలు తీశాను.

బుడమకాయలపాటికే బుడమనరాయుల పాడని కూడా పేరు. ఇప్పుడది చేచిరాకు గ్రామంగా ఉన్నా పూర్వం అది గొప్ప ఊరుగా వుండివుండాలి అనడానికి ఆధారాలు లేకపోలేదు. అక్కడ భూమి చాలా సారవంతమైనది. ఈగంగమ్మ దేవాలయానికి సమీపాన్ని పూర్వం పెద్దచెరువు ఉండేది. ఇప్పటికీ దీని ఆనవాళ్లు చూడవచ్చు. ఇప్పుడది అంతా తుప్పలతోను, డొంకలతోను అడవి మొలచి పోయింది. ఈ చెరువు వైశాల్యము 400 ల ఎకరాలుండవచ్చు. ఈ చెరువునీటికి ఆధారభూతములైనవి మూడువాగులున్నవి. ఈవాగులలోని నీరు ఈచెరువు[...] వస్తుంది. ఇప్పు డీవనరులు చెడిపోయినవి. ఈ చెరువువల్ల నాగంపల్లి, వెలిగొండరాయునిపల్లి, సేరారెడ్డిపల్లి, వెంగళపల్లి, బుడమకాయలపాడు, గర్నిపెంట, గొల్లకట్ట—ఇన్నివూళ్లకు లాభం ఉంటుంది. చెరువులో పుష్కలంగా నీరుంటే వెయ్యిఎకరాలకు పైగా సాగవుతుంది. ఇక్కడ పూర్వం ఒకదేవాలయంకూడా ఉండేదని తెలుస్తుంది. గౌనర్మెంటువారు కాని, జమీందారుగారుకాని ఖిలపడి పోయి ఉన్న ఆచెరువును ఉద్ధరింపచేయించేటట్టయితే పైని చెప్పిన గ్రామాల ప్రజలకు చాలా ఉపకారమవుతుంది. ఆగ్రామం వెంకటగిరి జమీలోనిది. జమీందారులుకూడా ఇందువిషయమై శ్రద్ధ వహించడం లేదు. ఇటువంటివి ఖిలపడి ఉన్న చెరువు లిటు చాలా ఉన్నవి. ప్రజలకు అనేక మహోపకారాలు జరిగినట్లు చెప్పబడే బ్రిటీషుప్రభుత్వంలోకంటె కూడా పూర్వపుప్రభుత్వాలలోనే ఈప్రాంతాలు పాడీపంటా సమృద్ధిగా గలిగి ప్రజలు సుఖపడేవారని చెప్పడానికి లెక్కకుమించిన ఈచెరువులేసాక్షి. ఆటువంటి రాతిభూములలో వివిధాన్నో గొప్పగొప్ప చెరువులు నిర్మించి నిర్జలమైన ఎడారికాని ఎడారిభూములనూ, గొడ్డువారిన అడవినేలలనూ సస్యశ్యామలములైన సుక్షేత్రములుగా మార్చి ప్రజాక్షేమానికీ, జాతీయసంపదకూ తోడ్పడ్డ పూర్వపు ప్రభుత్వాలకూ ఇప్పటి ప్రభుత్వానికీ ఉండే వ్యత్యాసం దేశం చూస్తేనేకాని బోధపడదు.

వెలిగొండరాయడిదేవళం అక్కడికి సమీపమున వెలిగొండలలోనే ఉన్నది. అది ముచికుందులవారి ప్రతిష్ఠ అని చెప్పతారు. ఆదేవళం సమీపముననే మూసీ (ముచికుంద)నది పుట్టుతున్నది. ఆదేవళాన్ని చూడడం పడింది కాదు. వెంకటగిరినుంచి వచ్చే వెలిగొండలచాలు గర్నిపెంట, తువ్వపాళ్ల సమీపాన్నే ఆఖరవుతుంది. కలుజువ్వలపాడు ఈవెలిగొండ కివతల ఉన్నది.

బుడమకాయలపాటి పని పూర్తిచేసుకొని కొంచెం చుట్టుతోకను నాగంపల్లి, గర్నిపెంట, తువ్వపాడు, నాగిరెడ్డిపల్లి, గార్లదిన్నెలమీదుగా కలుజువ్వలపాడు వెళ్లినాను. ఈప్రాంతాల కొన్నిఊళ్లలో విశ్వబ్రాహ్మణులే కరణాలు. కలుజువ్వలపాటిలో రాట్నములు చాలా ఉన్నవి. అవి ప్రత్తిపట్టేరోజులు గనుక చిల్లరవర్తకులు ప్రత్తి పండించినవాళ్లదగ్గరకు విడివిడిగావచ్చి ప్రత్తికొనుక్కొనిపోయి మొత్తంచేసి పెద్దవర్తకుల కమ్ముతారు. సంసారులు తీకవాళ్లవశం మూలాన్ని దినవెచ్చములకు డబ్బుకోసం అల్లాడుతూఉంటే ఈ చిల్లరవర్తకులువచ్చి ముందు చౌకధరకు పంటను గుత్తకుతీసుకొని అడ్వాన్సుగా సొమ్మిస్తారు. అందువల్ల పంట ఎంతపండినా పండించినవారికి నిత్యదరిద్రమున్నూ దళారులకు నిత్యపంటగాను ఉంటున్నదట. ఈకారణాలచేత పల్లెటూరిరైతులు చాలావరకు వర్తకులకు లోబడి ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటున్నారు. ఈప్రాంతాల చాలామంది రైతులు భూములన్నీ వర్తకుల 'అడమానా'(తాకట్టు)లలోనే శాశ్వతంగా ఉండిపోతున్నవి. పంటకు వర్షాలమీద ఆధారపడవలసింది దేశం. భుక్తికి వర్తకులమీద ఆధారపడ

వలసినవారు రైతులు. మిగులూ తగులూ ప్రభుత్వానిది. దేశస్థితి ఇట్టిది.

కలుజావ్వలపాటిలో కైలాసనాథస్వామి ఆలయంలో పాత తెలుగుశాసనం ఉంటే దానికి ప్రతిబింబం తీసుకొన్నాను. అక్కడినుంచి మాల్యాద్రిపురం రోడ్డు రైలుస్టేషనునుంచి పొదిలికి కొత్తగాపోస్తున్నరోడ్డు మీదుగా వెళ్లదామనుకొన్నాము కాని రోడ్డు పూర్తికాలేదు. తోవకూడా మంచిది కాదని కరణంగారు చెప్పితే తిన్నగా మాల్యాద్రిపురం రోడ్డు రైలుస్టేషనుకు వెళ్లినాను. అక్కడికి శ్రీశైలం నల్లమలకొండలచాలు సంజమబ్బుల లాగ కనిపిస్తూ ఉంటవి. అక్కడ నైరుతి గజ్జలకొండ, దొనకొండలమీదు గాపరిచేసువచ్చి పిడప నర్సారావుపేట, గుంటూరులమీదుగా బెజవాడ వచ్చి అక్కడినుంచి తిరిగి పట్నానికి వచ్చాను. ఈరీతిగా ముగిసింది నెల్లూరుమండల యాత్ర.

వెలికొండల ప్రాంతాన్ని ఊళ్లలో పైరుపంటలకూ త్రాగుటకూ పశువులకూ కూడా దిగుడుబావులలోని ఉదకమే. నీరు చాలాచోట్ల చాలాబావులలో కశ్మలంగా ఉంటుంది. విధిలేక తాగవలసిందే ఆనీరు దాహానికి. దిగుడుబావు లున్నచోటల్లా నారికురుపులు జాస్తి. అవి లేనిఊళ్లూ దిగుడుబావులులేని ఊళ్లూ లేవు. ఆరోగ్యం చాలా తక్కువ. వైద్యసహాయం గ్రామాలకు అసలే లేదు. మంచి రస్తాలులేవు గ్రామాలకూ గ్రామాలకూను. విద్యావిషయంలో ఊళ్లన్నీ చాలా వెనకబడిఉన్నవి. సాంఘిక నాగరికతలు అంతగాలేవు. ఏఉద్యమానికీ కూడాప్రచారం అటు చాలా తక్కువే. కాని దేశం ఇట్టిస్థితిలో ఉన్నప్పటికీ గాంధిమహాత్ముని పేరు తెలియని ఊరులేదు. ఆ మహాత్ముని పేరు మూలమూలలకు ప్రాకింది; భక్తిగౌరవాలు కలిగించుకొన్నది. కాని ఆయన కలిగించిన రాజకీయప్రబోధము ఆప్రాంతపుల అంతగా ఉన్నట్టు తోడుకోట్టదు.

ప్రజలు చాలామంచివాళ్లు. దేహపటిమా బుద్ధిబలమూ ఉన్నవాళ్లే. కాని అటు అవసరమైనది ఒక్కజాతీయప్రబోధమే. దేశదారిద్ర్యమూ, తరచు సంభవించే అనావృష్టిదోషమూ వారిని క్రుంగదీస్తున్నవి. పూర్వపుదేశీయప్రభువులు పరిపాలన చేసే కాలంలో ఇట్టిప్రాంతాలే శత్రుజనదుస్సాధ్యములై పౌరుషపరాక్రమాలతోనున్నూ, పాడిపంటలతోనున్నూ వియ్యమంది మిలమిల మెరుస్తూ ఉండేవి. ఆరోజు లారోజులే, ఈరోజు లీరోజులే.

అనుబంధము

హరదత్తాచార్యులవారు రచించిన చతుర్వేదతాత్పర్యసంగ్రహమనే నామాంతరముగల గిరీశస్తుతిమాత్ర్తిమాల అన్ని వేదాంతగ్రంథానికి ప్రోలయ వేమారెడ్డిగారి తిమ్మడును, ఆయన సర్వసైన్యాధిపతీ అయిన మల్లాయరెడ్డిగారి మునిమనుమడుగు కోమటిరెడ్డిగారి కొడుకు (సోమేశభూపతి సోదరుడు) శివలింగభూపతి వ్యాఖ్య వ్రాశాడు. ఆవ్యాఖ్యాగ్రంథంలోని ప్రారంభశ్లోకాలు కృతికర్తృవంశావతారక్రమం వర్ణించేవి ఈక్రిందఇస్తున్నాను. ఈవ్యాఖ్యానం ప్రతి తంజావూరుజిల్లా తిరువిడైమరుదూరు దేవాలయగ్రంథాగారంలో ఉండగా ౧౫౯౫ లో మొట్టమొదట దూది శ్రీహాచ్. కృష్ణశాస్త్రిగారును, టి. వి. కృష్ణస్వామిశాస్త్రిగారును పరిశోధించారు. ఈపైని చెప్పిన ఇరువురి సహాయంతో వెనుక దక్షిణహిందూదేశంలోని సంస్కృతతాళపత్రగ్రంథాన్వేషణ మునకు పూనుకొన్న హుల్షుదొరగారు ఈవిషయమును గురించి తమ నివేదికలో వ్రాశారు. వారి నివేదికలో నుంచే పాఠకుల ఉపయోగార్థము ఈశ్లోకాలు ఎత్తి వ్రాయబడ్డవి.

జాతి ప్రసత్త్వ కమలాభిరామా
యుగప్రియా పత్కావిసంఘసేవ్యా।
గంగా ద్వితీయేవ సశైల లక్ష్మీః
పాదాంబుజా దీశితు రుద్బభూవ॥

తత్రోదభూ తోక్కమటిప్రోలభూపః
స్వకాన్వవాయైక మణిప్రదీపః।
లోకత్రయ వ్యాప్తయశః ప్రతాపః
కృతారిభూపాల మనోనుతాపః॥

మాచప్రభు ర్వేమవిభుశ్చ దొడ్డ
భూపోఽన్నభూపోఽపిచ మల్లభూపః।
తస్యాత్మజా ఔరసభావకామాః
భూయోవతీర్ణా ఇవపాణ్డుపుత్రాః॥

శ్రీవేమభూమీ రమణస్య తస్య
పుణ్యం జనైర్వర్ణయితుం న శక్యమ్।
ఖిలీకృతో ధర్మపథ స్తురుష్కై-
ర్ఘంటాపథో యేన కృతః పృథివ్యాం॥

హేమాద్రికల్పకథితాఖిలదానదక్షో
నిస్సీమభూమితరణ ప్రథమానకీర్తిః।
సోపాన సంతతి మసౌ ప్రవిధాయ [భూప
స్తాం *] శ్రీగిరీశపదవీం సుగమాం చకార॥

వేమాధిపస్యా[వర]జోఽపి మల్ల
భూవల్లభోఽసౌ జగనొబ్బగణ్డః।
స... ర్ణాదితురుష్కమల్లా-
సముల్లసద్భల్లగణా న్విజి[గ్యే*]॥

తస్యాభవ చ్ఛ్రీపినకోమటీంద్ర
స్సూనో జగద్వ్యాప్త[హితో*]నరేంద్రః।
సర్వప్రజానే త్రచకోరచంద్ర
స్స్వరాష్ట్రసంరక్షణనీతితంత్రః॥

పంచ శ్రీగిరి భూపతి గ్గుణనిధి ర్వేమక్షమానాయకో
మాచక్ష్మాపతి రన్నదేవనృపతిః పెద్దక్షితీశోఽపిచ।
ఏతస్య గ్గుణరత్నరాజితతనోః పుత్రాః పవిత్రాన్వయాః
క్షీరోదాదమరద్రుమా ఇవబుధత్రాణార్థ మభ్యుత్థితాః॥

ధానుష్కధౌరేయతమాం స్తురుష్కా-
న్ప్రాపయ్య నిష్కాసన మాత్మరాష్ట్రాత్।
నిష్కంటకాం సర్వభువం వ్యధత్త
స మాచభూపో భుజసైభవేన॥

అభవతా మథ కోమటిశ్రీగిరి
క్షితిపతీ అపి మాచవిభోః సుతౌ।
బలిబలోన్మథనార్థ ముపాగతౌ
హరిసురాధిపతీ ఇవ భూతలమ్॥

వర్ణ్యాః కథం కోమటి భూమిపాస్తే
యస్యాక్షికోణే యుధి కోపశోణే।
దిశంతి ఘాసం ప్రవిశంతి దేశం
విశంత్యరణ్యం రిపుభూమిపాలాః॥

సర్వం తా మహితై ర్మహోభి ర
మలై రాశాతమోనాశనం
సోమేశ శ్శివలింగభూపతి రపి
ద్వౌపుష్పవంతావివ।
సర్వక్షోణిభృదాశ్రయా ద్గుణ
నిధే శ్శ్రీకోమటీంద్రాంబుధే
రారూఢావుదయం శివస్య
మహితా వంశావతారా భువి॥

భరతమతపతంగ స్సత్పవిత్రాంతరంగః
కృతరిపుమదభంగ స్సద్గుణవ్యూహతుంగః।
కలితసుకృతసంగ స్త్యక్తపాపో త్తరంగ
స్స్వజయతి శివలిం[గ*] క్ష్మాపవేశ్యాభుజంగః॥

సౌందర్య మాహాయ్య మముష్య శౌర్యం
కిం వర్ణ్యతే యస్య హి దర్శనేన।
స్త్రీణాం చ మానో విరుహాం చ దొస్థ
ద్విషాం చ శస్త్రం గళతి క్షణేన॥

ద్వారే దక్షిణపూర్వే శ్రీశైలాఖ్యస్య భూభృత స్తస్య।
పుణ్యాం స్కందపురీం తాం సోమేశస్సర్వ కామదోధ్యాం॥

మణిమయగృహహృద్యా శక్రభూపైర భేద్యా [స్తే]॥
గజగమనభవాద్యా సర్వపుణ్యానవద్యా।
కలితసకలకామా భాతి రామాభిరామా
విహసితపురసీమా పూరియం స్కందనామా॥

యత్రాత్రినేత్రప్రభవ స్తపోభి
స్స్కందం సమారాధ్య సమాహితాత్మా।
సోమత్వ మాప్య స్వగభ స్తిభాభి
శ్ఛిన్దన్సమస్త(?) తమాంసి జంతోః॥

కింవర్ణ్య[తే*] పుణ్యమహత్త్వమస్యా
యస్యాస్సమీపే విజనాః ప్రధానాః।

ఏనోరతాః పుణ్యరతా భవంతి
సోమేశ సాన్నిధ్యవశా ద శేషాః॥

హైమం సమారోహతి తత్ర పుర్యాం
సింహాసనం శ్రీ శివలింగభూపే।
హైమాని హేమాద్రిశిలాసనాని
తదీర్ష్యయే వారినృపా శ్రయంతే॥

మాహేశ్వరేణ శివలింగమహీశ్వరేణ
మాహేశ్వరత్వ మఖిలాః కలయంతి లోకాః।
ఆమోదితాఖిలదిశావలయేన యోగాత్
భద్రశ్రి[యా]వనిరుహో ఇవ చందనత్వమ్॥

బ్రహ్మణ్యోగ్రా సహస్రం సముచితముదితి[ః*]
స్వర్ణరాశీ వనేకా
సగ్రాస్య న ప్యగ్రహారా వతిమత వితతా
దేవతానాం ప్రతిష్ఠా[ః*]।
బ్రహ్మోద్వాహో న్వహూనావ పృక్కృత సుకృతినా
మగ్రణీః పుణ్యచేతా

స్తుత్యా న్నామా స్త్రిపుణ్యాం వ్యధితనయదయ
న్ధూర్జటి ప్రీతికామః॥

శ్రీగంగాధరవంశవార్ధిరజనీ
నాథస్య విద్యానిధే
నప్తా శ్రీత్రిపురాంతకస్య సుధియః
పౌత్రో సుతో శ్రీగిరేః।
పుత్ర శ్రీత్రిపురారి దేశికమణే
ర్భీమేశ్వరస్యానుజో
యస్య శ్రీగిరిదేశికో గురురభూత్
శ్రీకొండరాజోఽంగీకృతః॥

గురుం త మారాధ్య స తత్కృపాప్త
సర్వప్రతాప శ్శివలింగభూపః।
వ్యానష్ట హృద్యాం సారద త్తమూరి
కృతాం గిరీశస్తుతిసూక్తిమాలామ్॥



శ్రీమంతుడు   దరిద్రుడు

చైతుసింగు[1]

మొసలికంటి సంజీవరావు గారు

మహోత్తరగుణదోష సంకలితము, ఆకర్షణీయము, పతనార్హము నైన యొప్పు హేస్టింగ్సు పరిపాలనచారిత్ర మెంతయు విచార్యము. తత్సంబంధ కాశీరాజోపాఖ్యాన మిం దరయుదము.

గభీరపారావారముం బోలు హైందవచారిత్రమున నల్పశలభప్రాయుఁడగు కాశీరాజు హేస్టింగ్సు కారణమునఁ గొంత ప్రాముఖ్యము గాంచెను.

ఈతని పేరు చైతుసింగు. కాశీరాజ్యము, అయోధ్యాదేశాంతర్భాగము. తద్రాజ్యాధిపతి వజీరును[2] ధిక్కరించియు, ధిక్కరింపఁజాలని స్వాతంత్ర్య మనుభవింపుచుండెను. ఆవిషయ మటుండ, కాశీదేశము క్షామ మెఱుంగక, సస్యశ్యామలశోభితమై ధనధాన్యసమృద్ధమై, లక్ష్మీనిలయమై, దర్శనీయమై, వర్ణనీయమై యుండెను.

ప్రసిద్ధమగు బక్సారు యుద్ధావసరమున (౧౭౬౪) చైతుసింగుజనకుఁడగు బలవంతసింగు కాశీరాజ్యము పాలించుచుండెను. తనపై నధికారము వహించి శాసింపఁజాలు నయోధ్యాధీశుని పీడనము సైఁపఁజాలక, హైందవచారిత్ర నిర్మాణసమర్థమగు నమ్మహాసమయమున, నాంగ్లేయులకుఁ దోడ్పడి, బలవంతుఁడు వారి కృతజ్ఞతాభిమానములకుఁ బాత్రుఁడాయెను. ఇంగ్లాండునందలి కంపెనీ డైరక్టర్లు గూడ నాతని నెంతయు నభినందించిరి.[3] సమయము మిక్కిలి అనుకూలముగ నున్నను, తాను సర్వస్వతంత్రుఁడై యుండ నాసింపక, ఆంగ్లేయాధికారమునకు, లోఁబడి యుండు స్వాతంత్ర్యమే ఆతఁ డపేక్షించెను. కాని బక్సారు యుద్ధానంతరమైనసంధి ననుసరించి కాశీరాజు నగుడు నయోధ్యాధిపతిసామంతుఁ డాయెను. ఆసంధి ననుసరించియే, తన సామంతుని స్వాతంత్ర్యమునకు భంగము కలిగింప రాదని ఆంగ్లేయులు శాసించుటచే, వజీరు పరిభవానలతప్తుఁ డయ్యు, సహించి యూరకుండెను.

బలవంతసింగు ౧౭౭౧ లో మరణించినంతనే, అయోధ్యవజీరు దురాశాపరుఁడై, కాశీరాజ్యమును కబళింపఁగోరెను. కాని, ఆంగ్లేయులు సమ్మతింపమి, వజీరు భగ్నమనోరథుఁ డాయెను. బలవంతునికుమారుఁడగు చైతుసింగు యథాప్రకారము రాజాయెను. 1773 లో వజీరు మఱలఁ దన కాశీరాజ్యగ్రహణేచ్ఛ వెలిపుచ్చెను. అట్లు కాదేని, తద్రాజ్యస్థ ప్రసిద్ధదుర్గములు రెండును, ౧౦,౦౦,౦౦౦ రూ. (పదిలక్షలు) అదనముగా నైనను లాగవలయునని ఆతఁడు ప్రయత్నించెను. హేస్టింగ్సు నిరాకరించెను.

ఆంగ్ల పరిపాలకుఁడు చెప్పుకారణములు గమనింపఁదగి యున్నవి.

౧. కంపెనీ రక్షించుచున్న గాని చైతుసింగు యొక్క రాజ్యప్రాణములకు క్షేమము లేదు;

౨. చైతుసింగును కంపెనీ రక్షించుట ధర్మము;

3. కేవలము ధర్మమగుటయే కాక అట్టి యాచరణము రాజనీతి విహితముగూడ నై యున్నది. మన దేశమున కంటియున్న కాశీదేశము మనకు ధనవ్యయమేమియు లేక అమరియున్న రక్షయై యున్నది. తన

1. ఇయ్యది రెండవచారిత్రకవ్యాసము. మొదటిది—నందకుమారవధ—జనవరి భారతియందుఁ జూడనగును.

2. అయోధ్యాదేశాధిపతులను వజీరులని యందురు.

3 R......and so highly important was the service which he rendered to the Company, that the Directors expressed their sense of it in the strongest terms"—
Mill and Wilson—p. 363, IV.

సాహాయ్యము మన కవసర మగునప్పుడు తద్దేశాధిపతి తప్పక ఒనరించునని మనము విశ్వసింపవచ్చును.......

....

బక్సారుయుద్ధమునందు తమకుఁ దోడ్పడిన కాశీరాజు పెడ నాంగ్లేయులు కృతజ్ఞులై యుండుటయే కాక తద్రాజ్యాధిపతి ఎప్పటియట్టులు స్వతంత్రుఁడై యుండుటయే వారలకు క్షేమకరముగ వాంఛనీయముగ నుండెను. కావుననే, హేస్టింగ్సు అయోధ్యాధీశుని దుష్ట సంకల్పమునకు దోహద మొనరింపక ఆసమయమున చైతుసింగున కమితోపకార మొనరించినవాఁడాయెను.

అంతనయోధ్యాధిపతి మరణించెను. (౧౭౭౫) ఆతని పుత్రుఁడగు ఆసఫుద్దౌలా రాజాయెను. ఆసమయమున నాంగ్లకంపెనీ సేవకులు హేయముగఁ బ్రవర్తించిరి. ఆసందర్భముననే అయోధ్యకు లోఁబడియుండిన కాశీరాజు ఆంగ్లేయులకు సామంతుఁ డాయెను. చైతుసింగు స్వాతంత్ర్యమునకు భంగము వొరయకుండ జూడవలయునని హేస్టింగ్సుకడు మదారముగ సంకల్పించెను. అన్నపాలుఁ డేఁటేట ౨౨,౧౦,౦౦౦ రూ. కప్పము చెల్లింపవలసియుండెను. పదరు కప్పము సరిగఁ జెల్లునంతకాలము తా మాతనిస్వాతంత్ర్య మరికట్టమనియు, అన్యులరికట్టకుండ తాము రక్షింతుమనియు, కరరూపమునఁ గాని, మఱే రూపమునఁగాని ఎప్పుడు ధనము తామెన్నఁడుఁగోరమనియు కంపెనీవారు అభయమొసంగిరి. కప్పము వసూలుచేయు నధికారము రెసిడెంటున కొసంగినచో రాజుయొక్క గౌరవ స్వాతంత్ర్యములు కొఱఁతపడునని యెంచి, * కాశీరాజు స్వయముగనే ఆమొత్తము కలకత్తానగరమునకుఁ బంపునేర్పాటు హేస్టింగ్సు చేయించెను. మఱియు, నాణ్యముద్రణాధికారముగూడ నాతనియధీన మాయెను. ఈవిధమున నిర్ణీతసుల్క సమర్పణము తప్ప రాజశబ్దము సార్థకమగునట్లు కాశీరాజు సర్వస్వతంత్రాధికార సమన్వితుఁడై విలసిల్లెను.

ఈసందర్భమున హేస్టింగ్సు వ్యక్తపఱచిన ఔదార్యము, అభిమానము, ఋజుప్రవర్తనము ప్రశంసనీయములు, నాదర్శప్రాయములుఁగదా! కాని, చల్లని వర్షము లీను కాఱుమేఘమున భయదములగు పిడుగులుకూడ నడఁగియుండునని ఎఱుంగని కాశీరాజు అట్లే తలంచి, యుప్పొంగి, ఆంగ్లపాలకుఁడు దైవసమానుఁడని విశ్వసించి, విచారము మఱచి నిజప్రజాసేవాపరాయణుఁడై హాయిగ నుండెను.

చైతుసింగు రెండుమూడు సంవత్సరములు ఆంగ్లేయుల ఆగ్రహమునకు గుఱికాకుండ, కప్పము సకాలమున సముచితముగ సమర్పించెను. అంత ఫ్రెంచివారితో యుద్ధము సంభవమాయెనను కారణమున ౫,౦౦,౦౦౦ రూపాయిలు అదనము చెల్లింపవలయునని (౧౭౭౮) హేస్టింగ్సు ఆకస్మికముగాఁ గోరెను. రాజు సహజముగ భయాక్రాంతుఁడై చేయునదిలేక ఆభారము కొంతయైనను తగ్గింపవలయునని అర్థించి, తన కాధనము చెల్లించుట కొడఁబడి, ఇఁక నెన్నఁడట్లు విధింపరాదని సవినయముగాఁ గోరెను. అది యొక్క అపరాధముగ గణించి వాయిదాలపై జెల్లింపవలసిన ఆపైక మంతయు నొక్కసారియే చెల్లింపవలయు ననియు అనంతరము ఐదాఱు దినములలోఁ జెల్లింపవలయు ననియు నాంగ్లపాలకుఁడు కఠినముగ విధించెను. రాజు శిరసావహించెను.*

మఱుసటిసంవత్సరము మరల ౫ లక్షల రూపాయిలు హేస్టింగ్సు కోరెను. అంత, తా మొనరించుకొనిన యొడంబడిక స్మరణకుఁ దెచ్చి, అట్లు విధించుట

* *Vide p. 366, IV—Mill and Wilson.*

* "The Raja asked that the exaction should be limited to a single year, and was punished for his 'contumacy by being ordered to pay the whole forthwith instead of by instalments. Chait Singh then asked for six or seven months' indulgence, whereupon payment was demanded within five days, and was told that if he failed to comply he would be treated as though he had refused absolutely."—A Historical Geography of the British Dominions, Vol. VII,—India Part I,—p. 201;—Mr. P. E. Roberts.

తగదని రాజు సవినయముగా నివేదించెను. కాని, ఆంగ్ల పరిపాలకుఁడామాట పాటింపక న్యాయాన్యాయములు విచారింపక, క్రుద్ధుఁడై సిద్ధముగ నుండిన బ్రిటిషు సైన్యమాతనిపైఁ బంపెను. చైతసింగు ఆసైన్యము తోడనే చెల్లించెను. అదిగాక, సుమరు ౨౫,౧౦౦ రూ. సైన్య వ్యయముక్రింద నాహతభాగ్యుఁడు సమర్పింప వలసిన వాఁడాయెను.

పెనుభూతమువలె దాపురించిన ఆపద యంతటనైనను తొలంగదాయెను. ఆసంవత్సరముగూడ గిఱ్ఱునఁ దిరిగెను. ఆంగ్ల పాలకుఁడు మగుడ (౧౭౮౦)నైదులక్షలు కోరెను. రా జేమి చేయవలయును? సామమునం గాని కార్యము దానమునఁ జక్కఁబడునని ఎంచి ఆ కేఁడు వెంగలి రై ౨,౦౦,౦౦౦ రూపాయిలు హేస్టింగ్సునకు రహస్యముగ నంపెను. ఆధన మందుకొనియు, నాంగ్ల పాలకుఁడు తనయాజ్ఞ మరలింపఁడాయెను. దురదృష్టవంతుఁడగు సింగు ౫,౧౮,౦౦౦ రూ. యథాప్రకారము జోహారు సల్పి చెల్లింప వలసినవాఁడాయెను. ఒకలక్ష రూపాయిలు పరిహారముగూడ నాతఁ డర్పించెను.

దుర్భరాంగ్ల దౌర్జన్యమునకును, చైతసింగు దురవస్థకును అంతము లేకుండెను. హేస్టింగ్సు ౨,౧౧౦ ఆశ్వికదళము నాయత్తపఱుప వలయునని నిర్దయుఁడై ఆజ్ఞాపించి, అనంతరము కరుణించి ౧,౦౦౦ దళము నాయత్తము చేయవలయునని కఠినముగ విధించెను. మందభాగ్యుఁడగు నారాజు తనయసమర్థత వెలిపుచ్చి ఆంగ్ల పరిపాలకుఁ డేమి చేయునో యని వెఱచి ఎట్టకేలకు ౫౦౦ ఆశ్వికులను, ౫౦౦ల పదాతులను జతపెట్టెను. క్రూర కుటిలాచార్యుఁడగు హేస్టింగ్సునకు ఆలస్యము దుస్సహమాయెను. కాశీరాజు యుక్తాయుక్తము లరయక ప్రచండాంగ్లాధికారము ధిక్కరింప సాహసించెనని నేరము మోపి, ౫౦,౦౦,౦౦౦ రూ.(ఏఁబదిలక్షలు), అపరాధము విధించి, తద్విపరీతపరిహార మర్పింపఁడేని క్షుద్రక్రిమికీటకమువలె నలిపివేయ వలయునని ఆంగ్లప్రభువు దారుణముగ సంకల్పించి, * అల్పసైన్యపరిరక్షితుఁడై దురంత క్రోధఘూర్ణమానమానసుఁడై బయల్వెడలెను.

ఆవార్త తెలిసినంతనే కాశీరాజు భయావేశమునఁ దనరాజధాని వీడి, ఎదురేఁగి, దవ్వునను్న, 'బక్సారు' గ్రామముచెంత హేస్టింగ్సును సందర్శించి, నిజాధికార లాంఛనమై మాననీయమై ప్రాణప్రదమై తివరు తనకిరీటము నాయాంగ్ల వీరుని,యూరుతలంబున నిడి '20,00,000 రూపాయలు పరిగ్రహించి నేరము సైరింపవలయు'నని భయవినయవిహ్వలస్వరంబునఁ బ్రార్థించెను. కాని, ఆమహనీయుని వెన్న వికటించి, దావానలసన్నిభముగ తన దారిద్ర్యము తీర్పఁగల అనంతధనరాశి గడింప నాసించిన ఆంగ్లప్రభువు ప్రసన్నుఁడుగాక,నోరార మాటాడక దురాలోచనాపరుఁడై తటాలునఁ గాశీనగరమునకుఁ బ్రయాణమాయెను.

కాశీనగరము చేరినంతనే, హేస్టింగ్సు దురాగ్రహము పూర్తిగ బహిర్గత మాయెను. తాఁగోరిన సాహాయ్యము తాఁగోరినంతనే కాశీరాజు చేయలేదఁట:— అదియొక మహానేర మాయెను! చైతసింగు, భయభ్రాంతుఁడై, తగు సమాధాన మొసంగెను. కడు సమంజసముగనున్న యాసమాధానము హేస్టింగ్సునకు మాత్రము దుస్సహమాయెను. అన్యథా ఎటులుండును?

ఆంగ్ల పాలకుఁ డాజ్ఞాపించినంతనే 'రెసిడెంటు' నాబడు నాంగ్లస్థానికుఁడు రయమ్మునఁ బోయి కాశీరాజును ఆతని రాజధానియందే బంధింపఁ గడంగెను. హేస్టింగ్సు యుక్తాయుక్తము లెఱుంగని మందుఁడు గాకున్నను ఈసమయమున మాత్రము మందుని చందముననే మెలంగెను. ఉత్తర దేశస్థులు బంగాళీలవలె పందలుగాక అఖర్వబలగర్వసమన్వితు లని యెఱుంగక రెండు పటాలములతో నాకార్యము చక్కనగునని ఆతఁడు భ్రమించెను. గుణవంతుఁడగు రాజు ప్రజాభిమానపాత్రుఁడై, తంత్రీయై, దైవమై ప్రవర్తిల్లుచుండిన కారణమున నాంగ్ల

---

* "I was resolved," says the Governor-General, "to draw from his guilt the means of relief to the company's distresses" Mill

పాలకుని దుష్టసంకల్పము వెల్లడియైనంతనే ప్రజాళి దండధరులై ఆయుధపాణులై దుర్దాంతక్రోధఘూర్ణిత మనస్కులై ఆంగ్ల సైనికులను జుట్టిరి. ఆంగ్లోద్యోగులు వీరపురుషోచితముగఁ బోరాడి మరణించిరి. సిపాయిలను దెగ నఱికి దేశీయులు కృతకృత్యులైరి. బంధితుఁడగు చైతసింగు సమయముఁ జూచి దీర్ఘ రజ్జువుగ నేర్పడిన తన యనుచరుల పాగాల సాహాయ్యమున గంగాతీరమున డిగ్గి నౌకారూఢుఁడై రెండవతీరమునందలి రామనగరము జేరెను.

కాశీరాజు తప్పించుకొనెను. ఆంగ్ల సైనికులు తెగటారిరి. హేస్టింగ్సుఅవస్థ తార్తరునిఁ బట్టుటఆయెను—రాజును బంధింపఁబోయి తానే బంధితుఁడాయెను. ఏఁబదిమంది సైనికులుమాత్ర మాతని యుండనుండిరి. ఝుంఝూమారుతాహతి గభీర పారావారావృత క్షుద్ర నౌకవలె నాతని మందిరము సంక్షుభితజనసంక్షోభములచేఁ జుట్టబడెను. ఆంగ్ల పాలకుఁ డేమికావలయును? స్వయంకృత ధూర్తప్రవర్తన ప్రతిఫలముగ నాఁతడాసమయమున మరణించెనేని* ఆంగ్ల విజృంభణ మేమాయెడిదో ఆంగ్ల హైందవసామ్రాజ్యనిర్మాణ మేమాయెడిదో, హైందవచారిత్ర మెటులు పరిణమించెడిదో ఎఱుంగరాదు.

అంతటి అపాయమునం దగుల్కొనినను ఆంగ్లపాలకుఁ డహంకార మడఁగదాయెను. విడివడిన కాశీరాజు అల్పసైన్యరక్షితుఁడగు హేస్టింగ్సుపై తత్క్షణము పడుటకు మాఱుగ సవినయముగఁ గబురంపి సఖ్యము నెఱప బ్రయత్నించెను. కాని గర్విష్ఠతదుర్గర్వమున నాదౌత్యము నిరసించి సమర్థులగు గూఢచారుల కర్ణరంధ్రములందు చీటులు పెట్టి అందందుఁగల ఆంగ్ల సేనానులకుఁ దన దురవస్థ హేస్టింగ్సు తెలియఁబఱచెను.

రంగమునకు దగ్గర నుండిన ఆంగ్ల సేనాని యొకఁడు తనయంతర మెఱుంగక తీవ్రపడుటచే దేశీయులు సన్నిధిస్థులందే ఆసైనికులను దాఁకి చెక్కాడిరి. దాన, కాశీరాజ్యమునఁ బొడసూపిన విప్లవము రాజ్యమందంతటను వ్యాపించెను. * కాశీరాజ్యమే కాదు—దుష్పరిపాలనా పీడితులగు అయోధ్యాదేశస్థులు గూడ నాయధికారము ధిక్కరించి, పన్ను లెగవైచి, శుల్కగ్రహణాధికారులను బాఱద్రోలిరి. బీహారుదేశముగూడ నట్లే సంచలింప నుండెను. మఱియు, పాఱిన చైతుసింగు సాహాయ్యమునకు సైన్యము లాయత్తమాయెనని తెలియవచ్చెను. అట్టిసమయమున నెంతయు నవసరమగు ధనము హేస్టింగ్సునెద్ద నేమియు లేకపోయెను. నాలుగైదుమాసములనుండి జీతములు లేక సైనికులు సంకటపడుచుండిరి. అట్టి నికృష్టసమయమున కాశీరాజు రేయియందు నరుదెంచి పైఁబడునని తెలియవచ్చినంతనే ఆంగ్ల పాలకుఁడు భయభ్రాంతుఁడై తన సైనికోద్యోగులతో సంప్రతించి, ఇంకను అందుఁ దడయుట అపాయకరమని ఎఱింగి, క్షతగాత్రులగు తన సైనికులనందే విడి, చీఁకటి యైనంతనే బలిష్ఠమగు 'చూనారు'దుర్గమునకు రహస్యముగఁ బలాయన మొనరించెను.

చైతుసింగు తనరాజధాని విడినయనంతరముగూడ నాంగ్ల పాలకునిఁ బ్రసన్ను నొనరించుకొన వలయుననియే ప్రయత్నించెను. తనవలన నావంతయు నేరము లేదని విన్నవించి, ఎట్టి షరతులకైనను లోఁబడి, సఖ్యముగ మనవలయునని ఆతఁడు కడుంగడుఁ బ్రయత్నించెను. * కుమతియగు నాంగ్ల పాలకుఁడు సమ్మతింపమి, సహనశీలుఁడగు కాశీరాజు చేయునదిలేక, సముచిత సమర ప్రయత్నము లొనరింపఁ గడంగెను. ఐనను, జయసంపాదన సమర్థులగు నాంగ్లేయుల కోహటించి, చైతుసింగు,

---

p. 393,—Mill

* "The contagion of revolt and hostility flew with unusual rapidity and strength," Mill.

"The Raja had endeavoured to make his peace from the moment of his escape ......and professed his readiness to submit with implicit obedience to whatever conditions the Governor-General might think fit to impose."—Mill.

'లతీఫు'పురమునుండి, 'బిజగరు'దుర్గమునకును, అటనుండి బుందేలు దేశమునకును, శాలి తుదకు, గ్వాలియరు నగరమున నడంగెను.

మన వ్యాసమునకు విశేషసంబంధము లేకున్నను, మఱియొక విషయము నీసందర్భమున గమనింపఁదగును. బిజగరుదుర్గమునుండి చైతుసింగు పాఱినయవసరమున నాతనిభార్యయు, నాతని జననియుఁ దమధనకనకాదులతో నందు విడిసియుండిరి. ఆదుర్గము రాజమాతకుఁ జెంది యుండెను. తనకుఁగల ధనమంతయుఁ దరలించుకొని తన పుత్రుఁడు వెడలెననియు, మిగిలినసొత్తు తనదేయనియు, ఆకారణమునఁదన్నుఁ దన ధనముతో సపరివారముగాఁబో నిచ్చి మఱికొన్ని సమపాయము లొనరింప నంగీకరించిన చో నాదుర్గమాంగ్లేయుల యధీన మొనరింతుననియు రాజమాత వర్తమాన మంపెను. ఆంగ్ల సేనాని హృదయమైన మెత్తఁబడెనుఁగాని దవ్వుననున్న హేస్టింగ్సు మాత్రము కఠినహృదయుఁడై సంచరించెను. ఇతర సమపాయముల మాటయటుండ, అనాధరాజ్ఞియొక్క ధనకనకాదుల నామెకు విడుచుటకు సమ్మతింపకుండుటయేకాక, ఆమెను బరీక్షింపకుండ వెడలనిచ్చినచో, విజయులగు సైనికులకు రావలసిన దోపిడి మాయమగునని ఆంగ్ల పరిపాలకుఁడు దారుణముగఁ దనసేనానికి వ్రాసెను.*

ఉదారమనస్కుఁడగు సేనాని లెస్సగ మెలంగవలయునని ప్రయత్నించినను, హేస్టింగ్సుయొక్క యధికమతము మెల్లగఁ బ్రాకి వెల్లడియగుటచే, ధనాశాపరులగు తనసైనికులను వారించుట అసాధ్యమాయెను. ఆకారణమునఁ బ్రసిద్ధకాశీరాజ్య భారధురంధరుల రాణివాసము చోరులవంటి, కంటకులవంటి, హంతకులవంటి అన్యజనుల, కఠిన పరీక్షకుఁ బాల్పడి తమదుర్గమునుండి ఎటకేని పోయెను.*

లతీఫుపురము స్వాధీనమైనంతనే హేస్టింగ్సు వసి వడిగ కాశీనగరమునకుఁ బోయెను. చైతుసింగును, ఆతని సోదరునిం దప్ప నితరజనానీకము నెల్ల మన్నింతునని యాతఁడు ప్రకటించెను. రాజనీతిజ్ఞుఁడగు నాంగ్లపాలకుఁడు రాజ్యము నామకహార్తమున నేకబళింప నొల్లక, పందొమ్మిది సంవత్సరముల ప్రాయముగల చైతుసింగు మేనల్లుని సింహాసనమునఁ బ్రతిష్ఠించి, ఆతఁడు బాలుఁడని, ఆతనిజనకుని 'నాయిబు'గా నియోగించి, తొంటి ౨౨ లక్షల కప్పమును, నలుబదిలక్షలు చేసి, రాజ్యమునందలి 'క్రిమినలు' అధికారమును, రాజధానియందలి 'సివిలు' అధికారమును గూడఁ దనకు బాధ్యుఁడై యుండు నొకయధికారియధీన మొనరించెను. రాజచిహ్నమగు నాణ్యముద్రణాధికారము మఫలే పోయెను. కాశీరాజు నిక్కముగ నొక పాతరాజాయెను.

"I apprehend that she the Ranee—will contrive to defraud the captors of a considerable part of the booty, by being suffered to retire *without examination*."—Hasting—Quoted by Mill.

"And when the Princesses, with their relatives and attendants, to the number of three-hundred women, besides children, withdrew from the castle, the capitulation was shamefully violated; they were plundered of their effects; and their persons otherwise rudely and disgracefully treated by the licentious people and followers of the camp."—Mill:—"That they or rather their attendants were subjected to personal search, is possible,—the searchers were females."—Wilson—p. 404.



నవ్వు నాశ్నము

సుఖమునకు నవ్వు కారణమా? నవ్వునకు సుఖము కారణమా? రెండును. లోపల తరలిన నవ్వు వెంటనే వెలుపలికి వచ్చును. వెలుపలనుండియు లోనికి నల్లే పోవును. ఈతీరున జాఁహార్వె కెల్లాగుగారు 'హెల్తు, పత్రికలో వ్రాసిరి. ఎట్లు పుట్టిననేమి, నవ్వు శరీరమును' మనస్సును ఉత్సాహింపించును. ఆత్మద్వారములను దెఱచి లోనికి ప్రకాశమును వ్యాపింపజేసి భయము, విచారము నక్కడ ప్రోదిచేసియుంచిన చీకటిని, పీడను చెదర గొట్టును. భయము, కోపము, విచారము జీవనవాహిని నింకించును. నోట ఉమ్మి ఊరదు. నాలుక మండుచు అంగిట నంటుకొనును. కాలిజము, జీర్ణకోశము-ప్రతి ముఖ్యావయవమును మందగించిపోవును; లేదా, పూర్తిగ నాగిపోవును. అయిన నవ్వు అన్నిచక్రములను ఝుంకారముతో నడవజేయును. మఱియు నెత్తురు రక్తనాళములయందు క్రొత్తవేగముతో పరువిడజేయును.

హాహాహా అను గళధ్వని క్లోమము (ఊపిరితిత్తులలోపలి కోశములకును, ఉదరమందలి కోశములకును నడుమ నడ్డముగ నుండు పొర) పిత్తజీర్ణకోశముల క్రిందికి మీదికి నెగురజేసి, అరెమొండలినమ్మిన బంట్లకు మనఃపూర్వకముగ హెచ్చరిక నిచ్చును; అది జీర్ణశక్తికి తోడ్పడును; పిత్తాశయమునుండివచ్చు పిత్తరసమును పరిశుద్ధ మొనర్చును; ఆహారవాహిక యంత్రటను తిరుగుడు తరంగములను పుట్టించును.

నవ్వు ఉత్తేజకద్రవ్యము; బలము నిచ్చుమందు; గొప్ప జీవామృతము.

హృదయపూర్వకమగు నవ్వుతో ప్రతిదినము నడయింపజేయుము.

నలుపు లున్నచో నవ్వి మఱచిపొమ్ము.

ఉత్సాహమున కోటీశ్వరుడవు కమ్ము.

ఈసందర్భమున మన ఆంధ్రరత్నము గోపాలకృష్ణయ్యగారు చెప్పిన వాక్యములు స్మరింపదగును: 'Laughter lubricates the soul,—నవ్వు ఆత్మను స్నిగ్ధమొనర్చును.

కీ. శే. శ్రీమతి పార్వతిఅమ్మాళు

'త్రివేణి' జూలయి సెప్టెంబరు మాసముల సంచికలో ప్రకటింపబడిన వ్యాసము నుండి.

శ్రీపార్వతిఅమ్మాళు ౧౮౬౫ సం. ఏప్రిల్ మాసమున జననమందినది. సుబ్బస్వామయ్యరుగారి చిన్న పెండ్లమున కీమె కడగొట్టుబిడ్డ. ఈఅయ్యరుగారు తిరుచినాపల్లి మండలమున మనక్కాల్ గ్రామమున నొక సంపన్నుడగు మిరాశిదారుడు. పార్వతిఅమ్మాళున కైదవయేట నాతడు మృతిచెందెను. అతనిపత్ని దొరఅమ్మాళు శిష్టాచారపరాయణ; సుగుణవతి. ఈమె తనసవతిపిల్లల పోరువలన చాలసిలుగులకు లోనయినది. పార్వతి అమ్మాళును కొచ్చిను సంస్థానపు దివానుపేష్కారుగ నుండిన కీ. శే. ఏ. శంకరయ్యరుగారి రెండవకుమారుడు

శ్రీచంద్రశేఖరయ్యరు పెండ్లాడెను. పెండ్లినాటికి పార్వతిఅమ్మాళునకు వయసు తొమ్మిదేండ్లు. తరువాత నొక యేడాదికా మెతల్లియు పరమపదించెను. ఆమెకు చిన్ననాడు కలిగినచిక్కులు—అందును తల్లిదండ్రులమరణము, యౌవనదశయందు తనపై తా నాధారపడియుండుట, తనబాధ్యతను గుర్తించుట, పరులయెడ నాదరభావము కలిగియుండుట మొదలయిన యుత్తమగుణములు పెంపొందుట కుపకరించినవి.



కీ. శే. శ్రీమతి పార్వతిఅమ్మాళు

మగడు చెన్నపురియందు న్యాయశాస్త్రకళాశాలయందు చదువుచుండ పార్వతిఅమ్మాళు కాపురమునకు బోయెను. ఆమె గృహకార్యనిర్వహణాసామర్థ్యమునకు, వివేకమునకు, నత్తవారింట నందఱు నామెయెడ గౌరవమును, ప్రేమయు గలిగి మెలగుచుండువారు. ఆమె కుటుంబకార్యములను నియమముతో, జాగరూకతతో, నేర్పుతో నెరవేర్చుచుండెడి. అతిథిసత్కారము నెడ నామెకు ప్రీతి మెండు. ఆమె యింట బట్టలు, పాత్రలు, ఆహారపదార్థములు అన్నియు పరిశుభ్రముగ నుండ జూచుకొనుచుండును. ఆమె యెన్నడును సొమ్మును వ్యర్థముగ వ్యయపెట్టెడిది కాదు. ఆమెకు లేనిపోని ఆడంబరము గిట్టదు.

భర్త బి. యల్. పరీక్షనిచ్చి న్యాయవాది కాదలచియుండ పార్వతిఅమ్మాళ్ ఆతనిని మైసూరు సివిల్ సర్వీస్ మొదటిపోటిపరీక్షకు పోవ ప్రోత్సహించినది. అతడట్లె పోయి యీపరీక్షయందు ప్రథముడుగ కృతార్థుడయ్యెను. మైసూరు ప్రభుత్వము వారాయనకు తొలుదొలుత అసిస్టెంటు కమిషనరు ఉద్యోగము నొసగిరి. క్రమముగా నాయన పెక్కు ఉన్నతోద్యోగములను బడసి తుదకు మైసూరు ప్రధానన్యాయస్థానమున ప్రధానన్యాయమూర్తియై ౧౯౩౪ వ సం. ఆగస్టుమాసమున విశ్రాంతిగైకొనెను. భార్యయగు పార్వతిఅమ్మాళు సత్ప్రవర్తనము, వివేకము, కార్యకౌశల్యము, అనుకూల్యము, ప్రోత్సాహము నాతనిజీవితమునకు మెఱుగుపెట్టినవనుట అతిశయోక్తి కాజాలదు.

ఆమెకు సంతానము జీవింపలేదు. ఆమె కా అంతరయే లేదు. ఒరులసంతానమే యామెసంతానము. ఆమె విశాలహృదయము ప్రేమపూరితము, వారినే తన పిల్లలుగ తలచి మిక్కుటముగ ప్రేమించునది. ఆమెకు మఱియు దీనులయెడ నిండుదయ. వారిదైన్యమును తొలగింప నిరంతరము పాటుపడుచుండెడిది.

ఆమె శిష్టాచారసంపన్నయైనను మతాంతరములయందు పార్వతిఅమ్మాళునకు విశ్వాసము గలదు. వానియందలి ప్రధానతత్త్వము లామెకు నచ్చినవి. ఇదియే యామెజీవితమునకు మెఱుగుదెచ్చినది. ఆమె కొన్నాళ్లకు దివ్యజ్ఞానసమాజమున సభ్యురాలయ్యెను. మహర్షులయెడను, పూర్వాచార్యులయెడను, జాతీయవీరులయెడను ఆమెకు భక్తిగౌరవములు మిక్కుటము. నిరంతరగ్రంథపఠనమే యిందులకు గారణము.

హైందవుల సాంఘికపరిస్థితులు ముఖ్యముగా వివాహవిధానము, స్త్రీలస్థితి, వితంతువులదుర్దశ, పంచములహీనస్థితి—పార్వతిఅమ్మాళు మనస్సున గట్టిగా

నాటుకొని కలత పెట్టినవి. ఆమె వీనిని చక్కబరచి సంఘమును అభివృద్ధికి దెచ్చుటకయి వీరకంకణము దొడిగినది.

ఆమెకు అఱవము బాగుగవచ్చును. చక్కగా ఉపన్యసించగలదు. కన్నడమునను, మళయాళమునను ఉపన్యాసముల నొసగగలిగియుండెడిది. తరువాత వయసువచ్చిన పిదప ఇంగ్లీషునను వ్యవహారమునకు జాలినంత పాండిత్యమునుగడించినది. మహాత్ములగు మున్నగువారి యుపన్యాసములను సరిగా నర్థముచేసికొనుటకును, ఆవశ్యకమైనచో తోడివారికి సందర్భానుసారముగ వివరించి చెప్పుటకును జాలినజ్ఞానము గలదు.

పార్వతి అమ్మాళు ఉపన్యాసములు విషయపూరితములు, సయుక్తికములు, అర్థవంతములునయి శ్రోతల హృదయములయందు లెస్స నాటుకొనునవి; విసుగు కలిగించు వ్యర్థప్రసంగములతో నిండియుండవు. అప్పుడప్పుడు ఆమె చమత్కారపుమాటలను వీగడ తాలికలవలె చేర్చుచుండును. తాను జెప్పబోవు విషయమునుగూర్చి చక్కగా నాలోచించి నిశ్చయమునుగుదుర్చుకొని పదపడి శ్రోతలకు నచ్చజెప్పుచుండును. సభలయందు మాట్లాడుట ఈమెకు జంకుగొంకులు లేవు. ఆమె ఉపన్యాసములను చిత్తు వ్రాసికొని వేదికనెక్కను. సూచనలచిత్తుకూడ నామె కక్కరలేదు. ఆమె యెప్పుడును స్వానుభవములోని విషయములనే మాటలాడును. భాష సుబోధముగనుండును. భావములు స్వతంత్రములు, స్పష్టములునయి ప్రబోధకములుగ నుండును. మంచి దృష్టాంతముల నామె యెత్తిచెప్పుచుండును. విరోధుల ప్రతివిమర్శనముల కింతయేని చలింపక శ్రోతలముఖభావ వైఖరులను గుర్తించి తన యుపన్యాసములను సాగించుచుండును. నియమితకాలమును, విషయమును ఇంతయైన మించక, పెంచక, తనసిద్ధాంతములను గ్రుద్దినట్లు చెప్పితీరును. ఇట్లుంటయు నగుటచేతనే శ్రోతలీమెయుపన్యాసముల నొకయక్షరమునైన వ్రోసిపుచ్చక శ్రద్ధతో వినుచుందురు. ఈమె యుపన్యాసధోరణిని పెక్కురు దేశీయులు, విదేశీయులు చాల మెచ్చుకొనియున్నారు. స్త్రీలసౌకర్యములకయిన పెక్కువిషయములనుగూర్చి యీమెచేసిన యుపన్యాసములు లెక్కకు మిక్కిలిగ గలవు. ౧౯౨౭ వ సంవత్సరమున మైసూరు విశ్వవిద్యాలయమువారి ప్రార్థనము నంగీకరించి 'స్త్రీల అభివృద్ధి-ప్రకృతావశ్యకములు' అను విషయమునుగూర్చి కన్నడమున నీమె చక్కగా నుపన్యసించినది.

పార్వతిఅమ్మాళు ఉపన్యాస ప్రారంభమున తాను విద్యావతి కాదనియు, పాఠశాలయందు విద్య నభ్యసించి పరీక్షలనిచ్చియుండలేదనియు, జీవితపాఠశాలయందే విద్య నభ్యసించెననియు, తన ఏబదియేండ్ల జీవితమున తనకు ఘటిల్లిన వివిధవిధజీవితానుభవములే తాను నేర్చిన పాఠములనియు చెప్పెడిది. ఇది సత్యము. పాఠశాలలయందామె విద్య నభ్యసింపకున్నను సుప్రసిద్ధద్రావిడ సాహిత్య గ్రంథములను, పురాణములను సవిమర్శముగా పఠించి విస్తారము జ్ఞానమును సంపాదించుకొనినది. దీనికి తోడు ఆధునికప్రపంచస్థితులను, దేశాభివృద్ధి కావశ్యకములగు విషయములను స్వీయవ్యాసంగముచేతను, భర్త సహాయముచేతను చక్కగా బోధపరుచుకొనుచుండెడిది.

పార్వతి అమ్మాళు బుద్ధిని, ద్రవ్యమును వినియోగించి సంఘాభివృద్ధికొఱకు కావించిన ఘనకార్యములు పెక్కిటిలో స్త్రీవిద్యాభివృద్ధికొఱకయిన బెంగుళూరునందలి 'మహిళాసేవాసమాజము' ముఖ్యమైనది. స్త్రీలయెడ సానుభూతిగల కొందఱు మిత్రుల సహాయప్రోత్సాహములతో నీయమ యీసమాజమును ౧౯౧౭ వ సంవత్సరమున నెలకొల్పినది. ఆనాటి చిన్న సమాజమే యీనాడు బహువిధముల స్త్రీలయభ్యుదయమునకు పాటుపడుచున్నగొప్ప సంస్థయయి పార్వతిఅమ్మాళు యొక్క స్వార్థరహితమైన సంఘసేవను, తెలివితేటలను చాటుచున్నది. ఆసమాజము పక్షమున స్త్రీలకొఱకొక ట్రెయినింగు పాఠశాల యున్నది. అందు స్త్రీలను కుటుంబసేవకు, ప్రపంచసేవకు ఉపయోగించునట్లు తయారు చేయుటయే పార్వతి అమ్మాళు ఉద్దేశ్యము కావున నామె కొన్ని తరగతుల బాలికలకు గృహకృత్యనిర్వహణవిధానమును, మతమును, నీతిని స్వయము బోధించెడిది. ఆపాఠశాలను నడుపుపద్ధతులు, జాతీయవిధానముల ననుసరించి విద్య గరపుట, ఆరోగ్యమును పెంపొందించు వ్యాయామశిక్ష మొదలయినవి పాఠశాలను పరీక్షింప నేతెంచిన స్వదేశీయవిదేశీయాధికారులు చాలగా మెచ్చుకొనిరి. అన్నిటిని

మించి ఉల్లాసముతో కలకలలాడుచున్న బాలికల ముఖములు చూడ సొంపుగ నుండెడివి. ఆపాఠశాలను సందర్శించినపుడు రాజప్రతినిధి గారిసతి యెంతయు సంతసమును వెలిబుచ్చినది. పాఠశాలయందలి బాలికలపై నాసాధ్వికి మాతృప్రేమ కలదు. వారిని ఎల్లవేళల కంటికి రెప్పవలె గాచుచుండును. మఱియు నామె సమాజము సొమ్మునుండియు, సొంతసొమ్మునుండియు విద్యార్థి వేతనములనొసగి వయసువచ్చిన స్త్రీలకు పెక్కు-గకు వృత్తి విద్యలు — ఉపాధ్యాయనూతికాధాత్రీ వృత్తులు — మొదలైన వానిని అభ్యసింప జేయుచుండెడిది. శిశు-ఆరోగ్య ప్రచారాలయమునకు తొలుత నొకసభ్యురాలుగ నుండి తరువాత సధ్యక్షురాలయి తత్సంబంధములగు కార్యములను కడు మెలకువతో నీమె నెరవేర్చుచుండెను. ఇంతేకాక, తఱచుగ నామె వైద్యాలయములకు బోయి రోగులనందఱిని జూచి వారికి సొమ్మును, వలసినవస్తువులను ఇచ్చి ఆదరించుచుండెడిది. వేయేల! మైసూరునందు స్త్రీలయభ్యుదయము నుద్దేశించి ప్రతిష్ఠింపబడిన సంస్థలలో నీయమబుద్ధి శరీర ధనసహాయము నొసంగని సంస్థయొక్కటియైన గానరా దనవచ్చును.

మొన్నటి ఐరోపా మహాసంగ్రామమునందు రణరంగమున పోరాడుచున్న సైనికుల సహాయముకొఱకు కొందఱు స్నేహితుల ప్రోత్సాహముపై రెండు మూడు సంఘలను స్థాపించి తన్మూలమున నీమె వారి కమూల్యమైన సేవను గావించెను. ఇండియా ప్రభుత్వము వారును, ప్రధాన సేనాపతి సర్ సి. మన్రోగారును ఈసేవను చాల కొనియాడిరి. పార్వతి అమ్మాళుగారి సంఘసేవను మెచ్చి ౧౯౧౭ వ సంవత్సరమున మైసూరు మహారాజావారు ఖిల్లతులను, ౧౯౩౩ వ సంవత్సరమున బ్రిటిషుసార్వభౌముడు కేసరిహింద్ పతకమును బహూకరించిరి.

౧౯౩౩ వ సంవత్సరము ఫిబ్రవరినెలలో పార్వతి అమ్మాళు బెంగుళూరు జిల్లాబోర్డుసభకు సభ్యురాలుగా నియమింపబడినది. ఆమె యాసభకు కేవల మలంకారమాత్రమే కాక ప్రతిసమావేశమునను స్త్రీలు పౌరసత్వమును బడసి ప్రజాహితకార్యముల నాచరింపజాలుదురు గాన వారి కట్టికార్యములను గావింప నవకాశముల నొసంగవలెనని వాదించుచుండెడిది.

ఈయమ ఇన్నిపనులను పెక్కేండ్లనుండి ఎడతెగని యనారోగ్యముచే క్రుంగుచుండియే కావించినది. సేవాపరాయణత, స్వార్థత్యాగము, దేశాభ్యుదయవాంఛ యీయామె యారోగ్యమును, తుదకు జీవితమును జయింపజాలినవి.

మొన్న ఫిబ్రవరిలో ఢిల్లీనగరమున జరిగిన అఖిల భారత మహిళా మహాసభ కీమె ప్రతినిధిగ నెన్నుకోబడినది. స్త్రీలకు వివాహోచితవయస్సును పొడిగించువిషయమున రాజప్రతినిధిగారికి రాయబారము జరుపవచ్చునని యీయామె యీప్రాతినిధ్యము నంగీకరించినది. భర్తతో ప్రయాణమై ఫిబ్రవరి ౫ వ తేదివాడు ఢిల్లీ చేరినది. మఱునాడుదయమున నభ్యంగము చేయుచు మార్బిల్లి వేడినీళ్ల ప్రొయ్యిపై పడినది. మంటేయియు, పాకాలును తీవ్రముగ గాలినవి. వెంటనే గట్టిగా వైద్యముచేయుచు మొదలు పెట్టిరి. ఆకారణమున ఆమె సభకు పోజాలకపోయినను సభవారు ఏనాటి కానాడు సభాకార్యక్రమమంతయు నామెకు టెలిఫోనుద్వారా తెలుపుచుండిరి. ఆమెయు వారికి తగినంత ప్రోత్సాహమును చూపుచుండెను.

ఆమెకు క్రమముగా గాయముల బాధ మదికి అపాయకరమైనది. చివరి కామె ౧౯౩౮ ఫిబ్రవరి ౨౭ వ తేది ఆదివారము శివరాత్రినాడు పగలు రెండుఘంటలకు ఈ కర్మభూమిని వదలి కైలాసధామము నలంకరించినది. ఆ పరోపకారపరాయణురాలు, పరమసాధ్వి, ౫౩ ఏండ్లయిన నిండకముందే పరమపదించుట దేశదౌర్భాగ్యము కాక మఱేమగును? పెక్కురు ప్రముఖులు తమయమ తాపమును ఉత్తరములు, వ్యాసములు, ఉపన్యాసములు, ఉపపాదనములు మొదలయినవానిమూలమున వెల్లడించిరి.

డాక్టరు అనిబిసెంటుగా రీమెనుగూర్చి వ్రాసినది యిట్లు కలదు:

"నేను చిరకాలమునుండియు పార్వతి అమ్మాళుగారి పరిచయభాగ్యమును బడసియున్నాను.

ఆమె దివ్యజ్ఞానసమాజసభ్యురాలు. నేను బెంగుళూరునకు పోయినపుడెల్ల వారియింటనే విడియుచుందును. బెంగుళూరునందలి ఎల్ల మహిళోద్యమములకును ఆమె హృదయము. అచటి మహిళా సేవాసమాజమును స్థాపించి తానే నాయకత్వమును వహించినది. అరవమునను, కన్నడమునను ఇంపుగా నుపన్యసింప గలదు. ఇంగ్లీషునను మంచిజ్ఞానమును సంపాదించినది. భారతదేశమునందలి సమర్థులగు నాయకురాండ్రలో నొక్కతె. ఆమె గృహమునకు దేవి; దివ్యజ్యోతి; శాసకురాలు. పరస్పర సాహాయ్యముతోడను, సంపూర్ణైకమత్యముతోడను వారివారి శ్రోవలను వారు వారు కార్యములను నడుపుకొనుచు భార్యాభర్తలు సుఖమయముగ గడపిన నలువదియేండ్ల దాంపత్యజీవితమునకు తరువాత హృదయవిదారకమయిన యొక్క దైవికసమాఘాతమా మెను కాలదన్నుకొని పోయినది. ఆమె జ్యోతిర్మయియై నిర్వృతిస్థానమున నెలకొని యున్నది."

ఈసాధ్వీమణిజీవితము ఆదర్శకమయినది. ఈమెకన్న సంపన్నులు, సాగుదలకలవారు నగు స్త్రీలు ఆంధ్రదేశమునను లేరనజాలము. కాని విశాలహృదయముతో తమ సోదరీమణులయభ్యుదయము కొఱకు నడుము కట్టిన వారిని మాత్రము చిటికినవ్రేలికొనకెక్కింప జాలము. మంచి అవకాశములు సామాన్యసంపన్నస్త్రీలకన్న సంస్థానములవారికి కలవు. వారే యిట్టి ఘనకార్యమునకు బూనుకొని ఇతర సోదరసోదరీమణులను ప్రోత్సహించి వారితోడ్పాటును బడయవలెను. తామును అవకాశములను విరివిగ గల్పించుకొని పాటుపడవలెను.

దేశము నాలుగుమూలలనుండి స్త్రీలయభ్యున్నతికొఱకయిన ప్రయత్నము లెడతెగక పెద్దమొత్తున కొనసాగి ఫలోన్ముఖములయిన నేతప్ప భారతీయమహిళామండలి కభ్యుదయప్రాప్తి యనుమానింపవలసినదే యగును. కేవలము స్త్రీలేకాక పురుషులును ఈవిషయమున శ్రద్ధవహించ దగుదురు.

కీ. శే. శ్రీమతి వంగల వనలతాదేవిగారు

(22-4-1905—28-9-1928)



ఈమె కృష్ణాపత్రిక సంపాదకులగు శ్రీ ముట్నూరు కృష్ణారావుగారి పెద్ద కుమార్తె. మచిలీపట్టణమున సంస్కృతము, తెలుగు సంగీతము, వీనియందు తన విద్య ముగిసినపిదప నీమెకు 16 వ యేట కలకత్తా విశ్వవిద్యాలయప్రొఫెసరుగ నుండిన డా. వంగల శివరామ్‌గారితో 18-5-1921 తేదీని వివాహమయ్యెను. శిష్టాచార సంప్ర

దాయముగల ఆంధ్రబ్రాహ్మణ కుటుంబమున హిందూ పద్ధతిని జరిగిన కొలది సంస్కారవివాహములలో నిది యొకటి.

1921-22 సం.నందు వారి కలకత్తా కాపురము సమయమున నామె యా పట్టణమునందు దక్షిణ ఇండియా యువతీసమాజము మొదలగు వాని యందు సభ్యురాలయియుండి, కళాశాలకు పోవుచుండెడిది.

23-12-1922 న నీమె కొకయాడశిశువు కలిగెను, పిదప కొలది దినములలోనే జబ్బుపడి సంవత్సరము పైబడిన కాలము బాధపడి నయమెయ్యెను. క్రొత్త లక్నో విశ్వవిద్యాలయమున రాజనీతిశాస్త్రశాఖకు ప్రధానోద్యోగిగా తన భర్త నియమింపబడుటచే వారితో నచటికేగెను.

ఈమె హిందీ భాషను బాగుగా నభ్యసించినది. లక్నోలోని ముఖ్య స్త్రీసంఘముల కార్యశాఖలయందుండి చురుకుగా పని చేసినది. దక్షిణయిండియా స్త్రీల సంఘమున కుపాధ్యక్షురాలుగా నుండినది. స్త్రీ విద్యాభ్యున్నతి, ఖద్దరు ప్రచారము, సంఘసేవ, హిందీరాష్ట్రభాషయీవిషయములయం దీమె చాల పనిచేసినది. హిందీ బాగుగ వచ్చియుండిన దగుటవలన తమ ప్రాంతమునందు వలెనే ఉత్తర దేశమున హిందీ, బంగాళీ స్త్రీలతో కలసి మెలసి పలుకుబడి కలిగి యుండినది.

ఈమె దక్షిణ దేశమునను, ఉత్తర దేశ మంతటను కూడ భర్తగారితో ప్రయాణము చేసియుండెను. గానమునందును, చిత్రకళయందు నీమె కెక్కుడు పరిచయము, నభిమానము నుండెడిని. హిందూస్థాని సంగీతమును నేర్చుకొనినది. ఆంధ్ర చిత్రకారులచే రచియింపబడిన భారతీయచిత్రము లనేకము లీమెవద్ద నుండెను. ఈమె యారోగ్యమునకై భర్తగారితో కలసి త్వరలోనే స్విట్జరులాండు వెళ్లవలసియుండెను. ఇంతలోనే క్రూరమరణము నిర్దాక్షిణ్యముగ వచ్చిపడెను. కుమార్తెగను, భార్యగను, మాతగను ఈమె యనేక విధముల నాదర్శభారతీయ మహిళగ నుండెను. 23 ఏండ్ల చిన్ని జీవితకాలముననే యీమె స్త్రీలకు, భారతదేశమునకు తను సేవ చేసి 'కొండంత యాశ'ను కలుగజేసి తన తలిదండ్రులను, సోదరిని, సోదరుని, చిన్నిబిడ్డను, నిర్భాగ్యుడగు భర్తను శోకమున ముంచి వెడలిపోయినది. తన యల్పజీవితప్రయోజనమును కలకత్తా, లక్నో, ఉత్తరహిందూస్థానములయందలి తన స్నేహితురాండ్రకు నచ్చజేసిన యీమె నిష్కృమణము వలన సంఘసంస్కరణ స్త్రీవిద్యోద్యమములకు కొంత నష్టము కలిగినదనియే చెప్పవలెను.

పౌరజీవనాదర్శము

కవయిత్రి సరోజినిదేవి సింగపూరు భారతసంఘమువారి 'ఇండియన్' పత్రికకు పంపిన ఆవేశపూరితమగు నొకచిన్న సందేశమునందు సత్యసౌందర్యముల వెలయు పలుకుల నిట్లు నుడివినది:

మనము ముఖ్యముగా జ్ఞాపకముంచుకొనవలసిన విషయ మేమనగా, నవీననాగరికత యభివృద్ధియగుచున్న కొలదిని, విజ్ఞానము నిచ్చి పుచ్చుకొనుటయందు ప్రపంచమంతటను అంతర్జాతీయభావము గలది యగుచున్న కొలదిని, మన మితర దేశములకొసంగుచు నితర దేశములనుండి మనమును గ్రహించుకొనుచున్నాము. అట్టిభావములతో విశాలదృక్పథము, శాస్త్రీయవిచారణ గల యనుభవముతో గూడిన జ్ఞానధనముతోపాటు తాను స్వయముగ ప్రపంచమున చేయవలసిన సేవాభారము హెచ్చును; జీవితము మరింత క్లిష్టమగును. ఈ యుద్యమమునకై మీరు మీ జీవితము నర్పింపవలయుననియు, భక్తిజ్వాల కడ వెలిగించుకొనుటకు మీ దీపములను సిద్ధపరుచుకొనుడనియు మీ దేశమునకు యోగ్యమగు సేవచేయుడనియు నేను కోరుచున్నాను. ఏదో యొకవిధమున మీ రుపాధ్యాయులై బోధనచేయుడని కాని, రాజకీయవేత్తలు కండని కాని నేను మీకు చెప్పుటలేదు. జీవితమున మీరంగ మేదియైనను, మీ రెంతయల్పులైనను, దేశము నొకజాతిగా నొనర్చు నా మహాసాంఘిక వ్యూహమును పూరించేయుటయందు మీరు ఒక యగత్యమగు అంశము. ఒక దేశము

యొక్క మహత్వము ఆదేశపు గొప్పవారియందు గాక యక్కడి సరాసరి మంచివారియం దిమిడి యుండునని మీ రెల్లరును జ్ఞప్తియం దుంచుకొన గోరెదను.

మతభేద వర్ణభేదములు పాటింపక, యెల్లమానవులకును సమానావకాశము లొసంగుచు, అభివృద్ధి కవరోధము గూర్చు విఘ్నముల జయించుటయందు ధీరతయు సత్యశౌచములను నిత్యజీవితమున నలవరుచుకొనుటయు, పరిపూర్ణావకాశములతో విశాలజీవనము గడుపుకొనుటకు ఈశ్వరదత్తమగు, అనల్లంఘ్యమగు హక్కు నుండి యే స్త్రీని గాని, పురుషునిగాని వంచింపకుండుటయు నట్టి మంచివారికి లక్షణములు.

భారతీయవిద్య

ఆగస్టుమాసపు 'ఇండియన్ ఎడ్యుకేటర్' పత్రికయందు కె. యస్. రామస్వామి శాస్త్రి గారు భారత దేశపు కులజీవనము యొక్కయు, వ్యుత్పన్నజీవనము యొక్కయు సజీవత్వము బహిరంతరములనుండియు తర్జనల నొందు చున్నదని యనుమానించుచు భారతీయ సంస్కారమునకు భారతీయవిద్యయే జయప్రద మగు సంరక్షణకర్త కావలెననిన ఇట్లుండవలెనని భావించుచున్నారు—

మన విద్యాలయములు, కళాశాలలు, విశ్వకళాపరిషత్తులును గ్రామపరిసరములలో నుండవలెను. అప్పుడే భావనోత్కర్షయు, నిరాడంబరజీవనమును, పవిత్రమైన, న్యాయమైన యేకీభావమును మరల నుత్పన్నమగును. గృహపరిశ్రమలచే సేవితమగుచు కోలచేతను, చేతిపనులచేతను నలంకృత మగుచు, భారతదేశము చాలవఱకు వ్యవసాయ జాతిగానే యుండవలెను. ఇట్టి యున్నత సంస్కారము బ్రహ్మచర్యము నాధారము చేసికొని యుండవలయును. మన దేశభావముల మూలమున ఆ సంస్కారము గరపవలయును. అంతేకాక యది ఆధునికముగను, జాతీయముగను కూడ నుండవలెను. మనమాతృదేశ మెట్లు కర్మభూమియు, భోగభూమియు, పుణ్యభూమియు నగునో గుర్తించుట కది మనకు తోడ్పడవలయును. మన బాలబాలికలు తమ భారతీయత గోల్పోవకుండ నాధునికులగు నట్లును, ధన శక్తి ప్రాభవములకు నేటి పందెముల వెనుక బడక తమ భారతీయతయందె కీర్తిని నిలుపుకొనునట్లును శిక్షితులై ప్రబుద్ధులు కావలెను.

కెల్లాగు సంధిపత్రము

నిబంధన 1

ఒడంబడిన యున్నతపక్షములన్నియు, అంతర్జాతీయ కలహములు లేకుండుటకై, యుద్ధ మొనర్చుట నిషేధమని ఆయాజాతులపక్షమున ధృఢపరచుచు, పరస్పర సంబంధములలో జాతీయరాజ్యనీతి కది యొకయుపకరణమని దానిని (యుద్ధమును) పరిత్యజించుకొనుచున్నారు.

నిబంధన 2


ఒడంబడిన యున్నతపక్షములన్నియు నైజములగు, లేక తమలో తమకు గల, కొన్ని కారణములనుబట్టి కలిగియుండు జగడములు లేక తగవులు విడదీయుటకు శాంతియుతమగు మార్గములనే తప్ప యుద్ధము నెన్నడును తలపకూడదని కరారు చేసికొనుచున్నారు.

నిబంధన 3

(నిశ్చితమగు పద్ధతుల విధించుచున్నది.)

సంతకములు చేసిన జాతులు

జర్మనీ, అమెరికా యునైటెడ్ స్టేట్సు, బెల్జియము, ఫ్రాన్సు, గ్రేటుబ్రిటను, కనడా, ఆస్ట్రేలియా, న్యూజీలండు, దక్షిణాఫ్రికాయూనియన్, ఐరిషుఫ్రీస్టేటు ఇండియా, ఇటలీ, జపాను, పోలండు, జెకోస్లావాకియా.



కెల్లాగు సంధిపత్రమున కెల్లాగు సంతకముచేయుచున్నాడు

ఈసంధిలో చేరుటకు పిలువబడిన జాతులు

ఆల్బేనియా	ఎతియాప్యా	పెర్షియా
ఆఫ్గనిస్తాన్	ఫిన్‌లండు	పోర్చుగల్
అర్జంటీనా	గ్రీసు	రొమేనియా
ఆస్ట్రియా	గ్వాటిమలా	*రష్యా
బొలీవియా	హెయిటీ	సాల్వడర్
బ్రెజిలు	హోండురాస్	సెర్బులు, క్రోట్లు
బల్గేరియా	హంగేరి	స్లావినులయొక్క
చైల్	ఐస్‌లండు	రాజ్యము
చైనా	లత్వియా	షయామ్

కొలంబియా	లిబేరియా	స్పెయిన్
కోస్టారికా	లిథూనియా	స్వీడన్
క్యూబా	లక్సెంబర్గ	స్విట్జర్లాండు
డెన్‌మార్కు	మెక్సికో	టర్కీ
డొమినికన (రిపబ్లికు)	నెదర్‌లాండ్సు	అరుగ్వాయి
ఎక్వాడర్	నికరగువా	వెనిజోలియా
ఈజిప్టు	నార్వే	
ఎస్తోనియా	పరగ్వాలు	పనమా

దుర్గమహంతి ఆదినారాయణ.

---

* రష్యాకు ఫ్రాన్సువారి ఆహ్వానము.

మీకు మేలైన సువాసనగల అత్తరులు కావలెనా?

అటులైన అత్తరులకు రాజని పిలువబడు **ఆటోడిల్‌బహార్‌ను** వుపయోగించుడు



కొన్ని బిందువులను మీ చేరుమాలుపై చిలికినతోడనే యింపగు,పుష్పసంబంధమగుసువాసన నీచుట్టుపట్లవ్యాపించును.

ఇంతటిరమ్యమైన, మనోహరమైనవాసనను నీవు బజారులో కొను యితర అత్తరులలో పొందజాలవు.

'ఆటోడిల్ బహార్' అను పేరును యిపుడు జ్ఞాపకమునకు తెచ్చికొనుడు. దానిని ఒకమారుపయోగించుడు. దాని మనోహరమైన, శాశ్వతమైన సువాసనరుతన్మయత్వమును చెందుదువు.

½	ఔన్సు	బుడ్డి	వెల	రు.	2—0—0
¼	,,	,,	,,	రు.	1—4—0
1	డ్రాము	,,	,,	రు.	0—12—0
మాదిరిసీసా			,,	రు.	0—2—0
సువాసనగలకార్డులు				రు.	0—1—0

వి. పి. చార్జీలు ప్రత్యేకము

కొనునపుడు దయచేసి 'ఆటోడిల్ బహారు' అను పేరును జాగ్రత్తగా పరిశీలించి కొనుడు. అన్నిచోట్లను అమ్మబడును.

సోల్ ఏజంట్లు:—

ఆంగ్లో యిండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదు బజారు, బొంబాయి.

నొప్పులుగాని, తీపులుగాని, ఏవైననుసరియే తొలగింపవచ్చును



మీరు ఏల నొప్పులవలన బాధపడవలెను. ఆ నొప్పులు తలయందైననుసరే, దేహమున యితరచోట్లనైననుసరియే, నడుమునొప్పి, వాయువునొప్పులు, పడిశము, గొంతురాపిడి, కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, నాడీనొప్పులు, బెణుకునొప్పులు, మొదలగు నొప్పులైనను సరియే, తప్పక త్వరలో

'అడమేన్స్ సైప్రెస్ సాల్వ్'

అనుదానిచే మాన్పవచ్చును. ఇది వుపశాంతికర మగు అంజనము కాదు. ఇది చాలా మేలైన తైలము. ఇది చాలా విలువగల ఓషధులచే తయారుచేయబడినది. దీనిచే నొప్పులుమొదలంటపోయి తక్షణమే నిన్ను ఆనొప్పియొక్క బాధనుండి తొలిగించును. వేలకువేలు దీనివల్ల లాభపడిరి.

వెల బుడ్డి 1 కి రు. 1—0—0. వి. పి. చార్జీలు ప్రత్యేకము.

ఈ అత్యద్భుతమగు సాధనిగారిణి ఫలమును కనుగొనుటకు యీ క్రింద పేర్కొనిన అంగడినుండి 2 అణాలకు శ్యాంపిలుడబ్బీ తెప్పించుకొనవచ్చును.

మెస్సర్సు:—ఎ. బి. పారెక్, 259, చైనాబజారు, మద్రాసు.

సోల్ ఏజంట్లు:—ఆంగ్లో యిండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదుబజారు, బొంబాయి.

ప్రపంచయువజన శాంతిమహాసభ

ఆమెన్ (హాలెండ్)

ప్రపంచయువజనోద్యమ సంస్థాపకుడును, డచ్చి యువజనసంఘకార్యదర్శియునగు హాయిస్‌టింక్ (హాలెండు)గారి యధ్యక్షతక్రింద ౧౯౨౮ ఆగస్టు ౧౭ మొదలు ౨౬ వఱకు సమావేశమైనది.

బెజవాడ ఆంధ్రయువజన సంఘకార్యదర్శియగు శ్రీయుత దాసు త్రివిక్రమరావు, ఎల్. ఎల్. బి., బార్. ఎట్. లా గారు ఒక్కరే తిన్నగా భారతదేశమునుండి వచ్చిన ప్రతినిధి; వీరు ఆంధ్రరాష్ట్రము తరఫున అధికారప్రతినిధియు.

రమారమి యెనమండుగురు భారతీయులు మహాసభకు ప్రతినిధులుగా విచ్చేసిరి.—

శ్రీ. డి. టి. రావుగారు, తిన్నగా భారతదేశమునుండి.
,, సింహాగారు, (అవధానుల నరసింహంగారు, మదరాసు) మ్యూనిచ్, జర్మనీనుండి.
,, సింగుకన్య, జర్మనీనుండి భారతీయస్త్రీ ప్రతినిధి.

,, సాన్యాలుగారు	లండనునుండి	గ్రేటుబ్రిటనునుండి.
,, గుహాగారు	భారతీయ	
,, సేనుగుప్తగారు	ప్రతినిధులు	

,, రాయిగారు, గ్లాస్గోనుండి భారతీయప్రతినిధి.

అన్ని జాతులనుండియు తగురీతి ప్రతినిధులు వచ్చి మహాసభ నలంకరించిరి.

మహాసభయందు ఆఱు విభాగములు ఏర్పడినవి.—

౧. రాజకీయము
౨. విద్యావిషయికము
౩. ఆర్థికము
౪. పందెములు
౫. అల్పసంఖ్యాకసంఘములు
౬. ధార్మిక నైతికములు

శ్రీ త్రివిక్రమరావుగారు ఆఱవవిభాగమునకు ఉపాధ్యక్షులుగా వర్తించిరి.

మహాసభ యీ క్రింది ఆదర్శములను తీవ్రముగ చర్చించినమీదట తీర్మానములుగ నవలంబించినది:

౧. శాంతియే ప్రపంచమునకు ప్రధానాశయము.

౨. శాంతిసూత్రములు యువకుల మదులకు బాగుగ పట్టునట్లు చరిత్రపాఠ పుస్తకము లన్నింటను చారిత్రక తాత్పర్యమును మార్చుట.

౩. పరాధీనజాతుల కన్నిటికిని స్వాతంత్ర్యము.

౪. స్వయం నిర్ణయాదర్శమును గుర్తించుట.

౫. పెద్దజాతుల పోషణమునుండి చిన్నజాతులకు విముక్తి.

౬. ఆర్థికమగు సామ్రాజ్యవాదమును (Imperialism), ఖడ్గవాదమును (Militarism) తుడిచిపెట్టుట.


౭. మతపరివర్తనముల ప్రచారకోద్యమమును తగ్గింపజేయుట.

భారతీయ ప్రతినిధులును, జర్మను ప్రతినిధులును పరస్పరము కడుంగడు మైత్రితో మెలగిరి. జర్మను ప్రతినిధులు భారతీయ ప్రతినిధులకు తమ దేశపునృత్తగానాదుల ప్రదర్శనము లిప్పించి, భారతీయయువకుల కీసందేశము నొసగిరి:—

“జర్మనుయువజన సంఘమను మేము మీ ఆదర్శములయెడ సంపూర్ణమగుసానుభూతి వహించియున్నాము; స్వాతంత్ర్య సంపాదనయత్నమున మేము భారతీయులను సంపూర్ణముగ ప్రోత్సహించుచు వారికి స్థిరముగ బాసటలమై నిలిచియున్నాము.”

శ్రీ త్రివిక్రమరావుగారు జర్మనీ అమెరికాలసంయుక్తప్రాతినిధ్యముల యాహ్వానము నంగీకరించి, “హిందూమతము, దార్శనికాధారమును” గుఱించి యొక యుపన్యాసము నొసగి, వారి అధికాదరణమునకు పాత్రులైరి.

డచ్చియువజన సంఘమువారు ప్రపంచ యువజన శాంతి మహాసభ గాంచిన యద్భుత జయమునకుగాను



[సర్వాంధ్ర యువజన శాంతిమహాసభ [ప్రతినిధులు

ప్రతినిధుల నభినందింప 'హేగు' నందు ఏర్పాటించిన సభ కాహూతులై శ్రీరావుగారు "అంతర్జాతీయశాంతిని" గూర్చి చక్కగ నుపన్యసించిరి. పిదప శ్రీరావుగారు గ్రేటుబ్రిటనునకు పోయి, ఎడింబరోయందలి భారతీయ విద్యార్థులను గలిసికొని, "ఎడింబరో భారతీయసంఘము" పక్షమున "ప్రపంచయువజన శాంతి మహాసభ" యాదర్శములను గూర్చి సెప్టెంబరు ౮ వ తేదీని ఉపదేశదాయకమగు నుపన్యాస మొసంగిరి. అందు శ్రీరావుగారు కీ. శే. దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని గూర్చి మాటాడిరి. భారతదేశమున ఆంధ్రరత్నముగను, ఎడింబరోయందు ౧౯౧౩-౧౯౧౪ సం. భారతీయసంఘమునకు ఉపాధ్యక్షుడుగను, ౧౯౧౪-౧౯౧౫ సం. దానికే కార్యదర్శిగను శ్రీగోపాలకృష్ణయ్యగారు కావించిన యద్భుతకార్య విధానమునుగూర్చి ముచ్చటించి, వారు స్వదేశమునను, పరదేశములనుగల భారతీయులకు గావించిన యపారసేవలకు జ్ఞాపకచిహ్నముగ వారి ఛాయాపటము నొకదానిని తమపుస్తక భాండాగార మందిరమున నెలకొల్పవలెనని భారతీయ సంఘమువారిని వేడి, శ్రీగోపాలకృష్ణయ్యగారి ఆత్మశాంతికై భారతీయులెల్లరు చేకమై ప్రార్థనలు సలుపునట్లు ప్రార్థించిరి.

వారిక బ్రిస్టలు నగరము పోయి 'సోషలిస్ట డిమాక్రాటిక్ పార్టీ' వారి యాహ్వానము ననుసరించి యచట "భారతదేశపు ప్రస్తుత రాజకీయపరిస్థితిని" గూర్చి యుపన్యసించి, అచటనుండి బెర్లిను, వియన్నా, జెనీవా నగరములందలి యువసమాజముల యాహ్వానము ననుసరించి ఆనగరముల కేగిరి. ఈపర్యటనమునుండి వారు ఈనడుమ భారతదేశమును జేరినారు.

దాసు త్రివిక్రమరావు గారు
ఎల్. ఎల్. బి., బార్-ఎట్-లా

శ్రీరావుగారు బెజవాడ వాణీముద్రాక్షరశాలాధిపతులగు మ. రా. రా. శ్రీ దాసు కేశవరావుగారి కుమారులు. వీరు ౧౮౯౪ సం. న జన్మించిరి. ఏలూరు బెజవాడ హైస్కూళ్లలో చదువుకొనిరి. ౧౯౧౦ సం. న అలహాబాదునందు మెట్రిక్యులేషను పరీక్షనిచ్చిరి. ౧౯౧౧, ౧౯౧౨ సం. ల వీరు అలహాబాదులో ఇంట



దాసు త్రివిక్రమరావుగారు, బ్యారిష్టరు

ర్మీడియటు చదువుచుండగా జబ్బుచేయుటచే ౧౯౧౩ వఱకు చదువు నిలిపివేయవలసివచ్చెను. మరల స్వాస్థ్యము కుదిరిన వెనుక వారు ౧౯౧౩ సం. న బారిష్టరు పరీక్షకు చదువుటకు గ్రేటుబ్రిటనునకు వెడలిరి. ౧౯౧౪ సం. న యుద్ధమువలన వీరు భారతదేశమునకు తిరిగి వచ్చివేసిరి.

ఇంటియొద్ద నూరక కూరుచుండనొల్లక ౧౯౧౫ సం. న వారు కొలంబో కేగి, అచ్చట ఎల్. ఎల్. బి. పూర్తిచేసిరి. పిదప కొంతకాలము 'సిలోనీస్' పత్రికకు సహాయసంపాదకుడుగా నుండి, యుద్ధము ముగియగా, ౧౯౧౮ సం. న లండను నగరమున కేగి, న్యాయవిద్యాభ్యాసము పూర్తిచేసికొని, ౧౯౨౧ సం. ప్రారంభమున న్యాయవాదివృత్తికి సమర్థులై, ఆ వేసవియందే భారతదేశమునకు తిరిగి వచ్చిరి.

అప్పటికిచట అసహాయోద్యమ ముమ్మురముగా నుండెను. దేశమాత యాహ్వానము ననుసరించి వారు

న్యాయవాది వృత్తియందు ప్రవేశించుట మానుకొని, బెజవాడయందు ముద్రాలయకార్య నిర్వహణమున దీక్ష వహించిరి.

ఇన్ని యేండ్లనుండియు వారు స్థానికవిషయములందు శ్రద్ధతో పనిచేయుచునే యుండి, ఆంధ్ర యువ సమితికి కార్యదర్శిగా నెన్నుకొనబడినారు. ఆమెన్ (హాలెండు) నందు జరిగిన ప్రపంచ యువజన శాంతి మహాసభకు ఆ సమితిపక్షమున ప్రతినిధిగా పోవ ప్రార్థితులై, అనటికి ౧౯౨౫ జూలయినెలయందు వారు భారతదేశమునండి బయలు వెడలిరి. హాలెండు మహాసభయందనేకోపన్యాసముల నొసగినపిమ్మట, వారు ఎడింబరోయందు శాంత్యుద్యమమునుగూర్చి యొక యుపన్యాస మిచ్చిరి. పిమ్మట "భారతదేశపు ప్రస్తుత రాజకీయ పరిస్థితి"ని గూర్చి బ్రిస్టలు నగరమునను "భారతదేశము"ను గూర్చి బెర్లిను, వియెన్నా, జినీవాల యందు యువసమితుల యెదుటను ఉపన్యాసముల గావింప వారి కాహ్వానములు వచ్చెను.

*　　　*　　　*

వారు ఇపుడు భారతదేశము తిరిగివచ్చిరి. వారిచ్చటి శాంత్యుద్యమమున కెంతయు చేయూతనొసగి, ముఖ్యముగ భారతస్వాతంత్ర్యయుద్ధమున పాల్గొని సాఫల్యమునకై యుపకరింతురుగాక!

ఇంగ్లండునందలి భారతీయులు

రాయపురం నల్లపీరన్ సోదరులు

మద్రాసు మంత్రిగానుండిన ఆర్. యస్. ఆరోగ్యస్వామి మొదలియారుగారి రెండవ, మూడవ కుమారులు ఆర్. యస్. పీరన్, ఆర్. యస్. థామస్ గార్లిద్దరును ఇంగ్లాండునందు వ్యవసాయము, పాడిపంట విషయమైన విద్యలను బడసిరి.

పీరన్ గారు చెన్నపురిలో 21-9-1899 తేదీని జన్మించి నెల్లూరు వెంకటగిరి హైస్కూలులోను, చెన్నపురి ముత్యాలపేట హైస్కూలులోను చదివి చెన్నపురి క్రిస్టియన్ కాలేజి హైస్కూలునందు 1919లో స్కూలు ఫైనలు పూర్తిచేసిరి. 8-8-1922 తేదిని వీరిద్దరు సోదరులు నింగ్లాండునకు ప్రయాణమైరి.

పగటివేసములు



పాల్ గారు(బాలికవేసమున); పేన్ గారు(జోగివేసమున); ఆర్. యస్. పీరన్ గారు (రెడ్ ఇండియన్ వేసమున) చందానిధివసూళ్ల డబ్బులు పట్టుకొనియున్నారు.



ఆర్. యస్. థామస్ గారు (హాస్యగానివేసమున)

ఈ 6 సంవత్సరములలోను గ్లాస్గోలో పీరన్ గారు వ్యవసాయమున బి. డి. ఏ. పట్టమునకై విద్య పూర్తిచేసి అప్రెంటిసుగ పనిచేసి 1926-27 సం.లో కిల్ మార్నాక్ లో పశుసంరక్షణ, పాలు పెరుగుల యభివృద్ధిమా



కృషీవలులతోసహా వేల్సునం దొక గోధుమపంట గడ్డిపప్పలను చేర్చుచున్న ఆర్. యస్. పీరన్ గారు

ర్గముల చేర్చుకొనిరి. వీరి విద్య పూర్తియైనది. త్వరలో భారతదేశమునకు తిరిగివత్తురు.

థామస్ గారు గ్లాస్గోలో 1 సం. చదివిరి. 1923-24 లో వేల్సునందు క్షేత్రశాలమునందు అప్రెంటిసుగ పనిచేసిరి. ఈ ఛాయాపటమునం దితడు ఆలుదుంపలను పప్పగా ప్రోగుచేయుచున్నాడు. 1925 లో వ్యవసాయపువిద్య పూర్తి చేసి యితడు బి. డి. ఏ. పట్టము పడ



వేల్సునం దొక బంగాళదుంపల పెరటియందు ఆర్. యస్. థామస్ గారు



ఆర్. యస్. థామస్ గారు-తమ బసయందు నెగడివద్ద

సెను. 1926-27 సం. నందు సంవత్సరము పాటుగ వను చదివి పరీక్షకు వెళ్ళనక్కరలేని మినహాయింపు పొంది వ్యవసాయమునందు గ్లాస్గో బి. యస్ సి. పట్టము పొందుటకై తయారయ్యెను. కాని యిట్టి చదువు నిష్ప్రయో



ఆర్. యస్. పీరన్ గారు-తమ చదువుకొను గదియందు

జనమని గ్రహించి ఆ ప్రయత్నము మానుకొని 1928 లో ఇకోలజీ (ఏయే మొక్కలు, చెట్లు ఎట్టి ఎట్టి స్థలములలో బాగుగా పెరుగును? మొదలగు విషయములు) యందు పరిశోధన చేయుటకై గ్లాస్గో వారి నుండి విద్యార్థి వేతనమును పొందెను. పేపరు మిల్లులలోని పనికిరాని సున్నపుమట్టి నుపయోగమునకు తెచ్చుట, దానితో పాత్రలు మొదలగు సామానులు చేయుట, దాని విలువుగా నుపయోగించుట మొదలగు వానియం దితడు ప్రత్యేకశిక్షణము బడయుచున్నాడు. అది ముగిసిన వెనుక నీ వర్షాంతమున నితడు మన దేశమునకు మరలివచ్చును.

వీరిరువురు సోదరులును గ్లాస్గో ఇండియన్ యూనియన్ కార్యములందు పాల్గొనుచున్నారు. బ్రిటిషు ఆసుపత్రుల సహాయార్థమై చందాలను, విరాళములను వసూలుచేయుటకు Ragday Celebration (పగటివేషముల పండుగవంటిది) యందు హాస్యపు దుస్తుల ధరించి యూపటమునం దున్నారు.

బిజేట వెంకటనారాయణస్వామి
యమ్. ఏ., బి. కామ్. (ఎడింబరో)

చెన్నపురి బిన్నీకంపెనీలో పూర్వము దుబాషీగానుండిన కీ. శే. బిజేటి దేవరాజనాయుడుగారి పుత్రుడితడు. చెన్నపురిలో 1902 సం. జన్మించిరి. పచ్చయప్పస్కూలులో స్కూలుఫైనలు ముగించుకొని జి. డి. ఏ. చదువుకొఱకు గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్సునందు చేరిరి. బ్యాంకింగ్ నందొకపట్టము పొందిరి గాని జి. డి. యే. పూర్తిచేయకయే వ్యాపారసంబంధ విద్యకొఱకు 1923 లో ఇంగ్లాండు ప్రయాణమైరి.

ఎడింబరో విద్యాలయమున 1925 లో బి. కామ్. డిగ్రీ పొంది 1927 లో అర్థశాస్త్రమున యమ్. ఏ. పట్టము బడసిరి. తత్త్వశాస్త్రమున పిహెచ్.డి.ని పొందుటకును, న్యాయశాస్త్రమున బారిష్టరు అగుటకును ప్రయత్నించుచున్నారు. అన్నిట జయము చేకూరినచో 1929 సం. మొదటిమాసములందు మరలివత్తురు.

ఇండియన్ అసోసియేషన్‌లో నెక్కువగా పాల్గొనుచుండి భారతదేశ సంబంధవిషయములం దెక్కుడాసక్తి చూపుచుండిరి. మొదటి సంవత్సరములలో వా సం



బిజేటి వెంకటనారాయణస్వామిగారు,
యమ్. ఏ., బి. కామ్. (ఎడింబరో)

ఘమున కుపాధ్యక్షులుగను, పిదప అధ్యక్షులుగను నున్నారు. 'ఎడింబరో ఇండియన్' అను త్రైమాసిక పత్రిక కుపసంపాదకులుగ కూడ నున్నారు.

భారతీయులు స్వరాజ్యమున కర్హులనియు, నిర్బంధముగ భారతీయు లందరకు విద్య యవసరమనియు వీరి యభిప్రాయము లుపన్యాసములలో వెలిబుచ్చుచుందురు. సైమనుకమిషను వ్యవహారము హాస్యనాటకమనియు, వారిని భారతీయు లెవ్వరును నమ్మరనియు, ఆంగ్ల పరిపాలన న్యాయ్యమైనది కాదనియుకూడ వీరు వెల్లడించిరి.

కొల్లూరు వెంకట్రాయుడు చౌదరిగారు

వీరు గుంటూరుజిల్లా మూల్పూరుగ్రామపు రామస్వామిచౌదరీగారి కుమారులు. తెనాలి స్కూలునందు స్కూలుఫైనలు పూర్తిచేసి, గుంటూరు మిషనుపాఠశాలయందు యింటర్మీడియేటును చదువుచు, పాశ్చాత్యవై

ద్యవిద్య పూర్తిగ నభ్యసించుటకు 1920 సం. సెప్టెంబరులో ఇంగ్లాండునకు ప్రయాణమయిరి. 1921 వ సం. లో ప్రవేశపరీక్షను పూర్తిచేసి, ఎడింబరో వైద్యకళాశాలయందు ఎం. బి. సి. ఎచ్. బి. తరగతియందు చేరి 1927 సం. లో బిరుదును గౌరవములతో సంపాదించిరి.



కొల్లూరు వెంకటరాయను చౌదరిగారు, యమ్. బి. సి. ఎచ్. బి. (ఎడింబరో), డి. టి. యమ్., డి. పి ఎచ్. (లివర్ పూల్), యల్. యమ్. (డబ్లిన్)

ఇంతటితో తృప్తినొందక ట్రాపికలువైద్యమందు ప్రఖ్యాతిబడసిన డి. టి. ఎం., డి. పి ఎచ్. బిరుదులకై లివర్ పూలునందు చదివి, వాటిని ౧౯౨౮ సం. లో సంపాదించిరి. ఆసంవత్సరమందే మిడ్ వైఫరి పరీక్షయందు నేరుపొందిన డబ్లిను విశ్వవిద్యాలయమందు ఎల్. ఎం. బిరుదునుకూడ సంపాదించగలిగిరి.

ఈమధ్యకాలములో ట్రాపికలు వైద్యసంఘము నందును, బ్రిటీషువైద్య సంఘమునందును సభ్యత్వమును సంపాదించిరి. 'Doctor of Public Health' బిరుదు నకును, 'Doctor of Medicine' బిరుదునకును చదివి, వీటినికూడ సంపాదించి యింకొకవత్సరములో స్వదేశము రాదలచియున్నారు.

ఎడింబరో హిందూసంఘములో సభ్యులుగానుండి "ఇండియను బజారు"ను యేర్పాటుచేయుటలో చాల శ్రమపడినారు. ఈ బజారును యేర్పాటు చేయుటకు రెన్నియో వేల రూపాయలు ఖర్చయినప్పటికి, వీరి చేయూతవలన సుమారు నాలుగువేల రూపాయలు యీ హిందూసంఘమునకు ఆదాయము సేకరింపబడెను.

బండిచక్రము

(జనపదగీతము)

జనమంచి వేంకటరామయ్య గారు

౧

రావె యప్పరో! రావెచెల్లెల! రావె కోమలిపిల్లరో!
త్రావి వేగమె చల్దిగంజిని రారె యూడుపు లాడ్వఁగా!
ఆకసంబునఁ బ్రొద్దుపై కెగఁ బ్రాఁకుచున్నది చూడరే,
ఆఁకవెట్టెడి తోళ్ల ముసుఁగున కడ్డరాని వెలుంగులో!

వానదేవునిరాకచే చెవలోనివేఁడి యడంగ చెం
లేని పంటపొలంబి తెప్పిటే నింపుఁ గమ్మని యూర్పులన్
పూవఁగా వలదే యిఁకం దన మేనఁ బులకల పోలికన్
జానలార! ముదంబులో మనవాటఁబోదెడి వెలుకలన్?
మెత్తనౌ చిత్తమున నీరిక లెత్తు విత్తనకోరికల్
రిత్తరాచనఁ దగులమెల్లను బొత్తు చేకుఱుకుండిరన్.

పైలదాఁకకయుండఁ గుచ్చెలు మలచి వెన్కకు గట్టరే
ప్రాలుమాలిక లేక వడ్డులు పంచి మూఁపలు పెట్టరే.

౨

అన్నవస్త్రము లిచ్చి ప్రోచెడి యమ్మకును భూదేవికిన్
మున్న గల్లుమనంగ గాజులు ముట్టి చేతుల మ్రొక్కరే!

తల్లి కోడివి బిల్లలట్టులు తగిలి కాళ్లను వ్రేళ్లనుం
దల్లిఁ గొల్చిన కోటికందెడుఁ బిల్లలార! దరాదేనియున్.

చోడిగింజయొ జొన్నగింజయొ చొప్పదున్ పరిగింజయో
కాఁడి పేఁడియుఁ గట్టుదొరలకు గాదెలేయిఁక నిండెడున్.

తాలుఅప్పలు గుట్టలై పడఁ ద్రవ్వి రతనపు రాసులన్
గోలకొండనవాబు బంగరు గోడలందును దాచెడున్.

విత్తుచుందుము కోయుచుందుము క్రొత్తయేమియు లేదిగన్
క్రొత్త బ్రదుకును బ్రతుకవలెనను కోర్కె యొక్కటిదక్కఁగన్
మాసిపోయిన రంగుచీరను మార్చి క్రొత్తది తాల్చి యా
వేసమట్లు లెస్సైన వేఱొక వేసమున్ ధరియించుచుం

క్రొత్త నవ్వులు క్రొత్త పువ్వులు క్రొత్త యాటలు పాటలుం
క్రొత్తయందము చందముం గని క్రొత్త వేడుక గూర్చెదున్.

భూమిదేవికి తల్లి విశ్వం బిది యామె బిడ్డల మనుటచే
నా మె త్రోవను బోవుచుందుము మన మరి సిపాయిలమై యరయ కో.

ఎండ గాసిన వాన గురిసిన నేళ్లు కోళ్లును నేకమై
నిండి పొంగిన నూళ్లు మున్గిన బండి చక్రము వోలె నే

తిరుగుచుండుము వెలుఁగుచీఁకటి దరిగఁగను మనభూమియుం
దిరుగుచుండును దానితో విధి త్రిప్పులం బడి మనమునున్.



ఎంతపాటున కంతయే ఫల మెంతయూఁకటి కంతె మా
కెంతకల్మియు లేమియేయగుఁ జింతలం జెనువంతలన్.

కడుపునిండినఁ జాలదే యిఁక గాదె నిండక పోయినన్
బదుకుపాటకపుం గొలానికిఁ జానకంబగు గంజియే.

3

పట్టినారము మొన్ననే కొడవండ్లు పంటలు కోయఁగా
మట్టినారము విత్తుఁగట్టల ముందుపంటకు నేఁడిదే.

౪

మాటయుం బలుకాడుకొంచును పాటపద్దము బాడుచున్
నాటినారము పాటుపడి యొక పూఁట గంజికి పరిపడన్.

నూటిగా నడుమన్ని త్రివిగాఁదను చుట్టుమనిరొడుఁ బ్రొద్దికం
గూటి ముంతలు వ్రేలు మామిడికొమ్మ నీడను నిల్వరే.

కడుపుచిచ్చును సెందరయుడును రవంత చల్లపడంగ నో[న్.
క్కడుగు నిల్చుట యొప్పుడున్ రెండడుగులిడుట కాముందుకు

బర్మా-భారతదేశములలో మాకు చాల ప్రసిద్ధి కలదు

వెండిసామానులు

బంగారుసామానులు

పరిశుద్ధమైనట్టియు అందమైనట్టియు

ఉపయోగకరమైనట్టియు వస్తువులు

పరిశుద్ధత—కలితీలేని వెండిని అనగా చాదీవెండిని కాసులబంగారమును మాత్రమే యుపయోగించెదము. మేము తయారుచేసిన ప్రతివస్తువుపైనను మా డయమండు ట్రేడుమార్కు తప్పకుండ నుండును.

అందము—మా నమూనాలు అన్నియును క్రొత్తరకముగాను బహుసొగసుగాను యుండును. ఈకాలమునందలి నవనాగరికులు ఆమోదింపబడిన పద్ధతులపైని వెండిసామానులను సాటిలేని నూతనస్వరూపములతో తయారుచేయించుచున్నాము.

ఉపయోగము—కలితీలేని వెండిసామానులను కొనుటవలన ధననష్ట మేమియును కలుగదని వేరుగాచెప్ప నక్కరలేదు. "ఏది శ్రేష్ఠమైనదో అదియే యెల్లప్పుడును చౌకయైనది" అను సామెతప్రకారము వస్తువును కొనునప్పుడు అది యెన్నియేండ్లు మన్నునను విషయమునుబట్టియే ధరను నిర్ణయింపవలసియుండును.

మీరు మీయింట నుంచుకొనుటకును ఒకరి కిచ్చుటకునుగూడ చూచినంతమాత్రముననే మీ కాశ కలిగింపగల వెండిసామానులు మావద్ద నున్నవి.

అన్నివిధములైన సామానులును మావద్ద సమృద్ధిగా నున్నవి. వానిలో మంచివానిని మీ రెన్నుకొనుటలో మీరు కోరినచో నిపుణులగువారు మీకు సలహానిచ్చుటకు సిద్ధముగా నుందురు. బహుమతిచేయుటకు యేరకము వెండిసామానులు కావలసినను అనుకూలమైనవానిని యెన్నుకొనుటలో మే మన్నిసౌకర్యములను కలుగజేసెదము.

మా పద్ధతి—నవరత్నముల వ్యాపారమునందు మే మేపద్ధతి నవలంభించియున్నామో ఆపద్ధతిని వెండి బంగారు సామానుల వ్యాపారమునందుగూడ మే మవలంభించియున్నాము. మోసములేకుండను కిమ్మతుచేయునట్టియు సరుకులను యిచ్చుటయే మాపద్ధతి!

ఎస్టిమేటులు—ఏరకము వస్తువులకైనను మేము నమూనాలను సిద్ధపరిచి కోరినవారి నమూనాలను ఎస్టిమేటులను పంపించెదము.

మీ ఆదరణను కోరుచున్నాము.

సురాజ్‌మల్ లల్లూభాయ్ అండు కో,

డయిమండు మర్చెంట్సు అండు జ్యూయలర్సు,

గోల్డు అండు సిల్వరు స్మిత్సు,

135, బిగ్ బజారు, తిరుచునాపల్లి. 313, ఎస్ప్లనేడు, మదరాసు.

'వాపిని'

పేటెంటు అభివృద్ధి చేయబడిన ఆవిరి కుక్కరు



కుక్కరులన్నిటిలోను **'వాపిని'** అనునదియే కడపటిది. దీనికై మీరందరును వేచియున్నారు. దీనిని చూచినంత మాత్రముననే ఒకటి మీవద్ద యుండవలెనని మీరు తప్పక కోరెదరు.

బాయిలరు వలె గట్టిగానుండి, ఆభరణమువలె ప్రకాశించుచు, అన్నియు పూర్తిగా గల వంటసామానులు. పై భాగమంతయు ఇత్తడితో తయారు చేయబడినది. లోనగలపాత్రలు అలుమీనియముతో తయారుకాబడి యున్నవి. వాడుట సులభము, పరిశుద్ధముచేయుట సులభము.

నీరు ఎంతవరకుండునది కనబడుచునే యుండును. ఇతర కుక్కరులయందుండు లోపములేవియు **'వాపిని'** యందు లేదు. ఇది చక్కగా పనికి ఉపయోగించుటకే తయారు చేయబడినది కాని ఆటవస్తువుమాత్రము కాదు. ఏరకము వంటవస్తువులు అనగా బొగ్గు లేక స్పిరిట్ లేక గ్యాసు లేక కిరసన్ పొయ్యి మొదలగువాటిలో దేనినైనను ఉపయోగించవచ్చును.

ధర రు **12-8-0** నుండి రు **25** ల వరకు గలదు.

పూర్తివివరములకు వ్రాయుడు.

బెంగాల్ కెమికల్ అండు ఫర్మాటికల్ వర్కుసు,

లిమిటెడ్; కలకత్తా.

శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారు,



గాంధర్వ విద్యాభూషణ

శ్రీ వెంకటస్వామినాయుడుగారు విశాఖపట్టణము వారు. అన్నగారి వద్దనే గానకళను, ఫిడేలువాద్యమును అభ్యసించి మంచి పాండిత్యమును గడించినారు. పది యేండ్లనుండి శ్రీ విజయనగర మహారాజావారి గాన కళాశాలలో ఫిడేలు ఉపాధ్యాయులుగా నున్నారు. ఆంధ్ర మండలమున ఫిడేలు పాండిత్యమున వీరికి సమానులనదగిన వారు ఎందఱో లేరనవచ్చును. ఇటీవల రెండుమూడేండ్లనుండి దక్షిణదేశమున గానసభలకు బోయి తమ పాండిత్యమును ప్రదర్శించి మెప్పువడసియున్నారు. విజయనగర మహారాజావారు వీరికి 'గాంధర్వ విద్యాభూషణ' బిరుదము నొసగినారు. జయపురము, వద్వాను మొదలగు సంస్థానముల ప్రభువులును, కొందఱు గానసభలవారును వీరికి స్వర్ణపదకములు మొదలగునవాని నొసగి బహూకరించిరి. వీరికిపుడు వయసు ముప్పదిరెండు సంవత్సరములు. వీరివలన ఆంధ్రదేశము గానకళయందు ముందునకు సాగుచుండుటను గారవదగును.

శ్రీ నందికోళ్ల గోపాలరావుగారు*



తూర్పుగోదావరి మండలమున ఇంజరము అను గ్రామము శ్రీ గోపాలరావుగారి నివాసస్థానము. వీరా గ్రామమునకు గ్రామాధికారి (Village Munsiff). వీరు తెలగాతెగలోని సంపన్నమగు ఉత్తమ కుటుంబమునకు చెందినవారు. స్వయం కృషిచేత చిత్రకళనభ్యసించి, వీరు వర్ణచిత్రముల చిత్రించుకౌశల్యము నలవరుచుకొన్నారు. వీరి తైలవర్ణ చిత్రము 'వేణుగోపాలుడు' భారతి ఐదవ సంపుటము, ఆఱవ సంచికయందు ప్రకటితమైయుండుట భారతీ పాఠకలోకమునకు విదితమే. ఇట్టిదియే ఇంచుకించుక భేదములు గల చిత్రమొకటి వీరిది జర్మనీలో ముద్రితమై యిపుడు ప్రచారమున నున్నది.

---

* శ్రీయుతులు గుండిమెడ వేంకటసుబ్బారావు, మారెళ్లపూడి పుత్రసత్యంశర్మగారలు శ్రీ గోపాలరావుగారి చిత్రములపై ప్రశంసలను వ్రాసి పంపినారు. వారు వ్రాసిన విషయము లిట నుపకరించినవి. —భారతి.

ఇందున్న 'శ్రీమన్నారాయణ' చిత్రము వీరి త్రివర్ణ చిత్రమునకు ప్రతిబింబము. ఈ చిత్రము, ఉలూచి-అర్జున, శ్రీకృష్ణుడు-రాధ, మొదలయిన చిత్రములను కొన్నిటిని రావుగారు జర్మనీకి ముద్రింపఁబంపియున్నారట. మఱియు వీరి వర్ణ చిత్రములు తెలుఁగునాడున గల రాజాస్థానములయందున్నవట.

మునకు దెప్పింపఁబూనినారు. చిత్రకళ నానాముఖముల కొనలుసాగుచున్న యీకాలమున వర్ణ చిత్రములను చక్కఁగ ముద్రింపనుపకరించు యంత్రసామగ్రి మన దేశమున లేక పోవుట యొక పెద్దలోటు. ఆలోటును తీర్పఁగలవారు కళాకుశలురు, కళాభిమానులును శ్రీమంతులు. శ్రీ గోపాలరావుగారు ఆలోటును తీర్ప ప్రయత్నించుచున్నారట. ఈ మేలివార్త సత్యమే అయి వారి ప్రయత్నము



శ్రీమన్నారాయణ

చిత్రకళయం దాసక్తి మిక్కిలియగుటచేతను, ధన సంపన్నులగుటచేతను వీరు చిత్రములను చిత్రించుకొనుటతో తనివి చెందక, వ్యయమునకోర్చి వానిని విదేశములకంపి ముద్రింపించి ప్రచార

సఫలమగునేని, ఆంధ్రదేశసౌభాగ్యదేవత నాగరికతా సౌధమునకింకొకమెట్టు పైకెక్కినదన్నమాట. వీరి చిత్రకళాకౌశల్యము ఇంకను పెంపొంది తెలుఁగునాటికి వాసి గూర్ప పరమేశ్వరుడనుగ్రహించుగాక!

భారతీయ మహిళామండలి

సి. యస్. నల్లముత్తు అమ్మాళ్ కన్యగారు



ఈమె శ్రీమతి డాక్టరు ముత్తులక్ష్మి అమ్మాళ్ గారి చెల్లెలు. మదరాసువిల్లింగ్ డన్ ప్రభ్వి కళాశాలయందుపాధ్యాయగా నుండెను. ఇంగ్లాండులో నాలుగేండ్లు ఉన్నతవిద్యల బడసివచ్చెను. ఇపు డీమె రాజమంద్రి స్త్రీల బోధనాభ్యసన కళాశాల సూపరింటెండెంటుగ నియమింపబడెను.

శ్రీమతి కన్యా లీలామణినాయుడుగారు



(శ్రీమతి సరోజినిదేవినాయుడుగారికుమార్తె)

ఈమె ఆక్స్ఫర్డునందు బి. యే. ఆనర్సుపట్టము నొంది యీమధ్య యాంగ్లదేశమునుండి స్వదేశమునకు మరలివచ్చి లాహూరునందలి ప్రభుత్వమహిళాకళాశాలయందు తత్త్వశాస్త్రోపాధ్యాయోద్యోగమును స్వీకరించెను. మొదట లండన్ సెంట్‌పాల్స్ బాలికాపాఠశాలయందు చదివి, పిదప ఆక్స్ఫర్డునందు తత్త్వశాస్త్ర అర్థశాస్త్ర రాజనీతిశాస్త్రములందు బి. ఏ. ఆనర్సుపట్టమును బడసెను. ప్రస్తుతము అమెరికాఖండమునందు భారతదేశస్థితినిగూర్చి ప్రచారము సల్పుచున్న సుప్రసిద్ధకవయిత్రి, రాజకీయవేత్త్రియగు శ్రీమతి సరోజినిదేవి కుమార్తె యీమె.

శ్రీమతి అన్నా ఈఫెను



ఈమె బెజవాడ పురపాలక సంఘమునందు సభ్యురాలుగ నియమింపబడిన ప్రథమనారీమణి; సంఘసేవాభిలాషిణి. బెజవాడయందు బాలికాభటోద్యమమును స్థాపించెను. ఈమె రైల్వే వైద్యశాఖోద్యోగియగు డా॥ యస్. జె. ఈఫెను, యం. బి. గారి పత్నీమణి.

జగన్నాథ నిందాస్తుతి

శ్రీ విక్రమదేవవర్మ గారు

గీతితతి

ఓ జగన్నాథుఁడా! నిన్ను నోకృపాస-ముద్ర! యనుచును బిలుతురు భూరిభీతి
నంతెకాక నీ కాపేరు సుంత యేని-చను నె? నీవ్యాదిఁ గరుణా రసమ్ము గలదె?

పాలొసంగెడుభామిని ప్రాణములను-గొనెడు నిను వెందుఁ గలదె పూతనను బార్వ
మేమి చేసితివో స్మరియించు కొనుము-మఱచినను మాత రేణుక న్మనసునుండి.

జనుల ప్రాణము ల్దినుకాలసర్ప మవుగ-యరయ నీకుఁ బామునకు సామ్యంబు గలదు
చక్రచిహ్న ముండుట దానిఁ జక్రియండ్రు-చక్రహస్తుండవగు నీవు చక్రివి గద!

భోగ మని పడగకు నండ్రు పొంది దాని-నద్ది భోగినామంబుతో నమరు చుండు
భోగము లనేకములు గల్గు పురుషవరుఁడ!-యెట్లు భోగివి గావో నీ వెంచఁగలవ?

అన్ని చోట్లఁ జరింపకే యహి యనియెడు-సర్ప మనెడు నాఖ్యల నద్ది చాటఁబడెడు
నన్ని నెలవులఁ జరియించు నచ్యుతుఁడవు-చెల్లవే నీకు నా రెండు పేర్లఁ దలఁప?

కుండలమువోలె నది చుట్టుకొనుట జనులు-దానిఁ గుండలి యందురు గాని దివ్య
కుండలంబులు గల నీకె కుండలియను-నామ మెంతయు నొప్పు నెన్నంగ మదిని.

నడుచుటం బాదములు లేక నాగపన్న-గాఖ్యలను బొందె నద్ది; నీ వంఘ్రివగుచు
ఋషుల మానసంబులఁ జరియించు నీకు-నొప్పుచుండెడు నానామయుగ్మ మభవ.

అడుగు లిలఁ గానరామి గూఢాంఘ్రి యనుచు-బలుకఁబడునద్ది; నీ పాదములు విరించి
కైనఁ గానంగఁ దరమౌనె? కాన నీదు-పట్ల నా నామధేయ మన్వర్థ మగును.

అద్ది చక్షుశ్శ్రవో నామ మందుఁ దనదు-కనులతోడనే వినుచుంట కతనఁ, జెవులు
లేక వినువాఁడ వగు నీకు నోకజాక్ష!-చెల్లదే తదాఖ్య నిజంగఁ? జెప్ప విభావ.

కుటిలగతి భుజగాఖ్యను గొనియె నద్ది-నీవు భుజగుఁడ వల గొల్ల నెలతలకును
అద్ది మంత్రవశ్యంబు; నీ వరయ నామ-మంత్రవశ్యుండ వగుదు రమాకళత్ర!

ఇంత చాలదే? నీ గుట్టు నింక బైటఁ-బెట్టి నంతన నగుదురు పెఱలు విన్న
నీకు దాసుండఁ గావున న్నే నెలుంగఁ-గొదవ గలుగదు; చెడదు నీ గొప్పతనము.

ఇంతయే నాకుఁ జాలు నా యంతమందుఁ-జెలిమి నీపేరు స్మరియింపఁ జేసి పిదప
నీకు నిచ్చకు వచ్చెడు నెలవు నిమ్ము-వామదేవ పూజిత దేవ! వాసుదేవ!



గ్రంథములు

* మహాభారత చరిత్ర

గ్రంథకర్త:—పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, పిఠాపురము.

వెల:—రూ. 1-0-0. డెమ్మీసైజు 237 పేజీలు.

ఈగ్రంథమును వందనములతో నందికొనినాము. గ్రంథకర్త యొనర్చిన పరిశ్రమాతిరేకమును ఎచ్చటపట్టిన నచ్చట చదివిచూచి మిక్కిలి యానందించితిమి.

అధునాతనులగు నాంగ్లులలో, తత్రాపి ప్రాచీన పరిపాటి ననుసరించిన వాఙ్మయ విమర్శకులలో, కూలంకష మగు ధిషణాపాటవమును వినియోగించి, సంస్కృతాంధ్ర భాషాసాహిత్యమును, సౌమనస్యము నలవర్చికొని ఈతీరుగా ఆర్యాంగ్లవిజ్ఞానముల కాకరమగు భారతరత్నాకరమును మథించి సారమును తేల్చిన పండితులు ఇప్పుడు చాల నరుదుగా నున్నారు.

శ్రీశాస్త్రిలుగారు ఈకాలపు విమర్శకులధోరణి ననుసరించి–అనగా కథ కాలము, కవికాలము, తద్విశేషములు మున్నగువానిని విమర్శించెడిరీతితో బహిరంగ పరీక్షతో ప్రకృతము ఈ భారతచరిత్రను వ్రాసియున్నారు. (ఇది వారు తెలిపినమాటయే.) కనుక వారు భారతయుద్ధకాలము, రచనావిధానము, గాథా విశేషములు, పాండవపక్షపాతులు, భారతకాలపు రాజ్యములు, భారతపు ముఖ్యకీర్తులు—అను ప్రధానకీర్షికలతో పాశ్చాత్యవిమర్శకపద్ధతితో గ్రంథరచనను సాగించినారు. ఇందు యుద్ధకాలమును నిర్ణయించునప్పుడు ఉపనిషత్తులు, జ్యోతిశ్శాస్త్రసంప్రదాయములు, భారతవ్యాఖ్యానాంశములు, తక్కిన పురాణాంశములు మున్నగువానిని గైకొని పెక్కుయుక్తిప్రత్యుక్తులతో భారతయుద్ధము 15–16 శతాబ్దులమధ్యను జరిగినదని నిరూపించినారు.

ఇక రచనావిధానమునందు—చాలవఱకు పాశ్చాత్యపండితులమార్గము ననుసరించి భారత భేదములను, వానికి ఆధారములగు వంశములను చక్కగా వెల్లడించిరి. ఈరీతిగానే గాథావిశేషములను వెల్లడించుటలో చాల ప్రయాసమునకు పాల్పడి, ఆర్యానార్య మిశ్రజాతినిర్ణయములు, భారతమున దేవతలుగా మహామహిమతో వర్ణింపబడిన శ్రీకృష్ణ పూతనా నాగులను గూర్చిన చరిత్రాంశములను సాధారణముగా నిరూపించుటయేకాక గతానుగతికముగా విశ్వసింపబడుచున్న ద్రౌపదీవస్త్రాపహరణాదికథలు అసత్యములని చెప్పకయే చెప్పుచున్నారు.

---

* భారతీపత్రికకు అభిప్రాయార్థము వచ్చిన గ్రంథమును నాకిచ్చి తదధిపతులు కొన్నిమాటలు వ్రాయుడని కోరిరి. కనుక నాకు తోచిన విషయములనే కొన్నిటిని ఇచ్చట వ్రాసియున్నాను. ఈచరిత్రకర్తల యభిప్రాయమును నే నెంతవఱకు అంగీకరించెద నన్నవిషయమును ముందు నా వ్రాయదలచిన వ్యాసములను బట్టి చదువరులు నిర్ణయించుకొనవలెను.

పం. ఆ. శా.

పాండవపక్షపాతులను గూర్చి చర్చించినప్పుడు భీష్మద్రోణకృప విదుర వ్యాసాదుల తత్త్వములు, వారొనర్చిన యాపందర్భాంశములు నిరూపించినారు. ఈ ఘట్టమునం దింకను శ్రీకృష్ణజరాసంధాదిశక్తి కలగల యంశములు చాల నిరతి గొల్పుచున్నవి. ఇటులనే మహాభారతకాలపు రాజ్యములను గురించి చర్చించుటలో గూడ మనస్మృతులు, పురాణములు మున్నగువానిని మాత్రమే కాక స్వదేశీయులు, విదేశీయులు వ్రాసిన చరిత్రాంశములను కూడ జతచేసి చర్చించి సిద్ధాంతము లొనర్చిరి. ఆకాలపు దేశముల పటము కూడ స్పష్టముగ ప్రదర్శింపబడినది. పిమ్మట ముఖ్య వీరులపట్టిక ఈయబడినది. ఇది ఇందుగల ముఖ్యవిషయములు.

మొత్తముమీద శ్రీసుబ్రహ్మణ్య శాస్త్రులుగారు అత్యధిక మగు నోపికతోను, పట్టుదలతోను సంస్కృతాంధ్ర మహాభారతములను తరచి తను యోపినకొలది అనేకములగు అద్భుతాంశములను వెలువరించిరి. సత్యనిర్ధారణమునకును, విషయవివేచనమునకును అలవాటుపడియున్న సహృదయుల కిట్టి విమర్శనము చాల సంతోషమును కల్గించి ఈవిషయమునం దింకను అధికమగు విమర్శనము చేయుటకు పురికొల్పుట కలుగ గలదు; కాని ప్రస్తుతాంధ్రదేశములో—అందునను ఎదుటివారివాద మేదియో వినుటకైనను ఓపికపట్టక అపూర్వాభిమానములతో వీరావేశమును దాల్చి ఆర్భాటముచేయుట కలవాటుపడినట్టి యాంధ్రదేశములో—ఇట్టిగ్రంథములును, గ్రంథకర్తలును చాల నిందాస్పదు లగుట తప్పనిసరి యని మా యభిప్రాయము. అయినను శాంతిని వీడక కేవలసత్యదృష్టితో ఇంకను అనేకగ్రంథముల నిట్టులె వెలువరించుట గల్గినచో, కాలాంతరమున నాగ్రంథములును, గ్రంథకర్తలును ఆంధ్రజాతికి, భాషకు ఉజ్జీవనము గల్గించునట్లు అగును. ఏమనగా, "కాలోహ్యయం నిరవధిః విపులా చ పృథ్వీ"—అని కదా అందురు. అయినను, విశిష్టమగు దేవాంశ కలవారని మనవారు నమ్ముచున్న కృష్ణుడు, పాండవులు, వ్యాసాదులు మున్నగువారి విషయముల గురించి ఈగ్రంథమునందు చిత్రములు, ఆశ్చర్యజనకము లగు సిద్ధాంతములు వ్రాయబడినవి. ఇంతకుమేల? "దుర్యోధనునిదే న్యాయము. పాండవులదియే అన్యాయము. పాండవులు కృత్రిమజన్మ కలవారు. ద్రౌపదీ వస్త్రాపహరణము అసలు జరుగలేదు. పాండవులు భారతీయులే కారు. కౌరవులే రాజ్యార్హులు, దుర్యోధనాదులు ఉత్తమకౌరవులు; రాజనీతి విశారదులు. వ్యాసుడు వర్ణసంకరసంతానమునకు పునాది. పాండవులు వ్యసనాసక్తులు"అని ఇట్టివి మన ప్రాచీనాచారపరాయణులకుమహాత్తుగా విన్నంతనే గుండె బ్రద్దలు చేయునట్టివే కదా! కనుక ఈరీతిగా ప్రవాహమునకు ఎదురీత గల గ్రంథములు మనవారిచే ఆదరింపబడునను నమ్మకము మాకు గల్గలేదు. కాని లోకమునకు విరుద్ధములుగా నున్నను పట్టుదలతో వీటిని బయటపెట్టి శాస్త్రులుగారు తమకు గల సత్యప్రియతను వెల్లడించినారు. ఇందులకై వీరి నభినందించెదము.

ఏది యెట్లున్నను అనుకూలబుద్ధితోనో, లేక ప్రతికూలబుద్ధితోనో, వీరి విమర్శనలలో సార మెంతకలదన్న యూహతోనైనను, బూజుపట్టిన భారతపు ప్రతులను మనవారు కొందరైనను మరల విప్పి చదివెదరనుట సత్యము. ఈమూలకముగానైనను నిర్జీవముగానున్న సారస్వతపారిశ్రామికుల జీవితములో కొంత సంచలనము గల్గించుటయైనను ఉత్తమ మగు కార్యమే కాగలదు. తక్కిన దెట్లున్నను ప్రకృతము శ్రీశాస్త్రులు వారికి ఈపాటిదైనను శ్రేయస్సు తప్పదు గదా! కనుక వారు ధన్యులనియే తలంచుచున్నాము.

శ్రీశాస్త్రులుగారి గ్రంథములో చర్చింపబడిన విషయములు ఆంధ్రదేశపు విమర్శకులలో పేరెన్నిక గన్న బ్రహ్మయ్యశాస్త్రులు, చెళ్లపిళ్ల శతావధానులు మున్నగువారిచే ఆకర్షితములై యొప్పుడల గన్నట్లు పీఠికలో గ్రంథకర్తలు సూచించినారు. ఇది ఆనందింపదగిన విషయము. అయినను స్వయముగా పరీక్షించి ఈ విషయమున మరికొన్ని ప్రత్యేకవ్యాసములను వ్రాయదలచిన మేము ప్రస్తుతము గ్రంథపరిచయముగ నింతకంటెను విశేషించి వ్రాయజాలక యున్నాము. సం॥ ఆ॥ శా॥

కలికాలపు కథలు (మొదటిభాగం)

గ్రంథకర్త: కలగ సత్యనారాయణగారు. క్రౌను 152 పుటలు. వెల 0 12-0.

ఈభాగమున తొమ్మిది కథ లున్నవి. ఇందలి కథ లన్నియు వాడుకభాషలో వ్రాయబడినవి. 'సంఘసంస్కరణాభిలాషి'యగు గ్రంథకర్తగారు సంస్కరణవిధము లేవియు సూచింపకపోవుటచే వారి గ్రంథరచనోద్దేశము నిష్ఫలమైన దనవలసి వచ్చినది. పల్లెటూళ్లను,పట్టణములను గూడ గర్హించిన గ్రంథకర్తగారు వనవాసమును మెచ్చుదురుకాబోలు! పల్లెటూరి పడుచులు పశుప్రాయు లనియు, మన దేశపు ఆడువాండ్రు అప్రయోజకు లనియు సూచించుట శోచనీయము. విద్యోపార్జకుల కాధారభూతు లగు ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుల చులకనగ జూచుట గ్రంథకర్తల కయుక్తమని వ్రాయాశయము. ఇందు 'వదనమోము'వంటి ప్రయోగములుకూడ నున్నవి. వీరు ప్రచురింపనున్న రెండవభాగమునందైనను నెక్కుడుశ్రద్ధ వహించినగాని వీరి రచన మాదరపాత్రము కాజాలదేమో?

కో. నా.

మిస్ మేయో గ్రంథఖండనము

ప్రకాశకులు: జి. యస్. శాస్త్రి అండుకో., తపాలుపెట్టె నెం. 110, మద్రాసు. క్రౌను 183 పుటలు. వెల 1-0-0.

భారతజాతి కప్రతిష్ఠ వాటించుచు వ్రాసిన మేయోకన్య గ్రంథముయొక్క సారమును, ఆగ్రంథమునకు సమాధానముగ రంగయ్యరుగారు వ్రాసిన 'ఫాదర్ ఇండియా' యను గ్రంథములోనుండి కొన్ని భాగములను, ఆండ్రూసుదొరగారు 'యంగుఇండియా'లో ప్రకటించిన ఖండనలేఖలను నాంధ్రీకరించి చేర్పబడినవి. గ్రంథమంతయు సరళశైలిని సద్యోత్మకముగ వ్రాయబడి యుండుటచే స్త్రీ పురుషు లందరకును పఠనీయముగ నున్నది. ఈ గ్రంథము ప్రతి యాంధ్రుడును పఠింపదగినది.

కో. నా.

సిల్హౌటీస్

గ్రంథకర్త: వి.ఎస్. భూషణ్. ఇది యొక చిన్ని ఆంగ్లగ్రంథము. మనసు తోచినప్పుడెల్ల వ్రాసిన పద్యముల సమూహ మిందు కలదు. భావ మింకను పరిపక్వము కాకపోయినను చదువుట కీగ్రంథము మనోహరముగ నున్నది. వీరు సరోజినీదేవిగారి మార్గము ననుసరింప యత్నించినటులు గానవచ్చును. ఆంధ్రమునందే యీ పద్యము లున్నయెడల గ్రంథకర్త భావగీతములను వ్రాయుచున్న కవి కుమారుల తరగతికి జేరినవారగుదురు. రవీంద్రనాథ ఠాకురుగారు ఉపయోగించిన ఆంగ్లశైలిని వీరు దృక్పథమున నుంచుకొనిరి.

శైలియందును, పద్యముల కట్టుబాటునందువే కాక, భావములందును వీరు వంగదేశీయులనే యనుసరించిరి. వ్రాయుట కుత్సాహము కలవారిలో పలువురు దేశభాషలందు వ్రాసి స్వభాషల నలంకరింపకుండుట చోద్యము.

అచ్చు బాగుగ నున్నది. శీర్షికకు తగినటుల చక్కని చిత్రము లీగ్రంథమున కలదు.

త. రా.

శ్రీయుత కూచి నరసింహము పంతులుగారి జీవితచరిత్రము

కర్త: జనమంచి సీతారామస్వామిగారు.

ప్రకాశకులు: ముద్దా సోమప్పశాస్త్రి అండ్ సన్సు, మేలుపాక, విశాఖపట్నంజిల్లా. వెల అ. 0-3-0. భారతీపాఠకులకు ౨ అ. చీటికి గ్రంథము ప్రతి పంపుదురు.

ఇది శ్రీనరసింహము పంతులుగారి యమూల్య జీవితమునకు సంగ్రహావర్ణనము. శ్రీపంతులుగారి ఆబాల్యభక్తి సౌజన్యాదులు, ఉపాధ్యాయత్వమందలి అనల్పసామర్థ్యము, అతి మృదులమగు కవితాధోరణి, హృదయమందలి అతికోమలత మొదలగు సత్కృష్టలక్షణము లందు చక్కగ వర్ణించుచు, చదువరుల మానసములకు వారి జీవిత ప్రాశస్త్యము నెక్కించుచున్న దీచిన్నవ్యా

సము. వ్యాసము సంక్షిప్తమైన రక్తి గూర్చుచున్నది. శ్రీ పంతులుగారి అనుభవ సూచకములగునట్టియు వారి జీవిత విశేషముల గొన్నిటి వెలిబుచ్చునట్టియు, వారిమానసిక వికాసముల గొంత రుజువు పరచునట్టియు వారి చక్కని పద్యములిందు ఉద్ధృతములైనవి.

సతీతార

డిమ్మీసైజున ౫౦ పుటలుగల అయిదంకముల చిన్న నాటకము. దీని వెల ఒక్క-రూపాయట-అబ్బో!

గ్రంథకర్త: అనుముల వేంకటశేష కవిగారు, కావ్యవిశారద వగైరా బిరుదాంకితులు, తెలుగు పండితుడు, మునిసిపిల్ హైస్కూలు, నరసరావుపేట.

'చెత్తనాటకాలు వద్దో' అని అంటూండే కొద్దీ లెక్క లేకుండా పుట్టుకొస్తున్నాయి. వీటి మూలాన తెలుగు వాఙ్మయానికి తెగులు తగులుకొంటూంది. 'నాటకాంతం కవిత్వం' అని వెనకటి వారంటే 'నాటకంతోనే మొదలుపెట్టాలనోయి కవిత్వం' అంటారు ఇప్పటివారు. నాటకాలు వ్రాసేవారికి పాండిత్యంకంటే లోకానుభవం ఎక్కువ కావాలి.

ఈనాటకం కథ అంతటికీ తెలిసిందే కాని బృహస్పతినే చంద్రుడివేషంతో తారకు తార్చాడు గ్రంథకర్త. తార 'చంద్రుడే' అను భావంతో తంతు నడిపింది. ఇక తారకు సతీత్వమెక్కడ? భావ వ్యభిచారం కాలేదా!

ఝాన్సీ లక్ష్మీబాయి

(ఏకాంక నాటకము)

'సిపాయీల తిరుగుబాటు'ని పేరుగన్న భారత స్వాతంత్ర్య సమరమునాడు ఆంగ్ల సేనాపతుల గుండెగాలమయి పరాక్రమించి మించిన వీరవనితామణి యగు 'ఝాన్సీరాణీ' లక్ష్మీబాయి ఆంగ్లేయ సైన్యములు ముట్టడించియున్న ఝాన్సీకోటనుండి తప్పించుకొని వచ్చుట్టును 'చిత్రగుప్తుడు' ఇట్లు గ్రంథరూపమువకు తెచ్చినాడు. డిమ్మీసైజున ౪౮ పుటల పరిమితిగల యీ పుస్తకమునకు వెల, దొరకు చోటు తెలుపలేదు.

కృష్ణుని దేశసేవ

గ్రంథకర్త్రి: చాట్రాతి లక్ష్మీనరసాంబగారు. ముద్రాపకులు: కర్లపాలెం కోదండ రామయ్యగారు, శ్రీ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల (లిమిటెడ్), బెజవాడ. డెమ్మీసైజు ౯౪ పుటలు. వెల ౧-౦-౦.

చక్కని ధారాళమైన శైలితో నొప్పారు గద్య పద్య ధోరణిని శ్రీకృష్ణచరిత్రము దేశసేవాపరముగ నిరూపించుచు రచించిన యీగ్రంథము ప్రశంసాపాత్రము. ఇది బాలబాలికలు చదువదగినది.

అరేబియన్ నైట్సు: ప్రథమ భాగము

గ్రంథకర్త: జొన్నలగడ్డ వేంకటరాధాకృష్ణయ్యగారు.

ప్రకాశకులు: కత్తా అచ్చయ్య అండ్ సన్సు, రాజమండ్రి. క్రౌనుసైజు, ౨౫౫ పుటలు. వెల రు. 1-8-0.

'అరేబియన్ నైట్స్' అను ఆంగ్ల గ్రంథమునకిది ప్రతిపదాంధ్రీకరణము గాక, ప్రథమమున కథ చదివి, తత్సారమును పెంచుచు వ్రాసినది. శైలి యింకను సవరించుకొని సాఫు చేసికొన్న బాగుండెడిది.

శివలీల-నాటకము

కర్త: ముత్తనేని వెంకట చెన్నకేశవులుగారు, జగ్గయ్యపేట. పేజీలు 86. వెల రు 1-0-0.

గయోపాఖ్యానము (ప్రబంధము)

శ్రీవెంకటేశ్వర గ్రంథమండలి యందలి ఐదవ కుసుమము. కర్త: వెల్లంటి సుబ్బయార్యగారు. పేజీలు 154. వెల రు 1-4-0. చందాదారులకు రు 1-0-0.

సారూప్యౌషధశాస్త్రము

కర్త: డాక్టరు లంక రామారావుగారు, హెచ్. ఎం. బి., కాకినాడ. 587 పేజీలు. వెల రు. 3-0-0.

తంజావూరి మహారాష్ట్రరాజుల చరిత్రము

కర్త: కె. ఆర్. సుబ్రహ్మణియన్‌గారు, యం.ఎ., మైలాపూరు, మద్రాసు. పేజీలు 107. వెల రు. 1-0-0.

కోటంరాజు నాగేశ్వరదాసు

కర్త: పంగులూరివీరరాఘవుడుగారు, అప్పికట్ల.
పేజీలు 22.

బ్రహ్మగుండేశ్వర మాహాత్మ్యము

వెల. అ. 0-2-0.

శ్రీశైలక్షేత్ర మాహాత్మ్యము

వెల అ. 0-2-0.

శ్రీద్వారకా మాహాత్మ్యము

వెల అ. 0-2-0.

ఈపైమూడు మాహాత్మ్యములకు కర్త పుల్లాపంతుల రామచంద్రయ్యగారు, కర్నూలు.

దీపావళీపండుగ రహస్యము

కర్త: దువ్వూరి శాపన్నగారు, అంద్రంగి.
పేజీలు 64. వెల రు. 2-0-0

పత్రికలు

'రైతాంగము'

ఇది యొక నూతన మాసపత్రిక. మదరాసు, తిరువళిక్కేణి నుండి శ్రీ బి. టి. నరసింహాచార్యులుగారి సంపాదకత్వమున మొదటి సంచిక అక్టోబరు మాసాంతమున వెలువడినది. సం॥ చందా రూ 2-4-0. క్రౌను సైజున 22 పుటలు. 'రైతులకు సంబంధించిన ఆర్థిక, వ్యావసాయిక, సాంఘికసమస్యలను ప్రజల దృష్టిలోనికి దెచ్చి వానిని గురించి ఆలోచించునట్లు చేయుటయే ప్రధానాదర్శముగ' గల పత్రిక యిదివర కాంధ్రదేశమున లేనికొఱతను తీర్చుట కేర్పడిన దీపత్రిక. 'రైతుల యభ్యున్నతికి సాధనములగు ఆర్థిక, వ్యావసాయిక, ఆరోగ్య, సాంఘిక సమస్యలన్నియు నిందు చర్చింపబడు'నని సంపాదకీయమందు వ్రాయబడినది.

వేమవరపు రామదాసుపంతులుగారిచే వ్రాయబడిన 'వ్యవసాయపు రాయలు కమిషను' అను వ్యాసము కమిషనువారి రిపోర్టుయొక్క నిష్ఫలతను, నిరర్థకతను సూచించుచు, దానినుండి రైతులు గ్రహింపవలసిన విషయముల చర్చను ప్రారంభించినది. ప్రతిమాసము నొక్కొక వ్యాసమును వ్రాతుమని పంతులుగారిందు తెలిపిరి. ఇది సంచిక యందలి ప్రథమవ్యాసము.

గోగినేని రంగనాయకులుగారి 'రైతులు-ఆర్థికస్థితి' యను వ్యాసము రెండవది. క్రమక్రమముగ రైతులకు హెచ్చుచున్న వ్యయమును, తగ్గుచున్న ఆదాయమును, సిస్తుల బాధను గూర్చి ప్రతిగ్రామస్థుడును, రైతును శ్రద్ధతో చదువుకొనవలసిన యీవ్యాసము సరళశైలి నున్నది.

పశువ్యాధులలో తీవ్రమైన మలబద్ధము, కడుపు ఉబ్బరము యొక్క కారణములను, లక్షణములను, చికిత్సను గూర్చిన వ్యాసము మూడవది.

సమకాలికాభిప్రాయములలో 'గాత్రము ఎరువు', 'మిడుతల దండు నివారణము', 'పొగాకు పైరు', 'పైరుల మార్పుటవలని ప్రయోజనము', 'పరిసేలలో పాకుడు', 'విద్యుచ్ఛక్తి-భూసారము', 'పశువులకు రేచీకటి' యను విషయము లున్నవి.

రైతులయెడల శాసనసభలయందు ప్రభుత్వమువారి వైఖరిని గూర్చి సంపాదకీయములలో చర్చింపబడినది.

వ్యవసాయమును, గ్రామజీవనమును సూచించు ముఖశీర్ష చిత్రముతో, మొదటినుండి తుదివరకు రైతునకుపయుక్తమగు విశేషములతో నిండి, సార్థకనామయగుటకు ప్రయత్నించు సూచనలతో నున్న యీపత్రిక చిరజీవినియై వృద్ధిచెందును గాక! జ. బ్ర.



కుఱ్ఱవాళ్లని కూర్చోబెట్టి బొమ్మ గీద్దామంటే సరియైన వైఖరి దొరకడమే బ్రహ్మాండం

సాభిప్రాయవిశేషములు

ప్రపంచమునందు సత్యాశ్రయము లేని సకల ప్రయత్నములును నిరర్థకము లగుట సహజధర్మము. మానవు లీపరమార్థమును మఱచి పరమానర్థములకు పాలగుచున్న విధమును ప్రపంచేతిహాసము లనంతముఖములను బోధించుచున్నవి. కన్నులు గలవా రీపరమరహస్యమును చూడగలరు. చెవులు గలవా రీరహస్యమును వినగలరు. బుద్ధి గలవా రీపరమార్థమును గ్రహించి సుఖపడగలరు. కన్నులు, చెవులు, బుద్ధియు కలిగియుండియు వానిని సహజరీతి నుపయోగించనివారు దుఃఖముల పాలగుచున్నారు. ప్రపంచచరిత్ర మంతయును స్వార్థమునకును, పరార్థమునకును గల సంరంభమై యున్నది. బుద్ధిహీనులు స్వార్థము నే పరమార్థముగ ప్రదర్శించుటకు కపటనాటకములను గల్పించుచుందురు. స్వార్థపరులు చెప్పెడి సిద్ధాంతములకును, చేసెడి పనులకును సంబంధము దుర్గ్రాహ్యముగ నున్నది. అధర్మపరాయణులు తాత్కాలికముగ లోకమును వంచించినను కాలాంతరమున సత్యము వ్యక్తము కాగలదు. వర్తమానయుగమునందు వ్యక్తుల కపటనాటకములకన్నను మహాజాతుల కపటనాటకములు మహాసంక్షోభమును గలుగ జేయుచున్న విధమును అయిరోపా మహాసంగ్రామము సువ్యక్తము చేసినది. దేశములు పాడుపడినవి. ప్రజలు నశించిరి. సంపదలు క్షీణించినవి. ప్రజ లన్నాతురులై పరితపించుచున్నారు. ప్రపంచశాంతికై నానాజాతిసమితి స్థాపించబడినది. కాని ప్రపంచమునకు మాత్రము జ్ఞానోదయము గలుగలేదు. పాశ్చాత్య రాజ్యములందు వ్యక్తిస్వాతంత్ర్యము వికసించుచున్న విధముననే పరపీడనదాస్యములును వికసించుచున్నవి. ప్రపంచశాంతికి మూలాధారమైన యుద్ధసన్నాహ నియమములకు బ్రిటీషు, ఫ్రెంచి, ఇటలీ రాజ్యములు విముఖత్వమును చూపినవి. ఈరాజ్యము లెప్పటివలెనే యుద్ధసన్నాహమునకు విశేషమైన ద్రవ్యమును వ్యయముచేయుచున్నవి. ప్రజలన్నాతురులై పరితపించుచున్నారు. ఈరాజ్యములు పరదేశదాస్యమునకై చూపుచున్న శక్తిసామర్థ్యములు స్వదేశమోక్షమునకై చూపుట లేదు. ఈ రాజ్యములందు పరదేశాక్రమణాభిలాష పెరుగుచున్నది గాని తరుగుట లేదు. అయిరోపా మహాసంగ్రామానుభవము శ్మశానవైరాగ్యముగ పరిణమించినది. ఆయుధధారణమునందు గల భక్తిశ్రద్ధలు ధర్మధారణమునందు గలుగకున్నవి. ధర్మధారణము లేని సంపదలు, సామ్రాజ్యములు తాత్కాలికముగ సుఖదాయకములుగ గనుపడినను కాలక్రమమున దుఃఖదాయకములగుట తథ్యము.

మహాభారతీయుద్ధము ధర్మాధర్మముల సంరంభములందు ధర్మమునకు గలిగెడి విజయమును, అధర్మమునకు గలిగెడి పరాజయమును పరిస్ఫుటము చేయుచున్నది. దుర్యోధనుడు విజయాశీర్వాదము కోరినపుడు గాంధారి 'ధర్మము గలచోట విజయము గలుగును' అని దీవించినది. ధర్మరాజును ధర్మము రక్షించిన విధమున దుర్యోధనుని వాని యక్షౌహిణులు రక్షించలేదు. పరపీడన మధర్మపరాయణమై మూలచ్ఛేదమును జేయగలవిధమును భారతయుద్ధ మత్యద్భుతముగ బోధించుచున్నది. ఓడిపోయిన కౌరవులు సంపూర్ణముగ నశించిరి. గెలిచిన పాండవులును మహాదుఃఖము ననుభవించిరి. యుద్ధానంతరము ధర్మరాజు విజయమును బొందియును అనుభవించిన సంతాపము లోకమునకు జ్ఞానోపదేశమును జేయుచున్నది. ఆంగ్లేయులు విజయమును బొందియును సంగ్రామానంతర మనుభవించుచున్న దుఃఖవేదన జ్ఞానోపదేశమును జేయజాలకున్నది. బ్రిటీషుప్రజలకు జీవనాధారములైన స్వదేశపరిశ్రమలును, విదేశవ్యాపారమును క్షీణించుచు ప్రజలకు మామూలు జీవయాత్ర దుర్లభమైనది. క్షీణించుచున్న పరిశ్రమలను, వ్యాపారమును, రాజ్యాధికారమును రక్షించుటకు స్వార్థత్యాగము సాధనముగాని పరపీడనము, స్వార్థపరత్వము సాధనములు గావు. బ్రిటీషుసామ్రాజ్యసంరక్షణమునకై ఫ్రాన్సుతో జేసిన సంధినియమములు ప్రయోజనకరములుగ నిపుడు గనుపించినను విషమస్థితియందవి నిరర్థకములు గాగలవు. బ్రిటీషుసామ్రాజ్యమును రక్షించుటకు సామ్రాజ్యాంతర్భాగములందలి భక్తిశ్రద్ధలు యథార్థమైన సాధనములైనటులు పరరాజ్యముల సహాయము సాధనము గాదు. ఐరోపా మహాసంగ్రామమునందు సామ్రాజ్యాంతర్భాగములను రక్షించుటకు భారతబలముల సహాయము సాధనమైనటులు పరరాజ్యముల సహాయము సాధనము గాలేదు. ఫ్రాన్సు, బెల్జియము, టర్కీ మొదలగు రణరంగములందు భరతవర్షము చేసిన సహాయమును బ్రిటీషురాజనీతిజ్ఞులు వెంటనే విస్మరించుట సంతాపకరము. భరతవర్షమును శాశ్వతముగ బ్రిటీషురాజ్యపాశబద్ధము చేయుటకు బ్రిటీషురాజ్యతంత్రజ్ఞు లవలంబించుచున్న మాయోపాయములు భారతీయులను గాని, లోకమును గాని మోసగింపజాలవు. రాజ్యాంగసంస్కరణముల వ్యాజమునను బ్రిటీషురాజ్యతంత్రజ్ఞులు ప్రదర్శించుచున్న కపటనాటకమునందలి గూఢార్థము లోకమున కంతకును తేటతెల్లముగ నున్నది.

* * *

సైమను సప్తకము

సైమనుకమిషను రెండవసారి భరతవర్షమునందు సంచారము చేయుచున్నది. సైమనుకమిషనుకు భారతప్రభుత్వము త్రిశంకుకమిషనును జత చేసినది. గత సంచారమునందు సైమనుకమిషను విన్నపములతోను, స్వాగతములతోను సంతృప్తినిబొందినది. ఆసంచారము కేవలము ప్రచారము. ఆవిచారణయందలి సారాం

శరహస్యములకిపుడు బహిరంగముగ విచారణ జరుగుచున్నది. రహస్యవిచారణయందు భారతీయులపాత్రలేకపోయినను బహిరంగవిచారణయందు భారతీయుల పాత్ర గల్పింపబడినది. ఇంగ్లాండునందుగలిగిన విశ్రాంతిసమయమునందు కమిషను సుకరమైన కార్యవిధానమును నిర్ణయించినది. ఆనిర్ణయముల కనురూపముగ భిన్నరాష్ట్రములందు భిన్నసమస్యలను విచారించుట కుపక్రమించినది.

బొంబయి మద్రాసు రాష్ట్రములందు నిమ్నజాతుల సమస్యను, కలకత్తాయందు యూరపియను సంఘసమస్యను, బెంగాలు పంజాబులందు హిందూమహమ్మదీయ సమస్యను విచారించుట కుపక్రమించినది. వంగరాష్ట్రమునందు ఆంగ్లోఇండియను ప్రాతినిధ్యసమస్యను, మద్రాసునందు బ్రాహ్మణ బ్రాహ్మణేతర ప్రాతినిధ్య సమస్యను విచారించుట కేర్పాటు చేయబడినది. ఈవిచారణయందు భారతీయకమిషనులు పాల్గొనుట కేర్పాటులున్నను నిర్ణయాధికారము సైమనుకమిషనుకు మాత్రమే కలదు. రాయలుకమిషను, భారతసామ్రాజ్యకమిషను, రాష్ట్రీయకమిషను చేరి విచారణ చేయుచున్నవి. ఈ విచారణయందు రాష్ట్రీయపరిస్థితులను, స్థానిక పరిస్థితులను, సాంఘిక పరిస్థితులనుబట్టి పరస్పరవిరుద్ధములైన భావములు వెలువడుట సహజము. ఈ యేర్పాటులును పరస్పరవిరుద్ధ భావములను వ్యక్తము చేయుటకే చేయబడినటులు కనుపడుచున్నవి. బొంబయి ప్రభుత్వము సమర్పించిన రిపోర్టును గోప్యముగ నుంచవలసిన యవసరము గనుపడదు. రహస్యపరిశోధనమునందే మహోపద్రవము గలదు గాని బహిరంగపరిశోధనమునందు లేదు.

బొంబయి ప్రభుత్వపక్షమున టర్నరుగారు చెప్పినసాక్ష్యము సంస్కరణముల విషయమై వ్యాపించిన వదంతిని బలపరచుచున్నది. రాష్ట్రీయస్వపరిపాలనమును బొంబయి ప్రభుత్వమామోదించుచున్నది; లాను, ఆర్డరును కేంద్రాధికారవశము చేయుటకుగోరుచున్నది; రెండవ శాసనసభనుగాని, కార్యనిర్వాహకసభనుగాని నిర్ణయించుచున్నది. పంజాబునందును కేంద్రాధికారమునకు లాను, ఆర్డరును మార్చవలయునని పంజాబు ప్రభుత్వము విశదముచేయుచున్నది. నామరూపములు లేని రాష్ట్రీయస్వాతంత్ర్యము నొసంగుట కన్నిరాష్ట్రప్రభుత్వములును నేకగ్రీవముగ నంగీకరించునని జోస్యము చెప్పవచ్చును. అధికారము లేని సంస్కరణములను పరికల్పించుటయం దాంగ్లరాజ్యతంత్రజ్ఞులు పరమప్రవీణులు. బాధ్యతాయుత పరిపాలనమున కాధారభూతములుగ స్థాపితములైన మోంటుఫర్డు సంస్కరణములు గలుగజేసిన బీభత్సము బ్రిటీషురాజ్య తంత్రజ్ఞుల ప్రజ్ఞను విశదముచేయుచున్నది. కుడిచేతితో నిచ్చినదానిని ఎడమచేతితో లాగుకొనుట బ్రిటీషురాజ్యతంత్రజ్ఞుల రాజ్యనీతి యని సర్వత్ర చిరకాలానుభవము వలన తెలిసిన విషయము. రాజ్యాంగసంస్కరణవిధానమును రెండేండ్లకుపూర్వమే బ్రిటీషురాజ్యతంత్రజ్ఞ

లు నిర్ణయించియుందురు. ఆ నిర్ణయములనే ధూపదీప నైవేద్య హారతులతో సం. ౧౯౩౦ యందు ప్రకాశము చేయుట రాజ్యతంత్ర ప్రయోజనమై యుండును. ఈ కపటనాటక ప్రదర్శనము కాలహరణమునకు గారణంబగు చున్నటులు భారతీయప్రయోజనములను సమకూర్పజాలదు. నిర్ణయించిన విధానమున కీ కపటనాటకప్రదర్శన మేల కావలయునో దురూహముగ నున్నది. సర్ జాన్ సైమను సానుభూతిని, సదాశయములను తెలిపినను కార్యవిధానము మాత్రము మారునని నమ్ముట కవకాశములు లేవు. ఇంగ్లాండును సందర్శించిన భారతీయులును నీ యభిప్రాయమునే విశదము చేయుచున్నారు.

ఇంగ్లాండునుండి వచ్చిన శ్రీమాన్ శ్రీనివాసయ్యంగారు, ఛిమ్మనులాలుగారు మొదలగువా రందరును బ్రిటీషుప్రజలకు భారతీయుల పట్లనుగల నిరాదరణనిరసనభావములను విశదము చేయుచున్నారు. బ్రిటీషుపౌరు లే పక్షమువారైనను భారతీయుల స్వరాజ్యాశయములకు ప్రతిఘటనమును బూనుచున్న విధమును పత్రికాభిప్రాయములు, ప్రజాభిప్రాయములు విశదము చేయుచున్నవి. ఆ యభిప్రాయములనే సమర్థించుటకు సైమనుకమిషనువిచారణ జరుగుచున్నది. తెల్లకమిషనువిచారణయును, తెల్లపత్రికల ప్రచారమును సమానఫలమునుగలుగజేయ సమకట్టినవి. వీరి సంకల్పము బ్రిటీషు రాజ్యాధిపత్యమును సమర్థించుటయును, స్థిరతరము చేయుటయును గాని, భారతీయ స్వాతంత్ర్యమునకు గాని, బాధ్యతాయుత పరిపాలనమునకు గాని సోపానమును నిర్మించుట గాదని నిత్యానుభవము విశదము చేయుచున్నది. బొంబాయియందును, పునహాయందును, లాహోరునందును భారతీయు లవలంబించిన బహిష్కరణవిధానము భారతీయాత్మగౌరవమున కనురూపముగ నున్నది. లాహోరునందు రాజభటులు లాలా లాజపతిరాయిగారికిని, నితరనాయకులకును జూపిన దార్జన్యము బ్రిటీషుప్రభుత్వలక్షణమును విశదము చేయుచున్నది. ఇట్టి దురంతకార్యములన్నియును గాంధిమహాత్ముడు చెప్పినటులు బ్రిటిషుసామ్రాజ్యవిలయమునకు సాధనంబులగుచున్నవి. లాలా లాజపతిరాయిగారును, వారి సహచరులును జూపిన నిగ్రహము వారి త్యాగమున కనురూపముగ నున్నది. ఇట్టి నిగ్రహత్యాగములే స్వరాజ్యమునకు సత్యమైన మార్గములు.

బ్రిటీషు ప్రజాభిప్రాయ మంతయును నొకమార్గముననే నడుచుచు సహజమైన భారతీయాశయములను ప్రతిఘటించుచున్నపుడు భారతీయులు భిన్నమార్గములను నడుచుచు స్వీయస్వత్వములను గోల్పోవుట దేశాన్యతిమైన దురదృష్టముగ నున్నది. భారతీయుల స్వరాజ్యకాంక్ష పరమావశ్యకమైనను దారి తెన్ను లేకున్నది. "ఎవరికి వారే యమునాతీరే" యనునటు లున్నది. నాయకులు

తాన్సేను

(మెల్లగ) ఓ సన్న్యాసినీ!

మీరా

'సంద్రముల పలుపు సామీ, నీ కృప!
దివమణుల దొంతి దేవా, నీ రుచి!
వెన్నెలలగుట్ట విభూ, నీ చలువ!
నీ సేవను మది నిలుచుకొ బా పిరి!...'

తాన్సేను

ఓ సన్న్యాసినీ!- మీరా నా కెక్కడ లభించునో దివ్యదృష్టిని జూచి యెఱింగించి పుణ్యము గట్టుకొమ్ము!

మీరా

(తాన్సేనును గుర్తించి, ఒక క్షణకాలము కండ్లు మూసికొని, నెమ్మదిగ) మీరా చనిపోయినది.

తాన్సేను

(చకితుండై, నిట్టూర్పు పుచ్చి)హా!-మీరా లేని యీ బ్రదుకు వ్యర్థము.- నేనుకూడ మీరా కడకే పోయెదను.

మీరా

ఎట్లు పోఁగలవు?

తాన్సేను

మృత్యుద్వారమున.

మీరా

అటు నీకు మీరా చేకుఱదు.

తాన్సేను

మఱెట్లు చేకుఱును? మరణించిన మీరాను బ్రదికి యెట్లు పడయఁగలను? నన్ను మరణము తానే పొందునట్లున్నది.

మీరా

ఊరక మరణము నేల యుపాసించె

తాన్సేను

మీరా కొఱకు.

మీరా

దాన మీరా మఱింత దూరముగ
నీ జీవితమును వెచ్చించి, కొనఁ దగి
మీరాసాన్నిధ్యము గాదు.

తాన్సేను

మఱేమి? ఇఁక నేను బ్రదికి చేయఁద
దేమి?

మీరా

నీవు మీరా నెఱుఁగకపూర్వము మీ
కొఱకే జీవితము సర్పింప నెంచితివా?

తాన్సేను

జ్ఞప్తిలేదు. మీరాను నే నెఱుఁగని దె
డో జ్ఞప్తిలేదు. మీరా నా కెట్లు లభించు
మీరా లేక నా బ్రదు కెందులకు?

మీరా

విశ్వవిభుని సేవకై నీ జీవితము సర్పింపు
తాన్సేన్!

తాన్సేను

(మీరా మాట లించుక మననము
కొని) ఓ యోగినీ! నీ ఆశయ మేమి?

మీరా

తాన్సేన్! ఈ జీవితము నీది కాదు. నీ
నీవాఁడవని చెప్పుకొనుటకు నీ కేమధికార
న్నది? పుట్టకపూర్వము నీవు నీ వాఁడవా
చచ్చిన వెనుక నీవాఁడ వగుదువా?

తాన్సేను

నే నెవ్వరివాఁడను? ఏల జన్మించితిని?

మీరా

నీ ప్రభువు విశ్వమంతకును ప్రభువైన వాఁడు. ఆతని యిచ్ఛాపూర్తికై నీవు జన్మించితివి.

తాన్సేను

నాయిచ్ఛాపూర్తికై జన్మింపలేదా నేను?

మీరా

నీ యిచ్ఛాపూర్తికై నీవు జన్మించితివేని నీకు మీరా దక్కియేయుండును.—నీ యిచ్ఛ ఆతని యిచ్ఛపరు గందుకొనఁ జాలదు.

తాన్సేను

(హృదయము కరఁగి) ఓ దేవీ! ఆ పరమేశ్వరుని యిచ్ఛ పవిత్రముగ నెఱవేర్చుటకే నాకు దారిఁ జూపుము! ఇటుపై స్వార్థమునకై జీవింపను.

మీరా

(కాషాయ వస్త్రము నిచ్చుచు) ఈ వినయవేషము దాల్పుము. ధనికులు నీ దారిద్ర్యమునకే మచ్చరింతురు గాక! దర్పవిలాసములు నీ పారశ్యపదముల ముద్దిడుకొనుఁ గాక! బ్రదుకుము పరమేశునకై!

[తాన్సేను తల వాంచును. మీరా కాషాయ వస్త్రమును, రుద్రాక్షమాలికను అతనిపై నుంచి దీవనగా నతని భుజముపై చేయిడును.]

ఇఁక నిన్ను మిథ్యాజీవనము తాఁకదు. శాశ్వత సత్యజీవనము నీకు చేకూరినది!—మీరా నీకు దవ్వున లేదు; నీ వామెను విడిచిలేవు: కన్నెత్తి చూడుము — ఇదిగో మీరా!—నీవు భౌతిక జీవనమునకు చచ్చినవాఁడవు కానియెడల చచ్చి బ్రదికెడు దాని నెఱుఁగఁజాలియుండవు.

[సన్న్యాసులవలె వారిరువురు గారవించుకొందురు. ఇంతలో అక్బరు వచ్చును.]

అక్బరు

ఓ హో!—తాన్సేన్!—గాన తపోనిధి, ఇంకొక హరిదాసస్వామి!

(నమస్కరించును.)

[మీరా సన్న్యాసమువాట విని యామెబంధువులామెను జూడవత్తురు. పూజచేసి మీరా పాడును. నిశ్చలుఁ డగు తాన్సేను హృదయమున మీరా పాట ప్రతిధ్వనించును.]

'పితా! దేవ దేవా!

నీ రూపంబు అపారము భావజ
    గం బకురగతిఁ గనియె నిరూపణ
నీ రూపుఁడవు అపారుఁడ వగు ని
    న్నీ రూపంబున నిటు సేవింతుగా!—
నా వాణీఝరి పోవఁజాల దిక
    నీ వేణుపదము సేములు దాఁటఁగా
నా యెద భావ విహాయస పరిధి
    స్థిత భవనంఘ్రి స్పృశించియు ఆఁగుగా!—
పారవశ్యముల భూరిపయోధుల
    నీ మహామయత నీడలు గ్రక్కఁగా
ఆద మఱచి నా పేదయాత్మ నీ
    రుచులఁ గరఁగి నిర్వృతి వెలుఁగుగా!'—

తాన్సేను

'భావాతీతా! పావనమహిమా!
ప్రేమనిధీ! భవ విదళన నేతా!
విశ్వత్రాతా! శాశ్వత సర్వా
తీత నిరవధిక దివ్యప్రతిభా!'—

[ఎల్లరును మైమఱతురు.]

[దూరమున కోకిల గొంతెత్తి పాడును.]

ఆత్మార్పణము

తుమ్మల సీతారామమూర్తి చౌదరిగార

(వెనుకటిసంచిక తరువాయి)

ఆయ్యా! తొల్లిటిపున్నెపుం బలిమి నీ కాతిథ్యమ్ముఁ జల్పి నా
నెయ్యంబుఁ బ్రకటించు భాగ్య మొదవెన్ నేఁడీగతి న్నీవిఁకన్
డయ్యంగాఁ బనిలేదు నీదగునభీష్టం బెద్దియో చెప్పితే
నియ్యల్పుం డనువైన సాయమును దా నింపారఁ గావించెడిన్.

మానవునకుఁ బులుఁ గేచం - దానన్ దోడ్పడు నటంచుఁ దర్కింపకుమీ
మానవ మృగ ఖగ నగ మయ - మైన జగం బెల్ల నీశ్వరాంశంబ కదా.

ఈశ్వరునిశక్తి నాయందు నింతో యంతో - కలదను మ్మాటగుట నిట్లు పలుకు టొాదవె
వెండియుఁ భారతోర్విలో వెలయుశిలయు - నతిథిపూజాపరాయణం బగుట వినవె.

జాతి మత కుల గుణాదుల - నీతలి నరయం బనేమి యెవ్వానికైనన్
చేతనగు మేలు సల్పుట - పాతకహారణంబు చువ్వే పరికింపంగన్.

నావుడు నక్కిరాతుఁడు మనంబున నెంతయు సంతసించి యో
హో వెలఁ గమ్యెడిన్ ఖగకులోత్తమ, నీ చరితంబు! పాపపుం
ద్రోవలఁ ద్రొక్కి యిమ్మెపుడుఁ ద్రుంచు దురాత్ముని నన్ను నిట్లు సం
భావనఁ జేసి వంతె! తగుభంగి నినుం గొనియాడ నేర్తునే.

జడివానం దడిసితిఁ జలి - గడగడ వడఁకించుచుండెఁ గాయ మ్మకటా!
ముడుచుకొనిపోయె నియ్యది - విడివడున ట్లాచరింపవే! వెర వున్నన్.

నీ వీసాయ మొనర్చిన - జీవించెద నిప్పు; డట్లు సిద్ధింపనిచోఁ
బావనగుణాఢ్య, నాకుం - జావది తప్పక ఘటిల్లు క్షణకాలములోన్.

అని ప్రార్థించుటయు నక్కపోతరాజంబు వానికిం దగు ధైర్యంబు చెప్పి "యిదె వ
చ్చెద నుండు మన్నా" యని.

చట్టుప లట్టె విప్పి రభసంబు భృశం బొనరించి చెట్టులన్
గుట్టల దాటి తుట్టతుదకు న్నది కవ్వలిచక్కి నున్న పెన్
పట్టణ మొండు సేరి వెలిపట్టున గిట్టినచెట్టు మింటికిం
దొట్టి వెలుంగుచుండఁ గని తోడన వాలెఁ దదంతికంబునన్.

వాలిన వేడుక నచటన్ - వ్రాలి తుదిన్మండు నింధనంబును నాసన్
గీలించి యార్తరతిన్ - లాలస కేతెంచి తన కులాయమ్మునకున్.

ఎండుంజిదుగుల నీటన్ - నిండినవనసీమఁ బడయ నేరక వెర వొ
క్కొండును దోఁపమి భగవం - తుండా! యిపు డేమి సేయుదు నటంచు మదిన్.

కొంతతడవు వితర్కించి తుట్టతుద "కో హో! పొరపడితి నెట్టయెదుట నున్న గూటి న్మఱచి యెండుఁబుల్లలకు నల్లాడు నా వెఱ్ఱి నేమనవచ్చు? నార్తరక్షణం బునకంటె నిక్కులాయంబు నా కెక్కుడే? వలయునే నిట్టి గూళులం బెక్కింటి నొక్కదినంబున నిర్మింపనేర్తునని తలంచి, నీడంబున్ దొఱ్ఱనుండి క్రిందికిఁ బడ నెట్టి, యందు మెత్తగా నమర్చియున్న చెత్తం దాఁ దెచ్చిన కొఱవి నిడి యూఁది మంటఁ జేసి, దానిం గులాయేంధనములఁ గడుంగడు నడరించి కిరాతుం గాంచి.

అన్నా! దురంత శీతా - పన్నుఁడ వై నీవు వగవఁ బని లే దిదె మం
ట న్నిగిడించితి లె మ్మింకఁ - గ్రన్నఁ జలిఁ బాపుకొమ్ము గడగడలుడఁగన్.


అనిన విని పుల్గుపల్కులు - తన డెందంబునకు నవసుధాధారాపా
తనిభంబు లగుడు బోయం - డనూన హర్షమున మున్గి యల్లన లేచెన్.

ఇట్లు లేచి మెల్లమెల్లన మంటం దఱిసి.

"అహాహా"రవంబు "ఱిహిహీ" - "యుహుహుహూ" నాదములు సెలఁగ నోట లున్నతినం
ద, హుతాశనకీలలఁ బా - దహస్తములఁ గాఁచికొనె నతండు కడంకన్.

వెచ్చపడె నొడలు, సీతువు - విచ్చె, సమస్తాంగకములు విడివడె మోదం
బెచ్చెఁ గిరాతున కత్తఱి; - నచ్చపుడెందమునఁ బుల్గు నాతఁడు మెచ్చెన్.

పావురమపు డిట్లనె న - య్యా! వొఁగడం దగినవాఁడనా నే? నస్మత్
ప్రావీణ్య మెందు సెపుమా - నా విధి నేఁ జేయకున్న నవ్వరె లోకుల్?



గోషన్ప్రభువు
ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ద్వితీయ స్నాతకసభయందు
'డాక్టరు ఆఫ్ లెటర్సు' గౌరవబిరుదము నొందిరి.



సి. వి. రామనుగారు
ఆంధ్రవిశ్వకళాపరిషత్తు
ద్వితీయ స్నాతకసభోపన్యాస మొసంగిరి.



తాడిపత్రి రాఘవాచార్యులుగారు
నంద్యాల ఆంధ్రమహాసభయందు
'నాట్యకళాప్రపూర్ణ' బిరుదము బడసిరి.



డి. బలరామకృష్ణయ్య చౌదరిగారు
నంద్యాల ఆంధ్రమహాసభయందు
'బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ' బిరుదమును బడసిరి.



చిలుకూరి వీరభద్రరావుగారు

నంద్యాల ఆంధ్రమహాసభయందు 'ఆంధ్రచరిత్ర చతురానన' బిరుదము బడసిరి.

స్వీయప్రాజాపత్యమును గోరుచున్నారు. సంఘములు ప్రత్యేకలాభములను గోరుచున్నవి. నిమ్నజాతులు, మహమ్మదీయులు, హిందువులు, యూరపియనులు, ఆంగ్లోఇండియనులు ప్రత్యేక సాంఘికలాభములను గోరునటులు దేశక్షేమమును గోరుటలేదు. షాఫిగారివంటి విద్యావంతులు ప్రత్యేకప్రాతినిధ్యమును, నియోజకవర్గమును సమర్థించునపుడు దేశము నావరించిన దౌర్భాగ్యమును వర్ణింపవలసిన యవసరము గనుపడదు. నానకచందుగారు సాంఘిక నియోజకవర్గము బొత్తుగా పనికిరాదనియును సాంఘికనియోజకవర్గ మవసరమైనపుడు సంస్కరణములు పనికిరావనియును నొక్కిచెప్పిరి. రాజాగారును నిమ్నజాతులపట్లను జూపెడిశ్రద్ధను దేశముపట్లను జూపుటలేదు. దేశము బాగున్న వ్యక్తులు, సంఘములు బాగుపడుట కవకాశములు గలుగగలవు. దేశచైతన్యము క్షీణించుచున్నపుడు వ్యక్తివికాసము, సంఘవికాసము దుర్లభము.

సాంఘిక ప్రాతినిధ్యము గలుగజేయుచున్న యనర్థపరంపరలను బొంబయి ప్రభుత్వము వ్యక్తముచేసినది. సామాన్యముగను ప్రజాభిప్రాయమును, దేశాభిప్రాయమును దీని కనుగుణముగనె యున్నవి. సామాన్య నియోజకవర్గమును, సామాన్యమైన నియోజకాధికారమును తాత్కాలికముగను ప్రత్యేక సంఘలాభములకు నష్టదాయకముగను గనుపడినను, సకలదేశప్రయోజనములను సమకూర్చుటకు దోడ్పడగలవు. ప్రజాస్వామ్యమున కవసరమైన నియోజకవర్గము, ప్రాతినిధ్యము సామాన్యనియోజకవర్గము వలననే యేర్పడగలవు. ఈ సంధర్భములందు మౌలానా షౌకతాలిగారు ప్రయోగించుచున్న జయభేరి పరమవిషాదమును గలిగించుచున్నది. మతావేశము ప్రపంచమునకు గలుగజేసిన దుఃఖము వర్ణనాతీతము. మతమునకును, రాజ్యాంగములకును ముడిపెట్టుట యసంగతము. ఈ రెంటి సంబంధమును విడిపోవుట శ్రేయస్కరము. సంగ్రామమో, సంధియో కావలయునని షౌకతాలిగారు ప్రగల్భములు గొట్టిరి. మహమ్మదీయ పరాక్రమము విషయమై వారు నొక్కిచెప్ప నవసరము లేదు. ప్రపంచపరిస్థితులే విశదము చేయుచున్నవి. బానిసలైన హిందువుల మూలముననే ప్రపంచశాంతి గలుగవలసియున్నదని షౌకతాలిగారును, వారి యనుచరులును గ్రహించుట విశేషము. సాంఘిక విభేదములవలెను నాయకుల విభేదములును పరమాసహ్యముగ నున్నవి. ఈ విభేదములు భారతీయుల దౌర్బల్యమును, ప్రతిపక్షుల బలమును విశదము చేయుచున్నవి.

* * *

అఖిలభారత కాంగ్రెసుసంఘము

సకలపక్షసమావేశమునందువలెను అఖిలభారత కాంగ్రెసుసంఘమునందును నెహరూ నివేదిక యేకగ్రీవముగ నంగీకరింపబడుట శుభచిహ్నము. కాని సకలపక్షసమావేశలక్ష్యము డొమినియను ప్రభుత్వముమీదను, కాంగ్రెసు సంఘలక్ష్యము సంపూర్ణస్వాతంత్ర్యముమీద

దను లగ్నమైనవిధమును వ్యవహారవిధానము విశదము చేయుచున్నది. సంపూర్ణ స్వాతంత్ర్యాదర్శమున కభ్యంతరములను గల్పించెడివా రుండజాలరు. ఆదర్శమున కభ్యంతరములం లేకపోయినను కార్యవిధానమునందు భేదాభిప్రాయములు గలుగుచున్నవి. సంస్థానాధీశులు, జమీాందారులు, మహమ్మదీయులు, మితవాదులు, హోమురూలరులు, బ్రాహ్మణేతర పక్షమువారు దీని కభ్యంతరములను గల్పించుట సహజము. అఖిలపక్షసమావేశము చేసిన తీర్మానమునకు కాంగ్రెసుసంఘము చేసిన తీర్మానము ప్రతికూలము గాకపోయినను వివిధపక్షములవారును గలిసి పనిచేయుట కభ్యంతరము లేర్పడుచున్నవి. కాంగ్రెసు ప్రచారము కేవలము సభలకు మాత్రమె సంబంధించియున్నది. గ్రామసీమలందును, పట్టణములందును కాంగ్రెసుసంఘములు పేరునకైనను గనుపడవు. పేరునకైనను నిలిచియున్నచోట్లను తగవులాటలు మాత్రము గనుపడుచున్నవి. ఇట్టి సందర్భములలో దేశమంతయును కార్యరూపమున కాకపోయినను భావరూపముననైనను రాజ్యాంగముల విషయమై ఏకాభిప్రాయమును వ్యక్తముచేయుట ప్రయోజనకరమై యుండును. భేదాభిప్రాయములు కార్యానుకూల్యమునకు ప్రతికూలములు. కాంగ్రెసునందు స్వాతంత్ర్యపక్షము రాయలు కమిషను రాజ్యాంగసంస్కరణముల తరువాతను సహజముగ నేర్పడగలదు. ఈలోపుగను దేశమంతయును నేకమార్గమున నడుచుటవలనను లోకమున కసందిగ్ధముగను భారతప్రజాభిప్రాయము వ్యక్తమైయుండును. రాయలుకమిషను నాటక మింకను నైదుమాసములు ప్రదర్శింపబడనున్నది. ఈకాలము వ్యర్థమైన వాదప్రతివాదములతోను కాలహరణము చేయుటవలనను బ్రిటీషురాజ్యతంత్రజ్ఞుల సంకల్పము సఫలమగుట నిశ్చయము. ప్రజానాయకులు కార్యపరతంత్రులై భారతీయ సంకల్పమును సఫలము చేయుటకు దీక్షను బూనవలసియుందురు. కార్యదీక్ష లేని సంకల్పము పెద్దదైనను, చిన్నదైనను, సఫలము గాజాలదు.

Printed and Published by K. Nageswara Rao, at the Andhra Patrika Press, N .7, Thambu Chetty St., Madras.

విషయానుక్రమణిక

చిత్రములు

త్రివర్ణచిత్రములు:—'నలరాజు'; గోడిరాగిణి.

సాధారణ చిత్రములు:— తంత్రపరాజులు ౩; దివాన్-ఇ-ఖాస్; పల్లవశాసనము-సంగమేశ్వరము ౨; బాణశాసనము-నన్నమూరు; విష్ణూచిదేవతకొలువు; గోపణప్రభువు, సి. వి. రామనుగారు, తాడిపత్రి రాఘవాచార్యులుగారు; డి. బలరామకృష్ణయ్యచౌదరిగారు, చిలుకూరి వీరభద్రరావుగారు; మహానందిక్షేత్ర చిత్రములు ౪; కీ. శే. లాలా లజపతిరాయిగారు; ఆంధ్రమహాసభల నాయకులు ౫; ఇతర చిత్రములును.